

BHARATI

ఆగస్టు

1942

చిత్రభాను
శ్రావణము

పుటము ౧౯ :: సంచిక ౨

డీప్రతి 8 అణాలు

భారతి

ఆంధ్ర గ్రంథమాల, పోస్టుబాక్సు 212, మదరాసు.

ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము: విజ్ఞానమును సంపాదించుటకు తెలుసుకొదగిన ప్రతి విషయమును ఈమహాగ్రంథములో సవిస్తరముగా ప్రతిపాదింపబడియున్నది. ఇట్టి గ్రంథము నిదవర కెవ్వరును ప్రచురించినదిలేదు. ఇందలి విషయములను ప్రత్యేకించి పేర్కొనుట కొలదిమాటలలో అలవిగాదు. ఇది ప్రతి ఆంధ్రునియింటను ఉండి తీరవలసిన గ్రంథము. ఏవిషయమును గురించి సంశయము వచ్చినను దీనిని ఒకమారు విలోకించి సంశయనివృత్తి గావించుకొనవచ్చును. ప్రస్తుతము రెండు సంపుటములు ప్రచురితములైయున్నవి, వీనిలో 'అ' మొదలు 'అశ్విన్' వరకును గల సమస్తవిషయములను గురించిన వ్యాసములు గలవు. ఏకవర్ణ, ద్వివర్ణ, త్రివర్ణ చిత్రపటములుగూడ అనేకము జతపరుపబడియున్నవి. ప్రతి సంపుటము చక్కని స్వదేశీచర్మముతో పూర్తిగా బైండు చేయబడి, బంగారు రేఖల అక్షరములతో తీర్పబడియున్నది. ఒక్కొక్క సంపుటములోను 600 పుటలున్నవి. సంపుటము 1 కి వెల 10-'-0.

కాంగ్రెసు చరిత్ర: అఖిల భారత కాంగ్రెసు పుట్టినదాది నిన్న మొన్నటి దనుక— ఏబదయేండ్ల కాలము గావించిన సంరంభ మంతయు విపులముగా ఈ గ్రంథమునందు విశదీకరింపబడియున్నది. కాంగ్రెసు నాయకుల ఉపన్యాసములుకూడ సమయోచితముగా ఇందు చేర్పబడియున్నవి. సుప్రసిద్ధ ఆంధ్ర నాయకులైన భోగరాజు డా. పట్టాభిసీతారామయ్యగారు దీనిని రచించినారు. కాంగ్రెసువాది యనుకొను ప్రతివ్యక్తియు చదువితీరవలసిన గ్రంథము. ఖద్దరు గుడ్డబైండు. వేయిపుటలు. వెల 2-8-0.

ఆంధ్రవాఙ్మయ సూచిక: 1927-వ సంవత్సరము వరకును ముద్రితములైనట్టియు, అముద్రితములై వివిధభాండాగారములం దున్నట్టియు ఆంధ్ర గ్రంథముల పట్టిక. వెల 1-0-0.

భగవద్గీత (సంస్కృతము): శ్రీ శంకరభాష్యముతోను, దానికి కీ. శే. బెల్లంకొండ రామారావుగారిచే వ్రాయబడిన భాష్యార్క ప్రకాశ మను విపుల సంస్కృతవ్యాఖ్యానముతోను సహితము. (నాలుగు సంపుటములు). వెల 6-0-0.

సంపుటము 19
సంచిక 8

భారతి

చిత్రభాను శ్రావణము
1942 ఆగస్టు

నా దేవుడు - నేను

శ్రీ రా. వే. మ. గం. రామారావు
[పిఠాపురము యువరాజు]

●

పాడవలె నంచు నెన్నాళ్లో పాటుపడితి,
కొలువవలె నంచు నెన్నాళ్లో కూరుచుంటి
కాని పాట రాదయ్యె నేకారణంబొ!
కొలువ లేకుంటి నేలనో కూరుచుండి.

కడచిపోయినదానిని కలచ నేల!
వచ్చినాడను "బ్రహ్మమా! పాహి"యంచు,
భక్తితో నీదుపాదాల వ్రాలువాడ,
కంటినీటిని పాదాలు కడుగువాడ.

వ్యర్థజీవనమున వ్యవధియే లేదేమి
కన్నుమూయలేని కావరంబొ!
అర్థశూన్యమైన ఆందోళనములోన
అంతరంగదీప మార్ప నేల?

కాను దేవత, మరి కాను రాక్షసియును,
ఘనత కలదు, కలదు ఘనత లేమి,
మానవుండ నేను, మంచిచెడ్డల నుందు;
కోర్కె తెలియ, దేదొ కోరుచుంటి.

ఊహ్యమౌచునె మరియు దురూహ్యమౌచు
లభ్యమౌచునె మరియు నలభ్యమౌచు
నిదుర మెలకువ నడుమను నీడవోలె
తోచుచుండెడి తత్త్వమా! దోసిలి యిదె!

—

గౌరన

= శ్రీ నేలటూరు వెంకటరమణయ్య =

౧

ఆంధ్ర ద్విపద కావ్యములలో గౌరనామాత్యుని కృతులు ప్రసిద్ధికెక్కినవి. హరిశ్చంద్రద్విపద నెఱుఁగనివా రరుదు. నవనాథచరిత్ర యంత ప్రఖ్యాతము గాకున్నను, సర్వవిధముల దీనికి తుల్యమైనదే. పాల్కురికి సోమన, రంగనాథుఁడు, తాళ్లపాక తిరువెంగళనాథుఁడు దప్ప ఇంత సొంపుగ ద్విపద సెప్పఁజాలిన కవి మఱియొకఁడు గానరాఁడు. ద్విపదవాఙ్మయమున నితని స్థాన మత్యున్నతము. ఈవాఙ్మయపరిణామమున నితని కృషి యనల్పము. దాని యుత్కృష్టత చారిత్రకదృష్టితో నవలోకించినఁగాని తెల్లముగాదు. పూర్వాపర ద్విపద కావ్యవిమర్శనవలనఁ గాని యిది తేలదు. గౌరనకాలము నిశ్చయముగఁ దెలియకున్న పూర్వాపరగ్రంథము లెవ్వయో కనుఁగొనుటకు సాధ్యపడదు. కావున గౌరనకాలమును నిర్ణయించుటయే ప్రస్తుత వ్యాసముయొక్క ప్రధానోద్దేశము.

గౌరనకాలమునుగూర్చి పరిశోధన చాల జరిగియున్నది. కాలనిర్ణయమున కావశ్యకమైన చరిత్రాంశము లన్నియు లభ్యమై యున్నను, సిద్ధాంత మింకను తేలకున్నది.

హరిశ్చంద్రద్విపదలో గౌరన తన వంశము నిట్లు వర్ణించుకొనియున్నాఁడు:

"సింగనమాధవక్షితిపాలమణికి
మంగళమూర్తికి మంత్రియై జగతి
పొగడొందు పెద్దన పోతరాజునకుఁ
దగిన తమ్ముఁడు యశోధనుఁ డయ్యమంత్రి*
చెట్టపట్టంగ నోఁచిన భాగ్యవతికి
చుట్టాలసురభికి సుందరీమణికి
ఘనుఁడు వల్లభమంత్రి గంగాంబఁ గోరి
కనిన పోచాంబకుఁ గారాబుసుతుఁడ
ధరణి నమాత్యరత్నం బనఁబరఁగు
ధరణిమంత్రికిఁ గూర్మితమ్ముఁడ ఘనుఁడ
భూతనాయకపాదపూజాభిరతుఁడ
గౌతమగోత్రుండ గౌరనాహ్వయుఁడ."

నవనాథచరిత్రయందును పైవిషయములే సంగ్రహముగ వర్ణింపఁబడియున్నవి:

"సింగయమాధవక్షితిపాలమంత్రి
పుంగవుం డైయొప్పు పోతరాజునకు
ననుజాతుఁడగు నయ్యమామాత్యు కూర్మి
తనయుఁ డుత్తముఁడు గౌతమగోత్రజుండు
భ్రమరాంబికావరప్రాప్తవిచిత్ర
విమలసాహిత్యప్రవీణాధికుండు
ననఘచిత్తుఁడు గౌరనాహ్వయఖ్యాతు"

మఱియు గౌరన తాను నవనాథచరిత్రను రచించుటకుఁ గారణము నిట్లు చెప్పియున్నాఁడు :

* 'ఎల్లమంత్రి' యని ముద్రితగ్రంథపాఠము.

"ఘనముక్తిశాంతభిక్షారాయ బిరుదుఁ
డనుపమంబైన మహావైభవంబు
దనర విచిత్రవితానరమ్యమును
కనదుదంచితహేమకలశభాసురము

*   *   *

భాసిల్లు నిజసభాభవనంబునందు
శ్రీసముజ్జ్వలరత్న సింహాసనమున

*   *   *

గొలువుండి బహుకథాగోష్ఠిని శైవ
ములు.........................
నవిరళయోగవిద్యాధికులైన
నవనాథవరుల పుణ్యప్రవర్తనలు
పరఁగ శ్రీగిరికవిపద్యబంధముల
విరచించినాఁ డది ద్విపదకావ్యముగ
జెప్పింపవలయుఁ బ్రసిద్ధి వెంపలర
నిప్పుడు గల సుకవీంద్రులలోన

*   *   *

ననఘచిత్తుని గౌరనాహ్వయఖ్యాతుఁ
గనపరుషుమునకుఁ దగఁబిలిపించి

*   *   *

మన్నించి మాకొక్క మధురమై వెలయు
కావ్యంబుగాఁ జెప్పి కమలజవిష్ణు
సేవ్యమానునకును శ్రీశైలపతికి
శంకరునకు బాలశశిశేఖరునకు
నంకితం బొనరింపు మనుచు కర్పూర
పూరితంబైన తాంబూలంబు లొసఁగె"

పై నుదాహరింపఁబడిన ద్విపదలవల్ల గౌరన సింగనమంత్రి యను రాజునకు మంత్రియైన పెద్దనపోతరాజునకుఁ దమ్ముఁడైన యయ్యామామాత్యుని పుత్రుఁడనియు, ముక్తిశాంతభిక్షారాయఁడను శైవమతాధిపతి ప్రోత్సాహముచేత శ్రీగిరి యను కవి యంతకుముందు పద్యప్రబంధముగఁ జేసిన నవనాథచరిత్రమును ద్విపదకావ్యముగఁ జేసి శ్రీశైలమల్లికార్జునస్వామి కంకిత మిచ్చెననియుఁ దెలియుచున్నది.

౨

మొదట ఈశ్రీగిరికవినిగూర్చి యొకమాట. ఇతఁ డెవ్వరో నిర్ణయించుటకుఁ దగినయాధారములు లేవు. ఇతని గ్రంథము నామమాత్రావశిష్టమైనది. మఱియు దాని నేలక్షణగ్రంథకర్తయుఁ బేర్కొనలేదు. సంకలనగ్రంథములలో నొక శ్రీగిరన్న శ్రీరంగమాహాత్మ్యములోని పద్యములు గానవచ్చుచున్నవి. శ్రీరంగమాహాత్మ్యము వైష్ణవగ్రంథ మగుటచే నితఁడు పద్యనవనాథచరిత్రకర్త కాఁడని కొంద ఱనుచున్నారు. ఇది యంతగఁ బరిగణింపఁదగిన యంశము కాదు. కాని శ్రీగిరన్న యెప్పటివాఁడో తెలియదు. కావున గౌరనకాలము శ్రీగిరన్న మూలమున నిర్ణయించుటకు వీలు కాదు. కృష్ణామండలాంతర్గతమగు మోగల్లు గ్రామభీమేశ్వరాలయములోని శిలాశాసనములం దొక శ్రీగిరికవి పేర్కొనఁబడియున్నాఁడు.* ఇం దొకటి శా. శ. ౧౨౩౭-వ సంవత్సరమునాఁటిది. రెండవదానిలోఁ గాలము చెప్పియుండలేదు. మొదటిదానిలో నత్తిలిపోతిరెడ్డి యనునతఁడు ప్రమథకవి సిరిగిరి అయ్యంగారి కిచ్చిన భూదానము వర్ణింపఁబడియున్నది. రెండవదానియం దనవేమారెడ్డిగారు ప్రమథకవి సిరిగిరి దేవయ్యంగారికిఁ జేసిన భూదానము వివరింపఁబడియున్నది. ఈభూదాన మొసఁగిన వదాన్యుఁడు క్రీ. శ. ౧౩౩౦ మొదలుకొని ౧౩౪౫ వఱకును అద్దంకి కొండవీటిపురములు నిజరాజధానులుగా తూర్పు సముద్రతీరాంధ్రదేశము నేలిన ప్రోలయ

* Madras Ep. Coll. 753, 754 of 1920.

వేమారెడ్డిగాని యన్యుఁడు గాఁడు. కావున నీ సిరిగిరికవి కాకతీయరెడ్డియుగద్వయసంధియం దుండె ననుట తెల్లము. ప్రమథకవి యను బిరుదును బట్టిచూడ నీతఁ డేదో ప్రఖ్యాతశైవప్రబంధమును విరచించినట్లు తోఁచుచున్నది. ఇతఁడే పద్యనవనాథచరిత్రకర్త యైయుండవచ్చును. ఈ యూహ సరియైనపక్షమున గౌరన క్రీ. శ. ౧౩౧౫ నకుఁ దరువాతివాఁ డని నిశ్చయించి చెప్పవచ్చును.

తరువాత ముక్తిశాంత భిక్షారాయని గూర్చి యించుక చెప్పవలసినది. ఇతని యానవాలు పట్టుట సులభసాధ్యము గాదు. 'ముక్తిశాంతభిక్షారాయఁ' డనునది యొక ప్రత్యేకవ్యక్తిసూచకనామధేయము గాదు; శ్రీశైలభిక్షావృత్తిమఠాచార్యుల బిరుదము. బ్ర. శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు తమచేఁ బరిష్కరింపఁబడి మద్రాసు విశ్వవిద్యాలయమువారిచేఁ బ్రకటింపఁబడిన నవనాథచరిత్రపీఠికలో నతని నిట్లు గుర్తించియున్నారు:

"మఱియు శ్రీనాథునిచే శివరాత్రిమాహాత్మ్యము దన భృత్యుఁడగు ముమ్మడిశాంతయ్యకుఁ గృతి యిప్పించిన శ్రీశైలజంగమమఠాధీశ్వరుఁడగు శాంతభిక్షావృత్తిరాయఁడే గౌరనచే నవనాథచరిత్రమును మల్లికార్జును పేరఁ గృతిగాఁ జెప్పించుటచేత నీ గౌరనయు శ్రీనాథుని కాలమువాఁడే యని విస్పష్టంబగుచున్నది." *

గౌరనయు, శ్రీనాథుఁడును సమకాలికులు గావచ్చును. కాని 'ముక్తి శాంత భిక్షారాయ' బిరుదమూలమున వీరి సమకాలికతను స్థాపించి దాని నాధారపఱచుకొని గౌరనయొక్క కాలమును నిర్ణయించుట సాధ్యము గాదు. శివరాత్రిమాహాత్మ్య నవనాథచరిత్రలందు పేర్కొనఁబడిన ముక్తిశాంతభిక్షారాయ లొక్కరు గాక భిన్నవ్యక్తులు గావచ్చును. వీరొక్కరే యని ఋజువుపఱచ లేకపోయినచో శ్రీనాథ గౌరనల సమకాలికతను, దన్మూలమున గౌరనకాలమును నిర్ణయించుటకు సాధ్యముగాదు.

3

ఇఁక సింగనమాధవుఁ డెవ్వరో, అతని కాల మెద్దియో కనుఁగొనవలసియున్నది. గౌరనయే తన లక్షణదీపికలో నితని గుర్తించుట కొక మార్గమును జూపియున్నాఁడు:

"అస్తి ప్రశస్తావనిపాలమౌళి
రత్నావళీరంజితపాదపీఠః,
రేచర్లవంశాంబుధిపూర్ణచంద్రో
మహాబల స్సింగయమాధవేంద్రః."

అని సింగయమాధవుఁడు రేచర్లవంశసంజాతుఁ డని తెలియఁబఱచినాఁడు. రేచర్లవారు పద్మనాయకులు. వీరు క్రీ. శ. ౧౪-వ శతాబ్దోత్తరార్ధమునుండి యిప్పటి హైదరాబాదు రాజ్యములోని రాజకొండ దేవరకొండ దుర్గములను రాజధానులుగఁ జేసికొని తెలింగాణమును చిరకాల మేలిరి. రేచర్లవంశమున నిద్దఱు సింగయమాధవేంద్రులు గానవచ్చుచుండుటచే (౧. దాచయసింగన పుత్రుఁడగు మాధవుఁడు. ౨. అనపోతయ సింగన పుత్రుఁడగు మాధవుఁడు.) వారిలో గౌరన పేర్కొనిన సింగనమాధవుఁ డెవ్వఁడో కనుఁగొనుట సులభమైన పని కాదు. కాని గౌరన చెప్పిన సింగనమాధవునికి పెద్దనపోతురాజు

---

* మద్రాసు విశ్వవిద్యాలయమువారి నవనాథచరిత్ర పీఠిక, పుట ౬.

మంత్రియని తెలియుచుండుటచేత నీయిద్దఱి లో నెవ్వరికొలఁ పున పెద్దఁపోతురా జుండెనో కనుఁగొనఁగలిగిన పక్షమున నతని నాన వాలుపట్టవచ్చును. ఈయంశమును నిర్ధారణ సేయుటయందు వెలుగోటివారి వంశచరిత్ర కొంత తోడుపడుచున్నది. ఈవంశచరిత్ర కనుబంధముగ ముద్రితమైన శిలాశాసనముల యం దొకదానిలో సింగనమాధవుఁడును, నతని మంత్రియగు పెద్దనపోతురాజును బేర్కొనఁబడియున్నా రని వీరేశలింగం పంతులుగారు కనుఁగొనిరి.* సదరుశాసనము శ్రీశైలోత్తరద్వారమైన ఉమామహేశ్వర ములో దేవస్థానసమీపమున నున్నది. ఇందు "దాచయసింగభూపతిసుతుండైన ... శ్రీమాధ వేంద్రుఁడు ... శ్రీపర్వతోత్తరద్వారమైన మహేశ్వరదేవరమంటపము మహాచ్ఛిలా సమూహానను రమ్యముగా రచియింపించె" నని చెప్పియున్నది. ఇతనికడనే పెద్దనపోతు రాజు మంత్రియైనట్లు ఈశాసనమున కలదు.

> "శ్రీమతో మాధవేంద్రస్య
> రాజ్యాంగైకధురంధరః,
> మంత్రీ పోతననామాసీ
> త్సర్వశాస్త్రవిశారదః.
> యస్యామాత్యశిఖామణేః కవివర
> స్తోత్రైకపాత్రీకృతాం
> మత్వా వాక్పతి రిద్ధనీతిసుభగాం
> వాగ్వైఖరీం లజ్జతే,
> సోఽయం పెద్దనమంత్రివర్యతనయః
> శ్రీపోతరాజోఽన్వహం
> దేవస్యాస్య మహోపకారరచనాం
> సమ్యఙ్ముదాచీకరత్" †

ఈశాసనమున వర్ణింపఁబడిన "మాధవ క్షితిపాలుఁడు బేతాళరెడ్డి కెనిమిదవతరము వాఁడయిన రావుసింగయమాధవనృపాలుఁ డని తేటపడుచున్నది" అని వీరేశలింగం పంతులుగారు సిద్ధాంతీకరించి, క్రీ.శ. ౧౪౨౭ లో నిరావుమాధవనృపాలుఁడు రామాయ ణమునకు వ్యాఖ్యానము వ్రాసినట్లు క్రీ. శ. ౧౪౨౯ నాఁటి యొక శిలాశాసనమునఁ‡ జెప్పఁబడియుండుటచేత నతని మంత్రియు నప్పటివాఁడే యనియు, నామంత్రియొక్క తమ్ముని కుమారుఁ డగు గౌరనకవి ౧౪౪౦- ౫౦ సంవత్సరముల ప్రాంతములం దుండి యుండవలె ననియుఁ దీర్మానించిరి. ¶

ఇది పొరబాటు : హరిశ్చంద్రోపాఖ్యాన నవనాథచరిత్రాది గ్రంథములయందుఁ బేర్కొనఁబడిన సింగనమాధవుఁడు రావు సింగయమాధవుఁడు గాఁడు. సింగనమాధ వుఁడు దాచయమనుమఁడు; రావు సింగయ మాధవుఁడు పైఁజెప్పిన దాచయమనుమఁ డును, సింగనమాధవుని యన్నయు నగు ననపోతరాజుమనుమఁడు. మఱియు, పెద్దన పోతరాజు సింగనమాధవుని మంత్రియే కాని, రావు సింగయభూపాలుని మంత్రి కాఁడు. ఉమామహేశ్వరనాగరశాసనము లీవిషయ ములను దెల్లముసేయుచున్నవి. సింగనమాధ వునికాలమును ఉమామహేశ్వరశాసనము స్పష్టముగఁ దెలుపుచుండఁగా దానిని వదలి వీరేశలింగంపంతులుగారు నాగరశాసన

---

* ఆంధ్రకవులచరిత్రము, ప్రథమభాగము, పుట ౫౯౪.

† వెలుగోటివారి వంశచరిత్రము (అనుబంధము), పుటలు ౩౧-౩౬.

‡ వెలుగోటివారి వంశచరిత్రము (అనుబంధము), పుట ౪౫.

¶ ఆంధ్రకవుల చరిత్రము, ప్రథమభాగము, పుట ౫౯౫.

ముతో నితని నేల ముడిపెట్టిరో దుర్గ్రాహ్యముగ నున్నది. సింగనమాధవుఁడును, నతని మంత్రియగు పెద్దనపోతురాజును శా. శ. ౧౨౯౦-వ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౩౬౮ లో నుండిరని యుమామహేశ్వర శాసనమునందలి——

"దంత్యంకాంక శకాబ్దశాలిని శివే
వర్షే నతే ఫాల్గునే
మాసే దాచయసింగభూపతిసుతః
శ్రీ మాధవో భూధవః,
శైలస్యోత్తరతోరణే భువి మహే
శస్యాలయం నూతనం
పాషాణై స్సుదృఢం సురాసురనుతం
రమ్యం ముదాచీకరత్"

అను శ్లోకము విదితము సేయుచున్నది. మఱియు శాసనాంతమునఁ బెద్దనపోతురాజు వ్రాలు గానవచ్చుచున్నవి: "ఈ శాసనము వ్రాయింపవచ్చి వంగూరి తిప్పయభట్లు దేవతాస్తుతిగాను జెక్కిన శ్లోకాలు ఈ రెండును. శ్రీ శ్రీ శ్రీ పెద్దిరాజు కొడుకు పోతురాజు వ్రాలు."

ఇఁక సింగనమాధవుఁడును, నతని మంత్రియగు పెద్దనపోతురాజును క్రీ. శ. ౧౩౬౮-వ సంవత్సర ప్రాంతమున నుండి రనుట నిస్సంశయము గదా; పోతరాజు తమ్ముఁడగు నయ్యమంత్రియు నప్పటివాఁ డనుట నిశ్చయముగదా. అయ్యమంత్రి కుమారుఁడును, హరిశ్చంద్రోపాఖ్యాన నవనాథ చరిత్రల కర్తయు నగు గౌరన క్రీ.శ. ౧౩౯౦, ౧౪౦౦ ల ప్రాంతమున గ్రంథరచనకుఁ గడంగెనని యూహించవచ్చును. అతఁడు క్రీ. శ. ౧౪-వ శతాబ్దాంతమువాఁ డగునుగాని, వీరేశలింగంపంతులుగారు చెప్పినట్లు ౧౫-వ శతాబ్దమధ్యకాలమువాఁడు గాఁజాలఁడు.



శ్రీకాళహస్తీశ్వర శతకము

= శ్రీ బులుసు వేంకటేశ్వర్లు =

దివ్యర్షి సంకల్పసముద్భూత మగు మన పావనాంధ్ర సారస్వతారామమున మహాసౌరభవిలసితము లగు నిత్యనూతన ప్రసవముల నీని శోభావంత మొనరించినది శతకవాఙ్మయలతానికుంజము. ఈ వాఙ్మయోద్యానమున పురాణేతిహాస ప్రబంధనాటకేత్యాద్యనేకలతానికుంజముల నెన్నిరకముల సుకుమారకుసుమవ్రజమున్నను, విశిష్టసౌరభవిలసిత మగు నీలతానికుంజము నొసఁగిన శోభాశ్రీ యవిరళము, నద్వితీయమును. అందును, శతకవాఙ్మయలతాంతములు నగ్రతాంబూలము నందినది ధూర్జటి యమృతహస్తముల నావిర్భవించిన శ్రీకాళహస్తీశ్వరశతకము.

శతకకర్తమానసము

ఈశతకమున ధూర్జటిమానసము సహజవికాస సంసిద్ధినంది, అతిక్లిష్టము లగు జీవితసమస్యలకు బహుచిత్రములు, నదృష్టశ్రుతపూర్వములు నగు దివ్యసాధనలఁ జూపి, చక్కఁగాఁ బరిష్కరించినది. విషయప్రదర్శనమున విశిష్టతఁ జూపి, సులభ గంభీర భాషాప్రయోగమున సొంపునింపి, వివిధవిషయావిష్కరణమున వింత పోకడలు చూపి, భక్తియోగజ్ఞానవైరాగ్యముల ప్రాబల్యముఁ బ్రకటించి ప్రశంసాపాత్రముగా నీతని శతకము సహృదయుల హృదయములఁ జూఱగొన్నది. అందుచే, విజ్ఞానవిషయమున, సారస్వతోన్నతిని, జ్ఞానప్రకాశమున, నేవిధముగాఁ జూచినను నీతని శతకము ప్రధానస్థాన మాక్రమించితీఱును.

శతకపరమావధి

క్షణికము లగు భౌతికవాంఛలసంసిద్ధికై దురహంకారమదమాత్సర్యావృతు లగు మానవులు చేయు వ్యర్థప్రయత్నములలో నాముష్మికసౌఖ్యాభిలాష, ఆధ్యాత్మికపరిజ్ఞానము విస్మరింపఁబడుచుండును. అందుచే, మానవప్రపంచ మపార మగు నికృష్టదుఃఖసముద్రమున బడి యార్తిచెందవలసివచ్చును. ఈయార్తి తీర్పశక్యముకానిదై సర్వవినాశనమునకు దారితీయును కావున, ప్రాపంచిక ధనసంపాదనము పరమనీచమనియు, నమూల్యమగు నాత్మస్వయంప్రకాశమే, యనశ్వర మగు నాత్మానందసింహాసనాధిష్ఠానమే మన పరమావధి యనియు మేల్కొలుపుటే యీశతకము యొక్క పరమావధి.

ప్రబంధయుగమున శతకపరిణతి

ఆదికవి యనఁబరఁగు నన్నయగారిఁ బూర్వమారంభమైన యాంధ్రవాఙ్మయము క్రమక్రమవికాసము నంది కవిత్రయహస్తముల మహోజ్జ్వలమై, తదుపరి పెక్కురూపము లంది, రాయలయుగమునఁ బ్రబంధసరణిఁ బరిపూర్ణ మగు పరిణతి నందినట్లే, శతకవాఙ్మయమును పదునొకండు పండ్రెండు శతాబ్దములకుఁ బూర్వమే ప్రారంభమై శివతత్త్వసార, వృషాధిపశతకరూపముల నంది, క్రమవికాసము పొందుచు, కృష్ణరాయలయుగముననే దిగ్గజశ్రేష్ఠుఁ డనఁదగిన ధూర్జటి యమృతహస్తమున మహోన్నతపరిణతి నందుట విశేషము.

రసాత్మకమైన వాక్యము కావ్యమై రసములఁ బ్రధానములు శృంగారకరుణరసము లనుట, నీరెండును దైవపరము లైనపుడు భక్త్యావేశము నొసఁగి మానవుని భగవంతునివైపు త్రిప్పి సత్వరవిముక్తికి దారిచూపును. భావావేశము గలిగినచే భక్త్యావేశము కల్గి స్థిరభక్తి నిలుచునుగాన, స్వానుభవసమన్వితములై సత్యాత్మకము లగు శతకములే మానవహృదయమును పవిత్రముచేయుటకు సమర్థములు. ఈ శతక మీవిషయమునకు నిదర్శనము.

కావ్యార్థసూచనము

అత్యున్నతిస్థానము నందిన ప్రబంధయుగమునకుఁ జెందినవాఁ డగుట ధూర్జటి తన శతకమున నెత్తుకొను ప్రధానవిషయములను శతకారంభపద్యముననే సూచించుట యొక గొప్ప విశేషము.

"శ్రీ విద్యుత్కలితాజవంజవమహా
జీమూతపాపాంబుధా
రావేగంబున మన్మనోబ్జసముదీ
ర్ణత్వంబుఁ గోల్పోయితిన్
దేవా! నీకరుణాశరత్సమయ మిం
తేచాలుఁ జిద్భావనా
సేవం దామరతంపరై మనియెదన్
శ్రీ కాళహస్తీశ్వరా!"

ఈశతకారంభపద్యమునఁ దన కావ్యప్రధానవిషయములుగాఁ బేర్కొనిన వివి: శ్రీ విద్యుచ్చంచలము, ఆజవంజవము నికృష్టము, పాపాంబుధారప్రభావ మనంతము, మనోబ్జసముదీర్ణత్వముఁ గోల్పోవుటవల్లఁ గల్గు దుస్థితి, భగవత్కరుణాశరత్సమయప్రయోజనము, సేవామాహాత్మ్యము—ఇవి ప్రధానవిషయములు. వీని నుండి 'తామరతంపరగాఁ' బుట్టినవే మిగిలిన పద్యములు. ఈరీతిగా కావ్యవస్తుస్వరూపము నేశతకకర్తయుఁ జూపియుండలేదు. పైవిషయముల దిక్పరిదర్శనముగా నిటఁ బరిశీలింతము.

శ్రీ విద్యుచ్చంచలము

అస్థిరములు, చంచలములు నైన సిరులాసించి, మానవులు చేయని దుష్కృతములు లేవు. "ధనమూల మిదం జగ"త్తను ప్రధానార్థికసూత్రము ప్రపంచము నేలుచున్నది. అందుచేఁ దద్గర్హణము ప్రధానము. ఆధ్యాత్మికదృష్టికిఁ బ్రధానమైన శ్రీగర్హణముఁ బ్రారంభించి వాని వ్యర్థత్వముఁ జక్కఁగా నిరూపించినాఁడు.

"తరగల్ పిప్పలపత్రముల్ మెఱుఁగుట
ద్దంబుల్ మరుద్దీపముల్
కరికర్ణాంతము లెండమావులతతుల్
ఖద్యోతకీటప్రభల్
సురవీథీలిఖితాక్షరంబు లసువుల్
జ్యోత్స్నాపయఃపిండముల్
సిరు లిందేల మదాంధు లౌదురు జనుల్
శ్రీ కాళహస్తీశ్వరా!"

ఇంతకును,

"మదమాతంగము లందలంబులు హరుల్
మాణిక్యముల్ పల్లకుల్
ముదితల్ చిత్రదుకూలముల్ పరిమళంబుల్"

ఇవియేకదా శ్రీమంతుల సంపదలు! ఇవి మోక్షమీఁజాలవు కానఁ ద్రోసిరా జనవచ్చును. ఇవన్నియు లక్ష్మీవిలాసిని మాయానటనలు కాని సౌఖ్యప్రదములు కావు.

పదునాల్గు మహాయుగము లేలిన శ్రీమంతుఁడు, అయ్యుదయాస్తాచలసంధి నాజ్ఞఁ జెల్లించిన యాయుష్మంతుఁడు విస్మరింపఁబడి విస్మృతసాగరమునఁ గలసి రన్న నీక నల్ప శ్రీలకల్పులు "మత్తులై యేల చచ్చెదరు." వీని నాసించియేకదా!

"ఒకనిం జంపి పదస్థులై బ్రతుకఁ దా
మొక్కొక్క రూహింతు రే
లొకో తా మెన్నఁడుఁ జావరో తమకుఁ బో
వో సంపదల్."

అని సంకుచితదృష్టిని, స్వార్థమును నిరసించినాఁడు.

వేయేల, ఒక్కపద్యములో శ్రీదౌష్ట్యమును దేటతెల్లముగాఁ దెల్పి మన మానసములను వానినుండి దూరీకృతము చేయఁజాలుచున్నాఁడు:

"జాతుల్ సెప్పుట సేవఁజేయుట మృషల్
సంధించు టన్యాయవి
ఖ్యాతిం బొందుట కొండెకాఁ డవుట హిం
సారంభకుం డౌట మి
థ్యాతాత్పర్యము లాడు టన్నియుఁ బర
ద్రవ్యంబు నాశించి యా
శ్రీ తా నెన్నియుగంబు లుండఁగలదో..."

సిరు లిట్టివని తెలిపి,

"రాజశ్రేణికి దాసులై సిరులఁ గో
రం జేరఁగా సౌఖ్యమో

యీజన్మంబు తరింపఁ జేయఁగల మి
మ్మేప్రొద్దుఁ జింతించు ని
ర్వ్యాజాచారము సౌఖ్యమో"

యిపుడు తెలిసికొని మీమీకర్తవ్యము లూహించుకొనుఁ డని మానవుల నుద్బోధించుచున్నాఁడు.

ఆజవంజవము నికృష్టము

కాంచనగర్హణ మైనపిమ్మట ప్రధానవిషయము కాంతాసమ్మిశ్రసంసారము. దీని ప్రాధాన్య మెట్టిదనిన: "సంసారకూప మతిఘోర మగాధమూల" మ్మనియు,

"సంసారే జనితాపరోగసహితే
తాపత్రయాక్రందితే
నిత్యం పుత్రకళత్రవిత్తవిలస
త్పాశైర్నిబద్ధం దృఢం."

అనియు, విష్ణుదేవుని—

"సంసారభీకరకరీంద్రకరాభిఘాత
నిష్పిష్యమానవపుషః సకలార్తినాశ"

యనియు,

"సంసారసర్పవిషదిగ్ధమహోగ్రతీవ్ర
దంష్ట్రాగ్రకోటిపరిదష్టవినష్టమూర్తేః"

అనియు శ్రీశంకరులు ప్రార్థించినారు. అట్టి సంసారమును ధూర్జటి అతినికృష్టమైనదిగా, హృదయములకు నాటునట్లు వర్ణించియున్నాఁడు:

"కాయల్గాచె వధూనఖాగ్రములచేఁ
గాయంబు వక్షోజముల్
రాయన్ రాపడె ఱొమ్ము మన్మథవిహా
రక్లేశవిభ్రాంతిచేఁ
బ్రాయం బాయెను బట్టకట్టె తల చె
ప్పన్ రోఁత సంసారమే
చేయంజాల విరక్తుఁ జేయఁగదవే..."

సంసారమాహాత్మ్య మెట్టి దనఁగా, సంసారము దుఃఖజనక మనియు, సంపద్వాంఛతి నీచ మనియు, వాంఛ దుఃఖద మనియుఁ దెలియని మానవుఁ డరుదు. కాని, యీభావము తాత్కాలికముగాఁ గలిగి క్షణమున విస్మరింపఁబడును. ఈదుస్థితిని ధూర్జటి యెంత చక్కఁగా వర్ణించుచున్నాఁడో చూడుఁడు.

"రోసీరోయదు కామినీజనుల తా
రుణ్యోరుసౌఖ్యంబులన్
పాసీపాయదు పుత్రమిత్రజనసం
పద్భ్రాంతి, వాంఛాలతల్
గోసీకోయదు."

ఇట్టి రోఁతలు నిష్ప్రయోజనము లని వెంటనే "రోసిం దేటిది రోఁత లేటివి మనోరోగస్థుఁడై దేహి" యని చాటుచున్నాఁడు. మఱియు, నీసంసారపాశము విడివడని గొలుసువలె నవిచ్ఛిన్నదుఃఖభూయిష్ఠము. అది యెట్లన:

"ఆ లంచుల్ మెడఁ గట్టి దానికి నప
త్యశ్రేణిఁ గల్పించి త
ద్బాలవ్రాతము నిచ్చి పుచ్చుకొను సం
బంధమ్ము గావించి యా
మాలక్ష్యంబున బాంధవం బనెడు ప్రే
మం గొందరం ద్రిప్పఁగా
సీలన్ సీల యమర్చి నట్లొసఁగితో..."

మానవుఁ డెంత ప్రయత్నించిన నీసంసారశృంఖలలఁ ద్రెంపలేఁడు.

ఇన్ని విధములఁ జెప్పవలసిన యావశ్యకత లేదు- దీనివలన నేయొక్క సుఖమేని గల్గిన దీనిని గర్హింపకుండ నుండవచ్చును. చూడుఁడు:

"కాసంతైన సుఖంబు గానరుచునో మనః
కామంబు లీడేర్చునో
వీసం బైనను వెంటవచ్చునో జగ
ద్విఖ్యాతి గావించునో
దోసంబుల్ చెడఁబాపునో వలసినన్
దోడ్తో మియుం జూపునో
ఛీ! సంసారదురాశ..."

యని నిరపేక్షతో ధిక్కరించినాఁడు.

పాపాంబుధారాప్రభావ మనంతము

అట్టిసంసారార్ణవ మగ్నులైనవారు పాపాంబుధారావేగమునకు గుఱియగుదురు. వీరు —

"పీడం బట్టినయప్పుడున్ తనుసుతుల్
విన్నప్పుడుం బొట్టలో
నూ డున్నప్పుడు శ్రీ విలాసములు పై
కొన్నప్పుడున్ గాయకుల్
పాడంగా వినునప్పుడున్ జెలఁగు దం
భప్రాయ విశ్రాణన
క్రీడాసక్తులు..."

వీరు పాపాంబుధారావేగంబున పతనము నందుదురు. పరమేశ్వరుఁడే గతి యన్నవా 'రపవర్గరాజ్యపదవీ సింహాసనాధిష్ఠాను' లగుచున్నను, "ఆయు రన్నం ప్రయచ్ఛతి" యని శ్రుతులు మొరవెట్టుచున్నను, పాపప్రభావమువలన 'సంసారాంధకారాభిదూషితదుర్మార్గులై' సంతతముఁ గూటికిసై చరింతురు. మఱియు నట్టివారు 'పాపరాజీజాతాతిమదాంధబుద్ధు' లగుటచే రాజశ్రేణికి దాసులై సిరులఁ గోరఁజేరుదురు. వా రింకను, అంతయు మిథ్య యని యెఱిఁగియు నిత్యము—

"కాంతల్ పుత్రులు నర్థముం దనువు ని
క్కం బంచు మోహార్ణవ
భ్రాంతిం జెంది చరింతుగాని పరమా
ర్థం బైన నీయందుఁ దాఁ
జింతాకంతయుఁ జింత నిల్పరు"

మహాపాపాంబుధారానిహతుఁ డైన యతిర్యైనను, జీవశ్రాద్ధము చేసికొని కూడ,

"చావం గాలము చేరువౌ టెఱిఁగియున్
చాలింపఁగా లేక త
న్నే వైద్యుండు చికిత్సఁ బ్రోవఁగలఁడో
యేమందు రక్షించునో
యేవేల్పుల్ కృపఁ జూతురో యనుచు ని
న్నింతైనఁ జింతింపఁడు"

ఇట్టి దుస్స్థితిలోఁ బడఁగా నట్టివారి మనస్సులు చలించును. మనస్సంచలనమే పరమానర్థములకుఁ బ్రబలకారణము. కావున మనస్సముదీర్ణత్వముఁ గోల్పోవుటకు పాపాంబుధారయే ప్రధానకారణము.

మనోబ్జసముదీర్ణత్వసంచలనమువలని దుస్థితి

మనోబ్జసముదీర్ణత్వమును గోల్పోయినయాతఁడు భవకేళీమదిరామదంబున మహాపాపాత్ముఁడై శివుని వివేకింపఁడు. శివునందుఁ 'జింతాకంత చింత' నిల్పఁడు. 'అలుక్ బిడ్డలు తల్లిదండ్రులు ధనం' బను మహాబంధనిబద్ధుఁడై కడుదుర్మోహాబ్ధిలోఁ గ్రుంకి, భగవంతు నెన్నఁడును జింతింపఁజాలఁడు. "శ్రుతు లభ్యాసము చేసి, శాస్త్రగరిమల్ శోధించి, తత్త్వంబులన్ మతి నూహించి" నను 'నిర్జితచిత్త స్థిరసౌఖ్య' మందనేలేఁడు. పైఁగా, స్వేచ్ఛా భావనా క్రీడల వదరుచుండఁగా, సంశయభీకరాటవులఁ ద్రోవఁ దప్పి వర్తింపఁగా, మదనక్రోధకిరాతు లందుఁ గని భీమప్రౌఢిఁ దాఁకఁగాఁ జిత్తము చెదరిపోవును. అట్టివాఁ డెన్ని నేర్చినను 'నుమ్మడికాయలోని యావగింజంతైన' శంక పోఁగొట్టుకొనఁజాలఁడు. ప్రశాంతచిత్తస్థిరసౌఖ్యమెఱుఁగని పాపాత్ముఁడు,తన్ను నెదుర్కొన్న కష్టములకుఁ గ్రుంగిపోయి, జీవనదశయందు చీకాకై చెడిపోవును. అట్టివాఁడు ఒకపూఁట టింముకకూడు తనక్కు వసుచో నోర్వలేఁడు; ఎంతబాన కోర్వఁజాలక యిల్లిల్లును దూరు; చలికిఁ గుంపట్లైత్తుకో చూచును. వాఁడు వేయని వేసము లేదు. ఇట్టి దుస్స్థితిలోఁ బడిపోయి—

"స్తోత్రం బన్యులఁజేయ నోళ్లని వ్రత
స్థులోవ్లె వేసంబుతోఁ
బుత్రీపుత్రకళత్ర రక్షణకళా
బుద్ధిన్ నృపాలాశ్రయున్
బాత్రం బంచు భజింపఁబోదురు."

భగవత్కరుణాశరత్సమయప్రయోజనము

పరమేశ్వర కరుణాశరత్సమయ సంప్రాప్త మహాభాగ్యసంపన్నులు భగవన్నామమును విడువలేరు. తన్నామ నిరంతర సంస్మరణాభిరతి "నిప్పై పాతకతూలశైలమడఁచున్... తప్పన్ దవ్వుల విన్న నంతక భుజావర్గోద్ధత క్లేశముల్ తప్పన్ దారును ముక్తులౌదురు."

ఇట్టి మహాత్ములే మున్ను పరమేశ్వరునిచే "నపవర్గరాజ్యపదవీమూర్ధాభిషేకంబుఁ గాంచిన పుణ్యా

త్ముఁలు." వారు భవాంఘ్రిస్తుతిచే భవదుఃఖములు పాసి కైవల్య మంది వినోదింతురు. అట్టివారు నిర్భయులు, నిర్విచారపురుషులు. వారికి—

"పవి పుష్పం బగు, నగ్ని మంచగు, నకూ
పారంబు భూమిస్థలం
బవు, శత్రుం డతిమిత్రుఁ డౌ, విషము ది
వ్యాహారమౌ."

పరమేశ్వరుని కరుణాకటాక్షవీక్షణములు సోఁకిన మానవుఁ డే నీచాలయమును జొరఁడు; ఏకార్పణ్యపు మాటల నాడఁడు; మఱి యేయితరమతము నైనఁ దలఁపఁడు. ఆ కారణముచే, అతఁ డెట్టి క్లిష్టపరిస్థితులలో నైనను జీవనదశయందుఁ జీకాకై చెడిపోఁడు.

మఱియు నట్టి పుణ్యాత్ముఁడు స్వామిద్రోహము చేసి వేఱొకనిఁ గొల్వఁబోఁడు; పరమేశ్వరప్రీతికరము లైన శ్రుతి స్మృతి పురాణేతిహాసాదుల విన నొల్లకుండఁడు; ఈశ్వరుఁ దక్క నన్యదైవముల దిక్కుగాఁ జూడఁడు. అతనికి—

"క్షితిలో దొడ్డ తురంగ సామజము లే
చిత్రమ్ము? లాందోళికా
తతు లే లెక్క? విలాసినీజన సువ
స్త్ర వ్రాత భూషా కలా
ప తనూజాదిక మేమి దుర్లభము?"

అట్టివానికి లేమియే కల్గునో

"దివిజ క్ష్మారుహ ధేనురత్న ఘనసూ
తి ప్రస్ఫురద్రత్న సా
నువు (నీ) విల్లు, నిధీశ్వరుండు సఖుఁ డ
స్త్రీరాశి కన్యానిధుం
డు విశేషార్చకుఁడు..."

మైన ఈశ్వరుఁడే పోషకుఁ గాన యెన్న డెవరు సమర్థులు?

పరమేశ్వరావ్యాజ కరుణాకటాక్షపాత్రుఁడు నిచ్చ లాతనినే భజించి 'చిన్మయమహా నిర్వాణపీఠంబుపై రచ్చలు' చేయును. గ్రహదోషంబులు, దుర్నిమిత్తములు నాతని బాధింపఁ జాలవు. అట్టి మహాత్ముని వాత్సల్య లీలావచనంబులచే పరమేశ్వరుఁ డనుగ్రహించును.

సేవామాహాత్మ్యము

జ్ఞానమునకుఁ బ్రధానము భక్తిసంభరిత మగు సేవావిభూతితక్క నన్యము కాదను విషయము శతకమునం దెల్లెడల వెల్లివిరియుచున్నది. ఈవిషయమీ క్రిందిపద్యమున విస్పష్టముగాఁ బేర్కొనఁబడినది:

"ఏవేదంబు పఠించె లూత భుజగం
బే శాస్త్రముల్ చూచె దా
నే విద్యాభ్యసనం బొనర్చెఁ గరి చెం
చే మంత్ర మూహించె బో
ధావిర్భావనిదానముల్ చదువు ల
య్యా కావు మీపాదసం
సేవాసక్తియె కాక జంతువులకున్..."

మఱియు, "నీసేవ చేసి హతక్లేశు" లగుదురనియు, "సంసేవ చేసి నినుం గాంచెద" ననియుఁ బలుతావుల వెల్లడించినాఁడు. ఇంకను అమరస్త్రీల రమించినను విషని మోహము, బ్రహ్మపట్టము సిద్ధించినను దీరని యాశ, సర్వలోకములు మ్రింగినను దీరని కోపము పరమేశ్వరసేవామాహాత్మ్యముచేఁ బటాపంచలు చేసి వేయఁగలుగుటే కాక, మహాపాతకవారిరాశిని సైతము క్షణమాత్రమున దాఁటవచ్చు నని ఘోషింపఁబడినది. "మిమ్మెప్రొద్దు సేవించు నిర్వ్యాజాచార మే సౌఖ్య" మనియు,

"తనయుం గాంచి ధనంబు వాడి దివిజ
స్థానంబుఁ గట్టించి వి
ప్రున కుద్వాహముచేసి సత్కృతికిఁ బా
త్రుండై తటాకంబు నే
ర్పునఁ ద్రవ్వించి వనంబు పెట్టి మననీ
బో లేఁడు నీసేవచే
సిన పుణ్యాత్ముఁడు పోవులోకమునకున్ శ్రీ..."

అనియు సేవామాహాత్మ్యమును శ్లాఘించినాఁడు.

ఈవిధముగాఁ గావ్యప్రధాన విషయములను గావ్యార్థ సూచనగాఁ దొలిపద్యమునఁ దెలిపియున్నాఁడు. ఈ ప్రధానవిషయములు 'తామరతంపరై' జనించి

నవే మిగిలిన పద్యములు. ఆవిషయములఁ గొన్నిటి నిట సంక్షేపముగాఁ బరికింతము.

భక్తిజ్ఞానయోగవైరాగ్యములు

ఈశతకమున ధూర్జటి మహోన్నతవిషయము లైన భక్తి యోగ జ్ఞాన వైరాగ్యములఁ బ్రశంసించి యున్నాఁడు. ఇవన్నియుఁ గూడిన సేవావిభూతి మోక్షప్రద మనియుఁ దెల్పినాఁడు. భక్తినిగుఱించి —

"సలిలమ్ముల్ జులుకప్రమాణ మొక పు
ష్పమ్ముల్ భవన్మౌళి ని
శ్చల భక్తిప్రతిపత్తిచే నరుఁడు పూ
జల్ సేయఁగా ధన్యుఁడౌ"

నని దివ్యకంఠనినాదముతో ఘోషించినాఁడు.

భక్తితోఁ గూడిన యర్చనప్రాశస్త్య మిట్లు తెల్పుచున్నాఁడు:

"జలకంబుల్ రసముల్ ప్రసూనములు వా
చాబంధముల్ వాద్యముల్
కలశబ్దధ్వను లంచితాంబర మలం
కారంబు దీప్తుల్ మెఱుం
గులు నైవేద్యము మాధురీమహిమగాఁ
గొల్తున్నినున్ భక్తి రం
జిల దివ్యార్చనఁగూర్చి నేర్చినక్రియన్ శ్రీ..."

మఱియు, భవభక్తు నిట్లు చిత్రీకరించుచున్నాఁడు:

"తలమీఁదం గుసుమప్రసాద మలిక
స్థానంబుపై భూతియున్
గళసీమంబున దండ నాసికతుదన్
గంధప్రసారంబు లో
పల నైవేద్యము చేర్చు నేమనుజుఁ డా
భక్తుండు నీ కెప్పుడున్
చెలికాఁడై విహరించు రౌప్యగిరిపై శ్రీ..."

అనియు భక్తిభావము నభినందించియున్నాఁడు.

జ్ఞానవిషయమున, కేదారాది సమస్తతీర్థములు చూడఁబోవుటయు వ్యర్థమే యనియు, ముంగిలి వారణాసి, కడుపే కైలాసశైలము పరమేశ్వరపాదసమారాధనయోగము కల్గినపు డైతీఱుననియు, 'నజ్ఞానలక్ష్మీ దారిద్ర్య' లనుట లోకులు తీర్థయాత్రాలోలు రగుదురనియు తెలిపినాఁడు. మఱియు జ్ఞాని పరమేశ్వరభజన మున్నపుడు ఆపదలు పొడమినను, నిత్యోత్సవ మబ్బినను, జనమాత్రుఁ డన్నను, మహాత్ముఁ డన్నను, సంసారమోహము పైకొన్నను, జ్ఞానము కల్గినను, గ్రహగతులు కుందినను, మేలు వచ్చినను, గీడు వచ్చినను నన్నియు భూషణములుగానే యెంచును.

యోగవిషయాభిజ్ఞతను ధూర్జటి కొన్నిపద్యముల వెల్లడించినాఁడు:

"అకలంకస్థితి నిల్పి నాద మను ఘం
టారావమున్ బిందుదీ
పకళాశ్రేణి వివేకసాధనము లొ
ప్పన్ బూని యానందదా
పక దుర్గాటవిలో మనోమృగము గ
ర్వస్ఫూర్తివారించు వా
రికిగా వీడు భవోగ్రబంధలతికల్"

అనియు, ఓంకారవాచ్యుఁడు పరమేశ్వరుఁ డనియు నిట్లు వివరించినాఁడు:

"ఆరావం బుదయించెఁ దారకముగా
నాత్మాభ్రవీథిన్ మహో
కారోకార మకారయుక్తమగు నోం
కారాభిధానంబు చె
న్నారున్ విశ్వమనంగఁ దన్మహిమచే
నానాదబిందుల్సుఖ
శ్రీరంజిల్లఁ గడంగు నీవదెసుమీ శ్రీ..."

అని యోగప్రాశస్త్యమును హృదయామోదకరముగాఁ దెల్పినాఁడు.

వైరాగ్యవిషయప్రబోధ మనన్యసాధ్యమగురీతి నీశతకమునఁ జూపట్టుచున్నది. మహోభావసంభరిత మగు నీవైరాగ్యబోధ ధూర్జటియొక్క నిశ్చలవైరాగ్య స్థితిఁ దెల్పుచుండును.

"అంతా సంశయమే శరీరఘటనం
బంతా విచారంబె లో
నంతా దుఃఖపరంపరాన్వితమె మే
నంతా భయభ్రాంతమే

అంతా సాంతశరీరశోషణమె దు
ర్వ్యాసపార మే దేహికిన్."

అనియు,

"సంతోషించితిఁ జాలుఁజాలు రతిరా
జద్వారసౌఖ్యంబులన్
శాంతిం బొందితిఁ జాలుఁజాలు బహురా
జద్వారసౌఖ్యంబులన్."

అనియు, మఱియింక నెన్నో రీతుల తన శతక మందంతటను వైరాగ్యబోధన మద్వితీయముగా సాగించినాఁడు.

భక్తియోగజ్ఞాన వైరాగ్యసమన్విత మగు సేవామనీషయే బ్రహ్మానందము నొసఁగును గాని కేవల శాస్త్రజ్ఞానము నిష్ప్రయోజన మని, దానిని జక్కఁగా గర్హించినాఁడు.

కేవలశాస్త్రజ్ఞానము నిష్ప్రయోజనము

భక్తిప్రతిపత్తి లేని శాస్త్రజ్ఞానము వ్యర్థము అంతియకాక, బోధావిర్భావనిదానము చదువులు కావనేకావని విస్పష్టముగా బోధించినాఁడు. శాస్త్రజ్ఞానమే జ్ఞానప్రదాత్రి, ముక్తిదాయిని యగుచో ముక్తిశ్రీ నలంకరించినవారిలో —

"ఏ వేదంబు పఠించె లూత భుజగం
బే శాస్త్రముల్ నేర్చె తా
నే విద్యాభ్యసనం బొనర్చెఁ గరి చెం
చే మంత్ర మూహించె ..."

నని పృచ్ఛించుచున్నాఁడు. మఱియు, సమస్త శాస్త్రపారంగతుఁడైనవాఁడు వృథావచనములు చెప్పనే కాని నిర్జితచిత్త స్థిరసౌఖ్య మెఱుఁగఁడు.

శాస్త్రము లభ్యసించువారికి నిత్యత్వమనీష దూరమగునని ముక్తకంఠముతో ఘోషించుచున్నాఁడు:

"శుకముల్ కింశుకపుష్పముల్ గని ఫల
స్తోమం బటంచున్ సము
త్సుకతన్ జేరఁగఁబోవ నచ్చట మహా
దుఃఖంబు సిద్ధించు క
ర్మకలాభావములకెల్లఁ బ్రాపులగు శా
స్త్రంబుల్ విలోకించువా
రికి నిత్యత్వమనీష దూరమగు నో శ్రీ..."

ఇదియేకాక, మంత్రతంత్రములు పరిశీలించి సాంఖ్యాదియోగరహస్యము లెఱిఁగినవారికి ఆవగింజంతయైన సందియము నివారణము కాకపోవుటేకాక, చిత్తచాంచల్యము కలిగించునని యిట్లుదాహరించుచున్నాఁడు:

"చదువుల్ నేర్చిన పండితాధములు స్వే
చ్ఛాభాషణక్రీడలన్
వదరన్ సంశయభీకరాటవులఁ ద్రో
వ ల్దప్పి వర్తింపఁగా
మదన క్రోధకిరాతు లంగుఁగని భీ
మ ప్రౌఢి వేఁదాఁకినన్
చెదరున్ జిత్తము..."

ఇంకను పారిభాషిక పదాభిమానుల, జ్ఞానశూన్యులగు పండితుల నీరీతి నిందించి, పరమేశ్వర కరుణాకటాక్ష సంపాదనకు పాండిత్య మనపేక్ష్యమని నొక్కి వక్కాణించుచున్నాఁడు:

"పటవత్ రజ్జుభుజంగవత్ రజతవి
భ్రాంతిస్ఫురచ్ఛుక్తివత్
ఘటవత్ చంద్రశిలాజపాకుసుమరు
క్సాంగత్యవత్ అంచు వా
క్పటిమల్ నేర్తురు చిత్సుఖం బనుభవిం
పన్ లేక దుర్మేధసుల్
చిటుకన్నన్ దలపోయఁజాలు రధముల్ శ్రీ..."

భక్త ప్రశంస

వ్యాజస్తుతిపూర్వకముగా భక్తప్రశంస చేయుచు నొక విశిష్టమార్గమును ధూర్జటి యవలంబించినాఁడు భక్తులనామములు పేర్కొని స్తుతింపక భక్తసత్క్రియలఁ బేర్కొని శ్లాఘించు టిందలి విశేషము ఉదాహరణ కొకటి రెండు:

"నీతో యుద్ధముచేయ నోప(బాణునివలె)కవితా
నిర్మాణశక్తిన్ నినుం

స్త్రీపురుష్ జేయఁగఁజాల(పుష్పదంతునివలె)నీకొఱకుఁదం
డ్రిం జంపఁగాఁజాల నా
చేతన్ తోఁకట నిన్ను మొత్త నెఱతున్
జేకొను నాథ క్తి......"

యనియు,

"బాలన్ రువ్వఁగఁ జేతులాడవు కుమా
రా రమ్మరమ్మంచు నే
చాలన్ జంపఁగ(చిఱుతొండనంబి)నేత్రముల్ దివి
యఁగా
శక్తుండనేఁ గాన(కన్నప్ప)..."

ఇంకను జక్కఁగా—

"పవమానాశన భూషణప్రకరముల్
భద్రేభచర్మంబు నా
టవికత్వంబుఁ బ్రియంబులై భుజగసం
ఘాలాటవీచారులన్
భవదుఃఖంబులఁ బాపు టొప్పు చెలఁగిం
చాటించి కైవల్యమి
చ్చి వినోదింపఁగ నేమి కారణము యా..."

ఇంతయేల, నీభక్తు లెవ్వరైనను నాకుఁ బ్రశంసా పాత్రులేనని ధూర్జటి చక్కఁగాఁ దన భక్తపరా రాధన పరత్వమును జాటినాఁడు :

"భసితోద్ధూళితధూసరాంగులు జటా
భారోత్తమాంగుల్ తపో
వ్యసనుల్ సాధితపంచవర్ణరసనుల్
వైరాగ్యవంతుల్ నితాం
తసుఖస్వాంతులు సత్యభాషణ సము
ద్యద్రత్నరుద్రాక్షరా
జిసమేతుల్ తుద నెవ్వరైనఁ గొలుతున్..."

ఇంకను ననేకుల శతకమునం దెల్ల నీరీతిగానే ప్రశంసించినాఁడు.

కొన్ని నిర్వచనములు

ఈశతకమునందలి విశేషములలో నిది యొకటి. సౌఖ్య మన నేమి? సిలుగు లెట్టివి? శ్రేయోదాయకు లెవరు? చిత్త మెట్టిది? సద్వ్యాంగవు లెవరు? మొద లను ప్రశ్నములకు సమాధానములను నిర్వచించి చక్కఁగాఁ జూపినాఁడు :

"దినముల్ చిత్తములో సువర్ణముఖరీ
తీరప్రదేశాగ్రకా
నన మధ్యోపల వేదికాగ్రమున నా
నందంబునన్ బంకజా
సననిష్ఠన్ నిను జూడఁగన్న నదివో
సౌఖ్యంబు......"

"కల లంచున్ శకునంబు లంచు గ్రహయో
గం బంచు సాముద్రికం
బు లటంచున్ దెవు లంచు దిష్టమనుచున్
భూతంబు లంచున్ విషా
దు లటంచున్ నిమిషార్ధజీవనము లం
దున్ బ్రీతి పుట్టించి యీ
సిలుగుల్ ప్రాణుల కెన్ని చేసితివయా..."

మాయాజాండకరండకోటిఁ బొడిగా మర్దించిన వారు, విక్రమాజేయుఁడను కాయజుఁ జంపినవారు, కపటలక్ష్మీమోహమును బాసినవారు, ఆయుర్దాయ భుజంగమృత్యువు ననాయాసంబున గెల్చినవారు—వీరు శ్రేయోదాయకులు.

"విత్తజ్ఞానము పోదు చిత్తము భవా
వేశంబు రక్షాంబువుల్
మత్తత్వంబు తదంకురం బనృతముల్
మారాకు లత్యంతదు
ర్వృత్తుల్ పువ్వులు పండ్లు మన్మథముఖా
విర్భూతదోషంబులున్
చిత్తాభ్యున్నతనింబభూజమునకున్..."

ఇట్టిది చిత్తము.

ఇఁక సద్వ్యాంగవు లెవ రనఁగా, నీశ్వరునిపైఁ గావ్యము వ్రాయువాఁడు, నాతనిపైఁ బద్యములు పాడ మొనరించువాఁడు, నాతని మంజుల ప్రబంధము నిష్ఠాపూర్తిగాఁ బఠించువాఁడును.

ఈరీతిగానే భగవన్నామము, చనిపోయినవారి తోడి సంబంధము మొదలగు విషయములఁ జక్కఁగా నిర్వచించినాఁడు.

రాజదూషణము

శతక మంతయును స్వానుభవప్రదర్శనమునకు నిదర్శనమే యైనను, నిందుఁ బ్రధానముగా రాజదూషణమున నాఁటి రాజుల దుష్ప్రవర్తనను నిరంకుశముగా, నిర్భయముగా విశదీకరించి మిగిలిన రాజులకు గుణపాఠము బోధించినాఁడు. రాజులు మత్తు లనియు, వారి దానము లాత్మవ్యథాబీజము లనియు చంద్ర, కుబేర, కురుక్ష్మాపాలురే రాజులై దుష్కృతి చెందఁగా నీకుఁ దక్కినవారిఁ జేరఁగ్రొక్కన నేల యనియు, రాజకీటముల సేవింప లేననియు, రాజనఁగానే కృపాది సద్గుణంబులు తొలఁగిపోవు ననియు, వారు భూభృచ్చండాలు రనియు పలువిధముల నిందించినాఁడు.

అలంకారములు, లోకోక్తులు

సులభగంభీర భాషాప్రయోగమునఁ జక్కని యలంకారములు, వివిధములైన లోకోక్తులు నివియే శతకప్రాబల్యమునకుఁ, బ్రాచుర్యమునకుఁ బ్రధానములు. భాషావిషయ ప్రాశస్త్యమునకుఁ బూర్వోదాహృతపద్యములే ప్రమాణములు. ఇట్టి భాషాప్రయోగనైపుణ్యమున విషయము వెంటనే హృదయమునకు హత్తుకొని ప్రత్యక్షప్రబోధకము (Directness of appeal) గా నుండును. ఇది యీశతకమున నెల్లెడల వెల్లివిరియుచునే యున్నది.

ఇఁక, అలంకారములకు, లోకోక్తులకు నాలుగై దుదాహరణముల నరసి ధూర్జటి విషయప్రదర్శనవైశిష్ట్యము నరయుదము. అలంకారములకు:

"భవకేళీమదిరామదంబున మహా
పాపాత్ముఁడై వీఁడు న
న్ను వివేకింపఁడటంచు నేను నరకా
ర్ణోరాశిపాలైనఁ బ
ట్టవు బాలుం డొకచోట నాటతమితో
డన్ నూతఁ గూలంగఁ దం
డ్రీ విచారింపకయుండునా కటకటా..."

"భవదుఃఖంబులు రాజకీటముల నేఁ
బ్రార్థించినన్ బాయునే
భవదంఘ్రిస్తుతిచేతఁ గాక విలస
ద్బాలక్షుధాక్లేశదు
ష్టవిధుల్మానునె చూడ మేఁకమెడచం
టన్ దల్లి కారుణ్యదృ
ష్టివిశేషంబున నిచ్చు చంటబలె నో..."

మొదలగు నుదాహరణములు లెక్కకు మిక్కిలిగా నున్నవి. అతిసహజమైన ధోరణిలోఁ దలిదండ్రులు బిడ్డను లాలించునట్లు భగవంతుఁడు భక్తుఁడు కోరికలఁ గోర నిచ్చి లాలింపఁడా యను విషయము నిందుఁ జక్కఁగా నుదాహరించినాఁడు.

"పాలుం బువ్వయుఁ బెట్టెదన్ గుడువరా
పాపన్న రాయన్న లే
లే లెమ్మన్న నరఁటిపండుఁ గొని తే
లేకున్న నే నొల్ల నం
టే లాలింపరె తల్లిదండ్రు లపుడ
ట్లే తెచ్చి వాత్సల్యల
క్ష్మీలీలావచనంబులన్ మనుపవే..."

అనున దెంతసహజమును, కరుణరసపూరితమునో కదా! ఇట్టి విశేషము లీశతకమున ననంతముగా నున్నవి.

లోకోక్తులుకూడ నీశతకమునకు వన్నె తెచ్చినవి. "నియమం బెంతో ఫలంబు నంతియకదా", "నీవీయ పిండెంతో నంతియకా దశం బశనబుద్ధిం జూడ నేలబ్బు", "జలజశ్రీఁగల మంచినీళ్లు గలవా చత్రాతిలో", "వెలివాఁడలో బాపనిల్లు కలదా", "కాఁడా ముంగిలి వారణాసి కడుపే కైలాసశైలమ్ము", "ఇల్వెడలన్ ద్రోచినఁ జూరుపట్టుకొని నే వ్రేలాడుదున్" మొదలగు చక్కని లోకోక్తు లీశతకమహత్త్వమునకు నూతనశోభ నొసఁగుచున్నవి.

విషయప్రదర్శన వైశిష్ట్యము

తాత్త్విక విషయప్రబోధమున నొక గొప్ప విషయప్రదర్శనవైశిష్ట్యమును జూపి యద్భుతముగా సత్వరమున హృదయమునకు నాటునట్లు చెప్పఁగల సామర్థ్యము ధూర్జటిసొమ్ము. అగుటచే నీతని శతకము ఈవిషయమునకు గొప్ప నిదర్శనము. "అయుర్నశ్యతి

పశ్యతాం ప్రతిదినం" అనువిషయమును ధూర్జటి యెంత సహజముగా, మనస్సునకు ములుకులవలె నాటునట్లుగా చెప్పినాఁడో చూడుఁడు :

"నిన్నం జూడరొ మొన్నఁ జూడరొ జనుల్
నిత్యంబుఁ జావంగ."
"గడియల్ రెంటికొ మూఁటికో గడియకో
కాదేని నేఁ డెల్లియో
కడ నేఁడాదికొ యెన్నఁడో యెటుఁగ మీ
కాయంబు లీ భూమిపైఁ
బడఁగా నున్నవి..."
"తాతల్ తల్లియుఁ దండ్రియున్ మఱియుఁ బె
ద్దల్ చావఁగాఁ జూడరో."

మొదలగు వాక్యములు హృదయమున స్ఫుటముగా నాటును.

ఇతరశతకములతోఁ బోల్చి చూచి యీ శతకాన్నత్యము నరయుటకు జగత్ప్రసిద్ధి గాంచిన యొక్క భర్తృహరి సుభాషిత త్రిశతిలోని నాలుగైదు శ్లోకములఁ బోలిన ధూర్జటిపద్యములఁ జూచినచో నిఁక మిగిలిన శతకములఁ జేర్కొను నావశ్యకత కలుగదు.

" స్తనౌ మాంసగ్రంథీ
కనకకలశా విత్యుపమితౌ
ముఖం శ్లేష్మాగారం
తదపిచ శశాంకేన తులితం
స్రవన్మూత్ర క్లిన్నం
కరివరశిరస్స్పర్ధి జఘనం
ముహుర్నింద్యం రూపం
కవిజనవిశేషై ర్గురుకృతమ్."

అను భర్తృహరి శ్లోకమును పోలిన యీక్రింది పద్యమున ధూర్జటి యొంగసమ్మిళితము చేసి, ఇట్టి యుపమానమునకు వన్నె దెచ్చినాఁడు. చూడుఁడు :

" మలభూయిష్ఠ మనోజధామము సుషు
మ్నాద్వారమో నారకం
బలిమో పాదకరాక్షి యుగ్మములు ష
ట్కంజంబులో మోము తా
జలజంబో నిటలంబు చంద్రకళయో
పంగంబు యోగంబొ గా
సిలి సేవింతురు కాంతలన్ భువిజనుల్..."

తరువాత యాచ్ఞా దైన్యదూషణము చేయుచు

"కింకందాః కందరేభ్యః ప్రళయ ముపగతా
నిర్ఝరావా గిరిభ్యః
ప్రధ్వస్తావా తరుభ్యః సరసఫలభృతో
వల్కలిన్యశ్చ శాఖాః
వీక్ష్యంతే యన్ముఖాని ప్రసభ మపగత
ప్రశ్రయాణాం ఖలానాం
దుఃఖోపాత్తాల్పవిత్త స్మయపవన వశా
న్నర్తితభ్రూలతాని."

అని భర్తృహరి వ్రాసిన శ్లోకమును బోలిన యీ పద్యమున

"లేవో కానల కందమూలఫలముల్
లేవో గుహల్ తోయముల్
లేవో యేఱులఁ బల్లవాస్తరణముల్
లేవో సదా యాత్మలో
లేవో నీవు విరక్తులన్ మనుప జా
లిం బొంది భూపాలురన్
సేవల్ చేయఁగఁబోదు రేలకో జనుల్..."

అనియు, లేనిచో

"ఊరూరన్ జనులెల్ల బిచ్చమిడరో
ఉండన్ గుహల్గల్గవో
చీరానీకము వీధులన్ దొరకదో
శీతామృతస్వచ్ఛవాః
పూరం బేరులఁ బారదో తపసులన్
బ్రోవంగ నీ వోపవో
చేరం బోవుదు రేల రాజుల జనుల్..."

అనియు, నట్టివారిఁ గాపాడ భగవంతుఁడున్నాఁడు సుమా యని ధైర్యము చెప్పుటేకాక, క్లేశముల కోర్చి పైఁజెప్పిన రీతి వర్తించిన ప్రతిఫలము వెంటనే చూపివేసినాఁడు. ఈభావము భర్తృహరిశ్లోకమున లేదు.

మఱియొకటి :

"స్ఫురత్స్ఫారజ్యోత్స్నా
ధవళితతలే క్వాఽపి పులినే
సుఖాసీనాస్సంతః
ధ్వనిషు రజనీషు ద్యుసరితః
భవాభోగోద్విగ్నా
శ్శివశివశివే త్యుచ్చవచసః
కదా స్యామానందో
ద్గతబహుళబాష్పాప్లుతదృశః."

అను చక్కని శ్లోకమును బోలిన —

"దినముల్ జిత్తములో సువర్ణముఖరీ
తీరప్రదేశాశ్రమా
వనమధ్యోపల వేదికాగ్రమున నా
నందంబునన్ బంకజా
సన నిష్ఠన్ నినుఁజూడఁ గన్న నదివో
సౌఖ్యంబు లక్ష్మీవిలా
సినిమాయానటనల్ సుఖంబు లగునే..."

ఈపద్యమునందు శాంతరాత్ర నిశీథకాలముల మాత్రమేకాక ప్రతినిత్యము బ్రహ్మనిష్ఠాగరిష్ఠత పరబ్రహ్మస్వరూపముఁ గాంచి యానందింపవలె నని పైభావమునకు మెఱుఁగిడినాఁడు. ఇట్టి సౌందర్యము లెన్నియైన నీశతకమునఁ జూపవచ్చును.

పరమేశ్వరుఁడు స్త్రీపురుషుల సృష్టించి వారి నెందులకు సృజించినాఁడో యాపనులే పాతకవ్యవహారము లని శాసించినాఁడు. ఈస్థితిని ధూర్జటి విశిష్టనైపుణ్యముతో —

"చవిగోఁ జూడ వినంగ మూర్కొనఁ దనూ
సంఘర్షణాస్వాద మొం
ద వినిర్మించెదవేల జంతువుల నే
తత్క్రీడలే పాతక
వ్యవహారంబులు సేయు జేమిటికి..."

అని ప్రశ్నించుకొని, సమాధానము దొరకక, "మాయావిద్యచేఁ బొద్దుపుచ్చి వినోదింపఁగ దీన నేమి ఫలమో" యని వాపోయినాఁడు.

మఱియుఁ, గరుణరసము లొలుకాడఁ దాను భగవంతుని 'బిడ్డగా' నెంచుకొని ప్రార్థించినాఁడు.

"నీపేరున్ భవదంఘ్రితీర్థము భవ
న్నిష్ఠ్యూతతాంబూలమున్
నీపళ్లెంబుఁ బ్రసాదమున్ గొనికదా
నీబిడ్డఁ డైనాఁడ న
న్నీపాటిం గరుణింపు మోప నిఁక నే
నెవ్వానికిన్ బిడ్డగాఁ
జేపట్టం దగుఁ బట్టి మానఁదగదో..."

'నీబిడ్డను', 'నీపట్టిని' అను పదములలోని స్వారస్యము, నందు వెల్లివిరియు కరుణరసము నొకదాని నొకటి మించుచున్నవి.

శతకకర్త దృఢనిశ్చయము

ఈశతకము భావప్రధానము, స్వానుభవసమన్వితము నగుట పైయుదాహరణములఁబట్టి కవి పండితుఁడుగా, యోగిగా, జ్ఞానిగా, భక్తుఁడుగా, విరాగిగా, లోకజ్ఞానిగా, సర్వజ్ఞుఁడుగా నిందు మన కనులకుఁ బ్రత్యక్షమగుచున్నాఁడు. అంతటివాఁడుకనుకనే కవి నిరంకుశుఁడై, "నిను సేవింపఁగ నాపదల్ పొడమనీ నిత్యోత్సవం బబ్బనీ..." యన్నాఁడు. "నిన్నునమ్మినరీతి నొరుల నమ్మ"నన్నాఁడు. "నీపంచఁ బడియుండఁగాఁ గల్గిన భిక్షాన్నమే చాలు"నన్నాఁడు. "నిన్నే నిష్ఠ భజించెద" నని తన కవిత్వము సైత మీశ్వరునికేకాని యన్యుల కీయ నని కంకణము కట్టుకొని సంకల్పసంసిద్ధి నంది ధన్యుఁడైనాఁడు.

శతకఫలము

ఒక్కమాటలో నీశతకపఠనముచే జీవితప్రయోజన మిట్లుగాఁ గ్రోడీకరించి తెల్పి, తన్మార్గముఁ జూపి యొక్కసారిగా నుద్బోధించుచున్నాఁడు :

"సంపద్గర్వముఁ బాఱఁద్రోలి రిపులన్
జంకించి యాకాంక్షలన్
దంపుల్వెట్టి కళంకముల్ నరికి బం
ధక్లేశదోషంబులన్
చింపుల్ చేసి వయోవిలాసముల సం
క్షేపించి భూతంబులన్
చెంపల్వేయక నిన్నుఁ గాన నగునా..."


ఈపను లెన్నఁడో చేతు మన్నఁ గాదు :

"దంతంబుల్పడనప్పుడే తనువునం
దారూఢియున్నప్పుడే
కాంతాసంఘము రోయనప్పుడె జరా
క్రాంతంబు కానప్పుడే
వింతల్మేనఁ జరింపనప్పుడె కురు
ల్వెల్లెల్ల కానప్పుడే
చింతింపన్వలె నీపదాంబుజములన్..."

అను బ్రహ్మజ్ఞానోద్బోధముతో తన శతకము ముగించినాఁడు.

మ న వి ధి

ఈవిధముగా ననంతగుణవిశిష్టసంపన్నమగు నీశతకమున నింకను గ్రహింపవలసిన వెన్నియో కలవు. ఇంతటి మహోన్నతభావసమన్వితము లగు శతకము లాంధ్రవాఙ్మయముననే విలసిల్లుట మన యదృష్టము. ఇట్టి శతకపరిశీలనమువలన శతకములు వాఙ్మయముగా భావింపఁజనదన్న కవిచరిత్రకారుల వాక్యమును, శతకము లాయాకవులు బాల్యమున పద్యము లల్ల నేర్చుకొనుటకే వ్రాయఁబడిన వను దుర్భ్రాంతియుఁ ద్రోసిరాజని కొన్ని ప్రబంధములకంటెఁ గొన్ని శతకము లత్యంతస్తుతిపాత్రము లని ఘంటాపథముగాఁ జాటి, యిట్టి మహోన్నతశతకపఠనపారాయణ సద్వ్యవర్తనములవలని యుపలబ్ధి నందుట మనవిధి.



కోడలు

[కథానిక]

= శ్రీ యర్రంశెట్టి =
హనుమంతరావు

[మొదటిభాగము]

౧

లలిత కాపరానికి వెళ్లింది, వెళ్లలేదు. పెద్దసంబంధం చేద్దామని దురాశకుపోయి లలితతండ్రి బుచ్చి వెంకయ్యగారు లలిత మెడకు ఉరివేసినాడు.

తాహతులేని పనులు చేసి తలవంపులు తెచ్చుకొనేకన్న గుడ్డకు తగినట్టు కోటు కుట్టించుకోవడము ఉత్తమము. పెంపుడుకొడుకు, పెద్దఆస్తి, బి. యల్. చదువుతున్నాడు, మాపులకు నదరుగా ఉంటాడు అని పోటీలమీద పోటీలకు వెళ్లి మూడువేలకట్నం, వెయ్యి నూటపదహారురూపాయల లాంఛనాలు అనే షరతుతో లలితతండ్రి సుందరరావుసంబంధానికి ఒప్పుకొన్నాడు.

ముందే నాలుగువేలు పంపించమంది సుందరరావు పెంపుడుతల్లి వెంకాయమ్మ. కాని ఆవిడదగ్గిర చుట్టమున్నూ, బుచ్చివెంకయ్యగారి స్నేహితుడున్నూ అయిన రామమూర్తిగారు బుచ్చివెంకయ్యగారివంటి పెద్ద మనిషి ఆంధ్రదేశములో లేడనిన్నీ, అనవసరమైన పేచీలు పెట్టి తనకున్నూ, తన పెంపుడుకొడుకుకున్నూ తలవంపులు తీసుకొనిరావద్దనిన్నీ గట్టిగా సలహా చెప్పినాడు. ఆవిడ సరేనన్నది. పెళ్లివారంతా తరలి వచ్చారు. పెళ్లిపీటలదగ్గర బుచ్చివెంకయ్యగారు మూడు వేల కట్నం, వెయ్యినూటపదహారురూపాయల లాంఛనాలు చెల్లించాడు. కాని వెండికంచంలో ఉన్నవి వెయ్యినూటపదహారు వెండిబిళ్లలు, రెండువేలరూపాయల నోటు, తక్కిన వెయ్యిరూపాయలు లాంఛనాల రూపంగానూ వున్నవి.

పెళ్లికిముందరే తానెంత ప్రయత్నం చేసినా కట్నం భర్తీ చేయడానికి రెండువేల రూపాయలు దొరకలేదనిన్నీ, పరువు ప్రతిష్ఠలతో బ్రతికినవాడవడముచేతను, పెద్దకూతురి పెళ్లవడముచేతను పెళ్లి డాబుగా చేయాలని ఎంత ప్రయత్నం చేసినా తాను నాలుగువేల రూపాయలకన్న ఎక్కువ పోగుచేయలేకపోయినాననిన్నీ, వ్యవధి లేకపోవడముచేత భూమిని తాకట్టుపెట్టిగాని, అమ్మిగాని తక్కిన రెండువేల రూపాయలూ తీసుకొనిరాలేకపోయినాననిన్నీ, కొద్దిరోజులలో ఏదోరకంగాచేసి తక్కిన రెండువేల రూపాయలూ భర్తీచేయగలవాడననిన్నీ, అందాకా ఆ రెండువేలరూపాయలకూ ఒకప్రోనోటు వెయ్యినూట పదహారులతో పెట్టి సమర్పించుకొంటున్నాననిన్నీ బుచ్చి వెంకయ్యగారు రామమూర్తిగారితో ప్రాధేయ పడ్డాడు. సరళహృదయం గల రామమూర్తిగారు "సరే, నేనేదో తంటాలుపడి వియ్యపురాలిని ఒప్పిస్తాను. ఈ సంగతిమాత్రం ఎవరితోనూ చెప్పవ" ద్దని సలహా ఇచ్చాడు.

పెళ్లివారి ఆడవాళ్లమధ్య కూర్చున్న వియ్యపురాలు రామమూర్తిగారిని పంపి "కట్నం అంతా సరిగ్గా వుందయ్యా, మాడ"మని ఆజ్ఞ ఇచ్చింది. "అ. అ. సరిగ్గానే ఉం" దని జవాబు చెప్పాడు.

ఘల్లి మూడుముళ్లూ పడ్డాయి. వెండికంచం రూపాయలు వియ్యపురాలుగారికి అప్పగించారు. రొఖ్ఖం వెయ్యినూటపదహారురూపాయలు మాత్రమే ఉండడమూ, ఆ రూపాయలమధ్య రెండువేల రూపాయలకు నోటు ఉండడమూ చూసింది. ఆమె ఆడుపులి అయిపోయింది. కళ్లు చింతనిప్పులలాగ అయిపోయినవి.

కోపముచే పెదవులు వణికినవి. "రామమూర్తిని ఇల్లా పిలవం" అన్నది. ఆయన రాగానే ఆ పనిమంది ఆడవాళ్లమధ్యా అతన్నిపట్టుకొని హీనుడనీ, కుట్రదారుడనీ, దొంగఅనీ, పరమచండాలుడైన పెండ్లికూతురు తండ్రితో కలిసినాడనీ, తన మంచితనాన్ని సావకాశం చేసుకొని వియ్యంకుడూ, రామమూర్తీ తన్ను తీరని అవమానపరచి పరమచండాలమైన పని చేశారనీ తల వాచేటట్టు చివాట్లు పెట్టి, ఆ వెధవ పెంపుడుకొడుకు కూడా పెళ్లివారితో ఏకమయ్యాడనీ, వాడు తనింటికి ఎల్లా వస్తాడో చూస్తాననీ కేకలువేసి, ఆపూపాయలూ, ఆనోటూ అక్కడే గభిల్లని పారవేసి పెళ్లివారింట్లో పెళ్లిభోజనమైనా చేయకుండా తన రెండెడ్లబండి కట్టించుకొని స్వగ్రామానికి వెళ్లిపోయింది.

౨

ఈగడబిడ అంతా పెండ్లికొడుకు సుందర్రావుకేమీ తెలియదు. బంగారు ముద్ద, రూపం పొందిన సౌందర్యం, నాలుగోఫారమువరకు చదువుకొన్న విద్యావంతురాలు భార్యగా దొరికిందనే సంతోషించాడుగాని తన పెంపుడుతల్లిగారి హృదయంలో దావానలం, ప్రచండమైన తుపాను, మహాప్రళయం చెలరేగిందని అతని కేమి తెలుసును?

పెళ్లితంతు లన్నీ అవగానే నూతనవస్త్రాలతో, కలకలలాడు స్వరూపంతో లక్ష్మీదేవిలా వధువు తన చిటికినవ్రేలిని పట్టుకొని కూడా రా తల్లికి నమస్కారము చేయడానికి పెండ్లికొడుకు వెళ్లేటప్పటికి పెళ్లివారింట్లో తక్కిన ఆడవాళ్లు జరిగిన ఆ ఘోరవిషయం అతనితో పరిపరివిధాలుగా నొక్కిచెప్పినారు. సుందర్రావు భయంతో గజగజలాడిపోయినాడు.

సుందర్రావు ధైర్యములేని మనిషి. చిన్నతనంలోనే వెంకాయమ్మగారికి దత్తత వచ్చాడు. వెంకాయమ్మ బీద అక్కగారి కొడుకు. కన్న కుటుంబములో అయిదుగురు అన్నదమ్ములలో ఆఖరువాడు. వెంకాయమ్మ భర్తకు రెండవభార్యగా వెళ్లింది. ఆవిడభర్త లక్షాధికారి; ఆస్తిపరుడు. ప్రథమభార్య ఒక్క కూతుర్ని కని కూతురుతోపాటే పరలోకానికి వెళ్లిపోయింది. వెంకాయమ్మపుట్టింటివారు బీదవారు. ఆరుగురు అప్పచెల్లెండ్రలోనూ నాలుగో అమ్మాయి వెంకాయమ్మ. స్ఫురద్రూపి; ఆరితేరిన అప్సరస; ఆడుపులిలాంటి, తెల్లత్రాచులాంటి అందం; పెంకిపిల్ల; గడుసరి; రెండవభార్యగా మొగుడుదగ్గరికి కాపరానికి వెళ్లిందగ్గరనుంచి భర్తను పాదదాసునిగా చేసుకొంది. భర్తను ఇంగ్లీషురాజును చేసి సింహాసనం ఎక్కించి సర్వాధికారిణిలా వహించి తానే మంత్రి అయి రాజ్యాధికారం చలాయించసాగింది. భర్త కలలోనైనా ఎరగని వాత్స్యాయనశాస్త్రసంతోషము అతనికి సమకూర్చింది. భర్తవ్యాపారాలు భర్తకన్న జాగ్రత్తగా, లాభకరంగా నడుపుకువచ్చింది.

వెంకాయమ్మకన్న ఇరవయి ఏండ్లు పెద్దవాడైన భర్త తన అరువదియవ ఏట తన సమస్తమైన ఆస్తికీ వెంకాయమ్మకు సర్వహక్కు లిచ్చి, ఇష్టమైన కొడుకును పెంచుకొనే హక్కుకూడా యిచ్చి సంతోషముతో స్వర్గమునకు వెళ్లిపోయినాడు. నీళ్లులేని కండ్లతో వెంకాయమ్మ రెండుమూడు నెలలు ఏడ్చింది. అప్పగారి కొడుకును వైభవముగా దత్తత చేసుకొంది. భర్తకన్న ఎక్కువ వినయవిధేయతలు గలిగిన బాలకుడుగా పెంపుడుకుమారుని తయారుచేయ దలచింది. స్వాతంత్ర్యమూ, వివేచనా పెంపుడుతల్లిగారి సంరక్షణలో ఉంచి విద్యార్థిదశ ప్రారంభించాడు సుందర్రావు. కష్టపడి పరీక్షలు ప్యాసయినాడు. తల్లిమాటే వేదవాక్కు. ఆమె గీచిన గీటు పెట్టని కోట. ఆమె పొమ్మన్నది పోక, రమ్మన్నది రాక. ఆమెఆజ్ఞ సర్వసైన్యాధ్యక్షుని ఆజ్ఞ. కుడి, ఎడమ, కుడి, ఎడమ (Right, left. Right, left)— జీవితసైన్యపుదారిలో సుందర్రావు సైనికుడై నడక సాగించాడు.

3

తల్లినీ, తననూ అత్తవారి ఇల్లా అవమానముచేస్తారా?—సుందర్రావు చండభానుడైనాడు. అగ్నివర్షము కురిపించాడు. పెండ్లివారిని బళ్లు సిద్ధంచేయమన్నాడు. పెండ్లిభోజనమైనా చేయకుండా పెండ్లి

కూతుర్ని, లాంఛనాల్ని, కట్నాన్ని అత్తవారింటిదగ్గరే పారవేసి స్వగ్రామానికి వెళ్లి తల్లిని చేరుకొన్నాడు.

ఈ సంబంధము రావడము తనదే లోటని పెంపుడు తల్లి తిట్టిన తిట్లన్నీ పడ్డాడు. అత్తవారిని తల్లి తిట్టిన పదివేలతిట్లకూ తాను స్వంతముగా పదిహేనువేల తిట్లు చేర్చాడు. తల్లిగారి ఆజ్ఞ అయితే మర్యాదగల మరోసంబంధము చేసుకోవడానికి తాను సర్వసిద్ధమన్నాడు.

ఆ సాయంత్రానికే పెండ్లిమధ్యవర్తియైన రామమూర్తిగారు నాలుగువేల రూపాయలతో, పెండ్లికొడుకు వదలిపెట్టిన పెండ్లికూతురుతో, లాంఛనాలతో, పెండ్లికూతురుతోలూను ఇద్దరు ఆడచుట్టాలతో చక్కా వచ్చారు. పెండ్లికుమారుడు నోరెత్తకుండా, వెంకాయమ్మగారినోట మళ్లీ మాటరాకుండా గంగానదిలా, ఉప్పెనకెరటములా తమ కుటుంబాలలో యిటువంటి అమర్యాద ఎప్పుడూ జరగదనీ, తప్పుచేస్తే దండించాలిగాని తెలివితక్కువగా పారిపోయిరావడము ప్రజ్ఞ లేనితనాన్ని సాటించుకొంటుందనీ అన్నాడు. కార్యనిర్వహణశక్తి ఎంత ఉంటే నేమిటి, అనది అనదే అనిపించుకొన్నదన్నాడు. వచ్చిన కోపం చూపించుకోవడము ప్రజ్ఞావంతుల విధానమే కాదన్నాడు.

రామమూర్తిగారిని అన్నీ చెప్పనిచ్చింది వెంకాయమ్మ. అక్కణ్ణించి ప్రచండమారుతానికి పరవళ్లు తొక్కే పంచమహాసముద్రాలవలెనే కెరటంమీద కెరటంతో పరవళ్లుతొక్కింది. రామమూర్తిగారు సత్యాగ్రహం చేస్తానన్నాడు. ఊళ్లోవాళ్లను, కాంగ్రెసు వాళ్లను తీసుకొనివచ్చి గుమ్మానికి ఎదురుగుండా నిరాహారవ్రతం చేస్తానన్నాడు. అన్యాయ మంటే ఏమిటో ఎరగని వెంకాయమ్మగారు ఒక పర్వ శుభకార్యంలో, కారణ మున్నా సరే, అంత ఆవేశపూరితురాలు కాకూడదన్నాడు. భర్త్రాజులకన్న, నారదుడికన్న, భక్తులకన్న, ఆదిశేషువుకన్న, సముద్రుడికన్న ఎక్కువ ప్రజ్ఞతో పొగిడాడు వెంకాయమ్మను.

ఇదివరదాకా వెనకాలనే వున్న వియ్యంకుడూ, వియ్యపురాలూ వచ్చి తమ్ము క్షమించవలసిందని ఆవిడ కాళ్లమీద పడ్డారు.

గృహప్రవేశం జరిగిపోయింది. కాని మనుగుడుపులకు పెండ్లికొడుకును అత్తవారింటికి పంపించనం టే పంపించనంది వెంకాయమ్మగారు.

౪

కాలప్రవాహము నెమ్మదిగా జరిగిపోయింది. సుందరరావు బి. యల్. ప్యాసై, అప్రెంటిసై, ఏలూరులో ప్రాక్టీసు మొదలుపెట్టినాడు.

ఈలోగా బుచ్చివెంకయ్యగారు ఎన్నివేలసార్లు అడిగినా, ఎంతమంది పెద్దమనుష్యులచేత కబుర్లు పంపించినా కొడుక్కు కార్యం చేసుకోవడానికి నిరాకరించింది వెంకాయమ్మ. కారణ మేమిటో చెప్పదు. పెండ్లినాడు జరిగిన వ్యాపారవిషయంలో ఆమెకు వచ్చిన కోపం పోలేదా అంటే దానికీ దీనికీ సంబంధము లేదంటుంది. చేసిన తప్పు సర్దుకోవడముతో సరిపోదంటుంది. తప్పులకు శిక్ష లున్నా యంటుంది. ఆవిడ భావం ఎల్లా గ్రహించాడో గ్రహించాడుగాని బుచ్చివెంకయ్యగారు హృదయంలోంచి ఓడ్చి గడ్డగట్టించిన రక్తపుచుక్కలలాంటి అయిదువందల రూపాయలూ బ్యాంకుడ్రాఫ్టుచేసి వెంకాయమ్మగారికి పంపించి కార్యం చేసుకోవలసిం దని వినయంగా ప్రార్థేయ పడ్డాడు. కార్యం తనయింటిదగ్గరే చేసుకోవడ మనీ, ఒక్క పెండ్లికూతుర్నీ, పెండ్లికూతురి తల్లినీమాత్రము పంపించవలెననీ జవాబువ్రాసింది. ముహూర్తం పెట్టి భార్యనూ, కూతుర్నీ పంపించాడు బుచ్చివెంకయ్య.

కార్యం జరిగింది. స్కూలుఫైనలు ప్యాసైన లలిత అత్తవారింటిదగ్గరే కాపురంచేస్తూ ఉండిపోయింది.

అది మొదలు లలితబ్రతుకు దినదినగండము. దేముడే దిక్కు అన్నట్టు అయిపోయింది. అందమైనది, చదువుకొన్నది, తెలివైనది. కాని, ఏమి లాభము, మహారాణియైన అత్తగారికి బానిస అయిపోవలసిన వ్రాత ఉన్నప్పుడు ? మొగుడు దద్దమ్మ — యమకట్టుబొట్లతో తయారయినవాడు — పెంపుడుతల్లికి మారుపలకగలడా? భార్యను రక్షించగలడా ? పోగకళ్లుగలది అయి తేనేమిటి, మెరుగు పెట్టిన బంగారంలాంటి ఛాయగలదై తేనేమిటి,

కోలమోహమూ, మన్మథుని విల్లులాంటి పెదవులూ, సూర్యకాంతపుష్పపు రేకుల్లాంటి చెక్కిళ్లూ, కలవ మొగ్గల్లాంటి చెవులూ — అయితే నేమి లాభం? కోకిలగొంతుకలాంటి గొంతైతే నేమి లాభం? ఆమె చదువుకొన్న చదువూ, ఆమెలో సహజంగా వుండి క్రమశిక్షణపొంది వృద్ధిపొందిన దివ్యగాంధర్వమూ భర్తయొక్క భయమహాకూపంలో తాడుతెగిపోయిన చాదల్లా పడిపోయాయి. లలితయొక్క అందాలపోగు తనము భర్తయెదుట మహాబధిర శంఖారావ మైపోయింది.

చెప్పినట్లు చేస్తే ఆలోచన లేని దద్దమ్మ అని తిట్లు. చెప్పకుండా ఏదైనా చేస్తే విధవస్వతంత్రాలతో దేశం తగలడిపోతూం దని తిట్లు. తనకన్న ముందర లేస్తే ఎవరూ లేకుండా చూసి యిల్లంతా దోపిడీచేయించవల చుకుందని సాధింపు. తనతో సమంగా లేస్తే అత్తగారితోపాటు దర్జా కావాలా అని తిట్లు. ఒక చిటిక ఆలస్యంగా లేస్తే రాణీలకన్నా లేని దర్జా వచ్చిం దని తలవాచేటట్టు చివాట్లు. వంట ఎంత బాగా చేస్తేనేమి- కూరలో పోపు మాడిపోయిందనీ, పచ్చడిలో వుప్పు ఎక్కువయిందనీ, పులుసు ఉడకలేదనీ, అన్నం బిరుసుగా వారిందనీ, లేకపోతే చిమిడిపోయిందనీ వసట్కారాలు. కోపలు పోతరించివుంది, పనిమనిషి ఎందుకని పనిమనిషినన్నా పెట్టించలేదు వెంకాయమ్మ.

ఒకనాడు ఇలాగే ఎందుకో అత్తగారు తిట్టుతూంటే మనస్సు ఉండబట్టలేక లలితమ్మ జవాబు చెప్పిందట-“ ఎందుకండీ అత్తగారూ, అల్లా అంటారు” అని. ఇక చూడండి, ఆ రోజున మాటల్తోనే కోడల్ని చీల్చేసింది. తల్లిపక్షం వహించి కొడుకుకూడా నాలుగు దేహప్రహరణాలు అర్పించాడు. ఏమనకన్నా విడ్చింధిగాదు లలిత; కొయ్యబారి మొద్దయిపోయింది.

పుట్టింటికి ఒక వుత్తరమైనా వ్రాయడానికి సీలులేదు. పొరుగింటివారు దయదలచి జరిగే సంగతులన్నీ బుచ్చివెంకయ్యగారికి వుత్తరాలు వ్రాశారు. అదివరకే బుచ్చివెంకయ్యగారు వచ్చి పండగకు పంపమనీ, పబ్బానికి పంపమనీ ఎన్నిసార్లు అడిగినా అత్తగారు కొడుకునుగాని, కోడలినిగాని వియ్యాలవారింటికి పంపించింది గాదు. కూతుర్ని తండ్రితో మాట్లాడనియ్యనైనా లేదు. వియ్యంకుడిని భోజనానికైనా పిలవలేదు. పైగా, “తాను మహా మంచివాడని వీరూ వారూ చెప్పడంవల్ల రెండువేలరూపాయలకు నోటు వ్రాసి కట్నమని చెప్పి ఇచ్చి తనకు తీరని అవమానం చేస్తాడా? అటువంటిమనిషి తనఇంట్లో విస్తరివేస్తాడా? అల్లుణ్ణీ, కూతుర్నీ తన ఇంటికి తీసుకొనివెళ్లి కుడుపుతాడా? తనకు చేసిన అవమానాన్ని తాను తనజన్మంతా మరచిపోతుందా” అంటూ కోడలిదగ్గరకు వెళ్లి నానా అరుపులూ అరిచేది వెంకాయమ్మ.

లలితహృదయం ఎవరు వర్ణించగలరు? లోకంలో ప్రేమ అనేదే ఉండదా? మనుష్యుల కక్షలే ప్రధాన జీవితాలైవుంటాయా? మెత్తని మనస్సులనుకొనే ఆడవాళ్ల హృదయాలే లోకవాడుకకు విరుద్ధంగా కాలకూటవిషంతో నిండివుంటాయా? సామరస్యమనేది ప్రపంచంలో హుళక్కేనా? దయ, అంతఃకరణ — ఇవి గ్రంథాలలోనూ, ఉపన్యాసాలలో నేనా? తనచుట్టాలలో ముసలివాడి దగ్గరనుంచి పడుచువాళ్ల వరకూ భర్తలతో కాపురముచేస్తున్నవాళ్లు లేరా? అందరు అత్తగార్లూ ఇలాగే తమ కోడళ్ల జీవితాలను కాలిక్రింద పురుగుల్ని రాసివేసినట్టు రాసివేస్తున్నారా?

అవమానమే తన జీవితము. ఈ తీరనిబాధ రేపు, ఎల్లుండి చల్లారుతుందా? ఈయనచదు వేమైనది? జ్ఞానము, నాగరికత- ఇవి పాశ్చాత్యవిద్యలోనే లేవా? ఆచదువుకు హిందూజాతే తగదా?

లలిత కాపరానికి వచ్చినదిమొదలు మైమరచి నిద్రపోయి ఎరగదు. నవ్వు ఆమెముఖాన్ని విడిచి ఏనాడో పోయింది. కడుపులో మంట. కర్కశమైన ఆమెచేయి ఆమెహృదయాన్ని నుడ్డపిండినట్టు పిండుతోంది. ఆమె మెదడు వేడెక్కింది. నలిగిపోయే గుండెయొక్క రక్తం కన్నీరై ప్రవహించి ప్రవహించిపోయింది. దుఃఖమే తప్ప ఇతర మెరుగని ఆమెకళ్లు కాళరాత్రి కళలుతప్పి మూసుకుపోయినవి.

ఒకనాడు—

ఒక్కుమ్మడిగా లేచింది. ఆమె ఒళ్లు గజగజలాడిపోయింది. ముఖము జేవురించింది. ముక్కుపుటములు విస్ఫారితములై కన్నులు కెంపులెక్కాయి. గబగబ ఒంటినున్న నగలన్నీ తీసింది. ఆ నగలమూట చేత్తో పట్టుకుంది. భోజనం చేసి హాలులో దీపందగ్గర కూర్చుని వార్తాపత్రిక చదువుకొనుచున్న భర్తదగ్గరకు వెళ్లింది. ఆ నగలమూట బల్లమీద ఎత్తిపడవేసింది. ఆమెమాటలలో మంటలు లేవు. ఆమెమాటలలో మంచుగడ్డలు. ఆమెకళ్లలో కోపము లేదు. అసహ్యత అతిపరుసు గల సున్నీలులా కళ్లలో ప్రవహించింది.

"ఇదివరదాకా మీ ఇంట్లో బానిసత్వం చేశాను. దాద్వారా స్త్రీజాతినంతా అవమానంలోకి తీసుకొనివచ్చాను. నా నగలయందుగాని, నా గుడ్డలయందుగాని మీకూ, మీతల్లికీ ఏమాత్రమూ అధికారము లేకపోయినా ఈ కట్టుగుడ్డలుతప్ప తక్కినవన్నీ వదిలేసి వెళ్లుతున్నాను. కాని నాకు ఈ మంగళసూత్రము హిందూజాతి, భగవంతుడు ప్రసాదించినది. అది మాత్రం వదలుకోలేని పిరికితనం నాలో వుంది. మీలో ఏమైనా మొగతనం వుంటే ఈ ఆస్తికి హక్కు మీ పెంపుడుతల్లి పాదాలదగ్గరే ధారపోసి, వున్నవారు వున్నట్టుగా నాతో రండి—"

"ఛీ, పాడుముండా! ఇదివరదాకా లేని నోరు కూడా వచ్చిందీ!...అమ్మా, చూడవే, ఈముండ ఏమంటుందో" అని తల్లిని కేకవేశాడు సుందర్రావు.

"ఏమిట్రా నాయనా? నిన్ను కొట్టవచ్చిందా?" అని అత్తగారు లోపల్నుంచి పరిగెట్టుకొచ్చింది. లలిత మాట్లాడకుండా వీధితలుపు తీసి "నేను మాపినతల్లిగారింటికి వెళ్లుతున్నా"నని ఒక్క కేకవేసి ఊళ్లోవున్న తన పినతల్లిగారింటికి ఆ ఎనిమిది గంటల రాత్రివేళ చక్కాపోయింది.

*

మరి ఇరువదినిమిషములలో లలితపినతల్లికొడుకు సుందర్రావుదగ్గరకు వచ్చి, "ఇదేమిటయ్యా బావగారూ, మాచెల్లెలు మాయింటికొచ్చి అల్లా అంటుందేమిటి" అన్నాడు.

సుందర్రావు రౌద్రాకారం దాల్చి, "నువ్వూ, నీచెల్లెలూ మీరంతా ఒక్కటే! సానిదౌతుంది గాబోలు, అవనియ్యి" అని ఇంకా ఏమేమో వాగబోయినాడు.

లలితపినతల్లికొడుకు "ఛీ! నోరుముయ్యి. మీరు మాచెల్లెల్ని పెట్టిన బాధలన్నీ వింటూనే వున్నాను. భగవంతుడే మీకు ఏనాటికైనా సరిగ్గా బుద్ధిచెప్పతాడు" అని సుందర్రావు చెప్పే మాటలను వినకుండానే వెళ్లిపోయినాడు.

[రెండవ భాగము]

౧

పది వర్షాకాలాలు వెళవెళ వరదలు కట్టి జరిగిపోయినాయి.

ఏలూరు గవర్నమెంటుఆస్పత్రిలో ఆడవాళ్ల వార్డు కిటకిటలాడిపోతోంది. లేడీడాక్టరు నవ్వుమొగంతో, చల్లని మాటల్తో రోగులను విచారిస్తూ మందులు వ్రాసియిస్తూ రెండుగంటలలో వచ్చినవారిపనంతా పూర్తిచేసి తొమ్మిదిగంటలకు ఆడవాళ్ల వార్డును పరీక్షచేయడానికి బయలుదేరింది.

"అమ్మా దొరసానమ్మా! నిన్నణ్ణించి నాఒంట్లో చాలా బాగుందండీ"

"డాకుటరమ్మగారూ, ఇంక నేను ఆస్పత్రినుండి వెళ్లిపోవచ్చునాండీ? ఒంట్లో కాసా బాగుందండీ"

"మీరు దేవతలండీ. మీరు వచ్చిన పదిహేను రోజులనుంచీ నాకు సెప్పరాని ధైర్యమండీ."

ఇలాగ పదిహేనురోజుల క్రిందట్నే వచ్చి ఛార్జీ పుచ్చుకొన్న ఈ కొత్త డాక్టరమ్మ అంటే సాక్షాత్తు ఆరోగ్యదేవతే అని చేతులెత్తి దండము పెట్టని రోగులు లేరు.

పదకొండు గంటలవరకూ రోగుల నందరినీ చూచింది. నర్సులకు ఇవ్వవలసిన ఆజ్ఞాపనలు ఇచ్చింది. అయిస్‌ఫ్రూట్‌లాగ చల్లగా తియ్యగా, గులాబి

పువ్వుల్లాంటి పరిమళంగా మాటలాడుతూ చకచక పనులన్నీ నెరవేర్చుకొని తన చిన్న ఆస్టినుకారు నడుపుకొంటూ యింటికి వెళ్లిపోయింది డాక్టరు దొరసాని.

ఈ పదిహేనురోజులలోనే ఈ లేడీడాక్టరు చాలా ప్రజ్ఞావంతురా లనీ, చల్లని చేయి అనీ, ఆడకేసులు చికిత్స చేయడములో జిల్లా వైద్యాధికారి కన్న ఎక్కువ తెలివిగల దనీ చాలా పేరు పొందింది. ఆమెక్రింద పనిచేసే నర్సులూ, మంత్రసానులూ ఆమె ప్రతిభను మూడురోజులలోనే గ్రహించారు. ఆమె దగ్గర అనవసరప్రసంగానికి తావు లేదు. ఇసుమంత కోపమైనా కనపరచక తన క్రిందివారల పూజలు చూరగొను అధికారిణి ఆమె. ఆమెతోడి పురుష అసిస్టెంటు సర్జను, వారిరువురిపైన జిల్లా వైద్యాధికారి ఈమెనుచూచి ఏమేమో ఆలోచనలు పోయి ఏవేవో ఉర్రూతలూగారు.

ఆమెఅసమానరూపలావణ్యాలు అనేకమందికి అనేకవిధాల వ్యూహాలు జనింపజేసింది. తోడి పురుష అసిస్టెంటు సర్జను ఆమెతో ఏవేవో సరదామాటలాడుతూ ఆనందము పొందుదామని వచ్చి ఆమె మూర్తిని విలంబించివున్న ఏదో శక్తి తన్ను నిలబెట్టినట్లు కాగా చల్లచల్లగా వెనక్కు జారిపోయినాడు.

ఆమె తిన్నగా యింటికి పోయింది. స్నానము చేసి శుభ్రవస్త్రాలు ధరించి, వంట ఇంట్లోకి పోయి భోజనముచేసి, తాంబూలము వేసుకొని, ఆనాటి పత్రికలన్నీ చదివి, పడకగదికిపోయి పదినిమిషములు విశ్రమించి నిదురపోయింది. మూడుగంటలకు లేచి మొగము కడుగుకొని బట్టలు మార్చుకొని శుభ్రదేవతలా, శాంతిదేవతలా, రూపొందిన ఆరోగ్యదేవతలా తిరిగి ఆస్పత్రికి చేరుకొన్నది.

ఆసాయంత్రం ఆసుపత్రిలో ఆమె పనిచూస్తూ ఉండగా బంట్రోతు వచ్చి "అమ్మా, సుందర్రావుగారనే ప్లీడరుగారు తన భార్య నీల్లాడలేక కష్టపడుతూం దనీ, తమ సహాయము కావాలనీ వచ్చారు. వారి యిల్లు పవరుపేటలో చెరువుప్రక్కన ఉన్నదట. తమతో మాట్లాడాలని పురుషులు కూర్చునివుండే స్థలములో కూర్చొని వున్నారు. ఆయన్ని చూస్తే చాలా కంగారు పడుతున్నట్లున్నారు" అని కబురు చెప్పాడు.

ఈమాటలు వినగానే డాక్టరమ్మ మనస్సులో చాలా కంగారుపడింది. ఆమెగుండె దడదడ కొట్టుకొన్నది. అతిప్రయత్నముమీద మనస్సు కుదటపెట్టుకొని, కొంచెముగా వణకుచున్న చేతులను దృఢము చేసుకొని, "ఈవూరులో ఇంక వేరే ఆడడాక్టరులు లేరా ?" అని ప్రశ్నించింది.

"లేకేమండీ అమ్మా? ఓమిషనరీడాక్టరుదొరసానమ్మను క్రిందటిపురుటికి తీసికెళ్లారంటండమ్మా. ఆమె సరిగా వైద్యం చేయలేకపోయిందట. ప్రాణాపాయం వస్తే జిల్లాడాక్టరుదొరగారిని తీసికెళ్లారట. ఆడాక్టరమ్మచేసిన తెలివితక్కువతనానికి దొరగారు పెద్దప్రాణం బతికించేటప్పటికి పెద్దలు దిగొచ్చారటండి."

"ఇప్పుడుకూడా ఆ జిల్లాదొరగారినే తీసుకెళ్లకూడదూ ?"

"వారిదగ్గరకి వెళ్లివచ్చారటండి. వారు తాము చాలా తెలివైనవారనీ, తమను తీసికెళ్లవలసిందనీ సలహా ఇచ్చారటండి."

"సరే, నీవు వెళ్లు. నేను పిలుస్తాను."

బంట్రోతు అవతలికి వెళ్లిపోయినాడు.

ఏలూరు బదిలీ అయినప్పుడే ఇల్లాంటి దేవో సంభవిస్తుం దని ఆమె అనుకోనే అనుకొన్నది. తాను వైద్యురాలు. వైద్యుల ముఖ్యనిధి రోగులకు సేవచేయడము. వా రెవరైతేనేమిటి ?

కాని, వైద్యుడుమాత్రము మనుష్యుడు కాడా ? అతనికి హృదయము, మనస్సు వుండదా ? అతని హృదయాన్ని కలతపెట్టే సంగతులు తారసిల్లవా ?— తాను ఆలోచించడానికికూడ వ్యవధి లేనేలేదు. భగవంతుడు ఈలాంటి ఆదను ఎందుకు సృష్టించాడో ? తనకూ, ఆ కుటుంబానికీ సంబంధము వదలిపోయి పదిఏండ్లయింది. ఏది ఎందుకు వచ్చిందో ఏమి చెప్పగలము ? ఇదివరకు కన్న ఎక్కువ అవమానం జరుగుతుందా ?

ఒక్కసారి ఆమె గట్టిగా నిట్టూర్పు వదలింది. కన్నులు పూర్తిగా మూసుకొన్నది. పళ్లు బిగించి, కళ్లు తెరచి, బల్లమీద గంట కొట్టింది. పరుగున బంట్రోతు లోనికి వచ్చినాడు.

"నర్సును అన్ని పరికరాలతోనూ సిద్ధంకమ్మని చెప్పి, డ్రైవరకే డ్రైవు చేయవలసి వుంటుందని నా ఆజ్ఞగా చెప్పు. ప్లీడరుగారిని ఈలా పిలు."

బంట్రోతు బయటికి పోయి సుందర్రావుగారిని లోనికి పంపించి, తాను డాక్టరమ్మగారి ఆజ్ఞను నిర్వర్తించడానికి వెళ్లిపోయినాడు. సుందర్రావు లోనికి కంగారుతో ప్రవేశించి "అమ్మా, త్వరగా రావాలి. నేను రెండు జట్కాలనుకూడా తీసుకొనివచ్చాను." అని అన్నాడు. రంగుల కళ్లజోడు పెట్టుకొన్న డాక్టరమ్మ కొంచెము అస్పష్టధ్వనితో "సరే, మీరు వెళ్లండి. మీ వెంటనే నేను నాకారులో వస్తున్నాను. మా నర్సుకు మీయిల్లు తెలుసునట" అని ఇంగ్లీషులో చెప్పింది. సుందర్రావు వెళ్లిపోయినాడు.

సుందర్రావుగారి యింటిదగ్గిర ఆయనచుట్టాలంతా కంగారుపడుతున్నారు. సుందర్రావుజట్కాలు వచ్చి ఆగినవి. ఆవెంటనే డాక్టరమ్మగారి కారు వచ్చి ఆగింది. నర్సు, మంత్రసాని బంట్రోతుచేత సామానులు పట్టించుకొని ముందు నడవగా డాక్టరమ్మ పురిటింటిలోకి గబగబా వెళ్లిపోయింది. వెంటనే ఆమె సబ్బుతోనూ, లోషనునీళ్లతోనూ చేతులు కడిగికొని గదికిటికీలు బాగా తెరిపించి రోగితల్లినితప్ప తక్కిన వాళ్లనందరినీ బయటికి పొమ్మని రోగిని పరీక్షచేసింది.

రోగి అపరిమితంగా బాధపడుతోంది. చాలా నీరసంగా వుంది.

"నర్సు! ఇది ఫార్సిప్సుకేసు. నీవు క్లోరోఫారమ్ ఇయ్యి. మంత్రసానీ! పరికరాలన్నీ సిద్ధంచేయి..."అని డాక్టరమ్మ ఆజ్ఞచేసింది.

పదిహేనునిమిషాలలో పండులాంటి ఆడపిల్లను తల్లిగర్భకారాగారంలోంచి తీసి కేరుమనిపించింది. తల్లికి బలంకోసమని గ్లూకోజు నరాలద్వారా ఇంజక్షను ఇచ్చింది. మందులకు చీటీ వ్రాసియిచ్చి తాను చేతులు శుభ్రంచేసుకొని, నీలపుకళ్లజోడు సవరించుకొని, తల్లీ బిడ్డా క్షేమంగా వుంటారని తల్లితల్లికి ధైర్యము చెప్పి, తాను యింటికి పోయి మళ్లీ కారు పంపిస్తానని నర్సుతో చెప్పి యింటికి వెళ్లిపోయింది.

ఈడాక్టరు చాలా తెలివైన దనీ, ప్రజ్ఞావంతురాలనీ సుందర్రావుపెంపుడుతల్లి, అత్తగారు, మొగవారు, ఆడవారు అందరూ అనుకొన్నారు.

౨

డాక్టరమ్మగారిని ఎక్కడో చూచినట్లే వుందని సుందర్రావు ఆలోచన. ఆమెమాటలు చిన్న చిన్నవైన అభినయాదులలో సుందర్రావుకు ఏదో స్ఫురణ. ఆమె వెళ్లిపోయేటప్పుడు కృతజ్ఞత చూపడానికని సుందర్రావు ఆమెకు నమస్కారము చేస్తున్నప్పుడు, నీలపుకళ్లజోడు పెట్టుకొన్న ఆమెముఖముకూడా ఎక్కడో ఎప్పుడో ఎరుగున్నవారి ముఖములా తోచింది.

సుందర్రావు చాలా రూపుమారిపోయాడు. అతనికి నుదురుదగ్గరనుంచి సిగవరకు బట్టతలయింది. చుట్టూ గట్టుపోసినట్టుగామాత్రం జుట్టు వుంది. చిక్కిపోయినాడు. కళ్లు గుంటలుపట్టినవి. నుదురులో రేఖలు, కళ్లప్రక్క ముడతలు—రోగముపడి లేచిన మనిషిలా వుంటాడు. అదివరకే బానిసత్వస్వరూపమైన చూపు మరికొంత కాంతితగ్గి జడత్వాన్ని తాల్చింది. మనిషి గూనివానిలా కొంచెము ముందుకు వంగిపోయినాడు.

ఇవన్నీ ఆలోచించుకొంటూనే వెళ్లింది డాక్టరమ్మ. అతడంటే ఆమెకు ఎంతో జాలివేసింది. ఆమె ఎంతోసేపు నవ్వుకొంది. ఆనవ్వులో ఆర్ద్రత లేదు. ఏదో హాస్యము, ఏదో పాడితనముమాత్రము వుంది.

మరునాడు ఉదయాన్నే ఆస్పత్రికి వెళ్లబోయే ముందు సుందర్రావుయింటికి వచ్చి రోగిగదిలోకి తిన్నగా వెళ్లిపోయింది. డాక్టరమ్మ కులంచెడిపోకుండామాత్రము వుంటూవుందని యింట్లో ఎట్లా తెలిసిందో—బహుశా మంత్రసాని చెప్పివుండవచ్చు. ఈ డాక్టరమ్మదగ్గర మంత్రసానులూ, నర్సులూ వారికున్న

సహజమైన ప్రజ్ఞకన్న ఎక్కువప్రజ్ఞతో, ఎక్కువ శేముషీసంపన్నతతో సంచరించడము సాగించారు.

గది అతిశుభ్రంగా వుంచింది మంత్రసాని. తల్లీ, బిడ్డా పువ్వుల్లా పడుకొన్నారు. డాక్టరమ్మ రాగానే రోగి చిరునవ్వు నవ్వుతో ఆమెకు నమస్కారంచేసింది. "మీ మేలు ఎప్పుడూ మరిచిపోనండీ" అంది.

మంత్రసాని—ఇద్దరు బిడ్డలు పుట్టి పోయారటమ్మా.

డాక్టరమ్మ—భగవంతుని కృప వుండాలిగాని ఒకరు చేసేది ఏముందమ్మా.

ఈలాగు వారి సంభాషణ జరుగుతూండగానే వెంకాయమ్మ అక్కడికి వచ్చింది. "అమ్మా, మీవుపకారం ఎప్పటికీ మరవలే"మని డాక్టరమ్మకేసి తేరిపార చూసింది. ఏలాగైనా తెలివైనది గాబట్టి ఆమెమనస్సులో ఏదో మెరుపు మెరసిన ట్లయింది.

ఈ పదిసంవత్సరములలో వెంకాయమ్మ చిక్కిపోయింది. ఎప్పుడు ప్రవేశించిందో ఆమెకు రక్తహీనత—సన్నగిలిపోయింది. మొగము, ఒళ్లు పాండురమైపోయాయి. కళ్లల్లో నెత్తురుజీరలులేవు. పెదవులు తెల్లబడి ఒడిలిపోయినాయి. మొగము, కాళ్లు, చేతులు, మీగాళ్లు, మీదిచేతులు వుబ్బి ఉన్నాయి. డాక్టరమ్మ వెంకాయమ్మకేసి నల్లద్దాల్లోంచే తీక్ష్ణంగా చూసింది. చేతులూ, కాళ్లూ చూసింది. ఆమె పెదవుల్లో అడగని ప్రశ్న ప్రసరించింది. వెంకాయమ్మ డాక్టరమ్మ అడగని ప్రశ్న గ్రహించింది. "నాకు రెండేళ్లనుంచి ఈ పాండురోగము ప్రవేశించి చాలా బాధపెడుతోందండీ. ఎన్ని మందులు వాడినా తగ్గడములేదు. గుండెల్లో దడ, ఏదో పెద్దదాన్నయాను—"

ఆమె కసిగొద్దీ ఇంకా ఏవో మాటలు అందామనుకొంది. కాని అవి రాలేక గొంతుకలోనే వుండిపోయాయి. డాక్టరమ్మ సెలవు తీసుకొని వెళ్లిపోయింది. వెంకాయమ్మ ఎల్లాగ వెళ్లిందో లోపలికి వెళ్లిపోయింది. "అరే అబ్బాయీ, ఇల్లాగ రా" అని కేకవేసింది. "ఈ డాక్టరు నీ పెద్దపెళ్లామేరా" అని చెప్పింది.

"అదేకాబోలు. ఎక్కడో చూసినట్టు వుందని అనుకొన్నాను. ఇప్పుడు ఎల్లాగ?"

"ఎల్లాగేమిటి నీమొఖం! తెలివితక్కువ సన్నాసి! పెళ్లాన్ని తీసుకెళ్లి రాక్షసిచేతులో పెట్టావు. ఇంతవరకూ ఏదో జరిగిపోయింది. ఇక్కడినుంచైనా దాన్ని మానిపించేయి. మాలముండ. రండముండ."

ఎక్కడోవున్న ఏకొద్దిగక్తమో ఆమెముఖాన్ని చిమ్మింది. ఆమె నిలవలేక చతికిలపడింది. సుందరరావు వెళ్లిపోయినాడు. అతని మనస్సు పరిపరివిధాల పారింది.

దద్దమ్మఅయిన సుందరరావు లలితమ్మ వెళ్లిపోయిన కొన్నిరోజులదాకా ఆమెమాట చెప్పితే, ఆమె తలపుకు వస్తే మండిపోయేవాడు. తల్లితోపాటు ఆమెను ఎన్ని కారుకూతలు తిట్టాడో. ఎదుటపడితే నరికివేసేవాణ్ణే అనేవాడు. కాని ఆ వేడి చల్లారింది. ఎంత చచ్చుయినా చదువుకొన్నవాడు, పురుషుడు. భార్యయొక్క అందం అతని కిష్టములేకపోయినా, ఎదుట ప్రత్యక్షమవుతోంది. ఆమెమంచితనం, ఆమెదీనదృష్టి, తనవంక చూచిన చూపులు, ఆమెతియ్యని కంఠం, ఆమె జ్ఞానసంపన్నత ఎట్టయెదుట కోరకుండానే ప్రత్యక్షమవుతుండేది. తనహృదయంలో ఎక్కడో రహస్యంగా తన పెంపుడుతల్లిదే తప్పని తోచింది. కోర్టులో, ఇతర చోట్ల తోడివకీళ్లు, చుట్టాలు తన్ను తలవాచేటట్టు పెట్టిన చివాట్లు తనను కలచివేశాయి. కాలం గడచిన కొలది భార్య వెళ్లి ఇంటరులో చేరిందని విన్నప్పుడు పెంపుడుతల్లిమీద అతిరహస్యంగా మండిపోయాడు. కాని మొట్టమొదటనుంచీ గట్టితనం లేనివాడు. జావకడివాడు. ఆశాహృదయం కలవాడు. పెంపుడుతల్లి యావదాస్తికీ సర్వహక్కులు కలిగింది. ఆస్తా, లక్షలు పెరిగింది. అది ఎల్లా వదలిపెట్టగలడు ?

ఒకనాటిరాత్రి బెదరిపోయిన లేడిలా బంగారుఛాయగల లలిత తన ఒళ్లో తలపెట్టుకొని తన పాదాలు హృదయానికి గట్టిగా అదిమిపట్టుకొని మాటలులేకుండా వెక్కివెక్కి ఏడ్చింది. అప్పుడు తన కంఠంలో జాలి వేసినమాట నిజం. అప్రయత్నంగా ఆమెతలను తడిమాడు తాను. కాని గోడలోంచీ, మూసిన తలుపు

గ్గొంచీ దివ్యదృష్టిచేత తన పెంపుడుతల్లి చూస్తుందేమో నని భయపడినాడు. పురుషుడైవుండీ పురుషత్వము లేని దద్దమ్మ.

3

తల్లి చెప్పినచొప్పున ఇక్కడనుంచి తనయింటి డాక్టరే వైద్యం చేస్తాడనీ, తాము రానక్కరలేదనీ డాక్టరు లలితమ్మగారికి సుందర్రావు వుత్తరము వ్రాసి, ఇది తమ ఫీజని పదిహేను రూపాయలున్నూ, నర్సు ఫీజని అయిదు రూపాయలున్నూ పంపించాడు. ఆ వుత్తరములోనే మంత్రసానికి మామూలు లేటయిన రోజుకు అర్థరూపాయి యిస్తానని వ్రాసినాడు. లలిత చిరునవ్వు నవ్వుకొన్నది. నర్సును, మంత్రసానిని పిలిచి పదిహేనురూపాయలు నర్సుకున్నూ, అయిదు రూపాయలు మంత్రసానికిన్నీ ఇచ్చింది. వాళ్లిద్దరూ సంతోషిస్తూ వెళ్లిపోయినారు.

కాని ఈ ఉత్తరము వచ్చిన మూడవనాటికి డాక్టరమ్మగారింటికి పరువుపరువున సుందర్రావు రెండవ మామగారు రంగయ్య చక్కా వచ్చాడు. ఆయన వచ్చేటప్పటికి డాక్టరమ్మగారి యింటి హాలులో ఆమెతండ్రి కూర్చుని ఉన్నాడు. "ఎవరండీ బాబూ! కూర్చోండి" అని ఆయన ఈయనను మర్యాద చేసినాడు.

"డాక్టరుగారు మీ కేమవుతారండీ?"

"మా అమ్మాయండీ"

"తమరు బుచ్చివెంకయ్యగారా?"

"చిత్తం."

"చి-చిత్తం- నా- నాపేరు రంగయ్యండీ. చాలా అన్యాయం జరిగినమాట నిజమండీ. భగవంతుని చిద్విలాసము అల్లా వెళ్లిపోయిందండీ. ఇదంతా మా అక్కగారు వెంకాయమ్మగారి లోటు. ఆవిడ జీవిత మంతా రాక్షసతనమేనండీ. తమ అమ్మాయి పెళ్లిం దగ్గరనుంచీ తన కొడుక్కు రెండవపెళ్లి రెండవపెళ్లని పరవళ్లు తొక్కిందండీ. రెండేళ్లు ఏ సంబంధమూ రాలేదు. మా అమ్మాయి ఎదిగి వుంది. నా భామె వేలు విడిచిన పినతల్లి కూతురండీ. నీ కూతుర్ని నాకొడుక్కిమ్మంది; లేకపోతే పస్తుపడుకొంటానంది. నా కప్పుడున్న రెండు వేల రూపాయల ఋణం తీర్చేస్తానన్నదండీ. బీదవాణ్ణి, ఏం చేయను? ఆ రెండువేల రూపాయలకూ పిల్ల నమ్ముకొన్నాను. కాని, పెళ్లికి ముందర తన కోపం పూర్తిగా మానెయ్యాలనీ, పిల్లను ఏమాత్రం అవమానంచేసినా లోకమంతటా తనయొక్క చరిత్రంతా డప్పుకట్టుకొని చాటిస్తాననీ బెదరించాను. పిల్ల ఏమాత్రం కష్టంపొందినా పిల్లను తీసుకురావడమే కాకుండా మాకూ, ఆవిడకూ వున్న చుట్టాలందరూ ఆమెగడప తొక్కకుండా చేస్తానని బెదరించాను. పిల్ల కాపరానికి వచ్చింది. ఇద్దరు పిల్లవాళ్లు పుట్టి పోయారు. ఇది మూడవకానుపండీ. తమ అమ్మాయిగారి కరుణవల్ల, చేతిచలవవల్ల మా అమ్మాయి సుఖప్రసవ మయిందండీ. పిల్ల కులాసాగా వుంది. కాని నిన్నరాత్రినుండి అమ్మాయికి నూటనాలుగు నూటఅయిదు డిగ్రీల జ్వరం వస్తూందండీ. ఎడమరొమ్ముమీద కురుపు వేసింది. ఒళ్లు తెలియదు. సంధో ఏమిటో బాబూ. ఆ ఒళ్లుతెలియని తనంలో "డాక్టరమ్మ, డాక్టరమ్మ, డాక్టరమ్మగారే బ్రతికించారు" అని ఒకటే పలవరింపు. మా అల్లుడు తీసుకొని వచ్చిన డాక్టరు రెండుమూడు ఇంజక్షనులిచ్చాడు. ఏమీ పనిజరగలేదండీ. ఆడాక్టరుగారు కూడా "ఆ లేడీడాక్టరును తీసుకొనివచ్చి చూపించండి. అవసరమైతే నేను వుండనేవుంటాను" అని సలహా యిచ్చాడు. అమ్మాయిగారు ఆస్పత్రిలో ఉన్నారా, ఇక్కడ ఉన్నారాండీ? వారు పరీక్షప్యాసై ఆట్టే రోజులు కాలేదనుకొంటాను. కాని ఉత్తమఇల్లాలు కాబట్టి అంత చక్కని పేరూ, అంత చల్లని హస్తవాసిత్వమూ సంపాదించుకుంది" అని ఆయనకు ఆలోచనకు తావు ఇవ్వకుండా వుండేందుకున్నూ, ఇప్పుడు వుండే సంబంధ బాంధవ్యాలు అందరికీ తెలియడముచేత లేడీడాక్టరు రారేమో అని భయముచేతను ఒక్కమ్మడి గుక్క త్రిప్పకోకుండా మాట్లాడాడు రంగయ్యగారు.

బుచ్చివెంకయ్యగారు ప్రత్యుత్తర మిచ్చారు: "ఈ వ్యవహారా లేమీ మా అమ్మాయిదగ్గిర తీసుకురా

కండి. మేము ఎవ్వరమూ వెంకాయమ్మగారి కుటుంబపు సంగతిగాని, సుందర్రావు పేరుగాని మా అమ్మాయి దగ్గిర తీసుకురాము. ఆ ఇల్లాలూ, ఆ ఇల్లాలి పెంపుడు కొడుకూ మా అమ్మాయిని ఎంత బాధపెట్టారోగాని ఊళ్లో వున్న పినతల్లిగారింటికి వెళ్లి అక్కడనుండి మొన్నాదు మావూరు వచ్చేసింది. కర్రభారిపోయింది. మాకుటుంబమంతటిలోనూ తన అత్తగారి యింటిసంగతి తీసుకు రావద్దనీ, లేకపోతే తన ప్రాణానికి ఆశవదలుకోవాలనీ నిశితంగా, దృఢంగా చెప్పింది. ఆ మరుసటి సంవత్సరము మదరాసులో ఇంటరుమీడియేటులో చేరి మొదటితరగతిలో మొదటిదిగా కృతార్థురాలైంది. పిమ్మట మెడికలు కాలేజీలో చేరింది. అందులోనూ ప్రతిసంవత్సరమూ మొదటి తరగతిలో నెగ్గింది. ఆఖరు సంవత్సరము మొదటితరగతిలో రెండవదిగా కృతార్థురాలైంది. ప్రభుత్వమువారు అసిస్టెంటు సర్జనుగా ఉద్యోగం యిచ్చారు. ఏడాదిపాటు మెటర్నిటీ ఆస్పత్రిలో ట్రెయినింగై పరీక్షప్యాసై నెల్లూరులో అసిస్టెంటు సర్జనుగా చేసి ఇక్కడకు వచ్చింది. ఈ పది ఏళ్లూ ఒక్కసారైనా ఆమెగాని, మేముగాని వెంకాయమ్మగారి కుటుంబముసంగతి ఎత్తలేదు. నేనూ, నా భార్యా ఆమె మెడికలుకాలేజీలో చేరినప్పటినుంచీ వెంటనే వుంటున్నాము. తన చదువేమో, తన ఉద్యోగమేమో మరి ఇంకేమీ లేదండి. అమ్మాయి ఇంట్లోనే వుంది. భోంచేస్తూంది. ఇప్పుడే వస్తుంది."

ఇంతట్లోనే భోజనము చేసి డాక్టరు లలితమ్మగారు యివతలకి వచ్చారు. ఆమె రాగానే ఆమెతో రోగిసంగతులన్నీ మనవిచేశారు రంగయ్యగారు.

లలిత—అయ్యా, నేను కొత్తగా ఉద్యోగంలోకి వచ్చాను. ఊళ్లో యితర డాక్టరులు వుండగా గవర్నమెంటు డాక్టరులు ప్రయివేటువైద్యం చేయగూడదు. జిల్లాడాక్టరుగారు ఆజ్ఞ ఇవ్వడముచేత నేనంతవరకైనా సహాయము చేశాను. డాక్టరులలో మర్యాద లున్నాయి. మే మామర్యాదలను ఏమాత్రమూ అతిక్రమించడానికి వీలులేదు. మీ కుటుంబపు డాక్టరుగారు మీ అమ్మాయికేసు తీసుకొనివచ్చి ఆస్పత్రిలో చేర్చి నావార్డులో ప్రవేశపెడితే నేను వైద్యంచేయవలసి వుంటుంది గాని, జిల్లా డాక్టరుగారి అనుమతి లేనిదే నేను మీ ఇంటికి రావడానికి వీలులేదు. తరువాత మీ ఇష్టం.

రంగయ్య — అమ్మా, రోగి సంధిలో నీ పేరు నిమిషానికి పదిసార్లు తలుస్తుంది. అదే రామనామస్మరణ ఐపోయింది. అమ్మా, ఎల్లాగు రక్షిస్తావో. పెద్దవాణ్ణి. తమ పాదాలు పట్టుకొంటాను.

లలిత—అయ్యా, ఈసంగతులన్నీ చెప్పి జిల్లా డాక్టరుఆజ్ఞ తీసుకొనిరండి. నేను సాయంత్రము వచ్చి వైద్యం ప్రారంభిస్తాను. సెలవు.

అని లోపలికి వెళ్లిపోయింది.

రంగయ్యగారు నిస్పృహతో, గుండెదడతో యింటికి వెళ్లిపోయాడు.

౪

డాక్టరు లలిత ఆసాయంత్రమునుంచి సుందర్రావుగారి భార్యకేసు మళ్లీ తీసుకొంది. రోగి నీళ్లాడి కొద్దిరోజు లైంది. పథ్యమున్నా పెట్టలేదు. ఎడంరొమ్ముమీద కురుపు. బాలింతజ్వరం అని ఇదివరకుడాక్టరు సెప్టిసీమిక్, స్ట్రెప్టోకోకస్ సీరమ్ రక్తనాళంగుండా యింజక్షను లిచ్చాడు. జ్వరం తగ్గలేదు. లలిత వచ్చింది. కూడా నర్సును తీసుకొని వచ్చింది. పదినిమిషాలు యితరమైన సర్వమూ మరచి ఆలోచించుకొంది. ఆమె మనస్సులో మెరుపు మెరసినట్లయింది. పదిగ్రెయినులు ౫ సి. సి. లో వున్న క్వైనుమందున్నూ, ౫ సి. సి. గ్లూకోజున్నూ కలిపి రక్తనాళంగుండా ఇంజక్షను యిచ్చింది. ఆమందుయొక్క గుణం చూచేవరకూ అక్కడనుంచి కదలగూడదని అక్కడనే మకాంపెట్టింది. ఆరుగంటలకు ఇంజక్షను యిచ్చింది. నెత్తిమీద ఉడుకులాంగుడ్డలు వేయించింది. ఎనిమిదిగంటలకు జ్వరం తగ్గడం ప్రారంభించింది. పదింటికి చెమటలు పోసి రోగికి మెలకువ వచ్చింది. నూటఅయిదుడిగ్రీల జ్వరం నూరుడిగ్రీలకు దిగిపోయింది. తనకు సరియైన ఔషధాభిప్రాయము కలిగినందుకు లలిత భగవంతునికి మనస్సులోనే కృతజ్ఞత తెలుపుకొంది.

రోగి కన్నులు తెరచి "అమ్మా, మీరే వచ్చారా? ఇక నాకు ఫర్వాలేదు" అన్నది. లలిత రోగినుదుటి మీద వున్న ఉడుకులాం తీసివేసి అక్కడ వున్న పొడితువాలుతో తుడిచి, పౌడపిడి, జుట్టు సరిచేసి "కొంచెము కాఫీ త్రాగుతావా" అని అడిగింది. రోగి తల ఊపింది. రోగితల్లితో "కొంచెము కాఫీ తెప్పించం" డనీ, పంచదారబదులు గ్లూకోజు వేయమనీ చెప్పి, రోగితో ఈ కబురూ ఆ కబురూ మాట్లాడడము ప్రారంభించింది. రోగి చిరునవ్వు నవ్వుతూ డాక్టరమ్మకబుర్లన్నీ వింటున్నది. కాఫీ త్రాగి రోగి నిద్ర పోయింది. లలిత నర్సును ఆమె యింటిదగ్గర దిగబెట్టి తన యింటికి వెళ్లిపోయింది.

లలిత భర్తయిల్లు వదలినప్పటినుంచీ భర్తను వదలిన విచారము ఏమాత్రమూ పడలేదు. చదువుకొన్న ఎనిమిది సంవత్సరములలో ఎన్నిసార్లో భర్తను గురించి ఆలోచించుకొన్న మాట నిజమే. భర్తకు మళ్లీ పెళ్లయిందని విన్నది. "అమ్మయ్య! కొంత బాధ వదలిం" దని అనేకసార్లు అనుకొన్నది.

ఆమెహృదయం భార్యాత్వాన్ని మించి పైకి పోయింది. ఆమెలో స్త్రీత్వం పోయిందని కాదు. ఆ రోజులలో ఆమెకు స్త్రీత్వం ప్రత్యక్షమే కాలేదు. తన తోడివిద్యార్థులైన అందమైనట్టి తెలివైనట్టి బాలకులు తనతో మాట్లాడినప్పుడూ, తన్ను తారసిల్లినప్పుడూ అవ్యక్తమై స్త్రీస్వాభావికమైన ఏదో ఒకరకమైన ఆనందం పొందింది. అంతకన్న వేరభిప్రాయాలు లేవు. భర్తతో తా ననుభవించిన సంపర్కసౌఖ్యాలను ఆమె సంపూర్ణముగా తనలోనుంచి పారదోలగలిగింది.

తాను కాపరానికి వచ్చినప్పటికి ప్రేమ అనేది ఆమె ఎరగదు. సాధారణ హిందూబాలిక ఏబాలికయినా గాఢమైన స్త్రీ పురుషప్రేమ కాపరానికి వచ్చినప్పటికి భావించివుండదు. అది భార్యాభర్తలు కలసితిరగడంలో, స్నేహంలో వుంటుంది. లలితే ఆలాంటి స్నేహంగాని, ఆలాంటి ఆనందంగాని భర్త విషయంలో ఎప్పుడూ అనుభవించలేదు. కోపము, భయము, ఓపిక, దుఃఖము అనేవితప్ప ఆమె ఇంకో గుణాలు ఎరగదు. పదిహేడు ఏండ్ల బాలికలో స్త్రీత్వం ఏమాత్రం విజృంభించివుంటుంది? ఈనాడు సంపూర్ణాంగియైన ఉజ్జ్వలపూర్ణయౌవనాంగి, యిరువది ఏడేండ్ల స్త్రీ..........

సుందరరావు పెద్దభార్యను చూచాడు. రెండవ భార్య ఎప్పుడూ అందమైంది కాదు. అతనికి ప్రథమ భార్యతో సమాగమము దొంగతనపుసొత్తు అనుభవించుచున్నట్లుగానే వుండేది. లలితలో ఆసమయాల్లో యౌవనము పొంగేదికాదు. స్త్రీ పురుషస్నేహము వాంఛించే రోజు లవి. అత్తగారు రక్షించే దుఃఖానికి ఏదో కొద్ది విరుగుడుగా భర్తను వాంఛించేది. ఆకోలదివాంఛ ఆమెకు ఏమాత్రమూ తృప్తి నిచ్చేదికాదు. పెంపుడుతల్లి భయాన సుందరరావు భార్యతో తిన్నగా మాట్లాడైనా మాట్లాడేవాడు కాడు. అతడు దొంగతనంగా భార్యనెప్పుడైనా కాంక్షిస్తే ఆ కాంక్షను లలిత తన భార్యాత్వపు విధిక్రింద పరిపాలించేదికాని స్త్రీయై ఎప్పుడూ పరిపాలించి యెరుగదు.

నేడు సుందరరావుకు పెద్దభార్య అందరాని కొండయింది. ఆమెలో సౌందర్యము పాలవెల్లువలా వుప్పొంగిపోతున్నది. భార్యను చూచి స్తబ్దపడి చచ్చి ఏదో అధోలోకానికి పోయినాడు. ఆమెతో మాట్లాడడానికైనా ధైర్యము, తాహతు చాలలేదు. ఆమె దుర్నిరీక్ష్య ప్రభాభాసితమైన దేవీస్వరూపములా వెలిగిపోతున్నది. ఇంతకాలమూ తనకు ఆమె కానిదైపోయిం దని వుడుకుబోతుతనం పొందాడు. కోపం పొందడానికి శక్తిలేదు.

✂

నాలుగురోజులలో రోగిణియైన లక్ష్మీదేవికి పథ్యము పెట్టినారు.

పథ్యంపెట్టిన రెండవరోజున డాక్టరు తన మామూలుపద్ధతిని సాయంత్రము నాలుగుగంటలకు ఆస్పత్రికి వెళ్లబోయేముందు సుందరరావుగారింటికి వచ్చి రోగితో కబుర్లు చెబుతూ కూర్చునివుంది.

రోగికి మళ్లీ జబ్బుచేసి విపరీతమైన జ్వరం వచ్చి సంధిమాటలలో డాక్టరమ్మ డాక్టరమ్మఅని కలవరించే

టప్పుడుకూడా తన పెద్దకోడలిని వైద్యానికి తీసుకొని రాకూడదని వెంకాయమ్మ పెంకిపట్టు పట్టింది. ఆపాడుముండ తన గడప తిరిగి తొక్కకూడదంది. ఇంటిలో అందరూ కూడా ఆమెను బతిమాలారు. రోగియొక్క స్థితి అంతకంతకును మితిమీరిపోయింది. అంతతో రంగయ్యగారికి పట్టరాని కోపము వచ్చింది. వెంకాయమ్మను తలవాచేటట్టు చివాట్లుపెట్టాడు. "ధనాని కాసపడి, ఆస్తి కాసపడి, వృద్ధబుద్ధిహీనుడనై నీకొడుక్కు నాకూతుర్నిచ్చుకొని గంగలో పడ్డాను. చస్తే చచ్చింది, నా కూతుర్ని తీసుకొనివెళ్లి ఆడాక్టరమ్మకాళ్లమీద పడవేస్తాను." దద్దమ్మలా కూర్చునివున్న అల్లుని వైపు తిరిగి "ఏమయ్యా, నీవు ఇంకా ఎన్నాళ్లు పెంపుడుతల్లి కొంగుచాటున దాక్కునివుంటావు? మొగతనం లేక బంగారములాంటి భార్యను అవతలకి తోసేస్తివి. ఇవ్వాళ మళ్లీ ఆడుదానికన్న అధమాధమముగా నోటమాటరాకుండా కూర్చుంటావు. నీకేం, ఈ పెళ్లాం పోతే ఇంకోపెళ్లాం వస్తుంది"అని కేకలువేశాడు.

ఈమాటలతో తల్లీకొడుకు లిద్దరూ హడలిపోయినారు. వెంకాయమ్మ గజగజలాడిపోయింది. సుందర్రావు మొగము వెలవెలలాడిపోయింది.

ఈవిషయాలన్నీ తలచుకొంటూ వెంకాయమ్మ పెద్దకోడలూ, చిన్నకోడలూ పురుటిగదిలో నవ్వుతూ కులాసాగా మాట్లాడడము చూచింది. ఆమె ఒళ్లూ మనస్సూ చీమలూ, జెర్రులూ ప్రాకినట్టయిపోయింది. ఆమెలోని మహాక్రోధమంతా ఒక్కసారి వెల్లివిరిసిపోయింది. పళ్లు పటపట కొరుక్కుంటూ కోర్టునుంచి పెందలకాడే వచ్చిన కొడుకుదగ్గరికి పోయి "ఏమిరో వాజమ్మా, నీకు ఆ రంకుముండమీద మనస్సు పోయిందా? నిమ్మదించిందిగా జబ్బు? అందరూ నాడబ్బు తినాలని ఏడ్చే వెధవలే. నీకోసమే ఎప్పుడూ పడని అవమానాలు పడుతున్నాను. నే చస్తే మీ అందరికీ కర్మం విరగడైపోతుంది"అంది. చూస్తూచూస్తూ ఆమె నల్లగుడ్లు వెనక్కి తిరగబడ్డాయి. గబుక్కున కూలి చెట్టు విరుచుకొని పడినట్లు పడబోయింది. "అదేమిటే అమ్మా, అమ్మా" అని సుందర్రావు తల్లిని పట్టుకొన్నాడుగాని లేకపోతే వెంకాయమ్మబుర్ర బద్దలయ్యేది. "మామయ్యో, మామయ్యో, మా అమ్మ చచ్చి పోతోం" దని ఒకపొలికేక పెట్టాడు. తల్లిని చంటిబిడ్డలా ఎత్తుకొని తీసుకొచ్చి హాలులో మంచముమీద పడుకోబెట్టి పురుటి గది సమ్ముఖంలోకి వచ్చి "డాక్టరుగారూ, మా అమ్మచచ్చిపోతోంది, ఒక్కసారి చూడండి" అని వణుకుతో మాట రాక సగముగా అన్నాడు. లలిత చివాలున లేచి రోగిదగ్గరికి వచ్చి రోగినాడి పరీక్ష చేస్తూ పురిటిగదిలో నున్న మంత్రసానిని తన అర్జంటు మందులు పెట్టిన పెట్టెను తెమ్మనీ, గ్లూకోజు ఇంజక్షను తొందరగా ఇవ్వమనీ ఆజ్ఞ యిచ్చింది. ఈలోపుగా వెంకాయమ్మ పడుకున్న మంచం పీటలు ఎత్తిపెట్టమని ఆజ్ఞ యిచ్చింది. గ్లూకోజులో చాలా కొద్ది ఎడ్రినాలిన్ కలిపి వెంకాయమ్మ స్తనముల క్రింద కండరములలో ఇంజక్షను యిచ్చింది. నాడి కొంచెం గట్టిపడింది. మళ్లీ కొంత గ్లూకోజు రక్తనాళముల ద్వారా ఇంజక్షను యిచ్చింది. ఆ పట్టుపట్టు రోగికి రెండు గంటలకు మెలకువ వచ్చింది. కాని వెంకాయమ్మ అతి నీరసపడిపోయి సంపూర్ణ స్పృహలోకి రానేలేదు. రంగయ్యగారే భారమంతా తన నెత్తిమీద పెట్టుకొని తన కూతుర్ని రక్షించినట్లుగానే తన వియ్యపురాలినికూడ రక్షించవలసిందని లలితమ్మను అతి వినయంగా ప్రార్థించాడు.

"ఈమెకు సంపూర్ణంగా తెలివొచ్చేవరకూ నేను వైద్యం చేస్తాను. ఇది గడ్డుఅయిన పాండురోగము. చాలాకాలం అశ్రద్ధ చేశారు. ఒంట్లో రక్తం ఏమాత్రమూ లేదు. రోగికి పూర్తిగా మెలకువ వచ్చిన తరువాత ఆమెయిష్టముపైనగాని నేను వైద్యము చేయడానికి వీలులే" దని అన్నది లలిత.

సుందర్రావు కృతజ్ఞతాపూర్వకమైన చూపులతో తల వాల్చుకొన్నాడు. రంగయ్య "చిత్తమమ్మా, ఆలాగే చేయించండి" అని అన్నాడు. డిజిటాలిన్, డైయూర్టిన్, కాంపోలాన్, గ్లూకోజు అనే మందులు ఆమెకు ఉపయోగించడము మొదలుపెట్టింది. గుండె బలపడింది. ఒంట్లో వున్న నీరంతా అధికొచమానం ద్వారా వెళ్లిపోయింది. అక్కడనుంచి ఒక్క కాంపో

లాన్ మాత్రము నడుపుతూ లోపలికి హిపాటిక్స్ అనే పైత్యకోశపుమందు యిచ్చే ఏర్పాటు చేసింది.

లలిత వైద్యం ప్రారంభించిన నాలుగోరోజుకు ఒంట్లో జవసత్తువులు చేరి వెంకాయమ్మకు పూర్తిగా మెలకువ వచ్చింది. గుండెల్లో దడ తగ్గడం, కాళ్లలో, చేతులలో, మొహంలో వున్న నీరు తగ్గిపోవడం, కొంచెం ఒంట్లో తనకు ఆరోగ్యంగా ఉండినట్లు తనకు తోచడం ఆమె చూచింది. ఈ రాక్షసిచేత తనకు వైద్యమేమిటని తనకు అప్పుడప్పుడు వుద్భవిల్లిన ఆలోచనలు అక్కడక్కడే చంపివేసుకొంది. లలిత వైద్యానికి వచ్చినపుడల్లా తనకు ధైర్యము వచ్చినట్లయ్యేది. లలితమ్మవైద్యం తాను ఒప్పుకొంది. వైద్యం సాగింది. నానాటికీ వెంకాయమ్మ దృఢగాత్రురాలు కాసాగింది.

౬

పెద్దభార్య తన చిన్నభార్యకూ, తన తల్లికీ సర్వకాలహాససంపూర్ణ వదనయై వైద్యము చేస్తూ వుండడము సుందర్రావుకు ఆశ్చర్యము వేసింది. భార్యతో పరాయిలేడీడాక్టరుతో మాట్లాడినట్టయినా మాట్లాడదామని ప్రయత్నించాడు. లాభం లేకపోయింది.

లక్ష్మీదేవిచంటిబిడ్డ ఎంతో కులాసాగా వుండడమూ, లక్ష్మీదేవి డాక్టరమ్మ వచ్చేటప్పటికి ఆమెను ప్రత్యక్షమైన దేవిలా చూడడమూ ఇదంతా సుందర్రావు చూస్తూనేవున్నాడు. ఆమెకుమాత్రం తనకు వైద్యంచేసే వైద్యురాలు తన సవతేనని ఎంతమాత్రమూ తెలియదు. తెలిస్తే ఆమె ఏమనుకుంటుందో అని అతడనుకొన్నాడు. రెండవభార్యతో డాక్టరు లలితమ్మ సంగతి చెప్పి ఆమె పొందే భావాలను చూడాలని ఒక కల్మషమైన కోరిక కలిగింది సుందర్రావుకు. మళ్లీ తప్పనుకొన్నాడు. మళ్లీ ఆ ఆలోచనకు లోనయిపోయినాడు. చిన్నగా లక్ష్మీదేవి దగ్గరకు వెళ్లినాడు.

"నాప్రథమవివాహముసంగతి నీకు తెలుసును కదూ?"

"ఆ, అంతా తెలుసును"

"ఏం తెలుసును?"

"అత్తగారు పెట్టే బాధలు పడలేక పుట్టింటికి వెళ్లిపోయి డాక్టరుపరీక్షకు చదివి ప్యాసై ఉద్యోగము చేస్తున్నదని"

"నీకు వైద్యంచేసే డాక్టరుగారి సంగతి ఎరుగుదువా?"

"ఆ, ఎరుగుదును. ఆమె మీ పెద్దభార్య"

సుందర్రావు తెల్లబోయాడు. అతని హృదయం కాళీ అయిపోయింది.

భర్త తెల్లబోవడము చూచి లక్ష్మీదేవి "మానాన్నగారు అన్నిసంగతులూ చెప్పారు" అన్నది. సుందర్రావు అక్కడనుంచి వెళ్లిపోయినాడు. లక్ష్మీదేవిహృదయము ప్రాథమికస్థితిలోనే వున్నది. ఆమెకు వస్తే కోపము, లేకపోతే దయ. భర్త అలా వచ్చి ఎందుకని వెళ్లిపోయినాడో ఆమెకు అర్థము కాలేదు. డాక్టరు యిష్టపడి మళ్లీ కాపురముచేయడానికి ఒప్పుకుంటుందా? తనకన్న అందంగా వుంది. మంచి ఉద్యోగం చేస్తున్నది. ఆమెను తీసుకొనిరావడానికి భర్త ఆశపడుతున్నాడా? డాక్టరమ్మ తన యింటికి తిరిగీ కాపరానికి రావడానికి ఎందు కిష్టపడుతుంది? తనకు ఈగొడవ లేమీ తెలియవు. డాక్టరమ్మ చాలామంచిది. ఆమె దేవతామూర్తి. ఆమెకు మాత్రం భర్త అవసరంకాదా? భర్త ఎంత దుష్టుడైనా, అత్తగారెంతటి దుర్మార్గురాలైనా ఒకస్త్రీ చేసే కాపరం చేతులారా తోసివేసుకొని తన యిష్టమువచ్చినట్లు వెళ్లిపోవచ్చునా? తన తండ్రి తన భర్తను, అత్తగారిని ఎన్నివాగ్దానాలు తీసుకొని తన పెళ్లికి ఒప్పుకోలేదు? అలాంటప్పుడు తన అత్త, భర్త తన్ను రాసిరంపాన్ని పెడితే తాను పుట్టింటికి పారిపోతుందా? బాధలు పడుతూ అత్తవారింటిదగ్గరే వుంటుందా? ఉత్తమ ఇల్లాలు బాధలన్నీ పడుతూ ప్రాణాలన్నీ అర్పిస్తుంది గాబోలు. కోడరికాలు భరించలేక ఎంతమంది పతివ్రతలు నూతుల్లోనూ, చెరువుల్లోనూ, కాలువల్లోనూ పడి ప్రాణాలు

తీసుకోలేదు? అందరూ అత్యుత్తమపతివ్రతలైతే సీతను, సావిత్రిని చూపించడ మెందుకు? ఈ ఆలోచనతే భరించలేక లక్ష్మీదేవి ఎదుట గోడమీద వున్న సీతారామలక్ష్మణహనుమంతులున్న పటానికి నమస్కారంచేసి బిడ్డకు పాలివ్వడము మొదలుపెట్టింది.

వెంకాయమ్మ తన పెద్దకోడలిచేత వైద్యము చేయించుకోవడానికి ఎందుకు ఒప్పుకుందో తెలియక సుంద్రావు, రంగయ్యగార్లు ఆశ్చర్యపడ్డారు. ఈ విషయం వెంకాయమ్మగారికిమాత్రం ఏం తెలుసును? కసికొద్దీ రాక్షసైన కోడలుప్రాణం తీసేస్తుం దని భయపడిందా? డాక్టరురుసుము, కోడలవడముచేత, పుచ్చుకోదని ఆశపడిందా? ఈవైద్యం జరుగుతూ ఆరోగ్యం పొందుతున్నకొలదీ వెంకాయమ్మలో ఏదో వర్ణింపరాని మార్పు రాసాగింది. డాక్టరు వచ్చేటప్పటికి ఎంతో గౌరవముచేసి కుర్చీ వేయించి మర్యాదచేసేది. ఒక్కనాడుకూడ తమ ఇరువురి వెనకటిచుట్టరికమును జ్ఞాపకంతెచ్చే సంగతి ఒక్కటిగూడ ఆమె తీసుకొని రాలేదు. లలితమ్మ వచ్చేటప్పటికి ఆమెముఖము కలకలలాడేది. లలితమ్మ వెళ్లినదగ్గరనుంచి ఏదో పరధ్యానములో వుండేది. ఆ ఊళ్లో వున్న ఒక పండితుని తనకు ప్రతిదినమూ భారత, భాగవత, రామాయణగ్రంథములను చదివి వినిపించి అర్థంచెప్పడానికని ఏర్పాటు చేసుకొంది. కొడుకును, రంగయ్యగారిని ప్రతివిషయానికీ పిలిచి ఆలోచించసాగింది. నెమ్మదినెమ్మదిగా తాళపుచెవి కొడుక్కు యిస్తూండడమూ, ఇంతడబ్బు తీసుకురా అంతడబ్బు తీసుకురా అని చెప్పడమూ చేయసాగింది. ఒకరోజున బండి చేసుకొంది. తిన్నగా డాక్టరు లలితయింటికివెళ్లింది. లోపలికి పోయి వియ్యపురాలికాళ్లమీద పడి "అమ్మా, నన్ను క్షమించు. నేను నీ కుటుంబానికీ, లలితమ్మజీవితానికీ రాక్షసినై, పెనుభూతానై మహాకష్టముతీసుకొనివచ్చాను. లలితమ్మ అపరదేవత. నా యావదాస్తిని లలితమ్మకు రాసియిస్తాను. ఆమె నాజీవితానికి ఏమిప్రాయశ్చిత్తము వినియోగిస్తే అది నిర్వర్తిస్తాను" అని వెక్కివెక్కి ఏడుస్తూ ఆమె కాళ్లు వదిలిందిగాదు. లలితమ్మతల్లి తెల్లబోయింది. ఆమె ఏమి చెప్పగలదు? ఆమెకు కళ్ల నీళ్లు తిరిగాయి. "నేను నా పెద్దకోడలి కాళ్లమీద పడి ఆజన్మాంతమూ క్షమించమని కోరుచున్నా నని చెప్పవలయును" అని అన్నది. ఆ స్త్రీవిషయమై తాను ఆడిన మాటలు అమ్మాయితో మనవి చేయవలయు నని ప్రార్థించింది.

౭

ఆ మర్నాడు రాత్రి ఎనిమిది గంటలకు సుంద్రావు డాక్టరు లలితాదేవి యింటికి వచ్చాడు. లలితా సుంద్రావుల చరిత్ర నెమ్మదినెమ్మదిగా లోకమంతా తెలుసుకోనే తెలుసుకొంది. లోకమంతటా వీరి సంగతి పాకిపోయింది. సుంద్రావుగారు రాగానే బంట్రోతు హాలులో వున్న కుర్చీలో కూర్చోమని, లోపలికి వెళ్లి బుచ్చివెంకయ్యగారితో "సుంద్రావుగారు వచ్చారండి" అని చెప్పాడు. వెంకయ్యగారు 'ఈ గొడవ ఏమిట్రా బాబూ' అనుకొంటూ హాలులోకి వచ్చాడు. మామగారు రాగానే సుంద్రావు లేచి నమస్కారం చేశాడు. చేసి తల వాల్చుకొని అలాగే నిల్చుండిపోయినాడు. బుచ్చి వెంకయ్యగారు 'కూర్చోండి' అని, సుంద్రావు కుర్చీమీద కూర్చుండగానే తాను కూర్చున్నాడు. సుంద్రావు కళ్ల నీళ్లు కారిపోతూవుండగా తల వాల్చుకొని కూర్చునివుండి కాలి బొటనవ్రేలితో తివాచీని వ్రాయసాగినాడు.

బుచ్చి వెంకయ్యగారు ఏం మాట్లాడగలరు? "ఇంటిదగ్గిర తల్లీ, పిల్లా కులాసాగా వున్నారా?" అని మాత్రము ప్రశ్నించాడు. సుంద్రావు తల వూపాడు.

తర్వాత ఏలాగో సంబాళించుకొని తల వాల్చుకొని "ప్రపంచంలో నాబోటి దుర్మార్గుడు లేడు. పరీక్షలు ప్యాసవడము నాలోని పశుత్వాన్ని ఎక్కువ చేసింది —" అని ఆగిపోయాడు.

బుచ్చివెంకయ్యగారు 'ఏదో వస్తోందిరా బాబూ' అనుకొన్నాడు.

"మీ రందరూ నన్ను క్షమించడానికికూడా నేను అర్హుణ్ణి కాను. మీ రందరూ నన్ను క్షమించారంటే అదే నాకు పదివేలు."

బుచ్చివెంకయ్యగారు "ఎవరు ఎవరిని క్షమించగలరు నాయనా? అందరినీ క్షమించేందుకు, ప్రేమిం

చేందుకు, రక్షించేందుకు భగవంతుడు ఒక్కడే ఉన్నాడు. మనకు వచ్చే కష్టాలు, సుఖాలు మన కర్మనుబట్టి వుంటవి". అని నెమ్మదిగా చెప్పినాడు.

వారిద్దరిమధ్య మౌనము తెరలై వాలింది. ఏలాగైతేనేమి, సుందర్రావు ధైర్యము తెచ్చుకొని "నా క్షమార్పణ ఆమెకుగూడ స్వయంగా చెప్పుకొని వెళ్లిపోతాను" అన్నాడు.

బుచ్చివెంకయ్యగారు పదినిమిషములు ఆలోచించి లోపలికి వెళ్లిపోయినాడు. లలిత తాను చదువుకొనే గదిలో బల్లమీద ఎలెక్ట్రిక్ స్టాండు వెలుతురులో 'బ్రిటిషు మెడికల్ జర్నలు' అనే ఒక ఇంగ్లీషు వైద్యపత్రికను చదవడానికని తీసి ఏదో పుటను తీసి ఆపుటలో విషయాలమీద ఏమాత్రమూ దృష్టి లేక తల్లివల్ల అత్తగారి రాకసంగతి ఎరుగున్నది కాబట్టి ఆ ప్రకరణంలో ఇది భాగమని అనుకొంటూ, ఆలోచించుకొంటూ వున్నది. ఇంతలో తండ్రి వచ్చి "అమ్మాయీ, నిన్ను క్షమార్పణ అడగాలని అంటున్నాడు. ఏం చెప్పమన్నావు?" అని అడిగినాడు.

రోగిని చూసి రోగిసంగతి, వైద్యంసంగతి నిశ్చయించుకొన్నట్లుగా లలితమ్మ అయిదునిమిషము లేదో ఆలోచించుకొని హఠాత్తుగా లేచింది. "నాన్నా, నేను వెళ్లి మాట్లాడివస్తాను" అని చెప్పింది. "నేను ఒక్కర్తెనే వెళ్లివస్తా"నని తండ్రితో చెప్పి హాలులోకి వెళ్లింది.

లలితమ్మ రాగానే సుందర్రావు లేచి నమస్కారము చేసినాడు. అతని కళ్లవెంట అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. లలితమ్మ అతనిని కూర్చోమని సైగచేసి తానును తన తండ్రి కూర్చున్న కుర్చీలోనే కూర్చున్నది.

ఆ హాలు అతిసుందరముగా అలంకరింపబడి ఉన్నది.

సుందర్రావు వేరే మాట్లాడలేక కళ్లనీళ్లు అపుచేసుకొని తల వాల్చుకొనేఉన్నాడు.

హాలులో గడియారము ఎనిమిదిన్నర కొట్టింది.

లలితమ్మకూడా ఏమీ మాట్లాడలేదు. గోడమీద అలంకరింపబడివున్న చక్కని చిత్రలేఖనములు ఈదంపతుల నిరువురిని చూస్తున్నట్లున్నవి.

సుందర్రావు తన జేబులోని ఉత్తరమును తీసి "న-న్ను-మీ-రు-క్ష-మిం-చాలి" అని అంటూ ఆ ఉత్తరము తీసుకొనివచ్చి ఆమెబల్లమీద వుంచినాడు. తాను వెళ్లి యథాస్థానమున నిలుచున్నాడు. లలితాదేవి భర్తను చూస్తూ "మీరు కూర్చోండి" అని అన్నది.

మళ్లీ మౌనదేవతే తాండవము చేసినది. సుందర్రావు లేచి నమస్కారముచేసి సెలవుతీసుకొంటానని చెప్పి గబగబ వెళ్లిపోయినాడు. లలితమ్మకంటిలో రెండుచుక్కలు గిర్రున తిరిగినవి.

౫

లలిత అక్కడనే భర్త అందించిన కవరు తీసి దానిపైఅడ్రసు చదువుకొన్నది. "డాక్టరు లలితాదేవి, యమ్.బి.అండ్ బి.యస్., అసిస్టెంటు సర్జను, ఏలూరు." అని ఇంగ్లీషులో ఉన్నది. కవరు నెమ్మదిగా విప్పిలోని కాగితాలు పైకిలాగగానే ఐదు వేయిరూపాయల నోట్లును, రెండు ఉత్తరములును కనపడినవి. ఆమె తెల్లబోయి ఆనోట్లమీటో అర్థంచేసుకోలేకపోయింది.

"శ్రీ లలితాదేవీ!

మనుష్యులు చేసే కొన్ని పాపాలకు నివృత్తి లేదు. నేను చిన్నతనాన్నించి దద్దమ్మను. చదువుకొన్న మూర్ఖుణ్ణి. ధనానికి ఆశించిన పాపిని. నేను మిమ్మలను క్షమించమని అడగడానికికూడ అర్హుణ్ణి కాను. మీరు ఏలూరు రావడమువల్ల నేనూ, మా అమ్మా ఇదివరకు మిమ్మల్ని పెట్టిన బాధలకు కలిపి యింకా ఎన్నో బాధలు పెట్టినాము. మీరు దేవతాస్వరూపులు. రూపు తాల్చిన దివ్యక్షమామూర్తులు. మా అమ్మగారూ, నేనూ ఏమిచేస్తే మాపాపాలను మేము కడిగివేసుకోగలమో తెలియక క్రుంగిపోతున్నాము. మీరు క్షమించానసే ఒకచిన్న ముక్క వ్రాస్తే అది హృదయాని కద్దుకొని అదే పదివేలని ఆ ఉత్తరాన్ని పూజచేసుకొంటూ వుంటాను. మా అమ్మగారు మీ అమ్మగారితో ఏదో

మనవి చేశారు. అది తప్పక నిర్వర్తించగలసిం దని మీ పాదాలమీద వ్రాలి ప్రార్థిస్తున్నాను. లక్ష్మికూడా యిందులో ఒక ఉత్తరము పంపింది. మా ఉత్తరాలు గాని, మా కోర్కెలుగాని మీకూ, మీ ఆశయాలకూ ఏమీ అడ్డురాగూడ దని మిమ్ములను పదేపదే ఆశిస్తున్నాము. ఈనాటి మాహృదయాలను సంపూర్ణకరుణతో చూడగలుగుటకు మీకు శక్తి యివ్వవలయునని భగవంతుని వేడుకొంటున్నాను. ఇందుతో పంపినది నీచమైన నాతల్లియూ, నేనున్నూ తీర్చలేని మీతండ్రిగారి బాకీ తీర్చడానికి పంపుకొన్న అర్పణ.

నేను జన్మ ఎత్తినదిమొదలు ఒక్కవిషయమైనా కృతార్థత అని అనకొనేటట్లు నిర్వర్తించలేదు. ప్రాక్టీసులేని వకీలును, మహోత్తమురాలైన భార్యను పూజించలేని హీన భర్తను, నీచురాలైన పెంపుడు తల్లిని విడ్వలేని పిరికికొడుకును. ఈవిషయంలో నన్నాతమ్మ ఒప్పించగలనని ధైర్యములేని అశక్తుడను.

మీ విధేయుడు,
సుందరావు"

"శ్రీ శ్రీ పార్వతీస్వరూపురాలైన లలితాదేవి అక్కగారికి—

చెల్లెలు లక్ష్మి వ్రాసుకొన్న వినయపూర్వకమైన ఉత్తరము.

మీకు నమస్కారము చేస్తున్నా నక్కయ్యా. నేను మిమ్మల్ని ఏమని పూజింపగలను? నేను మీకూ, మీ ధర్మానికీ అడ్డంవచ్చిన పాపాత్మురాలను. నేను ఏమిచేస్తే మీరు నన్ను క్షమించగలరు? మీరు నాప్రాణదానమూ, నాబిడ్డ ప్రాణదానమూ చేశారు. నేను, నాబిడ్డ నీబిడ్డలం. నేను మీదాసీక్రింద వుంటాను. మీరు మీయింటికి రండి. నేను ఏమాత్రము అడ్డమైనా నాయథాస్థానముననే పోయి మిమ్మల్ని దూరముగానే వుండి నాహృదయమార పూజించుకుంటాను. మీరు మీయింటికి వస్తే ప్రతిరోజూ ఉదయాన్ని మీకాళ్లు కడిగి ఆనీళ్లు నా నెత్తిమీద పోసుకొంటాను. మీకు బట్టలు వుతుకుతాను. మీకు భోజనము వండిపెడతాను. మిమ్మల్ని చూసుకొంటూ వుప్పొంగిపోతాను. మీపాదాలు నాహృదయానికి అదుముకొంటాను. మీరు మీ యింటికి వచ్చిననాడు నాజన్మ సఫల మవుతుంది. మీరు నాకు అక్క అని తెలుసుకొన్ననాడు నాజీవితం తరించిం దని ఏడేడు లోకాలూ ఉప్పొంగిపోయాను. మిమ్ములను 'అక్కా' అని నన్ను నోరారా పిలవనీయండి.

ఇట్లు,
ప్రేమతో మిమ్ములను పూజచేస్తున్న మీచెల్లెలు
లక్ష్మి."

లలితమ్మ కళ్ల నీళ్లు పెట్టుకొంటూ ఆ రెండు ఉత్తరములను కళ్ల కద్దుకొంది.

⸻

భర్త, లక్ష్మి ఇటువురూ వ్రాసిన ఉత్తరములు చదువుకొని వెళ్లి తండ్రిచేతి కిచ్చింది లలితమ్మ. ఏదువేలరూపాయలూ తండ్రిప్రక్కనే పెట్టింది. తాను తిన్నగా గదిలోనికి పోయి మంచముపైన మేను వాల్చింది. భర్త ఎదురుసుండా చంటిపిల్లవాడిలా కూర్చున్నాడు. ఆయన నిజంగా వెర్రివాడు. ఆయన ఈజీవితములో ఒకపనీ నెరవేర్చలేకపోయినాడు పాపం. ముప్పదినాలుగేండ్ల యీడువాడై వలుబది ఐదేండ్లయీడువానిలా గయిపోయినాడు. ఆయనకు వైద్యంచేస్తే మళ్లీ పడుచువా డవడూ? కర్కశహృదయం కలిగి మహారాణిలా పరిపాలనాశక్తి గలిగిన, తల్లితనం ఎరగని ఒక స్త్రీచేతిలో నీరసుడై బానిసయిపోయాడు.

లలితమ్మమనస్సు ద్రవించిపోయింది. తానున్న తల్లితనము ఎరగదు. తన స్త్రీత్వం ఆశించే తల్లితనం ఎదుట సుందరావు తెలివితక్కువ బాలకు డైనట్లు తోచింది. సుందరావు దిక్కులేని శిశువులా కనపడ్డాడు.

"పూర్ బాయ్ (Poor boy), పాపం, ఆ బాలుడు" అని అనుకొన్నది.

పురుషుడు బలవంతుడై స్త్రీని పరిపాలించాడు, స్త్రీని లాలించాడు, స్త్రీని పోషించాడు, ఆమెను బుజ్జగించాడు, ఆమెకు రక్షకు డైనాడు. ఇప్పుడు

తన భర్త ఏమీ తెలియని తెలివితక్కువవాడైన బాలకుడుగా ఉన్నాడు. అతనిని రక్షించడము తన విధి.

ఈలాంటి ఆలోచనలు ఆలోచించుకొంటూ ఏరెండుగంటలతో కునుకువారింది లలితమ్మ. తన మామూలుచొప్పున అయిదుగంటలకే లేచి స్నానము చేసి శుభ్రవస్త్రాలు ధరించి వ్రాతగదిలోనికి పోయి భర్తకును, లక్ష్మికిని ఉత్తరాలు వ్రాసింది. ఆరెండు ఉత్తరములను తండ్రిగారు గదిలోనికి రాగానే ఆయన చేతి కిచ్చింది. ఆయన ఆ రెండుఉత్తరములను చదువుకొన్నాడు. నిన్నటి నోట్లు అయిదున్నూ ఆఉత్తరములతోపాటు మడచి ఆమెచేతి కిచ్చినాడు. "అమ్మా, నీహృదయంలో సరస్వతి, లక్ష్మి, పార్వతి ఎప్పుడూ నివసిస్తూనేవుంటారు. నీకు తోచింది భగవత్ప్రేరితం" అనిమాత్రం అన్నాడు. లలితమ్మ ఉత్తరములు కవరులో పెట్టి కవరు అంటించి పైఅడ్రసు వ్రాసి గంటకొట్టి బంట్రోతును పిలిచి అతని చేతికి ఉత్తరములు యిచ్చి సుందర్రావుగారికి యివ్వవలసిందని ఆజ్ఞ ఇచ్చింది. తాను ఫలహారములు తీసుకొనుటకు లోనికి వెళ్లిపోయింది.

సుందర్రావు ఆఉత్తర మందుకొన్నాడు. అతని గుండెలు దడదడ కొట్టుకొన్నవి. తనయొక్క అదృష్టదురదృష్టాలు ఆ ఉత్తరంలోనే ఉన్నవికదా అనుకొన్నాడు. ఉత్తరమును కళ్ల కద్దుకొన్నాడు. తల ఎత్తి భగవంతుని ప్రార్థించాడు.

౧౦

"ప్రియా,

మీ ఉత్తరము, చెల్లెలిఉత్తరము రెండూ చూచితిని. రాత్రి ఒంటిగంటవరకూ నిద్రపోలేదు. లోకానికి, దేశానికి, కుటుంబానికి వచ్చే మార్పులు భగవంతుని చేతుల్లో ఉన్నవిగాని మనచేతిలో ఏమి ఉన్నవి? జ్ఞానవంతులు వెనకటి విషయాలు తలపెట్టరు. జరిగిన విషయాలను మార్చలేము.

నేను మీయింటికి వచ్చి వెనకటిమల్లే వుండడము ఎన్నటికీ భావ్యముకాదు. ఎంత ఉత్తములైవున్నప్పటికీ మనుష్యప్రకృతులు మనుష్యప్రకృతులే. నాచెల్లెలు లక్ష్మి పరమసుశీల. ఆమె మీతో ఎప్పుడూ వుండడానికి అర్హురాలు. ఏ కారణాలవల్లనైతేనేమి, నేను రోగినారాయణసేవ చేసే ఈదారిని తీసుకొన్నాను. అది మన యింటిదగ్గరే వుండి చేయవచ్చునని మీరు వాదించవచ్చు. కాని దానివల్ల మీకున్నూ, నాకున్నూ, లక్ష్మికికూడా యిబ్బందులు వస్తాయని నానమ్మకం.

మీరు ఎప్పటికైనా నాభర్తలు. హిందూస్త్రీనైన నాహృదయంలోంచి మీమూర్తి ఎప్పుడూ మాయంకాలేదు. నాచెల్లెలితోపాటు నేనుకూడా ఈ ఊళ్లో వున్నన్నాళ్లూ మీకు సేవచేస్తాను. తరువాత నేను ఎక్కడ వున్నా మీరు, నాచెల్లెలు, అత్తగారు ఎప్పుడూ వస్తూవుండవలసింది. మీరు పంపిన ఐదువేల రూపాయలూ ఇందుతో తిరిగీ పంపివేస్తున్నాను. ఈ అయిదువేలూ ఏలూరు ఆస్పత్రిలో ఆడవాళ్ల భాగమును వృద్ధిచేయడానికి ప్రభుత్వమువారికి అత్తగారి పేర ఇవ్వండి. ఎల్లుండి ఆదివారమునాడు నేను, మా అమ్మ, నాన్నగారు అక్కడికి భోజనానికి వస్తున్నాము.

చెల్లెలికి కౌగిలింతలు. చిట్టితల్లికి ముద్దులు. అత్తగారికి, పిన్నిగారికి, రంగయ్యగారికి నమస్కారములు.

జీవితంలో ఏవిషయంలోనూ సాఫల్యము పొందలేదని ఏమాత్రమూ విచారించవద్దు. ఇక్కడనుంచి విజయం మీవంతు అని నమ్మండి. ధైర్యముతో ఛాతీ విప్పుకొని విజయంపొందేవాడిలాగ సంచరించండి. నేనూ, లక్ష్మి మీవెనకాల ఎప్పుడూ వుంటాము.

ఇట్లు
ప్రేమతో, మీ
లలిత."

సుందర్రావు మోకరించి ఆ ఉత్తరాన్ని తలపైన పెట్టుకొన్నాడు.

దేవుడి కోపమొచ్చింది!

[ఒక ఆంగ్లకవి భావం]

●

రాత్రి పదకొండుఘంట లవుతుంది. అందరూ భగవన్నామస్మరణ చేసుకుని ఇక పండుకోబోతారు. ఆ సమయమందు దేవదేవుడు స్వర్గలోకమందు సుఖాసీనుడై, మానవజాతి నివేదించుకునే ప్రార్థనాపరంపరను అతిశ్రద్ధతో ఆలకిస్తున్నాడు. ఒక్కొక్క మొరనే వరసగా చెవినిబెట్టి, వెంటవెంటనే భగవంతుడు సెలవిచ్చే ఆశీస్సులను గబగబ రాసుకుంటున్నాడు ప్రయివేటు సెక్రటరీ.

ఒక కోటీశ్వరుని ప్రార్థన :

" హే భగవన్! ఇప్పుడే నేను ఒకటవరకపు అమెరికనుమోటారుకారుకు ఆర్డ రిచ్చివున్నాను. దానిపయిన ఈగయిన వాలకుండ అది సప్తసముద్రాలూ దాటుకుని భద్రంగా నాయిల్లు చేరేటట్టు ఓకంట కనిపెట్టాల్సిన భారం నీదే స్వామీ!......"

'సరే' నన్నట్టుగా దేవుడు తలవూపాడు. 'గ్రాంటెడ్' అని చెప్పి సెక్రటరీ అనుకూలమయిన రిమార్కు రాసుకున్నాడు.

తరువాత—

ఎజెండాలో : ఉద్యోగంకోసం పెనగులాడుతున్న ఒక అభ్యర్థి మొర. తక్కిన అప్లికేషన్లు యావత్తూ తొక్కిపెట్టి, తనదిమాత్రం నెగ్గేటట్టు అనుగ్రహించవలసిందని ఆతడి యావ.

చర్రుమని దేవుడికి కోపం వచ్చింది. చిర్రుబుర్రులాడుతూ, "వీల్లేదు" అని రాసిపారెయ్యమని సెక్రటరీకి ఆజ్ఞాపించాడు.

వెంటనే సెక్రటరీ లేచి, "ఇదేమిటి యేలికా! అట్లా ఆగ్రహిస్తారేం?—ఆ శ్రీమంతుడి మోటారుకారుపయిన ఈగయిన వాలకుండ చేయటానికి తడయక సమ్మతించివుంటిరే, పాపం—పొట్టగడవని ఒక పేద... నవుకరీకోసం నానాపాట్లూ పడుతూవుంటే కేవలం నిరాకరించటం...?"

అనేసరికి, దేవుడిట్లా అన్నాడు :

"శ్రీమంతుడు ఏ అయిదేళ్లకో వక్కసారి ముచ్చటగా కోరిక కోరుకుంటాడు. తీర్చ బుద్ధేస్తుంది. కాని, ఈపేదవాళ్లు తెల్లారి లేచిందిమొదలూ అనుక్షణమూ ఏదో కొరత చూపిస్తూ మనల్ని పీక్కుతింటూనేవుంటారు. రోజూ చచ్చేవాళ్లకోసం ఏడ్చే దేమిటి? అర్జీ తోసిపారెయ్..."

— ముద్దా విశ్వనాథం.

—✻—

క్రొత్త త్రోవ

= శ్రీ అవ్వారి వాసుదేవశాస్త్రి =

గీర్వాణభాషలో అలంకారశాస్త్రంలో రాజానకవంశము చాలా ప్రసిద్ధమైనది. ఆ వంశంలో పుట్టినవారు చాలామంది అలంకారగ్రంథాలు వ్రాసి ఆ వంశానికి వన్నె తెచ్చారు. ఇందులో రాజానకకుంతకుడు మొదటివాడు. అతను 'వక్రోక్తిజీవిత' మనే పుస్తకం వ్రాసి వక్రోక్తియే కావ్యానికి జీవిత మని నిర్ణయించాడు. తరువాత రాజానకానందవర్ధనుడు బయలుదేరి 'ధ్వన్యాలోకం' వ్రాసి "అది కాదు. ధ్వనియే కావ్యానికి ఆత్మ" అని నిశ్చయించాడు. తరువాత రాజానక మహిమభట్టు బయలుదేరి 'వ్యక్తివివేకం' వ్రాసి ధ్వని అనేది అనుమానంచేత గతార్థం అవుతుందనీ, అన్ని ధ్వనులూ అనుమానంలో అంతర్భావాన్ని పొందుతయ్యనీ తేల్చాడు. తరువాత రాజానకరుయ్యకుడు బయలుదేరి వ్యక్తివివేకానికి వ్యాఖ్యాన మంటూ ప్రారంభించి వ్రాస్తూ దానిలో అనుమితివాదాన్ని ఖండించి మళ్లీ ధ్వనివాదాన్నే నిలవబెట్టాడు. ఈ వ్యక్తివివేకంలో మహిమభట్టు ఆనందవర్ధనుడి ధ్వనివాదాన్నే కాక రాజానకకుంతకుడి కావ్యలక్షణోదాహరణాలను గూడ ఖండించాడు. అదిగాక అనేక కావ్యనాటకాదులను క్రొత్తవిమర్శనాసరణితో విమర్శించి, ఆ దోషములు లేకుండావుండేటట్టు తాను మళ్లీ ఆపద్యగద్యాలను రచించి చూపాడు. ఇంత నిష్పక్షపాతంగానూ, లోతుగానూ విమర్శించేవారు చాలా తక్కువ. వీ రందరూ ఒకే వంశంలోని వారైనా ఒకరిని ఒకరు సహించలేకనో, మఱియేమో యిలా గ్రంథాలు వ్రాసుకున్నారు. యిలా వ్రాసుకోడానికి అసూయే గనక కారణమైతే, ఆ అసూయకు సారస్వతం మూలకంగా ప్రతిక్రియ చేసుకోవడంవల్ల, యితరులకు యేవగింపు కలిగించకుండా, పైగా సారస్వతపథికులకు చాలా సంతోషాన్నీ, వుపకారాన్నీ గూడా కలిగించినవారైనారు. ఇతను ౯-వ శతాబ్దంలో వున్న ఆనందవర్ధనాచార్యుల మతాన్నీ, ౧౦-వ శతాబ్దపు పూర్వభాగంలో వున్న అభినవగుప్తపాదాచార్యుల లోచనవ్యాఖ్యానాన్నీ ఖండించాడు గనుకను, ౧౨-వ శతాబ్దంలో రుయ్యకుడు యీతనిపుస్తకానికి వ్యాఖ్యానం వ్రాసి, యితని మతాన్ని కొంత ఖండించివున్నాడు గనుకను, ఆ మధ్యకాలంలో, అంటే ౧౦-వ శతాబ్దపు ఉత్తరభాగంలోనో, ౧౧-వ శతాబ్దం (A. D.) లోనో వున్నాడని తోస్తున్నది. ఇతను భీముడనేవాని పౌత్రుడనీ, శ్రీధైర్యుడనేవాని కుమారుడనీ యితని గ్రంథాంతశ్లోకాలవల్లనే తెలుస్తున్నది.

"అధాతుం వ్యుత్పత్తిం సప్తృణాం క్షేమయోగభాజానామ్,
సత్సు ప్రథితనయానాం భీమస్యామితగుణస్య తనయానామ్.
శ్రీధైర్యస్యాంగభువా మహాకవేః శ్యామలస్య శిష్యేణ,
వ్యక్తివివేకో విదధే రాజానకమహిమకే నాయమ్".

శ్యామలమహాకవిశిష్యు డని కూడా యీ శ్లోకాలవల్లనే తేలుతున్నది. యితని గ్రంథంలోని యీ క్రిందిభాగం తెనుగులోని వ్యావహారికభాషావాదంతో కొంత పోలుతుందేమో సహృదయులు చూడగోరుతున్నాను. ౧౦, ౧౧ శతాబ్దప్రాంతంలో గూడా గీర్వాణవాక్ప్రపంచంలో కూడా యిటువంటివాదం వొకటి లేవదీసిన వ్యక్తి వున్నాడనే దీనివల్ల తేలుతున్నది. ఇటువంటివే కొత్తకొత్త అభిప్రాయాలు ఈ పుస్తకంలో చాలా వున్నవి. ఇతను చాలాచోట్ల ప్రాచీనులకంటె మిక్కిలి విలక్షణమైన కొత్త తోవలను తొక్కాడు. ఈతని పాండిత్యం చూద్దామా-సాధారణమైనది కాదు. చాలా ఉద్దండమైన పాండిత్యం. తర్కశాస్త్రం సంపూర్ణంగా లోతుపాతులతో అభ్యసించినట్టు తోస్తున్నది. తక్కిన వ్యాకరణాది శాస్త్రాలుగూడా బాగా చదవినట్టే వున్నది. ఇదిగాక భాషలో చాలా గొప్ప, అపారమైన కృషి చేశాడని గూడా తోస్తున్నది.

'సాధుశబ్ద' మని లోకములో ప్రసిద్ధమైన శబ్దముండుగాక! అట్లయినను అసాధుశబ్దము గూడ సామగ్రివశమునఁ బ్రయోగించినవాని కిష్టమగు నర్థమును జెప్పుచునే యున్న దని యనుమానప్రమాణముచే నసాధుశబ్దమునకును వాచకత్వము నిశ్చయింపఁబడినది. కావునఁ "దగిన ప్రకరణాదిసామగ్రి యున్నచో శబ్ద మర్థమును చెప్పఁజాలును. లేనిచోఁ జెప్పఁజాలదు." అని నిశ్చయింతము. అదియే పెద్దలచే

"అసాధు రనుమానేన
వాచకః కైశ్చి దిష్యతే,
వాచకత్వావిశేషేఽపి
నియమః పుణ్యపాపయోః"

(అసాధుశబ్దమైనను అర్థమును చెప్పునని కొంతమంది యనుమానప్రమాణముచే నొప్పికొనిరి. అర్థమును బోధించుటలో విశేషము లేకున్నను అసాధుసాధుశబ్దములకు పుణ్యపాపములఁ గలిగించుటలో విశేషము కలదు.) అని చెప్పఁబడినది.

ఇంతమాత్రముతో, అనఁగా పుణ్యపాపముల నియమించుటలో విశేష మున్నంతమాత్రమున అసాధుశబ్దము నపశబ్దమని కల్పించుట యుక్తము గాదు. ఏలనన —

శబ్ద మనఁగా నేమి? శబ్ద్యతే (విమృశ్యతే = అభిధీయతే) అనేన అర్థః ఇతి శబ్దః అని కదా దాని వ్యుత్పత్తి? ఈ వ్యుత్పత్తివలన నేమి తేలుచున్నది? అర్థము చెప్పుటలో నిది (శబ్దము) సాధన మనికదా! శబ్దము సాధు వని, అసాధువని, అపశబ్ద మని మూఁడు తెఱఁగులు. ప్రకృతి యనియు, ప్రత్యయ మనియు విభాగము కల్పించెడి వ్యాకరణాదిలక్షణముచే ననుసరింపఁబడినది సాధువు. అట్టి లక్షణముచే ననుసరింపఁబడక 'డిత్థ' మ్మనగు శబ్దములవలె వ్యుత్పత్తి యేమియు లేనిది అసాధువు. అర్థము చెప్పుటనుండి తొలఁగినది అపశబ్దము. అనఁగా "అర్థము చెప్పుటకు సరియైన సామగ్రి లేక అర్థమును చెప్పనిది" అని అర్థము.

ఇట్లు విచారింపఁగా సరియైన సామగ్రి లేకపోవుటచే నొకప్పు డర్థము చెప్పనిచో సాధుశబ్దము గూడ నపశబ్దము కావచ్చునని తేలినది. అందువలన అర్థము చెప్పుట, చెప్పకపోవుటలను బట్టి శబ్దమనియు, నపశబ్దమనియు వ్యవహరించుట నేర్పఱచుటవలన నితిహాసములు, పురాణములు మున్నగువానియందును, ఆగమశాస్త్రము లోనగువానియందును నొకానొకచోట నసాధువులుగానున్న కొన్ని శబ్దముల నపశబ్దములని తలఁచువారిని నిరసించినట్లైనది. ఈ విషయమును సంగ్రహించి వ్రాసిన కారికలు:

"సామర్థ్యా దేవ శబ్దస్య విషయే ఽవగతే సతి,
న ప్రయోగో ఽస్య నహ్యేవ స్వనివృత్త్యై ప్రవర్తతే,
అత ఏవ ప్రకృత్యర్థమాత్రం తత్ర ప్రయుంజతే,
సంఖ్యాసాధనకాలాదే రనుగుణ్యానపేక్షిణః.

ఇయతా చాపశబ్దత్వం న తేషా ముపకల్పతే,
అర్థేషు శబ్దనాకర్మ కరణత్వానపాయతః. ”

నామతమున మాత్రము తగనిచోటం బ్రయోగింపఁబడిన శబ్దమే అపశబ్దము. ఎట్లన—

“మధుకరై రపవాదకరై రివ
స్మృతిభువః పథికా హరిణ్రవజాః,
కలతయా వచసః పరివాదినీ
స్వరజితా రజితా వశ మాయయుః.”

(లేళ్లకు నమ్మకము కలిగించుటకై వాద్యము చేయు కిరాతుల వాద్యముచేత లేళ్లు తమ్ము పట్టుకొనుట కేర్పఱచిన గుంటల స్వాధీనమైనట్లు, భార్యా నియోగముగల మార్గస్థులును వీణాగానమునుగూడ మించు తుమ్మెదల యవ్యక్తమధుర గానముచేత నాకర్షింపఁబడి మన్మథుని స్వాధీనమైరి.)

—మాఘుని శిశుపాలవధ మహాకావ్యమునుండి.

ఇచ్చట లేళ్లు ఉపమాన మగుటవలన నప్రధానములు. “ప్రధానాప్రధానయోః ప్రధానే కార్యసంప్రత్యయః” అని న్యాయ మున్నది. కాన లేళ్లు ఇచ్చట ప్రధానమైననే ‘రజితాః’ అని ప్రయోగింపవలెను. ఏలనన—

“రంజే ర్ణౌ మృగరమణే నలోపో వక్తవ్యః” అని కదా వార్తికము. ఈ వార్తిక మేమి బోధించుచున్నది? ‘లేళ్లను వేటాడుట’ అను నర్థము వాక్యమువలనఁ దోఁచుచున్నపుడు ‘రంజ్’ అను ధాతువునకు ణిచ్ పరముగానున్నప్పుడు నలోపము వచ్చును అని కదా! అట్లు నలోపము వచ్చినఁ గదా ‘రజితాః’ అని రూప మగును? ఇచట లేళ్లు ప్రధానములు గాక బాటసారులు ప్రధానమైనందున ‘రంజ్’ ధాతువునకు నలోపము వచ్చుటకు వీలులేదు. కావున నిచట ‘రంజితాః’ అనియే యుండవలయును. ఇచ్చట లేళ్లకున్న అప్రాధాన్యమును గణింపకయే మాఘుఁడు తగనిచోటఁ బ్రయోగించిన ‘రజితాః’ అనునది యపశబ్దము. ఏలనన — నిచట పాంథులు ఉపమేయము (వర్ణింపఁబడువారు) గాన వారే ప్రధానులు. కావున నా యుపమేయము యొక్క యర్థము ననుసరించియే శబ్దము ప్రయోగింపవలెను. కావున నిది యపశబ్దమే. ఈమతమును సంగ్రహించి వ్రాసిన శ్లోకములు :

“ అసాధు శ్చాపశబ్దశ్చ
ద్విధా శబ్దః ప్రకీర్తితః,
తత్రాసాధు రసాధ్యో యః
ప్రకృతి ప్రత్యయాదిభిః.
శబ్దా దపేతో ఽపశబ్దః
శబ్దనాకరణాత్మకః,
శబ్దనా హి పరామర్శో
వాచ్యార్థవిషయో ఽస్య యః.
ఏవం చాసాధు శబ్దో ఽపి
నాపశబ్దత్వ మర్హతి,
న సో ఽప్యభ్యేతి సాధుత్వం
తయో ర్విషయ భేదతః.”

“ అయ్యా! అట్లుపమేయములగు, పాంథుల కనుకూలముగా నలోపము చేయక ‘రంజితాః’ అని ప్రయోగించినచో లేళ్లకు ఈ విశేషణ మన్వయించు టెట్లు? వాని కన్వయింపవలె నన్న ‘రజితాః’ అని యుపయోగింపవలెను కదా!” అని ప్రశ్నింపవచ్చును. దానికి సమాధాన మేమన— ప్రధానము ననుసరించి ‘రంజితాః’ అనియే ప్రయోగించి, అప్రధానమైన లేళ్ల కన్వయించునప్పుడు శబ్దమును ‘రజితాః’ అని మార్చుకొని యర్థము చెప్పికొనునట్లు వ్యాఖ్యానించుకొనుట మంచిది గాని అట్లు ‘రజితాః’ అని ప్రయోగించుట మంచిది గాదు.

“స్మృతిభువో బత పాంథమృగవ్రజాః”—అనఁగా పాంథులే లేళ్లు అని లక్షణతోఁ జెప్పికొన్నఁ గాని, “స్మృతిభువః పథికా హరిణ్రవజాః” —అనఁగా బాటసారు లనే లేళ్లు అని వ్యస్తరూపకముగాఁ జెప్పికొనినఁ గాని యీ ప్రయోగము సరిపోవును. ఎందువలన నన—అప్పుడు లేళ్లకుఁ బ్రాధాన్యము వచ్చును. అట్లు ప్రయోగింపఁబడక తగనిచోటఁ బ్రయోగింపఁబడినది గావున అస్వగోణ్యాదిశబ్దములవలె నిదియు నపశబ్దమే. ఈ విషయమునకు సంగ్రహశ్లోకములు :

“శబ్దప్రయోగః కర్తవ్యః
ప్రధానార్థవ్యపేక్షయా,
తదన్యాపేక్షయా త్వర్థా
దేనం విపరిణామయేత్.

విపరీత మతో-యత్ స్యా
దపశబ్దః స మాం ప్రతి”


అస్వః, గోణీ యున్నగు శబ్దములు గూడ నిట్లే నని పెద్దలు నిశ్చయించినారు. చూడుఁడు:

“అస్వగోణ్యాదయః శబ్దాః
సాధవో విషయాంతరే,
నిమిత్తభేదాత్ సర్వత్ర
సాధుత్వం చ వ్యవస్థితం”

అస్వః, గోణీ మున్నగు శబ్దము లసాధువులని లోకములో నొక ప్రథ గలదు. కాని ఆ శబ్దములు విషయాంతరమున సాధువులే యగును. ఎట్లన—

‘అస్వః’ అనునది ‘గుఱ్ఱము’ అనునర్థమున సాధువు గాదుగాని ‘న స్వః అస్వః’ అను విగ్రహముచే ‘తాను కానివాఁడు’ అనునర్థమునను, “నాస్తి స్వం(ధనం) యస్య సః” అను విగ్రహముచే ‘ధనము లేనివాఁడు’ అని యర్థము చెప్పినపుడును నది సాధువే కదా! అట్లే ‘గోణీ’ అనుశబ్దము ‘ఆవు’ అనునర్థమున సాధువు కాదు గాని ‘అనేకవస్తువులను ధరించుపాత్ర’ అను నర్థమున నదియు సాధువే కదా! కావున నా శబ్దములకుఁ గల యితరార్థములలో నవియు సాధువులే. కావున నిట్లు అన్ని శబ్దములును అర్థభేదముచే సాధువులే యగు నని యీ పెద్దలు వ్రాసిన శ్లోకముల కర్థము.

కావున శబ్దము అసాధువైనంతమాత్రమున దాని నపశబ్ద మనుటకు వలనుపడదు. తగనిచోటఁ బ్రయోగింపఁబడిన శబ్దమే, సాధువైనను అసాధువైనను అపశబ్ద మని చెప్పఁదగును.



చెట్లు!

'శ్రీవాత్సవ'

చెట్లు సైతం మనకంటే
ఎన్నో రెట్లు నయంసుమా.
ఆహార, విహారాల్లో
ఆకార, వికారాల్లో
ఆచార, విచారాల్లో
ఆదర్శ, విమర్శల్లో
మనకంటే ఎన్నో రెట్లు నయం చెట్లు.

స్వతంత్రంగా శ్రమించడం,
స్వయంకృషికి ఫలించడం,
స్వతంత్రించి సుఖించడం
నయంకదూ చెట్టుబ్రదుకు!
మనకంటే ఎన్నో రెట్లు నయం చెట్లు.

ఉన్నతపథలక్ష్యసిద్ధి,
ఉన్నది తిను మెలగు శుద్ధి,
ఉన్నందుకు వినమ్రబుద్ధి,
కన్నపరంపరాసమృద్ధి
ఏదీ మనలో మచ్చుకు
ఏమైనా,
మనకంటేఎన్నో రెట్లు చెట్లునయం.

చెయ్యలేవు అపకారం,
చేతనైతే చెడిఅయినా
చెయ్యగలవు ఉపకారం,
పలుజీవుల బ్రతుకు తెరువు,
పదిమందికీ నీడగొడుగు.
చెట్లు!
చెట్లు మనకంటే ఎన్నో రెట్లు నయం.

వాసంతవిలాసంలో
హేమంతవినాశంలో
ఝంఝానిలహేలల్లో
గ్రీష్మానలకీలల్లో
సుమభావం శ్రమభావం
కష్టసుఖసమానుభవం
కనబరచిన కర్మఋషులు
చెట్లు, చెట్లుమనకంటే ఎన్నో రెట్లునయం.

మనమిచ్చే విషగాలికి
మన కిచ్చే మంచిగాలి,
ఫలపుష్ప సమృద్ధంగా
పరిచర్యలు, పరిమళాలు,
చందన తాంబూలాదులు
సమస్తమూ సమర్పించి
స్వార్థరహిత సేవ చేయు,
చెట్లంటే చెట్లా అవి...
నయంకదూ మనకంటే ఎన్నో రెట్లు.

కదలలేకపోతేనేం
కలియబడవు, కలహించవు
మాట లేకపోతేనేం
తిట్టుకోవు, కొట్టుకోవు
ప్రకృతిస్థితి కనుకృతిగా
పట్టి పలుకరించి చూడు,
పలుకగలవు, కులుకగలవు.
పాడగలవు, ఆడగలవు,
బ్రతుకుమోడు చివురులెత్త
బాధబరువు తరగిపోవ
పాలించును, లాలించును
పాడించును, ఆడించును
పరువుబరువు పంచుకొనును
పలుకరించి పలికించును.

ఏదీ మరి మనలో ఆ
చెట్లవంటి చెలిమికాళ్లు
ఏమైనా చెట్లుకూడ మనకంటె
ఎన్నో రెట్లు నయంసుమా!!

మహాత్ముని ఉద్యమము - బ్రిటిషు ప్రభుత్వపు బాధ్యత

= శ్రీ చావలి వెంకటహనుమంతరావు =

కాంగ్రెసు కార్యనిర్వాహక సంఘము వారు వార్ధాలో జూలై ప్రారంభమున వారమురోజులు తీవ్రచర్చ చేసి చివరకు ప్రస్తుత రాజకీయసమస్యను గురించి ఒక ముఖ్యతీర్మానమునకు వచ్చిరి. ఆ తీర్మానముయొక్క ప్రాముఖ్యమును నిరసించుట కెంతమాత్రమును వీలు లేదు. హిందూ దేశభావిభాగ్యోదయమున కది చాల ముఖ్యమైన దని చెప్పవలసియున్నది. ఆ తీర్మానముయొక్క ప్రధానోద్దేశ్యము బ్రిటిషు ప్రభుత్వమువారికి హిందూదేశసమస్యను పరిష్కరించుటకు చివరిఅవకాశము నిచ్చుట. దాని రెండవ ఉద్దేశ్యము అట్టి పరిష్కారమునకు బ్రిటిషుప్రభుత్వమువారు తయారుగానున్నచో హిందూదేశప్రజలకు జపాన్, జర్మనీసైన్యముల దాడినుండి తమ స్వదేశమును కాపాడుకొనుటలో మనఃపూర్తిగ పాల్గొనుట కవకాశ మేర్పడు నని తెలియజెప్పుట. దాని మూడవ ఉద్దేశ్యము పైవిధముగా బ్రిటిషుప్రభుత్వము హిందూదేశసమస్యను పరిష్కరించుటకు తయారుగా లేనిచో కాంగ్రెసుసభ గాంధిమహాత్ముని నాయకత్వముక్రింద అహింసాయుత సహాయనిరాకరణమును మొదలుపెట్టుటకు వెనుదీయ దని. బ్రిటిషుప్రభుత్వమువారు తమ విధానమును ఆలోచించుకొనుటకును, కాంగ్రెసువారి కోరిక నెంతవరకు నెరవేర్చగలరో నిశ్చయించుకొనుటకును మూడు వారములు గడువీయబడినది. అటుతరువాత అఖిలభారత కాంగ్రెసుసంఘము బొంబాయిలో సమావేశమయి ఏమి చేయవలెనో నిశ్చయించును. ఆసంఘము కార్యనిర్వాహకసంఘమువారి తీర్మానమును బలపరచి గాంధిమహాత్మునికి అతని ఉద్యమమును మొదలుపెట్టుటకు దోహదము నిచ్చును.

* * *

అఖిల భారత కాంగ్రెసు సంఘమునకు కార్యనిర్వాహకసంఘమువారి తీర్మానమును మార్చుటకుకాని, త్రోసిపుచ్చుటకుకాని అధికారము కలదు. కాని, అట్టిపని ఆసంఘము చేయునని తలచుట కెట్టి అవకాశములును లేవు. ఇదివరలో అట్టి దెప్పుడును సాధారణముగా జరిగియుండలేదు; ఇప్పుడు జరుగునని చెప్పుటకును వీలులేదు. ఈ విషయమును

గురించి అనుమాన ముండనక్కరలేదు. రెండవ సంగతి: గాంధిమహాత్ముని అతని నిశ్చయమునుండి ప్రస్తుతము మరలించుట చాల కష్టమని గ్రహింపవలసియున్నది. "ఇది నా చివరి ఉద్యమము. బ్రిటిషు ప్రభుత్వాధికారముతో ఇది నా చివరి పోరాటము. ఈ ఉద్యమము నడుపుటలో ప్రాణములను కూడ వదలుటకు నేను సిద్ధముగా నున్నా" నని గాంధిగారు అనేకసార్లు స్పష్టీకరించి యున్నారు. జైలులోనికి పోవుట, జైళ్లను నింపుట తన ఉద్యమమునకు ప్రధానోద్దేశ్యము కాని, దానియొక్క ప్రధానవిషయము కాని కాదని కూడ ఆయన తెలిపి యున్నాడు. ఎంత త్వరగా వీలగునో అంత త్వరగా ఈసారి పోరాటము జరుపుట తన అభిప్రాయ మని ఆయన ఒక స్టేటుమెంటులో చెప్పియున్నాడు. అదియు కాక ఈసారి సత్యాగ్రహోద్యమమునందు కొంతమంది మాత్రమే పాల్గొనుటతో సరి పోదు. ఒక విప్లవముగా దానిని పరిగణింప వలసియుండు నని మహాత్ముడు స్పష్టపరచి యున్నాడు. ఈ సందర్భములలో కాంగ్రెసు సంఘమువారి ఆమోదన ఆతనికి చేయూత నిచ్చుటలో తోడ్పడునప్పటికిని, ఆ సంఘము యొక్క నిశ్చయముపైమాత్రము ఉద్యమమును మొదలుపెట్టుట యూ, పెట్టకపోవుటయూ యను విషయ మాధారపడి యుండ దని తలంపవచ్చును.

* * *

"మీరు హిందూదేశమును వదలిపొండు" అనునది గాంధిమహాత్ముని నూతనోద్యమమునకు దోహదమునిచ్చు కేక. దాని అర్థ మేమి అను ప్రశ్నకు మహాత్ముడు ఇదివరలో చాల సార్లు జవాబు ఇచ్చియున్నాడు. అదేమనగా, హిందూదేశమునుండి బ్రిటిషు అధికారము తొలగవలెననియే కాని, ప్రతి ఆంగ్లేయుడును, ఆంగ్లసైన్యమును దేశమును వదలిపోవలెనని కాదని. జపానీయుల దండయాత్ర నరికట్టుట కవసరమగుచో విదేశసైన్యము ఇక్కడ ఉండుటకు ఆయన కెట్టి అభ్యంతరమును లేదు. కాని ఆ సైన్యము స్వతంత్రహిందూదేశపు అంగీకారముతో మాత్ర ముండవలెనను షరతు నాయన పెట్టియున్నాడు. ఈవిధముగా అర్థము చెప్పిన తరువాత 'హిందూదేశమును వదలిపొండు' అను కేక ఎవరికికాని భయము కలిగించవలెనో తెలుసుకొనుట కష్టము. బ్రిటిషు అధికారము దేశమునుండి తొలగి, దానికి బదులు హిందువుల అధికారము స్థాపింపబడవలె నను విషయమును గురించి ఈ దేశస్థు లందరును ఏకాభిప్రాయులై యున్నారు. పక్ష, మత, కక్షవిభేదములు లేకుండ హిందూదేశ స్వాతంత్ర్యమును మన మందరమును కోరుచున్నాము. కాని గాంధిమహాత్ముని ప్రధానషరతును (అనగా బ్రిటిషుఅధికారము తొలగవలె నను షరతును) గురించియు, హిందూదేశము వెంటనే స్వతంత్రదేశముగ పరిగణింపబడవలె నను షరతునుగురించియు మనలో మన కెట్టి భేదములును లేవు. ముస్లిమ్‌లీగు సంస్థకూడ బ్రిటిషు

అధికారము అంత మొండవలెననియే కోరుచున్నది. ఇది చాల ముఖ్యమైనట్టియు, ప్రధానమైనట్టియు విషయము. దీనిని బ్రిటిషు ప్రభుత్వమువారు గ్రహించుట అవసరము. మహాత్ముని ఉద్యమసంధర్భములో ఏవిధముగా ప్రవర్తించవలె ననువిషయము నిర్ధారణ చేయునప్పుడు ఈవిషయమును ప్రభుత్వము వారు మనస్సునం దుంచుకొనుట చాల అవసరము. ప్రస్తుతసందర్భములలో, బ్రిటిషువారును, హైందవులునుకూడ యుద్ధమందు నిమగ్నులైయున్నప్పుడు బ్రిటిష అధికారము స్వదేశీయుల కెంతవరకు మార్చుటకు వీలగునను విషయమునుగురించి ఆలోచనకు అవకాశ ముండవచ్చును. కాంగ్రెసుఅధ్యక్షుడగు మౌలానాఅజాద్‌గారు అట్టి అవకాశ మున్నదని స్పష్టముగ చెప్పియున్నారు. కాని హిందూదేశము స్వతంత్ర దేశముగ పరిగణింపబడుచున్నది అను విషయమును గురించి ఆలోచనలకు కాని, రాయబారములకు కాని ఎంతమాత్రమును తావు లేదు. ఆ సిద్ధాంతమును వెంటనే బ్రిటిషువా రంగీకరించవలసియున్నది.

బ్రిటిషుపత్రికల వ్యాఖ్యలనుబట్టి గమనించినయెడల, బ్రిటనునందు గాంధిమహాత్మునియొక్క కాని, కాంగ్రెసుయొక్క కాని, హిందూదేశస్థులయొక్క కాని ఆశయములను గురించియు, అభిప్రాయములనుగురించియు, ఎంతమాత్రమును సానుభూతి యున్నట్లు కనిపించదు. ప్రస్తుతతీవ్రపరిస్థితులలో విప్లవరూపమగు సత్యాగ్రహోద్యమమును (దాని పరిణామ మెట్లుండునో గ్రహించుట కెవ్వరికిని అవకాశములేదు) మొదలుపెట్టుట సమంజసమా, అసమంజసమా యను అనుమానమునకు కొంత తావు కలదు. కాని బ్రిటిషుగవర్నమెంటువారు ఈ రెండుసంవత్సరములకును పైగా హిందూదేశసమస్యవైపు చూపుచున్న వైరుద్ధ్యభావము, విముఖత్వము, గాంధిమహాత్ముని ఉద్యమమునకు ముఖ్యకారణములని వారు జ్ఞాపకముంచుకొవలసియున్నది. హిందూదేశపు సరిహద్దులవరకు యుద్ధము వచ్చినది. ఎప్పుడు ఈదేశముపైజపానీయులు దాడిసాగింతురో గ్రహింప వీలులేదు. హిందూదేశపు రక్షణకై బ్రిటిషువారు, అమెరికనుదేశస్థులు, హైందవులు అందరును కలసి మెలసి తీవ్రప్రయత్నములు చేయుట కవసర మెంతేని కలదు. ఇట్టి క్లిష్టపరిస్థితులలో హిందూదేశపు రాజకీయాశయములను తృణీకరించి వాటిని నిరాకరించుట వలన బ్రిటిషుప్రభుత్వమువారు అనాలోచితముగ ప్రవర్తించుచున్నారు. దేశమందన్ని పక్షములవారును త్రోసిపుచ్చిన క్రిప్సు ప్రణాళికనే వారు తమ రాజకీయవేదముగా పఠించుట విచారకరము. బ్రిటిషువారికిగాని, వారి స్నేహితులకు గాని యుద్ధమం దెట్టి నష్టము వచ్చునట్లు చూచుటకాని, జపాను, జర్మనీదేశముల కెట్టి లాభము కలుగునట్లు చూచుటకాని హిందూదేశీయుల కెవ్వరికిని ఇష్ట ముండదు; ఇష్టము లేదనియే ఘంటాపథముగా చెప్పవచ్చును. కాని తమ స్వదేశమోక్షమునకై వారు పాటుపడుట, దానికి

సర్వప్రయత్నములును చేయుట - ఇవి తప్పని ఎవ్వ రనగలరు ?

* * *

ఇప్పుడైనను బ్రిటిషు ప్రభుత్వము వారును, ఇండియా ప్రభుత్వమువారును గాంధిమహాత్ముని ఉద్యమమును అణగద్రొక్కుటకును, అది మొదలుపెట్టబడకుండ ప్రయత్నము చేయుటకును ఉద్దేశింపక హిందూదేశస్థుల రాజకీయాశయముల నెట్లు సఫలపరుచుటా యను విషయమై తీవ్రాలోచన చేసినచో అందరకును లాభదాయకముగా నుండును. ఈ సందర్భములో ముఖ్యమగు విషయము ఈ దేశ స్వాతంత్ర్యమును స్పష్టముగా ప్రకటించుట. అట్లు ప్రకటించిన తరువాత వివిధ పార్టీల ప్రతినిధులు. సభ్యులుగా కల కేంద్ర ప్రభుత్వమును (దాని నేపేరుతోనైనను పిలువవచ్చును) ఏర్పాటు చేయబడుటకు ప్రయత్నము చేయవలసియుండును. పైన సూచింపబడినట్టి ప్రకటన చేయబడిన యెడల కాంగ్రెసు, ముస్లిమ్‌లీగు, హిందూ మహాసభ మొదలగు ముఖ్య రాజకీయ పక్షము లన్నియు దాని నామోదించి కేంద్ర ప్రభుత్వమునందు తప్పక పాల్గొనుట కిచ్చగించు నని తలంపవచ్చును. వివిధ రాజకీయ పక్షములమధ్య సంయోగము కుదరనిదే తాము చేయవలసినది గాని, చేయగలిగినది కాని ఏమియు లేదని బ్రిటిషు ప్రభుత్వము ఒకసారు చెప్పవచ్చును. కాని హిందూదేశస్వాతంత్ర్యము నంగీకరించుచు ప్రకటన చేయబడినచో దానివల్ల విశదమగున దేమన, బ్రిటిషువారు హిందూదేశ రాజ్యాంగవిధానమును స్వదేశీయుల చేతులలోని కిచ్చుట కంగీకరించుచున్నారని. అట్టి అంగీకారము స్పష్టముగా కనిపించినవెంటనే హిందూదేశమందలి వివిధపక్షములవారును తమలో తాము ఒడంబడికకు వచ్చెదరని ఆశించవచ్చును. అట్లుకాక ముస్లిమ్‌లీగువంటి కొన్ని పక్షములు అట్టి ఒడంబడికకు విముఖులైయుందు రనియే ఆలోచింతము. అట్టి పరిస్థితులలో ఆ సహాయనిరాకరణము చేయు పక్షములను వదలి ఇతరపక్షముల ప్రతినిధులతోడనే కేంద్రప్రభుత్వమును ఏర్పాటుచేయవలసియుండును. వారి సహాయనిరాకరణము వలన ఎట్టిలాభమును లేదని. ఆపక్షస్థులు గ్రహించినవెంటనే వారుకూడ తమ విధానములను మార్చుకొనకతప్పదు. కాని ప్రప్రథమమున అవసరమగునది హిందూదేశపు స్వాతంత్ర్యమును పరిగణించుచు ప్రకటన చేయుట.

పైన సూచించినట్టి పరిష్కారమునకు బ్రిటిషుప్రభుత్వమువా రంగీకరించునట్లు చేయుటలో కేంద్రప్రభుత్వ కార్యనిర్వాహక వర్గసభ్యులు, ముఖ్యముగ అందలి హైందవ సభ్యులు ప్రయత్నించవలసియున్నది. ఇది వారి ప్రధానబాధ్యతలలో ఒకటియని వారు గ్రహించుట చాల అవసరము. వారిలో కొంతమంది కాంగ్రెసుతో ఎట్టి రాజీకిని అనుకూలురుగా నుండరని తలంపవచ్చును. కాంగ్రెసును అణగద్రొక్కుటకే వారు. ప్రయత్నము చేయుదురు. కాని అధికసంఖ్యాకులగు అనధికారసభ్యులు ఈవిషయమై పట్టుపట్టి ప్రయ

త్నించినచో బ్రిటిషు ప్రభుత్వము వారు చాల వరకు లొంగి వచ్చెద రని తలంపవచ్చును. కాంగ్రెసు సహాయనిరాకరణోద్యమమును మొదలుపెట్టుటను వారు ఖండింపవచ్చును. దానికి వ్యతిరేకముగ ప్రచారముకూడ చేయవచ్చును. కొంతమంది సభ్యు లప్పుడే అట్టి ప్రచారమును మొదలుపెట్టినట్లు సూచనలు కనిపించుచున్నవి. కాని తమ దేశస్వాతంత్ర్యముపరిగణింపబడవలెనని గట్టిగ కోరుటకు వారు వెనుదీయుట కిచ్చగించరని ఆశకలదు. అట్లు వెనుదీసినచో దేశమునకును, ప్రజాబాహుళ్యమునకును వారు తీరనిఅపకారము చేసినవా రగుదురు. అదియుకాక ప్రభుత్వము వారు గాంధిమహాత్ముని ఉద్యమమును అణచుటకే నిశ్చయించినచో, వా రానిశ్చయమునకు దోహద మిచ్చి రను అపవాదు తప్పక వారిపై బడును. హైందవసభ్యు లట్టి అపవాదు సహించుట కిష్టపడుదురా ? లేక తమకున్న అవకాశములను, అధికారమును ఉపయోగించి హిందూదేశసమస్య సరియగు పద్ధతులపై పరిష్కరింపబడుటకు తగు ప్రయత్నము చేసెదరా ? ఇది ముఖ్యమగు ప్రశ్న.

[23-7-42]



నిరాశ

శ్రీ శివరామం

త్వరగ రావోయి నా ప్రియా! తరుగునేమొ,
వాడునేమొ, అందము నన్ను వీడునేమొ;
నీకొరకె, వెల్గు లిచ్చు నీ రాకకొరకె,
ఒంటిగా చీకటుల వేచియుంటి నోయి!

దినదినము జారు నా చక్కదనము చూచి
నేనె నాలోన కుములుచున్నాను గాని;
రాతిగుండె కాలము వెండిపూత పూయు
నా కురుల కింక తడయంగబోకు నాథ!

ముసలిదైన ఒక్క గులాబిపూవు నిండు
వలపుతో తేటివిటు నిట్లు పలుకరించె:
"రాలిపోవునో నా రేకు, లేల జాల
మోయి! తుదికౌగిలింత లీవోయి దేవ!"

వేడుకొను గులాబీమాట విననెలేదు,
పడుచుపూలకై పరువెత్తె నుడుకు తేటి;
ఒకటొకటిగాగ తన రేకు లూడిరాగ
నేలపాలయ్యె ఆ గులాబీలముసలి.

ఈ బ్రతుకుకూడ అటులాయెనేమొ సామి!
నీవు నను జేరరాకున్న, నీయెలుంగు
వినబడకయున్న, నీకంటికొన వెలుంగు
కనబడకయున్న, నే నింక మనగలేను.

ఎక్సు కిరణాలు

శ్రీ దువ్వూరి
= అనంత అచ్యుతసత్యనారాయణరావు =

ఎక్సురేలు (X Rays), లేక ఎక్సుకిరణములు అన్న మాట ఈరోజులలో పట్నాలంట ప్రతివాడికీ తెలిసినదే. డాక్టరు రోగిని ఎక్సురేఫోటో తీయించుకోవాలసి ఉంటుంది అంటాడు తరుచు. క్షయజబ్బువాళ్లకు ఊపిరితిత్తుల ఫోటో తీస్తారు ఎక్సురేలతో. దానివలన వాటి స్థితి ఎలా ఉందో తెలుస్తుంది. లేకపోతే ఏ చెయ్యో విరిగినవాడికి ఎక్సురేఫోటో తీస్తారు. ఎముక ఎక్కడ ఎలా విరిగిందో అంతా అగుపడుతుంది ఆ ఫోటోలో.

మామూలు ఫోటోకూ, ఎక్సురేఫోటోకూ భేదం ఏమిటి ? మనిషి యొక్క పై ఉపరితలాన్ని చిత్రిస్తుంది మామూలుఫోటో. అంటే - కాంతి ఏభాగంమీద పడగలదో ఆభాగాన్ని చిత్రించగలదు. అంతేగాని మనిషి ఫోటో తీసినప్పుడు అతని శరీరంలోని హృదయం, ఊపిరితిత్తులు మొదలయినవి ఫోటోలో అగుపడవు. కారణం ఏమిటంటే-కాంతి అతడి చర్మంగుండా లోపలికి వెళ్లలేదు. ఎక్సుకిరణాలతో మనిషిచర్మంక్రింద నున్న భాగాలకు ఫోటో తీయవచ్చును. ఇది ఎలా వీలగుతూందో ఆలోచిద్దాము.

ఎక్సుకిరణాల చొరవశక్తి

మామూలుకాంతి గాజు, నీరు మొదలయిన కొన్ని పదార్థాలద్వారా పోగలదు. వీటిని పారదర్శక పదార్థా (Transparent substances) లంటారు. కఱ్ఱ, ఇనుము, లోహాలు మొదలయిన చాలా పదార్థాలగుండా పోలేదు. వీటిని కాంతినిరోధకపదార్థా (Opaque substances) లంటారు. ఎక్సుకిరణాలకు ఒక విచిత్రమైన గుణం ఉంది. మామూలుకాంతి వెళ్లలేని పదార్థాలగుండా, అంటే కాంతినిరోధకపదార్థాలగుండా ఇవి పోగలవు. చర్మంగుండా మామూలుకాంతి వెళ్లలేదు. కాని ఎక్సుకిరణాలు పోతాయి. అలాగే కొద్దిగా దళసరి కలిగిన ఇనుపరేకుగుండా ప్రయాణం చేసి బయటపడగలవు. వీటిలో వేర్వేరు చొరవశక్తులు (Penetrating power) కల కిరణా లుంటాయి. కొన్ని కొద్దిదళసరిరేకులోనుండే వెళ్లగలవు. దళసరి హెచ్చయితే ఆడ్డివేయబడతాయి. కొన్ని హెచ్చుదళసరిరేకులోనుండికూడా పోగలవు. కొన్ని చర్మంగుండా, ఎముకలగుండా వెళ్లగలవు. కొన్ని చర్మంగుండామాత్రమే పోయి, ఎముకలలోనుంచి పోలేవు. చర్మంగుండా పోయి ఎముకలలోనుండి పోలేని ఎక్సుకిరణాలను మనిషి ఏభాగందగ్గర ఎముకకు ఫోటో తియ్యాలో ఆభాగంమీదకు పంపినట్లయితే ఏమవుతుంది ? కిరణాలు చర్మంగుండా పోయి, ఎముకను అగుపడచేస్తాయి. కాని ఎముకగుండా పోలేవు. కనుక అప్పుడుగానే ఫోటో తీస్తే, ఆఎముకఫోటో వస్తుంది. చర్మంలోపున ఉన్న భాగాలకు ఇలాగ ఫోటోలు తియ్యవచ్చును. ఇలాంటి ఎక్సుకిరణాలనే ఒక మనీపర్సుమీదకు పంపే మనుకోండి. తోలుగుండా కిరణాలు వెళ్లిపోతాయి. కాని లోపలి డబ్బులగుండా వెళ్లలేవు. కనుక ఏమవుతుంది? ఆడబ్బులు మన కగపడిపోతాయి. ఎంత విచిత్రం! మనీపర్సు విప్పనక్కరలేకుండానే, పర్సులో ఎన్ని డబ్బు లున్నాయో చెప్పివేయ్యవచ్చును.

ఎక్సుకిరణాలను కనుగొనుట

మామూలుకాంతి వెళ్లలేని కొన్ని పదార్థాలగుండా ఎక్సుకిరణాలు వెళతాయనీ, అందుచేత వాటి సాయంతో చర్మం క్రింద నున్న భాగాలకుకూడా ఫోటోలు తీయవచ్చునని తెలిసికొన్నాము. అయితే

ఎక్సుకిరణాల ప్రకృతి (Nature) ఏమిటో ఆలోచించలేదు ఇప్పటివరకూ. వాటిని మొట్టమొదట రాన్ట్‌జన్ (Rontgen) అనే ఒక శాస్త్రజ్ఞుడు కనిపెట్టేడు. ఒక గాజుగొట్టంలో గాలిని చాలావరకు తీసివేసి, మిగిలిన కొద్ది గాలిలోనుంచి విద్యుత్తు (Electricity) ను పంపుతూ, కొన్ని ప్రయోగాలు (Experiments) చేసికొంటున్నాడు. బేరియంప్లాటినోసైనైడ్ (Barium Platino-cyanide) అనే పదార్థంతో పూతపూయబడిన తెర ఒకటి ఆ గొట్టందగ్గర ఉంది పొరపాటున. ఇతడు ప్రయోగాలు చేస్తూఉండగా, ఆ తెర ప్రకాశించడం మొదలుపెట్టింది. కొత్త కిరణాలు ఏవో ఆ గాజుగొట్టంలోనుండి వచ్చి తెరను ప్రకాశింప చేస్తున్నాయని గ్రహించేడు. గొట్టానికీ, తెరకూ మధ్యగా కఱ్ఱదిమ్మ అడ్డుపెట్టేడు. కొద్దిగా తీక్ష్ణత (Intensity) తగ్గింది కాని తెర ప్రకాశించడం మానలేదు. ఆ కిరణాలకు కఱ్ఱలోనుండి చొరుచుకొని పోయే శక్తికూడా ఉందన్నమాట. ఆ గాజుగొట్టందగ్గర నల్లకాగితంలో చుట్టబడిన ఫోటోగ్రాఫుప్లేటు పాడయింది. దానికి కారణం ఆ కిరణాలే. ఈ లాగున ౧౮౯౫-వ సంవత్సరములో అటువంటి గాజుగొట్టంనుండి కొత్త కిరణాలు వస్తున్నాయనీ, అవి కాంతినిరోధక పదార్థాలగుండాకూడా ప్రయాణం చేయగలుగుతున్నాయనీ రాన్ట్‌జన్ కనిపెట్టేడు. కాని అప్పుడు అతడికి వాటి నిజప్రకృతి ఏమిటో తెలియలేదు కనుక వాటిని ఎక్సుకిరణాలన్నాడు. ఎక్సు, వై (X, Y) అనే అక్షరాలను మనకు తెలియనివాటికి సంకేతకములుగా ఉపయోగిస్తూ ఉంటాము. అలాగే ఈ కిరణాలు ఏమిటో అప్పుడు తెలియనివి కనుక ఇవి ఎక్సుకిరణాలనబడ్డాయి. ఆ తరువాత తరువాత వీటి గుణాలు, ప్రకృతి అన్నీ పూర్తిగా తెలిసేయి.

ప్రకృతి

ఎక్సుకిరణాల ప్రకృతి తెలుసుకొందుకు ముందుగా మనము కాంతియొక్క ప్రకృతిని తెలుసుకోవాలి. కాంతికిరణం అంటే అలలమూలంగా సెకండుకు ౧,౮౬,౦౦౦ మైళ్ల వేగంతో ప్రయాణంచేస్తున్న ఒక ప్రకంపనం (Vibration). ప్రకంపనం అంటే ఊయలచలనంవంటి కదలిక. ఇలాగ కాంతి అలలమూలంగా వ్యాపిస్తున్నప్పుడు, ఆ అల ఒక ప్రత్యేకపు కొలత కలిగిఉంటుంది. అంతేకాని ఎంత పడితే అంత ఉండలేదు. అందుచేత ఆ పరిమాణాన్ని 'అలపొడవు' అందాము. దానినే ఇంగ్లీషున Wave-length అంటారు. అయితే కాంతిలో అనేక రంగులకాంతి ఉంది. ఊదా, నేరేడుపండురంగు, ఆకుపచ్చ, నీలి, పసుపుపచ్చ, నారింజపండురంగు, ఎఱుపు ఇవి మనకు ముఖ్యంగా తెలిసిన రంగులు. వీటిలో ప్రతి రెండింటికీ మధ్య, ఆ రెండింటి మిశ్రమంవల్ల వచ్చిన అనేక రంగులు ఉంటాయి. కాంతియొక్క అలపొడవుకూ, రంగుకూ సంబంధ ముంది. అలపొడవు క్రమేపీ హెచ్చుతున్నప్పుడు రంగు ఊదానుండి ఎఱుపులోనికి క్రమేపీ మారుతుంది. అలపొడవుతో రంగేకాక శక్తికూడా మారుతుంది. అలపొడవు హెచ్చుతున్నప్పుడు శక్తి తగ్గుతుంది క్రమేపీ. అనగా ఊదారంగుకాంతికి ఎఱుపురంగుకాంతికన్న శక్తి హెచ్చన్నమాట. కనుక వేర్వేరురంగుల కాంతు లనగా వేర్వేరు అలపొడవులు, లేక వేర్వేరు శక్తులు గల కాంతు లని ఇప్పుడు మనకు తెలిసినది.


ఎక్సుకిరణాలుకూడా కాంతికిరణాలవంటివే. అలలరూపంగా సెకండుకు ౧,౮౬,౦౦౦ మైళ్ల వేగంతో ప్రయాణంచేస్తున్న ప్రకంపనే ఎక్సుకిరణముకూడా. అయితే వీని అలపొడవు మామూలు కాంతి అలపొడవుకన్న చాలాతక్కువ. ఈ అలపొడవులు చాలా చిన్నవిగా ఉంటాయికనుక వీటిని సెంటిమీటర్లలోను, మీటర్లలోను వ్రాయడం అలవాటుకాదు. సెంటిమీటర్లో పదికోటియవ భాగాన్ని ఒక ఆంగ్‌స్ట్రామ్ యూనిట్ (Angstrom Unit) అంటారు. ఊదా రంగుకాంతి అలపొడవు దరిదాపు ౪౦౦౦ ఆ.యూ., ఎఱుపురంగు కాంతియొక్క అలపొడవు దరిదాపు ౭౦౦౦ ఆ.యూ. ఉంటుంది. ౪౦౦౦-౭౦౦౦ ఆ.యూ. మధ్యగా అలపొడవు గల కిరణాలే మన కంటికగపడతాయి. కనుక ఇవే మామూలు కాంతికిరణాలు. వీటిని దృగ్గోచరకిరణా లనవచ్చును. ౪౦౦౦ ఆ.యూ.కు తక్కువ అలపొడవు కల కిరణాలను, అతినీలలోహిత

కిరణాలు (Ultra-violet rays)అంటారు. ఇవి కంటికి కగపడవు కాని కళ్లను ఉడుకులెత్తిస్తాయి వాటిమీద పడితే. వీనిలో కొన్ని కిరణాలు శరీరంలో కాల్షియం చేరుస్తాయి. అందుచేత వాటిని వైద్యంలో ఉపయోగిస్తారు. ఈ అతినీలలోహితకిరణాల అలపొడవులు ౮౦౦౦-౧౦౦ ఆ.యూ. మధ్యగా ఉంటాయి. ౧౦౦ ఆ.యూ.కంటె తక్కువ అలపొడవు గల కిరణాలే ఎక్సుకిరణాలు. ఇవికూడా కంటికి కగపడవు. అలపొడవు తగ్గినకొలది శక్తి హెచ్చవుతుందని ఇదివరకే చెప్పేను. ఈ ఎక్సుకిరణాల అలపొడవు ఇంత తక్కువగా ఉండంటే, వీటికి ఎంతో ఎక్కువశక్తి ఉందన్నమాట. కనుక ఎక్సుకిరణాలంటే ఎక్కువ శక్తివంతమైనటువంటివియు, కంటికిమాత్రము అగుపడనివియు అగు మామూలుకాంతికిరణములవంటి కిరణములే. ఈ ఎక్సుకిరణాల అలపొడవు ౧౦౦ ఆ.యూ. మొదలు ౦. ఆ.యూ.వరకు మారుచుండవచ్చును. ఇలా అలపొడవు తగ్గుతూందంటే వాటి శక్తి హెచ్చుతూందన్నమాట. అంటే అవి కాంతినిరోధకపదార్థాలలో చొరుచుకుపోయే శక్తికూడా హెచ్చవుతూంది. ఎక్కువ అలపొడవు, తక్కువ చొరవశక్తి గల కిరణాలను మెత్తని కిరణాలనీ (Soft rays),తక్కువ అలపొడవు, హెచ్చు చొరవశక్తి గల కిరణాలను కఠినకిరణాలనీ (Hard rays) అంటారు.

తయారుచేయు విధము

మామూలుగా గాలిలోనుండి విద్యుత్తు ప్రవహింపలేదు. ఒక గాజుగొట్టం రెండు చివరలను రెండు విద్యున్మార్గములు (Electrodes) అమర్చి, గొట్టంలోనున్న గాలిని చాలవరకు తీసివేసి, చివరలను మూసివేయవలెను.

అప్పుడు ఆ రెండు విద్యున్మార్గాలను కొన్ని వేల వోల్టుల విద్యుత్తును తగిలించినట్లయితే, గొట్టంలో ఉన్న కొద్ది గాలి విద్యుద్వాహక మౌతుంది. అంటే విద్యుత్తు ప్రవహించడానికి అనుకూల మౌతుంది. కనుక ఆ రెండు విద్యున్మార్గాల మధ్య విద్యుత్ప్రవాహం (Electric current) ఉంటుంది. విద్యుత్తు ఏచివరినుండి ప్రవేశించినదో దానికి ధనవిద్యున్మార్గము (Anode) అంటారు. రెండో చివరను ఋణ విద్యున్మార్గము (Cathode) అంటారు. ఇలాగ విద్యుత్ప్రవాహం రెండింటి మధ్యా ఉన్నప్పుడు, ఈ ఋణ విద్యున్మార్గంనుండి ఎలక్ట్రానులు (Electron)లనే ఋణ విద్యుదావేశకణాలు (Negatively charged particles) విడుదల అయి ఎక్కువ వేగంతో తిన్నగా ప్రయాణం చేసి ఆ ధన విద్యున్మార్గాన్ని ఢీకొంటాయి. ఆలా ఢీకొన్నప్పుడు ఆ ధన విద్యున్మార్గంనుండి అన్ని దిక్కులా కంటితో చూడబడని కిరణాలు ప్రసరిస్తాయి. అవే ఎక్సు కిరణాలు. అంటే ఎలక్ట్రానులు ధన విద్యున్మార్గంలోని పదార్థంతో ఢీకొన్నప్పుడు ఎక్సుకిరణాలు పుట్టే యన్నమాట. సాధారణంగా ధన విద్యున్మార్గంప్రక్కన ఇంకొక సహాయ ధన విద్యున్మార్గం (Anti-cathode) ఉంచుతారు. ఈ సహాయ ధన విద్యున్మార్గం ఋణవిద్యున్మార్గానికి ఎదురుగా ఉంటుంది. అసలు ధనవిద్యున్మార్గం కొద్దిగా ప్రక్కగా ఉంటుంద (పటము చూడుడు). అందుచేత విద్యు



ఎక్సురే గొట్టం

ఋ—ఋణవిద్యున్మార్గం ధ—ధనవిద్యున్మార్గం స—సహాయధనవిద్యున్మార్గం

త్తును పంపినపుడు ఎలక్ట్రానులు ఋణ విద్యున్మార్గంనుండి బయలుదేరి ఈ సహాయధన విద్యున్మార్గంతో ఢీకొంటాయి. అప్పుడు ఎక్సుకిరణా లుద్భవిస్తాయి. అయితే ఈ రెండు విద్యున్మార్గాలకు మధ్య చాలా యెక్కువ వోల్టుల విద్యుత్తును పంపాలి. ఆసుపత్రులలో ఉపయోగమునకై ఎక్సు కిరణాలను తయారుచేయడానికి ౬. లక్షల వోల్టుల విద్యుత్తును కూడా ఉపయోగిస్తారు. మనము ఉపయోగించిన విద్యుత్తు ఒత్తిడి

ఎక్కువవుతున్న కొలది తయారయిన ఎక్సుకిరణాల చొరవశక్తి, లేక గట్టితనముకూడా ఎక్కువవుతుంది. అంటే అలపొడవు తగ్గుతుంది. కనుక విద్యుత్తుయొక్క వోల్టులను అనుగుణ్యంగా మార్చుకొనుటవలన మనకు కావలసిన అలపొడవు గల ఎక్సుకిరణాలను తయారు చేయవచ్చును.

ధర్మములు *

ఎక్సుకిరణాల ధర్మాలను (Properties) గూర్చి ఆలోచిద్దాము ఇంక. ఈ ఎక్సుకిరణాలు కంటికి కగపడవు కాని మామూలుకాంతికిరణాలవలెనే ఫోటోగ్రాఫు ప్లేటుమీద ఫలితాలు కలుగచేస్తాయి. అందుచేతనే ఎక్సురే ఫోటోలు తియ్యడానికి వీలవుతూంది. ఇవి బేరియం ప్లాటినో సైనైడు అనే పదార్థంమీద పడినపుడు దానిని ప్రకాశింపచేస్తాయి. ఎక్సుకిరణాలు వస్తున్నదీ లేనిదీ తెలిసికోడానికి ఈ విషయాన్ని ఉపయోగిస్తారు. మామూలు కాంతిని అడ్డివేసే పదార్థాలగుండా ఇవి పోగలవు. ఎంత దళసరి గల కాంతినిరోధక పదార్థంగుండా పోగల వన్న విషయం ఆ ఎక్సుకిరణాల అలపొడవునుబట్టి ఉంటుంది. ఇవి వాయువులో నుంచి వెళ్లుతున్నప్పుడు, ఆ వాయువుయొక్క అణువులను (Molecules) విద్యుదావేశములను అయనులు (Ions)గా మారుస్తాయి. అందువలన ఆ వాయువు విద్యుద్వాహక మౌతుంది. ఈధర్మం ఎక్సుకిరణాల తీక్ష్ణతను (Intensity) కనుక్కోడానికి ఉపయోగించబడుతూంది.

ఎక్సుకిరణాలు పదార్థంగుండా పోతున్నప్పుడు, పదార్థంయొక్క అణువులతో ఢీకొంటాయి. అప్పుడు చాలా మార్పులు కలుగుతాయి. కాంతి ఎలాగయితే పారదర్శకపదార్థంగుండా పోతున్నప్పుడు పదార్థపు అణువులతో ఢీకొని అన్నివైపులా చిందబడుతూందో (Scattered) అలాగే ఎక్సుకిరణాలుకూడా అణువులతో ఢీకొన్నప్పుడు అన్నిదిక్కులా చిందబడతాయి. అలా చిందబడ్డప్పుడు కొన్ని కిరణాలు వాటి స్వంత అలపొడవులతోనే చిందబడతాయి. కొన్ని కిరణాలు చిందబడుతున్నప్పుడు అలపొడవులో మార్పులు పొందుతాయి. ఇట్లు అలపొడవులో మార్పు వచ్చుట అనే ఫలితాన్ని కాంప్టన్ ఇఫెక్టు (Compton Effect) అంటారు. మామూలు కాంతి పారదర్శకపదార్థాలగుండా పోతున్నప్పుడు, చిందబడిన కాంతిలో కొంత అలపొడవులో మార్పు పొందిఉంటుంది. దీనినే 'రామన్ ఇఫెక్టు' అంటారు. కనుక రామన్ ఇఫెక్టు, కాంప్టన్ ఇఫెక్టు ఒకలాంటివే. ఈ చిందబడిన ఎక్సుకిరణాలలో అలపొడవుమార్పు ఎందుకు వస్తున్నాయంటే, ఆకిరణాలు తమ శక్తిని కొంత అణువుల కిచ్చివేస్తూ ఉండడమునుంచి. ఇలాగ కిరణాలు నష్టపోయిన శక్తిని అణువులు గ్రహించి దాచుకోవడం లేదు. ఆ శక్తి అణువులను భేదించి వానితోనుండి ఎలక్ట్రానులను విడుదలచేస్తుంది. ఆఎలక్ట్రాను విడుదలఅవగానే చాలా ఎక్కువ వేగం కలిగిఉంటుంది. ఎక్సుకిరణాల నష్టపోయిన శక్తిముందు ఎలక్ట్రాను విడుదల అవడానికి ఉపయోగపడ్డ శక్తి చాలా తక్కువ. కనుక ఎక్సుకిరణం నష్టపోయిన శక్తిని దరిదాపు అంతా ఈ ఎలక్ట్రానే గ్రహిస్తుంది. అలా గ్రహించబడ్డ శక్తే ఎలక్ట్రానుకు విడుదల అయినప్పుడు వేగాన్ని ఇస్తుంది. కనుక ఎక్సుకిరణాలు పదార్థంగుండా పోతూ అణువులను ఢీకొన్నప్పుడు, అలపొడవులో మర్పుపొందినటువంటియు, పొందనటువంటియు అగు చిందబడిన కిరణాలే కాకుండా, అపరిమితవేగం కలిగిన ఎలక్ట్రానులుకూడా వస్తాయి. రామన్ ఇఫెక్టులో కాంతి నష్టపోయిన శక్తిని అణువులే తీసికొన్నాయి. కాని అవి భేదింపబడడం లేదు. కాంప్టన్ ఇఫెక్టులో ఎక్సుకిరణాలు నష్టపోయిన శక్తిని—ఈశక్తి చాలా ఎక్కువ—అణువులు దాచుకొనుట లేదు. ఆశక్తి అణువును భేదించి, విడుదలఅయిన ఎలక్ట్రానువశ మౌతూంది. ఇదీ రామన్ ఇఫెక్టుకూ, కాంప్టన్ ఇఫెక్టుకూ గల ముఖ్య భేదం. ఇంకొక్క భేదం ఏమిటంటే, రామన్ ఇఫెక్టులో అణువులు కాంతికి శక్తి నివ్వడంకూడా కద్దు కనుక కాంతిఅలపొడవు తగ్గడంకూడా ఉంది. కాంప్టన్ ఇఫెక్టులోమటుకు అణువులు ఎక్సుకిరణాల

* ఈ భాగము చదువుటకు ముందు గత సంచికలోని 'రామన్ ఇఫెక్టు' చదివిఉండవలెను.

శక్తి నివ్వడంలేదు. కనుక వీటి అలపొడవు హెచ్చుతుందేగాని తగ్గదు.

ఎక్సుకిరణాలు పదార్థంలోనుండి పోతున్నప్పుడు ఇంకొక మార్పును తెస్తాయి. అదేమిటంటే ఆ పదార్థంచే దానికి గుణశీలమైన ఎక్సుకిరణాలను (Characteristic X-Rays) ఉద్గారింప (Emit) చేస్తాయి. అంటే ఈపతనమయిన (Incident) ఎక్సుకిరణాలచే ప్రేరేపింపబడి, పదార్థం తనకు గుణశీలమైన ఎక్సుకిరణాలను అన్నిదిక్కులా ప్రసరిస్తుంది. ఈపతనమయిన ఎక్సుకిరణాలుమటుకు గుణశీలమైన కిరణాలకన్న తక్కువ అలపొడవు, లేక ఎక్కువ శక్తి కలిగి ఉంటాయి. అప్పుడే ఆ గుణశీలమైన కిరణాలు విడుదల అవుతాయి. ఇటువంటిదే మామూలుకాంతితోగూడ జరుగుతుంది. కొన్ని పారదర్శకపదార్థాలమీద సూర్యకాంతిని పడేటట్లు చేసి, వాటిని చీకటిలోకి తీసికొనివస్తే, అవి వాటికి గుణశీలమైన కాంతి నిస్తాయి. క్వినైన్‌సల్ఫేటు (Quinine sulphate) అనే పదార్థం నీటిలో కరగగా వచ్చిన ద్రావణాన్ని (Solution) ఇలాగ సూర్యకాంతిలోనుంచి చీకటిలోకి తెస్తే, నీలికాంతితో ప్రకాశిస్తుంది. అంటే ఇక్కడ పదార్థం పతనమయిన కిరణాలచే ప్రేరేపింపబడి,తనకు గుణశీలమైన కాంతి నిస్తుంది. ఇలాగ కొద్దిసేపుమాత్రమే ఇస్తుంది. ఈ దృగ్విషయానికి (Phenomenon) ఫ్లూరసెన్సు (Fluorescence) అంటారు. ఇక్కడ గూడ పతనమయిన కాంతి ప్రసరించబడిన గుణశీలమైన కాంతికన్న తక్కువ అలపొడవు కలిగిఉండాలి. కనుక ఎక్సుకిరణాలు పదార్థంమీద పడినపుడు, అది దానికి గుణశీలమైన ఎక్సుకిరణాలను ఉద్గారించడమనేది ఫ్లూరసెన్సువంటి దృగ్విషయమే.

ఎక్సుకిరణాలు పదార్థంమీద పడ్డప్పుడు గుణశీలమైన ఎక్సుకిరణాలను ప్రసరింపచేయడమేకాకుండా, పదార్థంనుండి ఎలక్ట్రానులను ఉద్గారింపచేస్తాయి. ఇక్కడ ఎక్సుకిరణం తన శక్తినంతాకూడా పదార్థానికి ఇచ్చివేస్తుంది. ఆశక్తిలో కొద్దిభాగం అణువునుండి ఎలక్ట్రానును విడుదలచేస్తుంది. తక్కినభాగం ఆ విడుదల అయిన ఎలక్ట్రానుచే గ్రహింపబడుతుంది. కనుక ఆఎలక్ట్రాను అపరిమితమైన వేగంతో బయటపడుతుంది. ఇక్కడ ఎక్సుకిరణంశక్తి అంతా ఎలక్ట్రానుకు ఇచ్చివేయబడింది. దీనిని గుణశీలమైన ఎలక్ట్రానుఉద్గారము (Characteristic Electron Emission) అంటారు. కాంప్టన్ఇఫెక్టులో ఎక్సుకిరణంయొక్క కొంతశక్తి విడుదలఅయిన ఎలక్ట్రానుకిచ్చివేయబడింది. తక్కువ శక్తితో అలపొడవులో మార్పుపొందిన ఎక్సుకిరణమే వస్తూంది. కనుక దీనిని చిందబడిన ఎలక్ట్రాను ఉద్గారము (Scattered Electron Emission) అంటారు.

ఇలాగ ఎక్సుకిరణాలు పదార్థంమీద పడి పదార్థపు టణువులతో ఢీకొన్నప్పుడు, వాటిలో కొన్ని తమదారంట అవి వెళ్లిపోతాయి. కొన్ని అన్నిదిక్కులా మార్పేమీ లేకుండా చిందబడుతాయి. కొన్ని అలపొడవు మార్పుతో చిందబడుతాయి. అలా కిరణాలు చిందబడుతున్నప్పుడు ఎలక్ట్రానులను విడుదల చేస్తాయి. అంతేకాక పదార్థాన్ని ప్రేరేపించి, దానికి గుణశీలమైన ఎక్సుకిరణాలను, ఎలక్ట్రానులను ఉద్గారింపచేస్తాయి. ఇన్ని మార్పులు కలుగచేస్తున్న ఈ ఎక్సుకిరణము పదార్థముల అంతఃప్రవృత్తి (Inter-action), ఎన్నోవిషయాలు తెలిసికొనుటకు ఉపయోగపడుతూంది.

ఒక అద్దముమీద కాంతి పడినపుడు ప్రతిఫలిస్తుంది. కాని ఎక్సుకిరణాలు ఇలాగ ప్రతిఫలించవు. అలాగే కాంతి వివర్తించే (Diffract) పరిస్థితులలో ఎక్సుకిరణాలు వివర్తించడం లేదు. కాని ఎక్సుకిరణాలు స్ఫటికాల (Crystals) మీద కొన్నికొన్ని విధాలుగా పడినపుడు ప్రతిఫలించుట, వివర్తించుట అనేవి అనుభవిస్తాయి. ఆప్రతిఫలనము (Reflection), వివర్తనము (Diffraction) పరిశీలించుటవల్ల స్ఫటికములోని అణువుల ఏర్పాటు, వాని మధ్యదూరము మొదలగు ఎన్నోవిషయాలు తెలుస్తాయి. కనుక ఇవి స్ఫటికంయొక్క నిర్మాణం (Crystal Structure) తెలిసికొందుకు ఉపయోగపడుతున్నాయి.

ఎక్సుకిరణాలు చర్మంమీద ఎక్కువసేపు పడినట్లయితే చర్మం కమిలిపోతుంది.

ఉపయోగాలు

ఈ నవీనయుగంలో ఎక్సుకిరణాలు మన జీవితంలో ఎన్నో విధాల ఉపయోగపడుతున్నాయి. ముఖ్య ఉపయోగం వైద్యంలో. ఎక్సురే వైద్యాన్ని రేడియాలజీ (Radiology) అంటారు. వీటివలన రాచకురుపులను, శరీరంలో వేసిన పెద్దకురుపులను మాన్పవచ్చును. చర్మవ్యాధులను కుదర్చవచ్చును. క్షయరోగుల ఊపిరితిత్తులకు ఫోటోలు తీసి, వాటిస్థితిని తెలుసుకొని అందుకు తగినట్లుగా మందీయవచ్చును. ఎముక ఏదేనా విరిగినపుడు, అది ఎక్కడ ఎలాగ విరిగిందో ఎక్సురే ఫోటోమూలంగా తెలిసికొనవచ్చును. మనిషిశరీరంలో చొచ్చుకుపోయిన లోహపు ముక్కలు ఎచ్చట ఉన్నవో కనిపెట్టవచ్చును. ఇనుపపోతలూ అవీ పోసినపుడు, వానిలోపున బిగటలవీ లేవు కదా యని పరీక్షచెయ్యవచ్చును. స్ఫటికాలమీద పతనమయిన కిరణాల ప్రతిఫలనము, వివర్తనము పరిశీలించి, ఆ స్ఫటికాల నిర్మాణం తెలిసికోవచ్చును. ఇటువంటి ఉపయోగాలెన్నో ఉన్నాయి ఎక్సుకిరణాలకు. ఈమధ్యను ఎక్సుకిరణాలకు ఇంకొక ఉపయోగంకూడా కనిపెట్టేరు. ఒక స్త్రీ అండాశయాల (Ovaries) మీద ఎక్సుకిరణాలు తగినంతసేపు పడునట్లు చేసిన, ఆమెను జీవితాంతంవరకు గొడ్రాలినిగా చెయ్యవచ్చును. ఇందువల్ల ఆమెకు ఇతరవిధంగా మార్పేమీ ఉండదు. కిరణాలు కొద్దిసేపే అండాశయాలపైన పడునట్లు చేసిన, ఆమెను కొద్ది సంవత్సరాలవరకు సంతానము పొందుటకు అనర్హురాలినిగా చెయ్యవచ్చును. తరువాత మరల ఆమె సంతానమును పొందుటకు తగిన దగును. అందువలన ఎక్సుకిరణాలు సంతాననిరోధానికికూడా పనికివస్తాయి. కాని వీటిని ఇంకా ఆపనికి ఎక్కువగా ఉపయోగించుట లేదు. ఇది ఇంకా ప్రయోగస్థితిలోనే ఉంది.



అజవిలాపము

= శ్రీ దువ్వూరి సూర్యనారాయణమూర్తి =

●

౧

ఓకసాయి! వధింపకు ముదుగు మొక్కెఁ-డంత్యసందేశ మున్న దో యయ్య వినుము
"ఆత్మవత్సర్వభూతాని" అనెడి తత్త్వ - మెన్నఁడైనను వినియుంటివే మహాత్మ!

౨

కూరిమి మీవలెఁ బ్రదుకఁగూడదె మేమును? జీవితాశ, సం
సారసుఖమ్ము మీకెటులో సర్వము మాకటుగాదె? బిడ్డలుఁ
లేరె? దురంతవృత్తికిఁ జలింపదె నీకరవాల మక్కటా!
నోరులు లేని జంతువు లనుంగు లటంచుఁ దలంపలేవొకో?

3

మేఁకలమై పశుత్వమున మేము జనించినయంతమాత్ర నీ
పీకరణిన్ వధింప నగునే? యిదియే నరహత్య యైనచో
నీ కురి గాకయుండునె? వినిందితవృత్తిని మాదుసంతతిన్
శోకదవాగ్నిఁ గూల్చెదు పశుత్వము నీదియొకాక మాదియే?

౪

కుత్తుక కత్తితోఁ దఱిగి కుండలనొడ్డి స్రవత్కవోష్ణపు
న్నెత్తురు నింపి యంగముల నిష్కరుణంబుగ వ్రచ్చి మేనితో
తిత్తుల నొల్చి రాక్షసవిధిన్ హతమార్చెదు; జాలియన్నదే
బొత్తిగ లేదు నీ యెడఁదఁ బోలునె నీ కిది వంశనాశకా!

౫

విలవిల తన్నికొంచుఁ బృథివింబడి జీవము పోక బాధతో
గిలగిల లాడుచుండ యమకింకర! నిర్దయ నాదు శీర్షముఁ
జెలుకుదు వెన్నిజన్మములఁ జేసిన పాపమొ? నీవు నేను ని
ట్టులు జనిభాగ్యమందఁగఁ గుటుంబము లెన్నియొ కూలియేడ్వఁగన్.

౬

సాపడఁ గందమూలములు సారపుఁగూరలుఁ గాయ లుండఁగాఁ
గూపపుఁబొట్ట నింపుటకుఁ గూడనిమాంసము లేల ? వానికై
మూపని పట్టనేల ? కసుమాలపువృత్తికి రోయవేల ? యే
పాప మెఱుంగ మీయసురు వాయునె నిన్ను దహింపకుండఁగన్.

౭

మావధకై ప్రభుత్వ మిటు మారణశాలలు నిల్పినట్లు మీ
మీవధ దీర్పఁ దారు పుడమిన్ భవనా లెచటేని గట్టిరే ?
చావు ఘటించు క్రూరులఁ గసాయుల నిల్పిరె జీతమిచ్చి ? లే
వేవియు, మానొసళ్లనె లిఖించి విధించిరిగాక దుర్దశల్.

౮

జాతరలందు శక్తుల కొసంగెడి యాబలి కేము, జన్నముల్
సేఁతకు మేమె యాహుతి, మలీమసమైన నికృష్టజాతికిన్
భూతికి మేము, క్రూరమృగభుక్తికి మే మిటు జాతియెల్ల ని
ర్హేతుకమా నకాలమృతికే గుఱియయ్యెడు నేమి కర్మమో !

౯

పెంచినయన్నినాళ్లు మముఁ బెంచుచుఁ బెట్టుచుఁ బెద్దమందగా
వించుచు మాదుపాఁడిని సమృద్ధిగఁ ద్రావెడునట్టి గొల్లఁడే
వంచకుఁడౌచు మమ్మిటులు వధ్యగృహంబున కప్పగింపఁడే ?
కంచియె చేనుమేయ నిను గాఁడఁగ నాడుట వెఱ్ఱియేకదా !

౧౦

జేనఁడుపొట్ట నింపికొనఁజెల్లక నెత్తురుకూటి కిట్లు మా
ప్రాణము లూడ్చుచుంటివి యభాగ్యుఁడ, పాతకజాతమెల్ల నీ
యాననమందె నిల్చె, నెటులైనను నీకిఁక శుద్ధిలేదు, నీ
మానము లూన మయ్యె, పశుమారణశాలకు గృధ్రశాంతులౌ !

౧౧

కన్నులఁ గాంచి నాగతిని గాఢతరంబగుభీతి గర్భని
ర్భిన్నములై వణంకి దురపిల్లుచు నిల్చెను మేఁకలెల్ల నే

డిన్నగు లొక్కరొక్కరికె యేర్పడుఁ దప్పదటంచు నీడ, నా
పన్నులఁ బ్రోచి యీమరణబాధ మరల్పఁగఁ జాల రెవ్వరున్.

౧౨

చత్తునటంచు నన్ దెలియఁజాలక నాపసికూనలెల్ల నె
గ్గెత్తుచుఁ జెంగునన్ బరువులెత్తుచుఁ జన్గుడువంగ వచ్చెదున్
ఒత్తిడిసేయఁబోకు మయయో! దగదొట్టిన చిచ్చుటాఁకలిన్
బుత్తు ననుంగుబిడ్డలకుఁ బుచ్చుము నన్నొకతూరి చెచ్చెరన్.

౧౩

రాపులుఁగుల్ త్వరంబడుచు రాపులువెట్టెడు, గృధ్రజాలముల్
కోపున నార్చి త్రుళ్లుచును గోపముసూపెడుఁ, గత్తులెల్ల మా
రూపులు మాపనుండెను నరుంతుదవృత్తిని, జాలమేల ? యీ
తాపము వాపి చంపి యిఁక ధన్యత గాంచు కృపాదరిద్రుఁడా!

౧౪

బుద్ధభానునహింసాప్రబోధనాద - బిందుకళ లింకిపోలేదు బెదరి మీకు
జ్ఞానశూన్యులు, మాకన్న హీను లగుట - మీఁచెవుల సోఁకనేర వామేటిశ్రుతులు.

౧౫

ఇంతకును నిన్ననఁబనేమి సృష్టిలోని - గొప్పలో టియ్యదే ప్రాణికోటియందు
గఱికపరకకు నో రున్నఁ గలవుదీఱు - నేడ్చిపోనేమొ మాబాధ కెంతొ వెఱచి.

సల్ఫానిలమైడు

= శ్రీ విస్సా రామచంద్రరావు =

౧

ఖండాంతరములలో సూతికావాతము, సవాయి, మధుమేహము, క్షయ మొదలైన దారుణ వ్యాధుల నిదానచికిత్సలకొరకు పరిశోధకులు తీవ్రపరిశ్రమలు పరస్పరస్పర్ధలతో సాగించే పరిస్థితుల్లో స్ట్రెప్టోకాక్కస్[1] జాతికి చెందిన విషక్రిములను మాడ్చివేసే శక్తిగల 'సల్ఫానిల్ అమైడ్' అనే ఒక రాసాయనికపు మందుపదార్థాన్ని జర్మను పరిశోధకులు కనిపెట్టినారు.

సల్ఫానిలమైడుకు ఇంత శక్తి ఉందనే విషయం ఏ ఆశ్చర్యసంఘటనవల్ల తెలియవచ్చిందో అదిమాత్రం ఒక పెద్ద రహస్యంగానే ఉంది. ఐ. జి. ఫార్బెనిన్డస్ట్రీ అనే ఒక సంస్థ—రాసాయనికరంగులను పరిశోధించేది—ఎల్బర్ ఫెల్డ్-జర్మనీలో ఉంది. ఈ సల్ఫానిలమైడును లోకానికి ఎఱుకపరచినగౌరవము ఆసంస్థకే చెందవలసి ఉంది. లాభం పొందదలచినప్పుడు వర్తకపారిశ్రామిక సంబంధములైన గుట్టుమట్టులు బయటపడకుండా కొంతవరకూ ఇలా రహస్యంగా ఉంచడము వ్యవహారమర్యాదయేకదా!

అసలు ఇలాంటిదొక మందు ఉందనే మాట వైద్యులకు మొట్టమొదట ౧౯౩౩-వ సంవత్సరంలో తెలియవచ్చింది. ఆ సంవత్సరమే చర్మవ్యాధులను గురించి చర్చించే సమావేశంలో డాక్టర్ ఫార్ స్టర్ అనే జర్మనీయుడు 'స్ట్రెప్టోజోన్' అనే పేటెంటుపేరుతో ఒక రహస్యౌషధమును బయలుచేసినాడు. స్టెఫిలోకాక్కస్[2] విషగ్రస్తుడైన ఒక పసివానిని బ్రదికించిన మహౌషధమని దాన్ని కొనియాడాడు.

ఆ మందే ౧౯౩౫ లో 'ప్రాంటోసిల్' అనే నామాంతరముతో వెలువడింది జర్మనీలోనే. వెంటనే దీనికి సంబంధించినవి అసంపూర్ణమైనవి, శాస్త్రసమ్మతముకానివి వైద్యవృత్తాంతాలు కొన్ని బయల్వెడలసాగినవి. పైమందువల్ల స్ట్రెప్టోకాక్కసుపుండ్లు పూర్తిగా మానెననీ, రుమాటిజం[3] నయమైందనీ, సూతికావాతం అత్యద్భుతంగా తగ్గిపోయిందనీ సమాచారాలు తెలియవచ్చినవి.

కాని అమెరికాలోని శాస్త్రజ్ఞులకు మాత్రం యీ ఆరంజిరంగుగల మందుపదార్థమేమిటో, దీని సంగతేమిటో, యీశాస్త్రదూరమైన వృత్తాంతాలను నమ్మడ మెలాగో బోధకాలేదు. రెండుసంవత్సరా

---

1. స్ట్రెప్టోకాక్కస్ — చుక్క చుక్కల్లాగ ఉండే సూక్ష్మక్రిములు. సూక్ష్మదర్శినితో చూడగా ఇవి గొలుసుకట్టుగా కనబడుతాయి. వీటిని మొత్తంమీద హీమోలిటిక్ వి, కానివి అని రెండుగా విభజింపవచ్చును. మొదటి తరగతికి చెందినవి ఎరిసిపిలస్, లింఫాంజైటిస్ (వెసురుపాము అంటారు), సూతికావాతము మొదలైనవాటిని కలిగించేవి. రెండవతరగతికి చెందినవి టాన్సిల్సు, పిత్తకోశము మొదలైనవాటిని పుండుపరిచేవి.

2. స్టెఫిలోకాక్కస్ - ఇవికూడా చుక్కల్లాగే ఉంటాయికాని గుత్తులుగుత్తులుగా కనబడుతాయి. చిన్నచిన్న కురుపులు, సెగగడ్డలు, రాచకురుపులు, ఆస్టియోమయిలైటిస్ మొదలైనవాటిని కలిగిస్తాయి.

3. రుమాటిజం — రెండవరకానికి చెందిన స్ట్రెప్టోకాక్కసు రుమాటిక్ జ్వరాన్ని కలుగజేస్తుంది. దానితో గుండెలోని కండరాలూ, ఒక అరకూ మరొక అరకూ మధ్య నుండే మడతతలుపులూకూడా పుండుపడవచ్చు. దీనికే 'రుమాటిక్ కార్డయిటిస్' అంటారు, కీళ్లు వాచి పట్లుపడితే 'రుమాటిక్ వాయువుపట్లు' అంటారు. ఈక్రిములే మెదడుకు సంబంధించిన 'కొరియా' అనే వ్యాధికి కూడా కారణమని నిరూపించారు.

లైందికదా యీమందును బయటపడవేసి ఒక్కపరిశోధకశాలలోనైనా స్ట్రెప్టోకాక్కసు వ్యాధిగతమైన చిట్టెలుకలకు యీమందిచ్చి "ఇదిగో చూడండీ! దీని ప్రభావంవల్ల నూటికి ఎన్ని చిట్టెలుకలు బ్రతికాయో" అనే మాటే లేకుండా తిన్నగా మనుష్యులమీద ఎల్లా ప్రయోగించారా యీమందు అని ముక్కుమీద వేలు వేసుకోని శాస్త్రజ్ఞుడు ఒక్కడైనా లేడు అమెరికాలో! కాని ఎంత ఆశ్చర్యం! రాబర్టు కాక్ మహాశయుడాదిగా ఇంతవరకూ ఎన్నెన్నో క్లిష్టమైన పరిశోధనలు చేసి స్పైరోకీట్లు4, ట్రిపనజోములు మొదలయిన మొండిక్రిములకు శల్వార్సాన్‌వంటి దివ్యౌషధాల్ని కనిపెట్టారే — అత్యల్పమైన యీస్ట్రెప్టోకాక్కసుజాతిక్రిముల పసపట్టగల ఒక్క మందైనా కనుక్కోలేకపోయారు గదా! గాజుగొట్టాల్లో క్రిములను హతమార్చగలిగిన కార్బాలిక్ ఆసిడ్, కరోసివ్ సబ్లిమేటులు5వంటి రాసాయనికాలే మనుష్యునికివ్వగానే అతన్ని పీడించే క్రిములకు బదులుగా ఆమనుష్యుణ్ణే హింసింప మొదలుపెట్టాయిగదా!

జర్హార్డు డోమాగ్ అనే ఎల్బర్ఫెల్డు-జర్మనీలోని రంగుల కార్ఖానాలోని ఒక పండితుడు తను ప్రాంటోసిల్‌ను6 ఉపయోగించి చిట్టెలుకలమీద చేసిన ప్రయోగఫలితాలను ౧౯౩౫ లో ప్రచురించాడు. ఏమైనా శాస్త్రసమ్మతమైన వృత్తాంతం మొట్టమొదట ప్రచురణకు వచ్చినది ఇతనిదే అని చెప్పాలి. స్ట్రెప్టోకాక్కసు జబ్బుతో ఉన్న చిట్టెలుకలకు ప్రాంటోసిల్ ఇవ్వగా ప్రతియొక్కటీ స్వస్థత చెందినదనీ, ప్రాంటోసిల్ పుచ్చుకోనని ప్రతియొకటీ చచ్చిపోయిందనీ అతడు తెలియపరిచాడు. ఇంతకంటే నిరాక్షేపణమైన కథనం మరొకటి ఉండబోదు. ఈ ప్రయోగాలను ౧౯౩౨ లో అతడు చేశానంటాడు. ఐతే ౧౯౩౫ వరకూ ఎందుకు ప్రచురించాడు కాడు? స్ట్రెప్టోకాక్కసు విషక్రిములను మారణం చెయ్యడంలో సాటిలేని దనుటచే ప్రపంచమంతనూ ఉర్రూతలూగించదగిన యీమహౌషధపు యోగ్యతను లోకమునకు వెంటనే వెల్లడించక గుప్తపరచనేల? ఏమో! అంతా గుప్‌చుప్. మరొకవిశేష మేమిటంటే, గాజుగొట్టాల్లోని స్ట్రెప్టోకాక్కసును యీ ప్రాంటోసిల్ ఏమీ చెయ్యలేదు; కాని మనుష్యుల్లోకి అడుగుపెట్టిందంటే ఆక్రిములమీద కొట్టిందే కొరడాదెబ్బ అనికూడా తెలియజేశాడు డోమాగ్. అయితే తన శక్తిని మానవదేహంలో మాత్రమే చూపించగలగడమనేది యీరంగుపదార్థానికి దేనివల్ల వచ్చింది?

ఈ రోజుల్లోనే పారిస్‌లో పాశ్చూర్ ఇన్స్టిట్యూటులోని జె. ట్రెఫోల్ దంపతులు ఈప్రాంటోసిల్‌ను గుణాత్మక విభజన చేశారు. చెయ్యగా చెయ్యగా ఇందులో వచ్చిన మూలపదార్థాన్ని రాసాయనిక మేళనము ననుసరించి 'పారా-అమైనో - బెంజీన్-సల్ఫానమైడ్' అని అన్నారు. దాన్నే ఇటీవల 'సల్ఫానిల్ అమైడ్' అంటున్నారు. చిట్టెలుకలకు అంటిన స్ట్రెప్టోకాక్కసుజబ్బును తగ్గించడానికి ఈ రంగురంగుల ప్రాంటోసిల్స్ ఇవ్వనక్కరలేదు, సామాన్యమైన అమిశ్రమైన సల్ఫానిలమైడును ఇస్తే చాలు అని తెలియజేశారు.

సరేకాని పై విషయాల్లేమీ జర్మనీయులకు తెలియవనా? తెలిస్తే ఎందుకు వెల్లడిచెయ్యరు? రంగులుపుయ్యడం దేనికీ యీమందుకు?... ఏజవాబూ రాదు వాళ్ళదగ్గరనుంచి. ఔను మరి! అంతా వ్యాపార రహస్యంగదా!

---

4. స్పైరోకీటు — బిరడాలు తీసే మరపైన ఉండే వలయం లేకుంటే ఎలా ఉంటుందో అలాంటి ఆకారం కల క్రిమి. ముందుకూ వెనక్కూ కూడా దొల్చుకువెళ్లే స్వభావంకలది. సూక్ష్మదర్శినితో సాధారణపద్ధతుల నవలంబించి చూస్తే కనిపించదు. సవాయి రోగాన్ని కలుగజేస్తుంది.

5. కరోసివ్ సబ్లిమేటు, లేక మెర్క్యూరిక్ క్లోరైడు — ఆస్పత్రుల్లో చేతులు కడుక్కోడానికి ఉపయోగించే ఊదారంగునీళ్లను దీనితోటే తయారు చేస్తారు.

6. ఈ ప్రాంటోసిల్‌ను ఆ కార్ఖానాలోనే పనిచేస్తూన్న మీఛ్, క్లేరర్ అనేవాళ్లు తయారుచేశారు.

తెలుసుకోటానికి లాంగూ, బ్లిస్సూ చాలా ప్రయోగాలు చేశారు. స్ట్రెప్టోకాక్కసు దేహంలో ప్రవేశించగానే ఒక విషాన్ని తయారుచేసి రక్తంలో పోస్తుంది. రకరకాలుగా ప్రత్యక్షమయ్యే కీళ్లన్నీ దానివల్లనే కలుగుతున్నవి.

ఏ విషక్రిమిగాని, మరే అన్యపదార్థమైనాగాని దేహంలో ఎక్కడప్రవేశించినా తక్షణమే చుట్టుప్రక్కల ఉన్న చిన్నచిన్న రక్తనాళాలు ఉబ్బుతవి. ఆ ఉబ్బిన నాళాల్లోంచి శ్వేతరక్తకణాలు జట్లుజట్లుగా బయటకు వచ్చి ఆ అన్యపదార్థాన్ని చుట్టుముట్టుతాయి. నాలుగైదు కణాలు కలిసిపోయి ఒక పెద్ద కణమై ఆపదార్థాన్ని ముక్కలుగా చేసి ఒక్కొక్క ముక్కనే కబళించి జీర్ణించుకుంటాయి. తర్వాత రక్తనాళాల్లోకి తిరిగి వెళ్లిపోయి ఆ విషపదార్థాలను మలమూత్రాల ద్వారా విసర్జిస్తాయి. ఇది సాధారణంగా దేహంలో జరిగే సంగ్రామం.

సల్ఫానిలమైడు దేహంలో ఎక్కడెక్కడ ఉన్న శ్వేతకణాలనూ ఆకర్షించి స్ట్రెప్టోకాక్కసు విడిసిన ప్రదేశానికి రప్పించి మామూలుపోరాటాన్ని చాలా హెచ్చించుతుంది. అంతేకాకుండా యీ రక్తకణాలు తయారయే చోట్లకు వెళ్లి క్రొత్తవి తయారయేట్లు చేస్తుంది. ఎప్పటికప్పుడు దేహంలో వృద్ధిచెందుతూన్న ఆ క్రిములమీదికి సల్ఫానిలమైడు క్రొత్త శ్వేతకణాల దండులను క్రమం తప్పకుండా పంపించి సంహరింపజేస్తుంది. ఆఖరుకు దేహంలో ఒక్క క్రిమినికూడా మిగలకుండా చేస్తుంది. అంతవరకూ యీమందు దేహంలోకి సరఫరా అవుతూనేఉండాలి. లేకపోతే జబ్బు తాత్కాలికంగా తగ్గినట్లే తగ్గి ఇట్లే తిరుగబెట్టి రోగిని క్షణంలో హతమారుస్తుంది. ఈవిధంగా తోడ్పడే పద్ధతిని 'కీమోథెరపీ' అనీ, యీసల్ఫానిలమైడువంటి మందులను 'కీమోథెరప్యూటిక్ ఏజంట్లు' అనీ అంటారు.

గాజుగొట్టాల్లోని స్ట్రెప్టోకాక్కసుకు సల్ఫానిలమైడువల్ల ఏహానీ కలుగదనికూడా నిర్ధారణచేశారు.

ఇ.కె. మార్షల్ అనే ఒక ఔషధశాస్త్రజ్ఞుడు సల్ఫానిలమైడును బిళ్లలుగా తినగానే అది త్వరగా జీర్ణమైపోతుందనీ, రక్తంలోకి క్షణంలో ఇంకి దేహంలోని మూలమూలలకూ ఇట్టే ప్రాకిపోతుందనీ నిరూపించాడు. ఈమందును పెద్దపెద్ద మోతాదుల్లో నిర్భయంగా యివ్వవచ్చుననీ, రోగికి నయమౌతోందన్నంతవరకూ ఏదిక్కూ ఉండదనీ, ఇది శాస్త్రం తెలియని బూటకపు చికిత్స కాదనీ, కేవలం శాస్త్రయుక్తమైనదనీకూడా తెలియపరిచాడు.

౪

'ఎపిడెమిక్ సెరిబ్రో స్పైనల్ మెనింజైటిస్' అమెరికాలో హెచ్చుగా కనిపిస్తుంది. మెదడునూ, వెన్నుపామునూ కప్పుకునిఉండే పొరలను 'మెనింజైటిస్' అంటారు. వాటిల్లో వచ్చే అంటుజాడ్యమే ఇది. ఆరోగ్యరక్షణ సరిగా లేని సైనికుల బారకుల్లోనూ, పల్లెల్లోనూ ఆకస్మికంగా కలుసుతూ ఉంటుంది. దీనికి కారణమైన క్రిమియే మెనింగోకాక్కస్. ఇది స్ట్రెప్టోకాక్కసుకు దగ్గరబంధువే. చిట్టెలుకలకు మెనింజైటిస్ తెప్పించి సల్ఫానిలమైడు ప్రయోగించి చూచాడు లాంగ్. మెనింగోకాక్కస్‌ను కూడా సల్ఫానిలమైడు అవలీలగా ఎదుర్కొనగలిగింది.

౧౯౩౭ లో ౧౧ గురు పిల్లలకు సెరిబ్రో స్పైనల్ మెనింజైటిస్ రాగా వాళ్ల వెన్నుల్లోకి సల్ఫానిలమైడు కల ద్రావకాన్ని ఎక్కించి, కడుపులోకి బిళ్లలిచ్చారు. ఒక్కడు తప్ప అందరూ ప్రతికారు. ఈ సల్ఫానిలమైడు మెనింగోకాక్కసుమీద అంతబలంగానూ పనిచేసిందని స్పష్టపడింది. అంతకంటే ఎక్కువైన మందేమోకూడాను ఇది. ఎందుచేతనంటే, సీరం యిస్తే కొంతమందికి సీరం సిక్నెస్[9] అనే ఖాయిలా వస్తూండడం కద్దు. దీనివల్ల ఆదిక్కు ఉండదుగదా!

---

9. సీరం సిక్నెస్—ఇది సీరం ఇచ్చిన మరుచటిరోజునుండి ౧౫ రోజుల్లోగా ఎప్పుడైనా బయటపెయ్యవచ్చు. ఇంజక్షను ఇచ్చినచోట దురద పెట్టి దద్దు లెక్కవచ్చు. మూత్రంలో ఆల్బ్యుమిన్ కనపడవచ్చును. బద్ధకం, వాంతులు మొదలైన దుర్గుణాలు కూడా కనిపించవచ్చును.

తర్వాత పెర్రీన్ లాంగ్ తన ప్రయోగాలను 'గానోకాక్కస్'[10] మీదికి త్రిప్పాడు. సగరోగంవల్ల ఎంతోమంది అమాయికలైన గృహిణులు తమ భర్తల తెలివితక్కువచే బాధపడుతూన్నారు. అంతే కాదు. స్త్రీలు ప్రసవించినప్పుడు పసికూనల కండ్లను యీ గానోకాక్కసు తాకి వాళ్లను పుట్టుగ్రుడ్డిగా చేస్తోంది. ఎంతో జాగ్రత్తవహించి సిల్వరునైట్రేటుచుక్కలను పసికూనల కండ్లలో వేసినా యీ మొండి గానోకాక్కసు తన తోకను వీలైనంతవరకు ఝాడిస్తూనే ఉంటుంది. సగరోగం జీర్ణిస్తే కీళ్లను పట్టుకుంటుంది.

గానోకాక్కసు చాలా వింత క్రిమి. మనుష్యుణ్ణితప్ప పరిశోధకశాలల్లో లభ్యమయే యేజంతువునూ తాకదు. కనుక సగరోగంమీద క్రమపరిశోధన చాలా కాలందాకా సాగలేదు.

౮౭ మందికి సగరోగం వస్తే సల్ఫానిలమైడును వాళ్లకు ఇచ్చారు. అందులో ౩౬ మందికి ౫ రోజుల్లో చీముకారడం కట్టేసింది. నొప్పి పూర్తిగా మాయమైపోయింది. ఈమాత్ర లొక్కటే వాళ్లకు కడుపులోకిచ్చింది. ఇంజక్షన్లుగాని, ఇరిగేషన్లుగాని ఏమీ చెయ్యలేదు. ఈసంగతిని మొట్టమొదట డీస్, కాల్‌స్టన్ అనే ఇద్దరు వైద్యులు ౧౯౩౭ జూనులో వెల్లడిచేశారు. తర్వాత ఎంతోమంది వైద్యులు ఈవిషయమై చాలా పరిశోధనలు చేశారు.

న్యూమోనియాజ్వరానికి, మూత్రవిసర్జనావయవాల్లోని వ్యాధులకుకూడా ఉపయోగించి వీటిని మాన్పే శక్తి సల్ఫానిలమైడుకు ఉందని నిరూపించారు మరికొందరు.

10. గానోకాక్కస్-ఇది సగరోగక్రిమి. జీడిగింజను పోలిన ఆకారం కలది. ఇవి ఎప్పుడూ జంటలుగా కలిసి కనబడుతవి. తెల్లరక్తకణాల్లో రెండుమూడు జంటలకు తక్కువలేకుండా కనబడును. రోగంయొక్క తీవ్రత హెచ్చుగా ఉంటే ప్రతియొక్క కణంలోనూ ఎన్నో జంటలు క్రిక్కిరిసి ఉంటాయి.

౫

సల్ఫానిలమైడు ఎంత మంచి మందైనా దానికి చెడుగు బొత్తిగా లేకపోలేదు. సల్ఫానిలమైడును సేవించినవారిలో కొంతమందికి పెదిమలూ, వ్రేళ్లచిగుళ్లూ నల్లబడ్డం, తలతిరగడం, మొహంతిరగడం మొదలైనవి కనిపించేవి. కాని యివన్నీ వాటంతటవే మాయమైపొయ్యేవికూడాను.

మూత్రపిండాల్లోంచి విసర్జింపబడేటప్పుడు సల్ఫానిలమైడు ఘనీభవించి అందులోని దోవల్లో చిక్కితే ఆమూత్రపిండానికి హాని కలిగి మూత్రంలో రక్తం పడుతుంది కొంతమందికి. ఇది కనిపించిన వెంటనే ఆమందును నిలిపివేస్తే అదే సర్దుకుపోతుంది. లేకపోతే మూత్రపిండాల్లో నొప్పిపుడుతుంది. తోవల్లో అడ్డు పెద్దదై మూత్రవిసర్జన పూర్తిగా నిలిచిపోతుంది.

ఒక పరిశోధకుడు చాలా పెద్దపెద్ద మోతాదులిస్తూ చికిత్సచేస్తూండేవాడు. ఆయనరోగుల్లో ఒకళ్లిద్దరు నయమవుతున్నట్లే అగపడి చటుక్కున ప్రాణాలు కోల్పోయారు. దానికి కారణం కనుక్కొగా తేలిం దేమిటంటే-సల్ఫానిలమైడు దేహంలో అమితంగా చేరితే రక్తంలోని ఎఱ్ఱకణాలు నాశనమవడమేకాకుండా తెల్లకణాలు గబగబా రక్తంలోంచి మాయమైపోతాయి అని. అందుచేత అనుభవం కల వైద్యుడే సల్ఫానిలమైడుతో చికిత్సచెయ్యాలిగాని సొంతవైద్యం ఎంతమాత్రమూ పనికిరాదు. తలనొప్పి రాగానే ఆస్పిరిన్ బిళ్లల్ని మింగినట్లుగా వాడకూడదు యీబిళ్లల్ని. అలా చేస్తే చాలాప్రమాదాలకు లోనుగావలసివస్తుంది. కాని ఎంతమంది అనుభవం కల వైద్యు లుంటారు ఏదేశంలోనైనా? ప్రజలకు కావలసినంతమంది తగినంత అందుబాటులో ఉండడం అంటే మాటలా? కాకుండా శాస్త్రసమ్మతంగా ఉపయోగించాలంటే సూక్ష్మదర్శినిల్లా మొదలైన ఎంతో విలువైన సాధనసామగ్రి కావాలే! ఎంతమంది వైద్యులు వాటిని భరించగలరు? ఎంతమంది రోగులు వైద్యుడికైనంత ఖర్చును యివ్వుకోగలరు? ఇదంతా ఒక పెద్ద సమస్య!

ఇటీవల యీసమస్యాపరిష్కారార్థం చాలా ప్రయత్నాలు చేశారు. సల్ఫానిలమైడును మూలంగా ఉంచుకొని దానికి రాసాయనికంగా చిలవలు పలవలు చేర్చి మనుష్యశరీరంమీద దాని కున్న చెడుగుణాల్ని చాలామట్టుకు తగ్గించగలుగుతున్నారు.

౧౯౩౮ లో 'సల్ఫాపిరిడీన్' అనే నమూనా ఒకటి బయల్దేరింది. అది న్యూమోనియాజ్వరాన్ని అత్యద్భుతంగా తగ్గిస్తుంది. పూర్తిగా ఏడురోజులు కాసే జ్వరం నాలుగురోజుల్లో దిగజారిపోతుంది. జ్వరతీవ్రతకూడా తగ్గిస్తుంది. కాని సూతికావాతాన్ని, మెనింజైటిస్‌ను ఎదుర్కోగల సల్ఫానిలమైడు ఏవిధంగా కొందరకు హాని కలిగిస్తుందో అలాగే యీసల్ఫాపిరిడీనుకూడా న్యూమోనియారోగులకు హానిచేస్తుంది. అందుచేత కొద్దికాలంలోనే ఉత్తమతరమైన వేరే ఇంకోరకంమందును తయారు చెయ్యవలసివచ్చింది.

పరిశోధకులు దీని కేమాత్రమూ చలించలేదు. చాలా కృషిచేసినమీదట ౧౯౪౦ లో 'సల్ఫాథయోజోల్' అనేదాన్ని తయారుచేశారు. ఇది సల్ఫాపిరిడీనంత గుణవంతమైనదే కాకుండా, కడుపులో త్రిప్పి వాంతరయేటట్లుండడం, తలనొప్పి పుట్టడం, రక్తం చెడిపోవడం మొదలైన చెడుగుణా లేమీ లేనిది. ఎంతైనా దీన్ని సేవించిన కొందరికి వంటిమీద పెద్దపెద్ద బొబ్బలేవడం, దద్దుర్లెక్కడం మొదలైన చెడుగుణాలు కనపడసాగాయి. అందువల్ల అది వెనువెంటనే ఒకరకంగా నిరుపయోగమైంది.

౧౯౪౧ ఏప్రిల్లో రిఛర్డు ఓ. రాబ్లిన్ జూనియరు అనేవాడు అమెరికా సైనమైడుకంపెనీ పరిశోధనాలయాల్లో చేసిన ప్రయత్నాల ఫలితంగా ఒక క్రొత్త నమూనాను తయారు చేశాడు. ఒక్క పొడుం పట్టంత తయారుచేశాడో లేదో అతని పైఅధికారి క్రాస్లీ దానికి 'సల్ఫా డయాజీన్' అని నామకరణం చేశాడు. అందులో ఒకభాగం 'సల్ఫ', రెండవది 'విటమిన్.'

ఇది సూతికావాతం, రక్తంలో విషంచేరడం, చెవిఅంతర్భాగం కుళ్లి తదనంతరం వచ్చే మెనింజైటిస్ మొదలుగాగల రుగ్మతలకు కారణమైన స్ట్రెప్టోకాక్కసును అతిసులభంగా నాశనం చెయ్యగల సల్ఫానిలమైడుకంటే ౧౫ రెట్లు గుణవంతమైనది. అంతేకాదు. న్యూమోకాక్కసును సల్ఫానిలమైడు బలంగా ఎదుర్కోలేదు. దెబ్బలు తగలగా స్టఫిలోకాక్కసు చేరిన పుండ్లను సల్ఫాపిరిడీను మాన్పలేదు. స్ట్రెప్టోకాక్కసువిషం రక్తంలో ప్రవేశిస్తే సల్ఫాథయోజోలు నుపయోగించడంవల్ల ఎక్కువ గుణముండదు. కాని యీ సల్ఫా డయాజీనుమాత్రం అన్ని రకాల కాక్కసుజాతి క్రిములనూ విజయవంతంగా ఎదుర్కోగలదు.

సల్ఫా డయాజీనుకు మరికొన్ని సద్గుణాలున్నాయి. దేహాన్నుంచి విసర్జింపబడేటప్పుడు తక్కిన వాటిమాదిరి కాకుండా మూత్రపిండాలకు ఏ మాత్రమూ హాని చెయ్యదని తెలుస్తోంది. తక్కిన మాడింటికీ ఉన్న చెడుగుణా లేవీ దీనికి లేనట్లుకూడా కనబడుతోంది.

సల్ఫా డయాజీన్ని అమెరికాలో చాలా హెచ్చుగా ఉపయోగిస్తున్నారు. త్వరలో మనకూడా హిందూదేశంలో అందగలదు. యుద్ధరంగాల్లో న్యూమోనియా జ్వరపీడితులమీద ఉపయోగించగా వెయ్యిమందికీ ఇరవైయొక్కరు మాత్రమే చనిపోయినట్లు వార్తలు అందాయి. అంతేకాక బలమైన గాయాలు తగిలితే వాటిల్లోకి విషక్రిములు చేరి ఏ అఘాయిత్యమూ చెయ్యకుండా ఉండేందుకు కట్లు కట్టేటప్పుడు సల్ఫాడయాజీన్ని రణరంగాల్లో చాలా విరివిగా ఉపయోగిస్తున్నారు.

పెర్రీన్ లాంగ్ యీ సల్ఫాడయాజీన్ని చాలా అభినందిస్తూ దాన్ని ఉపయోగించేటప్పుడు ఒక ముఖ్య గమనికను గుర్తుంచుకోవాలని హెచ్చరిస్తున్నాడు. రోగి ఇదివరలో ఎప్పుడైనా సల్ఫామందులు వాడాడా, అప్పుడేమైనా చెడుగుణాలు కనిపించాయా అని కనుక్కోవాలి. ఒకవేళ కనిపించాయనే అంటే వాడికి ముచ్చుకు ఒక చిన్న మోతా దిచ్చి అందువల్ల చెడుగుణా లేవీ లేకుండా చేసుకుని మరీ ఈమం దివ్వాలని సూచించాడు.

౬

గోరుచుట్టుకూ, మొటిమను గిల్లితే ముఖమంతటా పాకే పుండుకూ, మరికొన్ని రకాల పుండ్లకూ, 'ఆస్టియో మయిలైటిస్' అనే లోపలి ఎముక కుళ్లగా వేసిన పుండ్లను శస్త్రం చేసినప్పుడూ, అకస్మాత్తుగా వంటిమీద కలిగే ఘాతాలకూ, కొన్ని రకాలైన ఉదరముపై శస్త్రచికిత్సలకూ, క్రిమికపుండైనప్పుడు (అప్పెండిసైటిస్), పేగు చినిగితేను, పేగులో పుట్టిన పుండ్లవల్ల పేగు బొత్తపడితేను, పెరిటోనైటిస్ వ్యాధికి సల్ఫానిలమైడు అమృతంలాగ పనిచేస్తుంది.

పడిశం పడితే నాలుగైదురోజులదాకా తగ్గనిది మొదటిరోజునుంచీ కనక సల్ఫానిలమైడును వాడితే భారకింపు బాగా తగ్గిపోయి మర్నాటికి చాలా సుళువుగా ఉంటుంది.

సల్ఫాథయోజోలుతో ఒక పాళాస్త్రిని తయారు చేశారు. ఇది కొన్నిరకాల చర్మవ్యాధులకు బాగా పనిచేస్తుంది (ఎగ్జిమా - ఏనుగగజ్జి అనవచ్చు, ఇంపటైగో - గజ్జిపొక్కులు, సెబోరియక్ డర్మటైటిస్ మొదలైనవాటికి).

సల్ఫాడయాజీనుతో ఒక కాటుక తయారు చేశారు. నల్లగుడ్డుమీద వేసే ఒకరకం పుండును చాలా త్వరగా మాన్పిస్తుందని ఇటీవల వచ్చిన వార్తలనుబట్టి తెలుస్తుంది. ఈసల్ఫాపిరిడీన్నే బాసిల్లరీ డిసెంట్రీ (నెత్తురు బంక విరోచనలు)తో బాధపడుతూన్న వాళ్లకు ఇచ్చి చూశారు. దీన్ని ప్రారంభించిన మర్నాటికి జ్వరం విడిచిపోయిందనీ, మూడోనాటికి విరోచనంలో నెత్తురు బంక పడ్డం మానేసిందనీ ఇటీవల వచ్చిన వార్తలవలన తెలుస్తోంది. ఈ సల్ఫామందు ఇంకా ఎన్నిరకాల జబ్బులను నయంచెయ్యగలదో ?

ఈ సల్ఫామందులు సేవించేటప్పుడు కొద్దిగా పథ్యం చెయ్యాలి. ఉల్లిపాయలు, కోడిగుడ్లు తినకూడదు. గంధక సంబంధమైన ఏమందూకూడా వాడకూడదు.

౧౯౩౯-వ సంవత్సరంలో వైద్యశాఖకు చెందిన నోబెల్ బహుమానాన్ని జర్హార్డ్ డొమాగ్‌కు ఇచ్చారు.[11]

సల్ఫాపిరిడీన్ని మన రాష్ట్రంలోని ఆస్పత్రులలో విరివిగా ఉపయోగిస్తూన్నారు. దీనినే 'డగనాన్', లేక 'యమ్. అండ్. బి. ౬౯౩' అనే పేరుతో ఒక కంపెనీవారు విక్రయిస్తున్నారు. ఇంజక్షన్ల నివ్వడానికి వీలుగా 'సాలుసెప్టసిన్' అనే పేరుతో ఒక అరకునుకూడా అందజేశారు. ఈ డగనాన్ న్యూమోనియా, బ్రాంకోన్యూమోనియా, శగవ్యాధులకు వాడుతున్నారు. ఇప్పుడు మన కందుబాటులో నున్న సల్ఫామందు లన్నింటిలోను యమ్. అండ్. బి. ౬౯౩ జే చాలా శ్రేష్ఠమైనది.

జర్మనీవారు 'ప్రాంటోసిల్ రూబ్రం', 'ప్రాంటోసిల్ ఆల్బం' అనే మాత్రలనూ, ఇంజక్షన్ల నివ్వడానికి వీలుగా 'ప్రాంటోసిల్ సాల్యూబులు' అనే అరకునూ సరఫరాచేస్తూ ఉన్నారు. 'యూలిరాన్' అనే పేరుతో సల్ఫాపిరిడీనును పోలిన ఒక రకం మాత్రలనుకూడా అందజేశారు. కాని ఇటీవల యుద్ధంవల్ల యివేవీ అందుబాటులో లేవు.

ఈ సల్ఫామందుల ఆగమనంవల్ల వైద్యచరిత్రలో ఒక నూతనయుగం ప్రారంభమైనదని నిశ్చయమవుతోంది.

---

11. ౧౯౩౯ లోనే రసాయనశాస్త్రానికి చెందిన నోబెల్ బహుమానాన్ని బ్యూటినెంటు అనే జర్మన్ శాస్త్రజ్ఞునికీ, రజికా అనే జ్యూరిచ్ శాస్త్రజ్ఞునికీ పంచిఇచ్చారు. ౧౯౩౫ లో శాంతిబహుమానాన్ని ఓస్సీ ట్స్కీ అనే జర్మనీయుని కివ్వగా నాజీలు ఆ బహుమానాన్ని తిరస్కరిస్తూ, ఇకమీదట మావాళ్లకు బహుమానాలు మేమే ఇచ్చుకుంటామన్నారు. కాని, ఇప్పుడు స్వీడన్‌సామ్యం నాజీలకు కావాలి. ఈనోబెల్ బహుమానాల్లో ఎన్నోవంతు డొమాగ్‌కూ, బ్యూటినెంటుకూ ముట్టిందో భగవంతుడికే తెలియాలి.

కథానిక:

మేటినీ షో

శ్రీ 'రావుబాబు'

శనివారం 'మేటినీషో'కి సినిమాకి వెళ్లేడు కృష్ణమూర్తి కుటుంబసహితంగా.

"సుఖసంసారమె పరమానందం ..."

పాట చెవుల్లో గింగురుమంటూనే వుంది. లైట్లు వెలిగిపోయాయి. బాల్కనీమీద నాయుడుగారి అమ్మాయిలను చూచిన యువకులంతా ఒక్క సెకండు కూడా ఆలస్యం చెయ్యకుండా ఆ దొమ్మిలోంచి బయట పడి ఆడవాళ్ల గేటుదగ్గిరకు చేరుకున్నారు. కృష్ణమూర్తి, అరగంట తంటాలుపడి ఎల్లాగో పరిచయం కల్పించుకున్న లేడీడాక్టరుతో ప్రసంగిస్తూ తాపీగా పైకివచ్చి, ఆమె కారెక్కి వెళ్లిపోగానే తనభార్య కోసం చూస్తూ ఆడవాళ్లగేటుసమీపానికి వచ్చేడు. అప్పటి కప్పుడే చాలామంది యువకులు ఆ గేటువద్ద గుమిగూడి మొహం అంతా కళ్లుచేసుకొని కాచుకొని వున్నారు.

ఇరువైపులా సంరక్షణకర్తల్లాగున్న మగవారి మధ్యనుండి పారుతోంది మహిళాప్రవాహం. ద్వారములోంచి వస్తూన్న ప్రతియువతినీ నఖశిఖపర్యంతము పరీక్షచేసే వదలిపెడుతున్నారు యువకబృందం. అంతలో మెరపు మెరసినట్టు నాయుడుగారి అమ్మాయిలు ద్వారంలోంచి వచ్చేరు. యువకుల్లో తొక్కిడి ప్రారంభించింది. ఆ అమ్మాయిల వెంటే ఓ పెద్ద యువకప్రవాహం బయలుదేరి వారిని వారి కారుదాకా సాగనంపి, వారు కారెక్కి వెళ్లిపోయింతర్వాత ఆ పెట్రోలుగేసు నాఘ్రాణిస్తూ, ఆనాటి శోభనకార్యము నెరవేర్చినట్టు ఒకరొకరు చూసి సకిలించుకుంటూ యిళ్లకు జారిపోయారు.

ఆసమయానికే గేటులోంచి సుశీల రావడం నుంచి పాపం కృష్ణమూర్తి కాపరమాన్నను అందరితో పాటు జుర్రుకునే భాగ్యం లేకపోయింది.

సుశీల రెండేళ్ల రాజుని చంకని వేసుకొని "అబ్బ! ఏమి మంది! ఏమి మంది!" అని నిట్టూర్పులు విడుస్తూ మగనిని సమీపించి, చంకనున్న పిల్లాడిని అతని కప్పగించి "జట్కా చూడండి, చీకటి పడుతోంది, వేగం పోదాం" అని తానే జట్కాస్టాండుదగ్గిరకి దారి తీసింది.

ఇంతలో వీరివద్దనే ఓజట్కా ఆగింది. అందులోనుండి కమలం, రామారావు దిగేరు. సుశీల కమలాన్ని గుర్తుపట్టి "అరె! ఎప్పుడు రావడం?" అని దగ్గిరకు వెళ్లింది.

కృష్ణమూర్తి కమలాన్ని చూచి ఆశ్చర్యపోయాడు. తను అత్తవారింటికి వెళ్లినప్పుడల్లా ఎదురుగానున్న కిటికీలో దర్శనం యిస్తుండే గోహారుబొమ్మ ఎట్టయెదుట ప్రత్యక్షం!

కృష్ణమూర్తి ఇన్‌స్టింక్టు పురిగొల్పడాన్ని పక్కనే వున్న రామారావుభుజముమీద చెయ్యివేసి "ఏమండోయి రామారావుగారూ! ఎప్పుడు రావడం? ఏమిటి సంగతి? నన్ను గుర్తుపట్టే వుంటారు. రెండుమూడుసార్లు మా అత్తవారింటికి వచ్చినప్పుడు మిమ్మల్ని చూసేను. కాని పరిచయం చేసుకునే అవకాశం లేకపోయింది" అన్నాడు, లేని ఆప్యాయనం ప్రదర్శిస్తూ. రామారావును చూసినప్పుడల్లా అసహ్యించుకొనే కృష్ణమూర్తికి ఇప్పుడు సమయానుకూలంగా అతనితో మైత్రి కలుపుకోవలసివచ్చింది.

స్వతహాగా మితభాషి అయిన రామారావు కృష్ణమూర్తివంక చూచి లేని నవ్వుతో "తమ రీవూరిలోనా వున్నారు? —నాకు తెలీనే తెలీదండి" అని మాత్రము అని జట్కావాడికి డబ్బు లివ్వడానికి పర్సు తీసేడు.

అతన్ని చూస్తుంటే కృష్ణమూర్తిఆలోచనలు వెనకటిరోజులకు పరుగెత్తేయి. ప్రతిసాయంత్రమూ నీళ్లు కారుతూ కాళ్లీడ్చుకుంటూ వచ్చిన ఈ క్లోజు క్రాపు బుర్రనీ, అటు ఫేస్ పౌడరు వాసననూ సెంటుతో గుమగుమలాడే కమలాన్నీ చూసి "కాకిముక్కుకి...!" అని ఎన్నిసార్లు తను అనుకోలేదు!

"మళ్లీ కలుద్దాము" అని చెప్పి రామారావు టిక్కెట్లు కొనడానికి వెళ్లేడు.

సుశీల కమలాన్ని చూచి "అయితే ఎప్పుడు వచ్చేరు? ఎక్కడ దిగేరు? మీ వారికి ట్రాన్సుఫర్ అయిందా ఏమిటి?" అని కుశలప్రశ్న ప్రారంభించింది.

"అవును, ట్రాన్సుఫర్ అయింది. మధ్యాహ్నము ప్యాసింజరులో వచ్చేము. నేషనల్ హోటలులో దిగేము"

కృష్ణమూర్తి అందుకున్నాడు: "ఛాఛా! నేషనల్ హోటలులో దిగడమేమిటి—వెధవ వంటా, వెధవ తిండీని!"

"ఈరెండుమూడు రోజుల్లో ఏదో యిల్లు చూసుకోవాలి" అంది కమలం అతనివైపొకసారి చూసి.

కృష్ణమూర్తి భార్యవంక తిరిగి "అన్నట్టు మన యింటి కెదురుగా నున్న రమణమ్మగారిల్లు ఖాళీ అవుతున్నట్టుందే. ఆయిల్లు వీరికి సరిపోతుందేమో!" అన్నాడు.

"అవును. విశాలంగా చాలా బాగుంటుంది. పండెండురూపాయలు కాబోలు అద్దె" అని సుశీల కమలంవంక చూసింది.

"ఆయన్నిరే పొకసారి వెళ్లి చూడమంటాను" అంది కమలం.

కృష్ణమూర్తి భార్యవంక చూసేడు. "పోనీ, రేపు మనింటికి—"

సుశీల కమలంవైపు చూచి "అవును. మే ముంటూంటే హోటలు మెతుకు లేం గ్రహచారం? మా యింటికి వచ్చేయండి. ఈరాత్రికి మాతోపాటు ఏదో ఫలహారం—" అంది.

"రాత్రిఫలహారం అయిపోయిందిలే..."

ఇంతలో రామారావు టిక్కెట్లు పట్టుకొని వచ్చేడు. సుశీల మగనివంక చూసింది. కృష్ణమూర్తి రామారావుభుజంమీద చేయివేసి "హోటల్లో ఏమిటి తింటారు? ఈరాత్రి సరాసరి మాయింటికి వచ్చేయండి సార్. సామాన్లు రేపు తెచ్చుకోవచ్చు ... ఎటికా పరిచయం ఉన్నవాళ్లంగాని పైవాళ్లం కాముగదా ... మాయింటి కెదురుగా ఓఇల్లు ఖాళీఅవుతోందికూడాను. మీ కది నచ్చుతుందో లేదోకూడా చూసుకుందురుగాని" అన్నాడు.

రామారావు కమలంవంక చూసేడు.

కృష్ణమూర్తి రామారావువంక చూస్తూ "ఒక్కొ దగ్గరే వుంటే ఆడవాళ్లిద్దరికీ కొన్నాళ్లు ఊసుపోతుంది" అని ఓముక్క వేసేడు.

హోటలుఖర్చులు తగ్గినందుకు లోన సంతోషిస్తూ, రామారావు కృష్ణమూర్తివంక చూస్తూ "సినీమా నుంచి రావడం చాలా ఆలస్యం అవుతుందేమో... అంతరాత్రి మిమ్మల్ని తొందర చెయ్యడం..."

సుశీల కమలంవంక చూస్తూ "పోనీ, రేపు పొద్దున్నే వచ్చేయండి. హైస్కూలు వీథిలో కాంపౌండుగల ఇల్లే మాది" అంది.

కమలం సుశీలలోని మార్పు కనిపెట్టిందిగాని ఇరువురు మొగవాళ్లూ దగ్గిరే వుండడాన్ని ఆప్రసంగం ఎత్తడానికి వీలయిందికాదు.

రామారావు భార్యవంక చూస్తూ "జాగాలుండవుకాబోలు. లోపలికి వెళ్దాము" అన్నాడు.

కమలం సుశీలా, కృష్ణమూర్తులవంక చూస్తూ "మీరుకూడా రాకూడదూ? అంతా కలిసి వెళ్దాము" అంది.

"అబ్బ! చూసిందే మళ్లా చూస్తే నాకు తలనొప్పి వస్తుంది. ఇంటికి వెళ్లి ఫలహారమో ఏదో చేసుకోవాలా ఇంకా?"

"ఫలహారానికేమిలే? తిరిగి వస్తున్నప్పుడెక్కడయినా తోవలో కొనివ్వవచ్చు" అన్నాడు కృష్ణమూర్తి నవుసుతూ.

"మళ్లీ ఎక్కడ వెళ్తాములేద్దురూ" అని జట్కా ఎక్కింది సుశీల.

కమలం, రామారావులు వీరిద్దరివద్ద సెలవు పుచ్చుకొని సినీమాహాలులోనికి వెళ్లిపోయారు. కమలాన్ని చూస్తూ జట్కా ఎక్కేడు కృష్ణమూర్తి.

జట్కా వెళ్తోంది. సుశీల సినీమాకథని మననం చేసుకుంటోంది. కృష్ణమూర్తిమనసుమాత్రం వేరే విహరిస్తోంది.

"అయినా, అది బాగాలేదు సుమండీ"

"ఏది ?" అన్నాడు కృష్ణమూర్తి కంగారుపడి.

"అక్కడ... కథానాయకుడు...దాన్ని—"

కృష్ణమూర్తి స్తిమితపడ్డాడు.

"అంత చదువుకున్నవాడు అలా ప్రవర్తించడం ..."

మిస్టర్ యస్. కృష్ణమూర్తి, యం. ఏ., యల్. టి. ఏమీ మాట్లాడలేదు.

* * *

ఇంట్లో పూరీలు చేస్తూ మెల్లిగా పాడుకుంటోంది సుశీల: "సుఖసంసారమె పరమానందం"

కృష్ణమూర్తి వాలుకుర్చీలో కూర్చొని ఆమెను చూస్తున్నాడు. కమలంస్వరూపం అతని కన్నుల కింకా కట్టుతూనేవుంది.

ఉన్నట్టుండి సుశీల అంది: "మన ఇల్లు వాళ్లకి తెలుస్తుందో లేదోసుమండీ."

"కనుక్కొని వారే వస్తారు" అన్నాడు కృష్ణమూర్తి యథాలాపంగా.

"ఊరు కొత్త. దారి తప్పవచ్చును. మీరోసారి పొద్దుట వెళ్తే మంచిదేమో."

"అలాగే చూద్దాములేద్దూ. మీ పుట్టింటి వూరివాళ్లు అని ఎంత ఉబలాటపడిపోతున్నావ్ !"

తన కేమీ ఆప్రసక్తి లేనట్టుండడానికి పాపం అతని ప్రయత్నం !

* * *

మర్నాడు కాఫీలయాక నీటుగా దుస్తులు వేసుకొని పైమీద వోణీ వేసుకొని నేమనలహోటలుకు బయలుదేరేడు కృష్ణమూర్తి — భార్యచేత ఓసారి బలవంతం చేయించుకొని. అదృష్టము వరించిందతన్ని.

మేడమీద వారిబసలో ఒంటరిగా ఫేస్ పౌడరు రాసుకుంటూ మెల్లిగా పాడుకుంటోంది కమలం.

"రాగసుధారసము
అనురాగసుధారసము"

కృష్ణమూర్తి ఆ కంఠమాధుర్యానికి అచ్చెరువందుతూ మెల్లిగా అడుగులు వేసుకుంటూ గదిద్వారం సమీపించేడు. పిరుదులదాకా పడుతున్న ఆ కేశ సౌందర్యానికి ఆశ్చర్యపడి ఒక్కఘడియ ద్వారమువద్ద అలా నిలబడిపోయినాడు. అద్దములోంచి ఇతన్ని చూసి వెనక్కు తిరిగింది కమలం. మలచినట్టున్న ఆవిగ్రహము చూసేసరికి కృష్ణమూర్తిహృదయము ఒక్కసారిగా పట్టికొట్టింది.

కమలం ఛప్పున పైట సవరించుకొని, వొయ్యారంవొలికిస్తూ ఓమూలనిలబడి "వారు లేరు. వారి హెడ్ గుమాస్తాగారిని కలుసుకుందుకని వెళ్లేరు. వారు రాగానే వచ్చేస్తాము" అంది.

కృష్ణమూర్తి నవ్వుతూ దర్జాగా గదిలోకి వెళ్లి ఒక కుర్చీలో కూర్చొంటూ "మీకు మాయింటితోవ తెలియదేమోనని నన్ను పంపించింది—ఆఁ—మీరు కాఫీ పుచ్చుకున్నారా?— కాఫీకికూడా అక్కడికే వచ్చేసుంటే బాగుండును" అన్నాడు.

"కాఫీ తాగే వెళ్లేరులెండి...మానుంచి మీ కనవసరశ్రమ అవుతుందేమోనని భయపడుతున్నాము." అంది కమలం చిరునవ్వుతో.

"అబ్బే ! మన కేమి కొత్తవాళ్లమా ! పరిచయం అంటే ఇదివరకు లేదుకాని మాఅత్తవారింటికి వచ్చినప్పుడల్లా మిమ్మల్ని చూస్తూనేవుంటాను" అన్నాడు నవ్వుతూ కృష్ణమూర్తి.

కమలం అతనిమీద ఓచిరునవ్వు పారేసి ఊరుకుంది.

"మీరు నిలబడిపోయారు"

"ఫరవాలేదు" అని కమలం కిటికీ ఆనుకొని నిలబడింది వీథివైపు అప్పుడప్పుడు చూస్తూ.

ఎన్నోసార్లు తా నిదివరకు ఈకృష్ణమూర్తిని చూసే అతని క్రాపింగులాంటి క్రాపింగు పెట్టుకోమని తన మొగుణ్ని బలవంతంచేసిందికాని రామారావు క్లోజుక్రాపులోని సొగసు మరో క్రాపులో లేదని ఆమెమాట పెడచెవిని పెట్టేడు. కృష్ణమూర్తి ఒడ్డూ పొడుగూవిగ్రహాన్నీ, అతని పచ్చని శరీరచ్ఛాయనీ, అతని రిస్టువాచీ, బంగారుసులోచనాలనీ చూసినప్పుడల్లా సుశీల ఎంత అదృష్టవంతురాలో అనుకుంటూండేది కమలం.

"ఎలా గుంది సినీమా" అని ప్రశ్నించాడు కృష్ణమూర్తి, ఆమెకంఠమాధుర్యాన్నింకా చవిచూద్దామని.

"బాగానే వుంది."

"ఇవ్వాళ కాపిటల్లో 'సంసార్' అవుతోందే. అంతా కలిసి మేటినీషోకి వెళ్దామని చూస్తున్నాను"

కమలం కొంచెం నవ్వి "హిందీసినీమాలకి మావారు సాధారణంగా వెళ్లరు" అంది.

"ఆఁ, నే నొప్పిస్తానుగా. అంతా సరదాగా కలిసి వెళ్దామంటే వద్దంటారా ఏమిటి!"

ఇంతలో కమలం కిటికీలోంచి చూసి "అదిగో, ఎవ్వరితోనో కలిసివస్తున్నారు." అంది కొంచెం కంగారుతో. కృష్ణమూర్తి వెంటనే లేచి "నే వెళ్తాను. కొంచెం వేగం వచ్చేయండి" అని గది దాటి మెట్లదగ్గరకు నడిచేడు. కమలం అతని వెంటే ద్వారందాకా వచ్చి నిలబడి చూస్తోంది. చింకికోటుతోనూ, మురుకులు దిగని పంచతోనూ మెట్లెక్కివస్తున్న రామారావు కనిపించగానే కమలం ఒక్క నిట్టూర్పు విడిచి గిరుక్కున తిరిగి లోనికి వెళ్లిపోయింది.

కృష్ణమూర్తి రామారావు కెదురుగా వెళ్లి "ఇదిగో! ఇంకా ఇప్పుడే అడుగుతున్నాను. ఆఫీసుకా వెళ్లేరు?" అని పలుకరించేడు.

"ఆఁ. హెడ్గుమాస్తా ఉంటాడేమో అని వాడింటికి వెళ్లేనుకాని వాడి దర్శనం కాలేదు"

"మా ఇల్లు మీకు తెలుస్తుందో లేదో అని వచ్చేను..."

"ఇదిగో, ఇంకో అరగంటలో వచ్చేస్తున్నాము. హైస్కూలువద్దకదూ మీ యిల్లు?"

"ఆఁ. ఆకొంపొండు, మేడ...నేను వెళ్తాను మరి"

* * *

"వస్తున్నారా?" అని సుశీల మగనిని ఎదుర్కొంది.

"లేదింకా. తోవలోనే కనిపించాడు రామారావు. వారి హెడ్క్లార్కు దగ్గరకు వెళ్లివస్తున్నాట్ట. అతన్ని హోటలుదాకా ఓసారి దిగబెట్టి, వేగం రమ్మని చెప్పివచ్చేను"

* * *

జట్కా వచ్చి యింటిముందు ఆగింది.

సుశీల వీథివంక చూస్తూ "అదిగో—" అంది.

"అందియలా రవళీవా?" అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

సుశీల వీథిద్వారందగ్గరకు వెళ్లింది.

కృష్ణమూర్తి గదిలో కూచొనే కూనిరాగాలు బనాయిస్తూన్నాడు.

ఇంతలో గదంతా సెంటువాసనలను నింపుతూ కమలం ప్రవేశించి ఇతని గదివైపొకసారి చూచి సుశీలతో ఏదోప్రసంగిస్తూ వెనకయింటిలోనికి వెళ్లిపోయింది.

కృష్ణమూర్తిగదిలోంచి గీతాలు వినవస్తున్నాయి.

"జాజీపూదావీచల్లి
పోయే మెరుపల్లే వెరసి"

ఇంతలో రామారావురావడం, ఏవో పలుకరింపులూ, వాటిలో పడ్డా డతను.

కమలం, రామారావులకు మేడమీది గదుల్లో ఒకటి ఏర్పాటయింది.

* * *

శని ఆదివారాలలో దిద్దుదామని ఇంటికి తెచ్చిన కాంపోజిషనుపుస్తకాలన్నీ అలమారులో అలా పడే వున్నాయి. కృష్ణమూర్తిచూపులు కమలాన్ని వెంటనంటే వుంటున్నాయి. కమలాన్నీ, తన భార్యనూ ఒక్కదగ్గిర చూసినప్పుడల్లా వారిద్దరిలో కనపడుతున్న భేదానికి అతను ఆశ్చర్యపోతూన్నాడు. కమలం ఇంకా లేతవయస్సు (స్వీటు టీన్సు)లో ఉండి నిగనిగలాడుతోంది. ఆమెమాటలూ, ముత్యాలపల్వరుస కనిపించే ఆ కిలకిలనవ్వులూ అయింటినిండా ప్రతిధ్వనిస్తూ అతన్నేదో ప్రపంచములో విహరింపజేస్తున్నాయి. ఆమెచెక్కిళ్లలోని నునుపు సుశీలలో కనిపింపలే దతని కళ్లకి. చంకలో ఓపిల్లడు. రెండోది 'In-press' (కడుపులో). ఇంకెక్కడి నిగారింపనుకున్నాడు. ఎలాగయినా ఆడవాళ్లు పిల్లల్ని కనడం మొదలుపెట్టగానే ఇహ సరి అన్న అభిప్రాయానికి వచ్చేడు కృష్ణమూర్తి. ఫేస్ పౌడరు, టాయిలెట్టులతో మెరసిపోతుండే కమలాన్ని చూసి, ఇటు బట్టలన్నీ తడిమరక చేసుకొని వంటింట్లోంచి అటూ ఇటూ హడావిడిగా నడుస్తూన్న సుశీలని చూస్తే......!

భోజనాలయ్యాక రామారావు మళ్లీ వాళ్ల హెడ్డుగుమాస్తాదర్శనార్థం బయలుదేరాడు. అతను వెళ్లేక...

"వచ్చిరావడంతోటే ఆఫీసుపనేనా?" అని కొంచెం హేళనగా అంటూ మేడెక్కుతున్నాడు కృష్ణమూర్తి. కింద కమలం సుశీలతో "అయనకు ఆఫీసే ఇల్లు" అంది నవ్వుతూ.

మేడెక్కుతూ ఆమాటలు విన్న కృష్ణమూర్తి కొంచెం నవ్వి "అందుకే తాలూకాఆఫీసుగుమాస్తాలను గురించి ఆపత్రికలో అలా రాసేరు." అన్నాడు.

సుశీల ఆమాటలకి నవ్వుకుంటూ కమలంతో కూడ భోజనానికి వెళ్లింది.

ఇరువురూ భోజనానికి కూచున్నారు. సుశీల వుండివుండి కిసుక్కున నవ్వుతుండడము చూచి "ఎందుకంతగా నవ్వుతున్నా"వంది కమలం, తనూ కొంచెం నవ్వుతూ.

ఆమె అలా ప్రశ్నించగానే మరింత నవ్వు వచ్చింది సుశీలకి. ఆమె నవ్వాపుకుంటూ "అబ్బే, ఏమీ లేదు-ఆయనకొంటెతనముగాని..."

"ఫరవాలేదు చెప్పుదూ" కారణం తెలీకపోయినా, సుశీల నవ్వడము చూస్తుంటే కమలానికి నవ్వు వస్తూంది.

"ఏమీ లేదు, ఓ తాలూకాకచేరీగుమాస్తా...నీకెందరు పిల్లలని ఎవరో అడిగితే—"

సుశీలకి నవ్వాగడంలేదు.

"ఆఁ, అడిగితే?"

"తాలూకాకచేరీలో చేరకముందు..."

నవ్వును ఆపుకోలేకపోతోంది సుశీల.

"చేరకముందు?"

"తాలూకాకచేరీలో చేరకముందు ఒక్కపిల్లాడని ఆ...తర్వాత..."

"ఆఁ! ఆతర్వాత?"

విరగబడి నవ్వుతోంది సుశీల.

"ఆతర్వాత...తీ...రి...కే...లే—"

సుశీలనవ్వు చూసి కమలానికీ నవ్వు వచ్చి నవ్వుతోందికాని ఆమెమనస్సులోమాత్రం ఏవో భావాలు లేచి అలజడిచేస్తున్నాయి.

ఇంతలో సుశీలపుట్టింటినుంచి ఉత్తరం వచ్చింది. కృష్ణమూర్తి మేడ దిగి ఆ ఉత్తరాన్నందుకొని నట్టింటి ద్వారంవద్దకు వచ్చేడు.

"మీరహస్యాలకు అంతరాయం కల్పించడము లేదుకదా?"

సుశీల అతని చేతిలోని కార్డు చూసి "మావాళ్ల దగ్గర్నుంచా?" అని ఆత్రుతతో ప్రశ్నించింది.

"కాదు. మావాళ్లదగ్గర్నుంచి" అన్నాడు నవ్వుతూ కృష్ణమూర్తి.

"కాదు. ఆదస్తూరీ మాతమ్ముడిదిలాగే వుంది"

"భోజనము అవనీ, చదువుదువుగాని"

"ఊఁహూఁ, ఇలా తెండి"

కృష్ణమూర్తీ, కమలం ఆమెఆత్రుతకు కొంచెం నవ్వేరు.

"పోనీ, ఎప్పుడు వస్తున్నాడో చెప్పండి" అంది సుశీల కొంచెము రక్తిమతో.

శ్రుతి మించిపోతుందన్న భయం వేసి కృష్ణమూర్తి ఆకార్డు ఆమెపైపు విసరి, కమలంవంక ఓసారి చూసి కొంచెం నవ్వి వెళ్లిపోయినాడు.

సుశీల ఆ ఉత్తరం చదువుకొని "రేపు వస్తున్నాడు మాతమ్ముడు" అంది గేటంత మొహంతో.

"నిన్ను తీసుకోవెళ్లడానికా?"

"అవును. ఈదశమి దాటితే వీలులేదుగా"

"ఎన్నో నెల ఇప్పుడు?"

"ఈదశమికి ఆరోనెల వస్తుంది" అంది సుశీల కొంచెం సిగ్గుతో.

"చాలా వేగమే!" అంది కమలం కొంచెం నవ్వుతూ,

"దాని కేమి భాగ్యము"

"మీ ఆయనకు స్కూల్లోనా పని?"

సుశీల "అవును" అని కొంచెమునే పూరకుండి, వెనుకటిసంభావణ జ్ఞాపకానికి వచ్చి "ఏ మలాగ అడిగేవు?" అంది నవ్వుతూ.

"ఏమీ లేదు...జీత మెంత?"

"నూటాఇరవై"

"అదృష్టవంతురాలి వెలాగయినా"

"ఏమిటో ఆ అదృష్టము?"

"అంటే ... అనుకూలదాంపత్యము ... రాకా పోకా...ముద్దూ ముచ్చటా..."

*   *   *

భోజనముపనులు అయ్యాక ఇరువురూ మేడమీదికి వెళ్లి వారివారి గదుల్లో దుస్తులు మార్చుకుంటున్నారు. న్యూస్ పేపరు చదువుకుంటూన్న కృష్ణమూర్తి వారి రాక చూచి తన గదిలోంచి పైకి వస్తూ "ఇవ్వాళ అంతా కలసి 'నయాసంసార్' మేటినీషోకు వెళ్దాము...ఏం?" అన్నాడు.

"అవును సుశీలా. సరదాగా కలిసి వెళ్దాము" అంది కమలం.

"నయాసంసార్ లేదు గియాసంసార్ లేదు. నే నెక్కడికీ రాలేనుసుమా. చాలామటుకు సర్దుకోవాలి...ఏంపట్టుకో వెళ్లాలో, ఏమి అక్కరలేదో"

"ఎక్కడికి?" కృష్ణమూర్తి ప్రశ్నించేడు.

"మా వాళ్లింటికి."

"ఎవర్నడిగి?"

"సరిపోయింది!"

ఇరువురి సంభావణకూ నవ్వుతోంది కమలం.

"నాకు ఇక్స్పెక్షను రోజులు. ఇప్పుడు వెళ్లడానికి కాదుసుమా"

"బాగానే వుంది. ఏడాది కెన్నిసార్లు ఇక్స్పెక్షను?"

"ఇంకో వారంపదిరోజులయ్యాక వెళ్దువుగాని"

"అంటే ఏడవనెలదాకా వీలుండదుకదా అనా?"

"ఆ సంగతి తర్వాత చూసుకోవచ్చునుగాని ముందు సినీమాసంగతి చూడు. నలుగురం కుర్చీల్లో కూచుందాము. ఏం?"

"నే నామొగవాళ్ల మధ్య కూర్చోలేనుసుమండీ."

"ఏడిసినట్లే వుంది. నాపక్కనేగా కూచునేది?" కమలం పకాలున నవ్వింది.

"అసలు ఆయన వప్పుకుంటారో లేదో అడిగేరా?" అంది సుశీల.

"ఆయన అభ్యంతరం చెప్ప రనుకుంటాను." అని కృష్ణమూర్తి కమలంవంక చూసేడు.

కమలం కొంచెం సిగ్గభినయిస్తూ అతనిపైపు చూసినట్టూ కాక చూడనట్టూ కాక "ఏమో. మీరు చెప్పితే వప్పుకుంటారేమోకాని నే చెపుతే మాత్రం లాభం లేదు'... నిన్న ఆ సినీమాకి వెళ్లినందుకే చికాకు పడ్డారు" అంది.

*   *   *

సుశీల తన బట్టలు సర్దుకుంటూంది.

"ఆ బనారసుచీర పట్టుకొవెళ్తాను. బీరువా

తాళాలివ్వండి" అనీ... "నాపరుపు చిరిగిపోయింది, ఇక్కడుంచేస్తాను, దూది ఏకించి కుట్టించండి. అంతదాకా మీ పెద్దపరుపు తీసుకో వెళ్తాను" అనీ సుశీల చేస్తున్న హడావిడి చూస్తూ నిలబడ్డది కమలం.

ఇంతలో రాజు కమలంగదిలోంచి టాల్కుం డబ్బీ తీసుకోవచ్చి మూతతీసి వంపుతూండడం చూసింది సుశీల.

"అరెరె! అది తీసే వేమిట్రా... ఉంచీయమ్మా వుంచీ...ఎంత ఖరీదయిందో ఏమిటో" అని పిల్లడి చేతిలోంచి అది తీయగానే అతను రాగాలాపన మొదలుపెట్టేడు.

"పిల్లాడికేమి తెలుస్తుంది పోనిద్దూ"అని కమలం వెళ్లి రాజు నెత్తుకొని తన గదిలోనికి తీసుకో పోయి బుజ్జగించి ఊరుకోపెట్టింది.

కృష్ణమూర్తి పిల్లడిని ఏడిపించినందుకు భార్యనొకసారి కోపపడి "ఇలా దా అమ్మా దా" అని కమలం చంకలో నున్న రాజును పిలిచేడు. కమలం ఆ పిల్లాణ్ణి ఒకసారి బుగ్గలు ముద్దులాడి కృష్ణమూర్తివంక చూసి "రాడు" అని నవ్వుతూ నిలబడింది.

* * *

"రాత్రి సర్దుకుందువుగాని. మేటినీ షోకి వేళయింది. వేగను కాఫీకి నీళ్లు పెట్టు" అన్నాడు కృష్ణమూర్తి సుశీలా, కమలము లున్న గదిలోకి వస్తూ.

"నాకు ఆ హిందీగోల ఏమీ అర్థం కాదు, నేను రానుసుమండీ"

గదిలో గోడకున్న ఫోటోలు చూస్తూ నిలబడింది కమలం.

"చాలా బాగుంటుందికనూ. అశోక్ కుమార్ వాళ్లు ఏక్టు చేస్తున్నారు" అన్నాడు కృష్ణమూర్తి.

"ఎవర్తె ఆ అశోకకుమారి?"

కృష్ణమూర్తీ, కమలం ఫకాలున నవ్వేరు. సుశీల అర్థంకాక ఇద్దరివైపూ చూసింది. ఆమె అలా చూస్తున్నకొద్దీ వారికి నవ్వు హెచ్చవుతోంది. సుశీల పెట్టె తలుపు ధడాలున మూసి విసాలున లేచి "ఆకాఫీనీళ్లు ఏదో చేసియిచ్చేస్తాను. తాగి మీరంతా వెళ్లండి"అని గబగబ మేడ దిగి వెళ్లిపోయింది.

కృష్ణమూర్తి నవ్వుతూ కమలంవంక చూసి "మీ ఆయనసంగతేమిటి? సాయంత్రానికిగాని రానట్టుం దే!" అన్నాడు.

"ఏమో, ఎప్పుడు వస్తారో. ఇంతకూ సినిమాకి వెళ్లడానికి యిష్టపడతారో లేదో."

కృష్ణమూర్తికి ఆమెజవాబు చెవుల కెక్కనే లేదు. ద్వారాని కడ్డంగా నిలబడి ఆమెసౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నాడు. కమలం గదిలో గోడకున్న ఫోటోలను వరుసగా చూస్తూ ఓఫోటోదగ్గర ఆగిపోయి "పెళ్లిఫోటో కాబోలు" అని ఇతనివైపొకసారి చూసి నవ్వింది.

కృష్ణమూర్తి లోన ప్రవేశిస్తూ "అవును. అర్థాన్నంగా తగలడ్డది. కుర్చీమీద కూచోమంటే వప్పుకుంటేనా?"అని ఆఫోటోని గోడమీంచి తీసి కమలాని కందిచ్చేడు. కమలం అతనివంక ఓసారి చూసి ఆఫోటో నందుకొని "అవును, అంత ఎడంగా నిలబడిపోయిం దేమిటి?" అంది.

"దానిపేరు సిగ్గు" అని నవ్వేడు కృష్ణమూర్తి, ఫోటోను చూస్తున్నట్టు ఆమెకు సమీపంగా వచ్చి.

ఒక్క నిమిషము నిశ్శబ్దము.

కృష్ణమూర్తి ఆమెఅరచేతివంక చూస్తూ "చేతిలో మంచి అదృష్టరేఖ వుందే!" అన్నాడు.

కమలం ఫోటోని టేబిల్ మీద పెడుతూ "మీకు చెయ్యి చూడ్డం వచ్చునేమిటి?" అంది చిరునవ్వుతో.

"ఏదో కొద్దిగా...ఏదీ...ఆయుష్యరేఖ (Life Line) కూడా..."

కమలం తన అరచేతిని విప్పిచూపిస్తూ పైటంతా ముడుచుకుని ఎడంగా నిలబడింది.

కృష్ణమూర్తి ఆమెఅరచేతిని చూస్తూచూస్తూ ఆమెబొటనవేలి కింది భాగాన్ని కొంచెం తాకి "Mount of Venus Prominent గా వుందన్నమాట!" అన్నాడు ఒక్కసారి ఆమెకళ్లల్లోకి చూసి.

కమలంవళ్లు కొంచెం జలదరించింది. అప్రయత్నంగా ఒక్కఅడుగు వెనక్కువేసింది ద్వారంవంక చూస్తూ.

కిందినుంచి సుశీలగొంతుక వినిపించింది :

"అప్పీ ! కాఫీగుడ్డ ఎక్కడ పెట్టేవు?"

కృష్ణమూర్తి ఆమెఅరచేతిని పరీక్షిస్తూ పరీక్షిస్తూ "ఏదీ, మత్స్యరేఖకూడా వుందీ!" అంటూ తటాలున ఆమెమణికట్టును పట్టుకున్నాడు.

కమలంశరీరం కంపిస్తోంది. కృష్ణమూర్తి ఆమె కళ్లల్లోకి చూసేడు. "భయపడుతున్నట్టుంది" అన్నాడు మెల్లిగా.

కృష్ణమూర్తిచేతిలో ఆమెచేయి నలిగిపోతోంది. ఆమెజడలోని సువాసనలతో అతనిలోని పశుత్వము రేకెత్తింది...'అబ్బ'......

ఇంతలో కాఫీకప్పుతో ద్వారందగ్గర సుశీల ప్రత్యక్షం ! లోన కనిపించిన ఆ దృశ్యంతో ఆమెకళ్లు చెవరిపోయాయి.

ద్వారమువద్ద ఛాయని చూసి లోనివారిద్దరూ కంగారుపడ్డారు.

"అ...అదృష్టరేఖ...బాగానేవుంది" అని తడబడుతూ కమలంచెయ్యి వదిలేశాడు కృష్ణమూర్తి. కమలం దూరంగా వెళ్లిపోయింది.

సుశీల గది ప్రవేశిస్తూ "చెయ్యి చూస్తూన్నారా ఏమిటి ? ఫీజు సెటిల్ చేసుకున్నారా?" అంది లేని నవ్వు తెచ్చుకొని.

సుశీల అందిచ్చిన కాఫీకప్పు ఎలాగో చేతిలోంచి జారి కింద పడకుండా తాగేసి కప్పు బల్లమీద పెట్టేసి వెళ్లిపోయాడు కృష్ణమూర్తి.

సుశీలపెదవులపై నవ్వు చూసి కమలం కొంత ఊరటపడింది. టేబిల్ మీదనున్న కాఫీకప్పు అందుకుంటూ అక్కడ పడియున్న ఫోటోని చూసి "పెళ్లినాటిది కిందపడేశారూ?" అంది.

* * * *

సుశీల అటు కృష్ణమూర్తికిగాని, ఇటు కమలానికిగాని ఏమీ అనుమానం కలక్కుండా మామూలుగా నవ్వుతూ తిరుగుతోంది. బుర్రలోమాత్రం అనేకఆలోచనలు పరుగెత్తుతున్నాయి.

సాయంత్రం. మొహం కడుక్కుందికి కమలం, సుశీలా పెరట్లోకి వెళ్లేరు. కృష్ణమూర్తికూడ ఏదో పనిమీద పెరట్లోకి వచ్చేడు. సుశీల ఎత్తుకుంది సన్నని గొంతుకతో.

"నిజమో కాదో
యమునాతటిలో
రాధామాధవలీల"

"నీ కీపాట వచ్చునకదూ కమలం?"

"అబ్బే—రాదు"

"బాగుంటుందిసుమా" అని మెల్లిగా పాడడం మొదలుపెట్టింది, అటు కృష్ణమూర్తివంకా, ఇటు కమలంవంకా చూస్తూ.

"చంద్రిక నీవు
చందురు డతడు
మధురమధువు నీవు"

కృష్ణమూర్తికి భార్యకళ్లల్లో ఓమూడిరి ప్రతీకారం కనిపించింది.

* * *

రామారావు కొన్ని ఫైళ్లు పట్టుకొని ఏఅయిదున్నరకో వచ్చేడు. మేటినీషోటైము మించిపోవడంచేత ఆరుగంటల ఆటకి వెళ్లడానికి నిశ్చయమైంది. టిక్కెట్లఖర్చు కృష్ణమూర్తి పెడతాడని తెలిసిన తర్వాత రామారావు ఏమీ అభ్యంతరపెట్టలేదు. సుశీలమాత్రం తనకు తలనొప్పిగా వుందనీ, పైగా ఆ హిందీ తనకు బోధపడదనీ సాకుచెప్పి, ఎవ రెంత బలవంతం చేసినా వెళ్లలేదు.

ఫలహారములు చేసి మిగతా ముగ్గురూ వెళ్లిపోగానే సుశీల తొందరతొందరగా పెట్టె తీసి పంధ్రెండురూపాయలు పట్టుకొని పెరటిగోడదగ్గరకు వెళ్లి పొరుగుసుబ్బమ్మగారిని పిలిచింది.

" సుబ్బమ్మ దొడ్డమ్మగారూ, మీ రొక సహాయం చేసిపెట్టాలి. ఆ ఎదురుగా రమణమ్మగారిల్లు ఖాళీగా వుంది. ఈ రూపాయలు ఒక్కనెల అద్దె అని

వారి కిచ్చి, ఆ యిల్లు మీ పేరుతోనే తాళంవేయించుకోవాలి. కారణం తరువాత చెబుతాను. ఈ రాత్రే ఆ యింటికి తాళంపడిపోవాలి. నేనిలా చెప్పిన విషయం మూడోకంటివాడికి తెలీకూడదు! ఈవీధి చివరనే కాబో లున్నారు రమణమ్మగారు."

"అయితే,మీ యింటికి ఎవరండీ ఆ అమ్మాయి_"

"అదిగో అదే నేచేసిన పొరపాటు. తెలిసి తెలిసి కొరివితో తల గోక్కున్నట్టయింది. వాళ్లు ఆ ఎదురుగుండా యింట్లో దిగకుండానే ఈ ప్రయత్నం."

"అలాగా? తెలిసిందిలే అమ్మా. చూస్తుండగా నీ గూట్లో మన్ను పడనిస్తానటమ్మా... తే ఆ రూపాయలు. ఇప్పుడే వెళ్లి ఆ యింటికి తాళం వేయించుకొచ్చి చక్కా వస్తాను. రమణమ్మ నేనెంత చెపితే అంత."

* * * *

సినీమా చూచి వచ్చింతర్వాత అట్టే ప్రసంగములు ఏవీ పడలేదు. రాత్రి భోజనా లయ్యాక ఎవరిగూళ్ల్లోకి వారు చేరుకుంటున్నారు.

సుశీల మేడమీద వారిగదిలోకి వచ్చి మంచినీళ్ల చెంబు మేజామీద పెడుతూ "ఈవేళ మీ మేటినీషో నానుంచి పాపం భగ్నమయింది" అంది నర్మగర్భంగా.

మంచముమీద అటూ ఇటూ దొర్లుతున్న కృష్ణమూర్తి ఈమెవంక చూచి "అయితే నేమి, ఆరు గంటల ఆటకి వెళ్లాముగా ... నువ్వు రానంత మాత్రాన —" అన్నాడు.

"నయాసంసార్ సంగతి కాదు ... ఇక్కడ మీ మేటినీషోసంగతి చెపుతున్నాను."

కొంచెం గతుక్కు మన్నాడు కృష్ణమూర్తి. ఆమెవంక చూడలేదు. ఆమె చూపులకి ఆగలేకుండా వున్నాడు. కొంతసేపుండి ప్రసంగం మార్చాలని "మీ తమ్ముడు వచ్చింతర్వాత రెండురోజులయినా వుంటాడా?" అని ప్రశ్నించాడు.

"ఎందుకూ! నేను మరి వెళ్లదలచుకోలేదు."

ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి. "అంత ఉబలాటపడ్డావు! ఏ మొచ్చిం దిప్పుడు?"

"వీరికి యిల్లు ఏదీ కుదర్చకుండా ఎలాగు వెళ్లేది?"

"దాని కేముంది? రేపే రమణమ్మగారితో మాట్లాడి నిశ్చయంచేస్తాను ఆ ఎదురుగుండా యిల్లు"

కృష్ణమూర్తి గోడవంక తిరిగి కూనిరాగాలు తీస్తూ "అందాలదీవి యీమె" అని ఎత్తుకోగానే అర్థోక్తిలోనే "అవునేమో దేవకాంత!" అని అందుకుంది సుశీల. కృష్ణమూర్తి ఈ వైపు తిరిగి భార్యవంక చూసేడు. ఆడు పులే!

"ఏదీ, ఎన్నాళ్లయింది, ఒకపాట పాడు"

"నాకు రావు"

ఆమె స్వరానికి భయపడి ఇప్పు డేమన్నా ప్రమాదమేనని గప్‌చుప్‌గా కళ్లుమూసుకొని పడుకున్నాడు కృష్ణమూర్తి.

పక్కగదిలో, కమలం మంచంమీద కూర్చొని ఆవలిస్తోంది. అప్పుడప్పుడు ఈగదిలోని అలుకుడు వినవస్తోంది. అటు మగనివంక చూస్తే ఫైళ్లలో మునిగి వున్నాడు!

"ఇంకా ఎంతవరకూ రాసుకుంటారు?"_

"ఇంకోగంట"

తల యెత్తకుండానే జవాబుచెప్పి అతడు ఏదో కాగితముమీద కలం పెట్టుకొని తెగబరుకుతున్నాడు!

మూతీ ముక్కూ విరిచి ముసుగుతన్ని పడుకుందామె.

* * *

మర్నాడు తెల్లవారకట్ల పేసింజరులో సుశీల తమ్ముడు సుబ్బారావు వచ్చేడు. వీరింట్లో కమలాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

"అరె! ఇది ఇక్కడుం దేమిటి?"

"మేటినీ షోపరిచయం" అంది సుశీల కృష్ణమూర్తి వింటూండగానే.

కృష్ణమూర్తి మాటమాట్లాడకుండా పైమీద వోణీ వేసుకొని రమణమ్మగారింటికని బయలుదేరేడు. అసలే చికాకుగా వున్నాడు. అక్కడా గ్రేడ్ తిన

గానే అతని చికాకంతా సుబ్బమ్మగారిమీద తిట్లగా బయటికివచ్చింది.

ఇంటికి రాగానే భార్య కట్టిన సామానులన్నీ విప్పుతోంది. "ఏమిటయిం"దని అడిగింది ఇతన్ని చూసి.

"తప్పిపోయింది. నిన్ననే ఈ పాడుగు బోడి అప్పుడే మాట్లాడడమే కాకుండా ఓ నెలఅద్దెకూడా అడ్వాన్సు ఇచ్చి అఘోరించిందట. ఈబోడిదానికి అర్జెంటుగా ఇప్పుడు యిల్లెందుకు కావలసివచ్చిందో?"

"పాపం! మీ అదృష్టరేఖ అనుకున్నంత బాగా వున్నట్టు లేదు" అంటూ సుశీల వంటింట్లోకి వెళ్లి పోయింది.

ఇటు కృష్ణమూర్తికీ, అటు కమలానికీ చురుక్కుమంది. ఒకరి నొకరు ఒకక్షణం చూసుకొని తలలు వాల్చుకున్నారు.

భోజనాలవద్ద సుశీల తమ్మునితో కారణాంతరాలవల్ల తా నిప్పట్లో రాలేనని చెప్పేసింది. అతగాడు ఎందుకు, ఏమిటి అని ఏమీ ప్రశ్నించకపోవడము చూసి, తమ్మునితో రహస్యంగా ఏదో చెప్పేవుంటుందని భావించుకున్నాడు కృష్ణమూర్తి. అంతా కృష్ణమూర్తిసముఖానే జరిగిందికాని అతన్ని ఏప్రసక్తీ ఎవ్వరూ అడుగలేదు.

సుబ్బారావు తనకు సెలవులు దండుగెందుకని సాయంత్రం అయిదుగంటల పేసింజరులోనే తిరిగి వెళ్లిపోయినాడు.

సాయింత్రము స్కూలునుంచి వస్తూ కృష్ణమూర్తి చేతిలోని నాలుగు మల్లిపూలదండలనీ భార్యవైపు విసరేడు. సుశీల ఆశ్చర్యపడి "ఎప్పుడూ లేదు. ఇదేమి ట్రిలాగ"అంది.

కృష్ణమూర్తి దుస్తులు విప్పుకుంటూ "మేష్టర్లంతా కలిసి కొన్నారు. నావంతు నాలుగుదండలూనే తెచ్చేశాను"అన్నాడు చాలా వికటంగా.

"మేష్టర్లందరికీ ఈవేళ మల్లిపువ్వులమీదకు మనసు వెళ్లడం ఆశ్చర్యంగానే వుంది. అయినా స్కూలుకి మల్లిపువ్వు లెవరు అమ్మతెచ్చేరుచెప్మా!"

సుశీలమాటలకు నవ్వువచ్చిందో, లేక తనవంక చూస్తున్నది కనుక నవ్వా లనుకుందోగాని కమలం కొంచెం నవ్వింది. సుశీలా నవ్వింది. కాని ఆనవ్వులో జీవముమాత్రము లేదు.

"స్కూలుకి అమ్మతెచ్చేయని ఎవరు చెప్పారూ? తోవలో కన్పించేయి, కొన్నాము."

"అయితే, ఇటు మార్కెటువైపునుంచి మీరు వస్తున్నారేలా?"

ఇంత క్రాసుపరీక్ష వుంటుందని అతను, పాపం, అనుకోలేదు. తనకి అబద్ధము ఆడడం అంతగా చేతగాదని కృష్ణమూర్తికి ఆనాడు తెలిసింది.

కమలాన్ని జడవేస్తాను రమ్మని బలవంతపెట్టింది సుశీల. విధిలేక వప్పుకుంది కమలం.

కమలంవాసననూనె, పన్ని తెచ్చి దువ్వడం ఆరంభించింది సుశీల. దువ్వుతూ దువ్వుతూ సన్నని గొంతుకలో "వాడే చెలీ... అపవాదే చెలీ" అని ఎత్తుకుంది. కాఫీతాగుతూన్న కృష్ణమూర్తికి ఆనాడు భార్యప్రవర్తన చాలా వింతగా కనిపించింది.

"ఆః. గట్టిగా బిగించకు"

"లేదమ్మా, వదులుగానే వేస్తున్నాను."

....

"మోసకారి కాముదాసుల

మాటలు నీటిమూటే చెలీ" అంటూ సుశీల నాలుగు దండలూ కమలంజడలోనే పెట్టేసింది.

"అరె! పువ్వు లన్నీ నాకే పెట్టేశా వేమిటి?"

"ఉండనీ. నా కెందుకు, ముసలిదాన్ని"

వెనక్కి తిరిగిచూచింది కమలం.

"పాతికేళ్లు నిండా లేవు. ముసలిదాని వయ్యావప్పుడే!"

"పిల్లలు పుట్టుకొచ్చింతర్వాత మరేమిటి చెప్మా!"

కృష్ణమూర్తి చకితు డయ్యాడు.

కమలం, సుశీలా సబ్బుబిళ్ల పట్టుకొని పెరట్లోకి వెళ్లేరు. నూతిదగ్గర కమలం సుశీలచెయ్యి పట్టుకొని

"సుశీలా, నీ మాటలు అదోమాదిరిగా ఉంటున్నాయి. ఏమిటి కారణం?" అంది.

సుశీల కమలాన్ని నిదానించి చూసి అంది: "అయితే, అడుగుతున్నాను నిజం చెప్పు...తప్పెవరిది? నీదా, ఆయనదా?"

కమలం దిగాలుపడిపోయింది.

అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన రామారావు కాళ్లు కడుక్కుందుకని పెరట్లోకి వస్తూ నూతిదగ్గర ఆడువారి అలుకుడు విని తిరిగిపోబోతూ విన్నాడా మాటలు.

సుశీల అంటోంది: "పెద్దదాన్ని చిన్నదాన్ని-చెబుతున్నాను. నువ్వు ఆయనకు కొంచెం దూరంగా ఉండడము మంచిది కమలం."

స్తబ్ధుడై నిలబడిపోయాడు రామారావు. బుఱ్ఱలో ఏవో రైళ్లు పరుగెడుతున్న ట్టవుతోంది.

*　　*　　*

రాత్రి ఏప్రసంగమూ అడుగలేదు రామారావు. మర్నాడు. వేగం లేచి ఇళ్లకోసం ఊరంతా గాలించేడు కాని ఎక్కడా దొరకలేదు. మరి గత్యంతరం లేక నేషనల్ హోటలుకే వెళ్లి తాము మళ్లా అక్కడికే వస్తున్నామని చెప్పి పదిగంటలకు ఇంటికి చేరుకున్నాడు. అప్పటి కప్పుడే కృష్ణమూర్తి భోంచేసి స్కూలుకు వెళ్లిపోయాడు.

రామారావు భార్యను పిలిచి "ఇగో, మంచియిల్లొకటి కుదుర్చుకోవచ్చేను. వేగం సామాన్లు కట్టు" అన్నాడు.

సుశీల అతనిమాటలు విని "ఇప్పటికిప్పు డేమి తొందర? వారు రానీ...సాయింత్రము వారు వస్తే వెళ్లిపోదురుగాని." అంది.

"ఆలస్యము చేస్తే ఈ ఇల్లుకూడా తప్పిపోగలదు" అంటూ రామారావు స్నానానికి వెళ్లిపోయాడు. అతని కళ్లల్లోని తీవ్రతకి ఇరువురుస్త్రీలూ వింతపడ్డారు.

సుశీలబలవంతంమీద ఇరువురూ భోజనం చేసేరు. రామారావు జట్కాకోసం వెళ్లేడు. కమలం తన టాయిలెట్ బాక్సు పెట్టెలో పెడుతోంది.

"ఈ ఎదురుసుండా ఇల్లు దొరికివుంటే చక్కా ఇద్దరికీ వూసుపోనా, అది చేయిజారిపోయినదాకా వూరుకున్నారు మావారు...ఎక్కడయితేనేమి, ఇల్లు దొరికిందికదా...మళ్లా నేను మావూరునించి వచ్చిన తర్వాత వచ్చి మీ యిల్లు చూస్తానులే" అంది సుశీల.

"ఎప్పుడు వెళ్తున్నావు?"

"ఈ రాత్రి"

"ఈ రాత్రే!"

"ఊఁ. మావారితో కలిసి"

*　　*　　*　　*

హోటలు చేరిందాకా రామారావు ఏమీ అనలేదు. జట్కావాడికి డబ్బిచ్చి పంపించి మేడమీదికి వచ్చి భార్యవంక ఉగ్రుడై చూచి "ఏమిటి చేశా డావెధవ?" అని ఉరిమేడు.

అతని స్వరూపం చూసి భీతితో వణుకుతూ ఓమూల నిలబడింది కమలం.

....

వచ్చీరావడముతోనే భార్యాభర్తల కెందుకు కలహం వచ్చిందా అని ఆహోటలువాళ్లంతా ఆశ్చర్యపోయారు. ఆనాటకం చూసినవాళ్లంతా 'ఎంత నిర్దయుడు' అనీ, "పాపం కాకిముక్కుకి దొండపండు" అనీ తలోరీతి అనుకున్నారు.

*　　*　　*

పంద్రెండున్నరకు కృష్ణమూర్తి యింటికి వచ్చేటప్పటికి సుశీల పేరంటానికి బయలుదేరుతున్నట్టు ముస్తాబైవుంది. నీలిచీరా, సిల్కుజాకెట్టూ, వాలుజడా-చాలానాళ్లయిం దామెను ఆ ముస్తాబుతో చూడ్డం అతను. గదిలో ప్రయాణానికి సిద్ధంగా సామాను లన్నీ సర్దివున్నాయి.

"ఏమి టిదంతా? వా రేరీ?"

"వెళ్లిపోయారు. వారి కేదో ఇల్లు దొరికిందిట"

"అంత హఠాత్తుగా వెళ్లిపోయా రేమిటి?"

"అవును మరి. ఆ బ్రాహ్మడు మిమ్మల్ని నమ్ముకొని ఇక్కడకు వచ్చినందుకు బాగానే చేసేరు"

"ఏమిటి చేశానంటావు?"

"మేటినీషో గోలలో వుండిపోయి —"

దుస్తులు విప్పుకుంటూ సుశీలవంక తిరిగి చూసేడు కృష్ణమూర్తి.

"మేటినీ షోగోలలో వుండిపోయి ఎదురుగుండా రమణమ్మగారిల్లు చేయిజారిందాకా వూరుకున్నారా మరి"

కాఫీ తేవడానికి వెళ్లింది సుశీల.

కాఫీ పట్టుకొస్తున్న ఆమెను చూచి కృష్ణమూర్తి వాలుకుర్చీలో కూర్చొంటూ "మట్టముభ్యాహ్నం ఆ ముస్తాబేమిటి, ఈ సామానన్నీ ఇలా సర్దివున్నాయేమిటి?" అన్నాడు.

"మా నాన్నింటికి ప్రయాణం. వీలుగా వుంటే సాయింత్రం పేసింజరులో, లేకపోతే రాత్రి మెయిలులో"

"ఎవరి వెంట?"

"మీ వెంటేను — మీ బట్టలన్నీ కూడా సర్దేశాను — మీరు ఏమూడురోజులయినా సెలవు పెట్టాలి"

కృష్ణమూర్తి కాఫీతాగుతూ "వచ్చిన తమ్ముణ్ణి పంపేయడమేమిటి ... నా వెంట ఇప్పుడు ప్రయాణమేమిటి — నాకేమీ అర్థం ..."

"అంతా మీ మేటినీషో చేసింది"

"ఏమిటి, మేటినీషో, మేటినీషో అని చంపేస్తున్నావు!"

తమలపాకులు చీరుతూ అంది సుశీల: "మా నాన్నింటికి మీరు ఎప్పుడు వచ్చినా ఆ ఎదురుగుండా కిటికీపైపే చూస్తూండేవారని మా చెల్లి చెబితే ఏమిటో అనుకున్నాను ... పాతపరిచయం అన్నమాట!"

"దాని మొహం, నీ మొహమూను!"

సుశీల తలవంచుకునే తమలపాకులు చీరుతోంది. దూరంగా ఆడుకుంటున్న రాజు అలవాటు చొప్పున తల్లిదగ్గరకు వచ్చి "నేనిత్తా" నని చేతులు జాచేడు.

సుశీల తమలపాకులు చిలకలుచుట్టి పిల్లడివేళ్లకి పెడుతోంది. సుశీలవంక చూస్తూ ఆలోచిస్తున్నాడు కృష్ణమూర్తి: ఇంట్లో ఈయుద్ధపరిస్థితులు ఎల్లా చల్లారుతాయా అని.

సుశీల రాజు నెత్తుకొని అతనివ్రేలికున్న తమలపాకుల చుట్టల్ని మగనినోటి కందిచ్చింది. పదివేళ్లలోనివి కృష్ణమూర్తి నోటితో అందుకున్నాడు. వేళ్లకి కితకితలయి రాజు నవ్వుతున్నాడు. సుశీల రాజు నెత్తుకొని చేతుల్లో ఎగరవేస్తూ,

"రివ్వున ఎగిరే బొమ్మలూ—
గిరగిర తిరిగే...పకపకనవ్వే—"

తల్లి చేతుల్లో కిలకిల నవ్వుతున్నాడు రాజు.

భార్యమొహంలో మళ్లీ దరహాస చంద్రికలు పొడగట్టడంతో ప్రాణం లేచివచ్చిన ట్టయింది కృష్ణమూర్తికి.

సుశీల కొడుకును ఆడించి ఆడించి తండ్రివొడిలో కూలవేసింది నవ్వుతూ. ఆ ఊపులో ఆమెజడ అతని చెంపకు తగిలింది.

కృష్ణమూర్తి కొడుకుబుగ్గల్ని ముద్దుపెట్టుకొని, జేబులోని రంగుసుద్ద నొకటి అతని చేతిలో పెట్టి కిందకు దింపేశాడు.

"ఏమిటి, అప్పుడే వేళయిపోయిందీ?"

భార్యవంక భర్తా, భర్తవంక భార్యా కొంతసేపలా చూచుకొన్నారు. ఇద్దరికీ నవ్వు వచ్చింది.

"సుఖసంసారమె పరమానందం" అంటున్నాయామె కళ్లు.

ఉన్నట్టుండి కృష్ణమూర్తి ఆమెచేతిని పట్టుకున్నాడు.

"నా అదృష్టరేఖ అంత బాగుండదేమో!"

"సుశీ...పొరబాటు...కొంచెం కాలు జారిందంతే."

ఆమెకళ్లల్లో క్షమాపణ కనిపించింది... దగ్గరకు లాక్కున్నాడు.

"మేటినీషోవా?" అని సుశీల నవ్వుతూంటే...

కింద సుద్దతో గీతలు గీసుకుంటున్న రాజు సుద్దముక్క జారవిడిచి వింతగా చూస్తున్నాడు వారిద్దరివైపూ.

మానవదర్శనం

★

= శ్రీ హనుమచ్ఛాస్త్రి =

ప్రతిహృదయంలో
ప్రతిసదనంలో
జ్వాలలు రగిలించని
జ్యోతులు వెలిగించని
పా టెందుకు ?
పద మెందుకు ?
తేనెపాటకవిగారూ !
ఈ నాడా మీ కోతలు —

***

మీ చావని చరిత్ర కేంలే —
మా జీవనయాత్రాయాతన
కలిగించుకు
తెలిగించని
మహాకవీ !
జహాపనా !
మొయలేమయ్యా నీ పల్లకి
మొహమాటం దేనికి ?

***

కన్నీళ్లల్లో
వెన్నెల —
సున్నాలో
సుందరాంగి
ఆకలికేకల్లో
కోకిల కాకలి
చూసే మోసపు ఊసుల
నడిచాం
గడిచాం —
నేడా ?
మల్లిపూవు రేకుల్లో
తల్లిచావు పిల్లలు,
హరివిల్లుల్లో [నిల్లు,
అంటుకుపోయే అభాగ్య
కడల వెలుగు సంధ్యారా
కష్టజీవి నెత్తుటికళ్లు. [గంలో
ఖర్మం !
కనపడతాయయ్యా మాకు.

***

తత్త్వమసిలోని
అసితో —
కవనంలోని
వనం నరికి —
కోలాహలపు
హాలంతో —
తాపసుల
పసులతో —
పామరుల
సోమరుల
మరుభూములు దున్నితే
దుర్యోధన
ధనంపంట —
కుబేరుడు
బేరానికి దిగడా ?

***

శవంముందు
బాజాలూ,
పడుపుకత్తె
వేషాలూ,
ఊరేగే మురికినీరు,
సానివాడ
సప్తాహం,
తాగుబోతు
బూతులాట,
ముష్టివాడి
మొండిఘోష,
ఎముకముక్క—
భాగానికి
కుక్కల్లో
కుమ్ములాట
మా కైతకు
సందేశం.

——o——



[జననము 1890 మరణము 1942]

స్వర్గీయ డా. రాఘవేంద్రరావు

✿

= శ్రీ మోటూరి సత్యనారాయణ =

నిరుపమానము, మహోజ్జ్వలము నయినట్టి ప్రతిభ, హృదయం చూరగొనే వర్తన, ఉత్కృష్టమైన సంస్కారాలు, గంభీరమైన, విశాలమైన ప్రాపంచిక విషయపరిజ్ఞానం, దీర్ఘదర్శిత్వం గలిగి నైపుణ్యంతో కూడిన రాజకీయదక్షత, ప్రపంచంలోని ఏపార్లమెంటుకైనా వన్నె తేగల ఎనలేని వాదనైపుణ్యం, న్యాయప్రియత్వం, దళితవర్గాలపట్ల సానుభూతి—ఇవి డాక్టరు యీడ్పుగంటి రాఘవేంద్రరావుగారిలో వున్న కొన్ని గుణాలని మహాకోసలప్రాంతానికి చెందిన రాయపూరు న్యాయవాదిసంఘంవారు రావుగారి మృత్యువుకుపిమ్మట తమ సానుభూతితీర్మానంలో వెల్లడీకరించారు. ఇది సీ. పీ. లోనూ, ఇతరప్రాంతంలోనూ రావుగారి గుణగణాలనూ, సేవలనూ ప్రశంసిస్తూ చేసిన వందలకొలది తీర్మానాలలో ఒకటి.

ఉత్తరదేశానికి వలస

పందొమ్మిదో శతాబ్దం పూర్వార్ధం, ఉత్తరార్ధంలో కూడ బ్రిటిషుగవర్నమెంటు తమ సైనికబలాన్ని అమర్చుకొనడానికీ, వాటికి కావలసిన శిబిరాలను ఏర్పరుచుకోవడంకోసమూ బ్రహ్మాండమైన ప్రయత్నాలు చేసింది. ఇప్పటివలె అప్పుడు సైనికులకు కావలసిన సామానులు మోసుకుపోవడానికై రైళ్లు వుండేవి కావు. మద్రాసుప్రాంతాన్ని జయించినతరువాత తెలుగుసిపాయీల సహాయంతో బెంగాలు, బీహారు, సీ. పీ. సెంట్రలుఇండియాలను ఏవిధంగా బ్రిటిషువారు ముట్టడించిందీ, జయించిందీ మనకు చరిత్రకారులు చెప్తూనేవున్నారు. అందుకనే నేటికికూడా బీహారు, యు. పి. రాజపుతానా, సెంట్రలు ఇండియా అంతటా 'తెలంగీ' అంటే సిపాయి అని అర్థం. హిందీడిక్షనరీలలో ఈనాటికికూడ ఈ అర్థమే వ్రాయబడివుంది. ఆరోజుల్లో ఎంతోమంది తెలుగువారు తమ దేశం విడిచి ఈ మిలిటరీదండుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దేశంలో శాంతపరిస్థితులు ఏర్పడిన తరువాత ఈ సైనికశిబిరాలకు ఆహారసామగ్రి, లేక ఒక శిబిరాన్నుంచి మరొక శిబిరానికి సైనికులు, సామాను చేర్ప

వలసివస్తూవుండేది. రైళ్ల సౌకర్యం లేనందువలన ఎడ్ల మీదనే ఈ పని చేయవలసివస్తూవుండేది. ఈ సామానులు తోలే వ్యాపారం ఆ రోజుల్లో చాలా లాభసాటిబేరం. ఈ సామానులు తోలే పని గుత్తకు పుచ్చుకొని సికింద్రాబాదు, నాగపూరు, దేవోలీ, మవూ, జబల్పూరు మొదలైన సైనికశిబిరాల్లో తెలుగువారు పనిచేస్తూవుండేవారు. ఈ కంట్రాక్టులకోసం సీ. పీ. చేరిన కుటుంబాల్లోదే డాక్టరు యీద్పుగంటి రాఘవేంద్రరావుగారి కుటుంబం. రైళ్లు వచ్చిన తర్వాత కంట్రాక్టుపని ఆగిపోవడంచేత రావుగారి తండ్రియగు నాగన్నగారు నాగపూరునుండి వ్యాపారంకోసం బిలాసపూరు వెళ్లారు. అక్కడ వారు వేలకొలది ఆస్తి సంపాయించడం, తన ఏకైక పుత్రుడగు రాఘవేంద్రరావును ఇంగ్లండు ఉన్నతవిద్యాభ్యాసమునకు పంపించడం జరిగింది. కాని దురదృష్టవశాత్తు కొడుకు ఇంగ్లండునుండి తిరిగి వస్తూవుండగానే తండ్రియగు నాగన్నగారికి ఈశ్వరాజ్ఞ అయింది.

వకాలత్తును త్రోసిరాజుచేసి రాజకీయాలలో ప్రవేశం

రావుగారు ఇంగ్లండునుండి బారిష్టరీ ప్యాసయి వచ్చిన తర్వాత తన వృత్తిలో చేసిన పరిశ్రమా, చూపిన శ్రద్ధా అంత ఎన్నదగినవి కావు. ఆయనకు ప్రథమంనుండి ప్రజాజీవితంలోనూ, రాజకీయంలోనూ ఉన్న మక్కువ తన వృత్తియగు వకాలతులోనూ, తన తండ్రి ఏర్పరుచుకొన్న వ్యాపారంలోనూ లేకపోయింది. విద్యార్థిగా ఇంగ్లండులో గడిపిన మూడు సంవత్సరాల్లోనూ ఆయనలో మితిమీరిన దేశాభిమానానికీ, తనదేశపు పురోభివృద్ధికై తాను చేయవలసిన సేవకూ బీజా లేర్పడ్డాయి. భారతరాజకీయాకాశమున ఏకైక సూర్యుడై లోకమాన్య బాలగంగాధరతిలకు విహరిస్తున్న రోజు లవి. మహారాష్ట్రం హిందూదేశానికి నాయకత్వం వహిస్తున్న దినా లవి. రావు లోకమాన్య తిలకువద్ద, తదితర మహారాష్ట్రీయ నాయకులవద్ద రాజకీయాల్లో తన మొదటి పాఠాలు నేర్చుకున్నాడు. తన స్వంతపట్టణమగు బిలాసపూరు మునిసిపలు చెయిరుమనుగా తన రాజకీయ జీవితం ప్రారంభించాడు. ౧౯౨౦ లో తిలకు అస్తమించిన తర్వాత, మహాత్మాగాంధి సారథ్యం క్రిందకు భారతరాజకీయశకటం వచ్చినపుడు దానిని వెంబడించిన యువకుల్లో రావుగారుకూడ ఒకరు. ౧౯౩౪ వరకు రావుగారు కాంగ్రెసులో ప్రసిద్ధనాయకుడుగానే వున్నాడు. మహాకోసలరాష్ట్రీయకాంగ్రెసు సంఘానికి తాను మొదటి ప్రెసిడెంటు. తాను కాంగ్రెసులో వున్నంతకాలం దానికి ఇంచుమించుగా ప్రెసిడెంటుగానే వున్నాడు. సీ. పీ. మహాకోసలంలో ఆయన సంపాయించిన పలుకుబడి, ఆ ప్రాంతాన్ని ఒకసూత్రం మీద నడిపించడంకోసం ఆయన చేసిన పని, యువకుల్లోనూ, పెద్దల్లోనూ తన శక్తిచాతుర్యాలద్వారా ఆయన పురికొల్పిన ఉత్సాహం, తన దీర్ఘదర్శిత్వంద్వారా, విశాలత్వంద్వారా ఆయన వేసిన పునాది— వీటివల్లనే నేటికికూడా సీ. పీ. భారతరాజకీయాల్లో దివిటీవలె వెలుగుతోంది

మంత్రిత్వము, గవర్నరుపదవి

విద్యావిషయంలోనూ, రాజకీయంలోనూ సీ. పీ. చాలా వెనుకబడివుండేప్రాంతం. దీనికితోడు అది మూడుభాగాలుగా విభజింపబడింది. నాగపూరు సీ. పీ., బీరారు సీ. పీ. అని రెండురాష్ట్రాలూ, హిందీ సీ. పీ. అని ఒక రాష్ట్రం మొత్తం మూడు రాష్ట్రాలు. ఈమూడు రాష్ట్రాల రాజకీయాలు వేరు, నాయకులు వేరు, సమస్యలు వేరు, విజ్ఞానసంబంధాలు వేరు. ఈప్రాంతంలో రాజకీయం అంటే బురదగుంటవంటిది. సంఘర్షణ హెచ్చు. ఐకమత్యం తక్కువ. అజ్ఞానం అధికం. సీ. పీ. నాగపూరుకూ, సీ. పీ. బీరారుకూ ఒకప్రక్క, సీ. పీ. మరాఠీకీ, సీ. పీ. హిందీకీ మరొకప్రక్క ఎడతెగని పోటీ. మహారాష్ట్రీయులు రాజకీయవాసనగలవారు. పారంపర్యంగా వారికి పరిపాలనాదక్షత వుంది. విద్యలోనూ, వివేకంలోనూ వారిది అందెవేసిన చెయ్యి. సాహసంలో వారికి బహుకొద్దిమంది సాటి. మహారాష్ట్ర సామ్రాజ్యం స్థాపించాలనే సంకల్పమే వారి సాహసానికి పరమావధి. శివాజీ వంశజులైన భోసలారాజులకు చెందినదిగదా నాగపూరుకోట! ఈ కోటచుట్టూ వందలకొలది చిత్రవధ

వంశజులకు వేసవాలు చేరివున్నారు. పేరుకు సీ. పీ. మరాఠీలో చేరినది. అయినా నాగపూరు చిత్పవన పొలిటీషియన్లకు పెట్టనికోట. కాపరడేలు, పరాంజపేలు, ఖరేలు, పట్వర్ధనులు, తాంబేలు మొదలైన ఎంతోమంది హేమాహేమీలున్న స్థాన మిది. పూనా నుండి ప్రతిరోజూ రాజకీయ విజ్ఞానం ప్రవహించే పట్టణం ఇది. సీ. పీ. ప్రభుత్వానికి ప్రధాననగరం నాగపూరు. మధ్యపరగణాల రాజకీయంలాగానే మధ్యపరగణాలకు ప్రధానపట్టణమైన నాగపూరు కూడ ఒక కలగూరగంప. పార్సీ పెట్టుబడిదారులు, మార్వాడీవడ్డీ వ్యాపారస్థులు, మహారాష్ట్రీయ జాగీరుదారులు గల నాగపూరులో రావుగారు రాజకీయంలో ప్రవేశించారు. ఒక సామాన్యకాంగ్రెసువాడుగా జీవితం ఆరంభించి రాజకీయంలో ఎక్కడా దారి తప్పుకోకుండా తాను కోరిన గమ్యస్థానానికి చేరుకున్నాడు. ఈ నాగపూరులోనే రెండేళ్లు రాష్ట్రానికి ప్రధాన మంత్రిగానూ, ఏడేళ్లు గృహసచివుడుగానూ, నాలుగు మాసాలు గవర్నరుగాకూడ పనిచేశాడు. ౧౯౨౭ మొదలుకొని ౩౭ వరకు నిరాటంకంగా రాష్ట్రం అంతటా తన అధికారాన్ని చెలాయించాడు. ప్రభుత్వపు శాఖ లన్నిటిలోనూ రావుగారు తన అసమానమైన ప్రతిభను ప్రతిబింబించేటట్టు చేశాడు.

కేవలము స్వశక్తితో వృద్ధికివచ్చిన ప్రజ్ఞాశాలి

రాజకీయాల్లో పైకి రావాలంటే, కుటుంబంలో పారంపర్యంగా వచ్చే ప్రతిష్ఠ కొందరికి పనికి వస్తుంది. విస్తారమైన ధనం, జమీందారీ, తత్సంబంధమైన అధికారం, పలుకుబడి కొందరికి లాభిస్తుంది. చెమట ఓడ్చి రేయింబవళ్లు కష్టపడి ఏదో ఒక వృత్తిలో సంపాదించిన జ్ఞానం, తత్ఫలితంగా లభించిన కీర్తి కొంతమందిని ఆదుకొంటుంది. అపారమైన పాండిత్యం, విద్వత్తు, విరివిగా వివిధ విషయాలమీద వ్రాసి ప్రచురించిన గ్రంధకర్తృత్వం కొంతమందికి సహాయపడుతుంది. చేతిలో లక్షలకొలది డబ్బుండి, ప్రజలనూ, పార్టీలనూ కూడగట్టుకొనే శక్తి వుండి పగలు రాత్రి అనకుండా పాటుపడేవారికి రాజకీయ నాయకత్వం లభింపవచ్చు. ప్రచారం చేయడానికి కావలసినంతమంది స్వంతప్రచారకులు, వార్తాపత్రికలు లభిస్తే రాజకీయనాయకత్వం సంపాయించి నిలుపుకోవచ్చు. బహుసంఖ్యాకులైన సజాతీయులుంటే వారి అండకూడ రాజకీయ నాయకత్వానికి కొంత దోహద మిస్తుంది. మంచి వాగ్ధాటి, వ్యాసకళా నైపుణ్యంతో రాజకీయ కీర్తిసౌధాన్ని కట్టవచ్చు. కాని రావుగారి జీవితంలో పైని చెప్పిన వేవీ ఆయన రాజకీయనాయకత్వానికి ఉపకరించినట్టు కనపడవు. ఆయనరాజకీయజీవితమంతా తాను స్వయంగా నిర్మించుకొన్నదే. ఆయనకు కలిగిన ప్రతి జయమూ స్వశక్తిమీద పోట్లాడి సంపాయించుకొన్నదే. ఆయన ఔన్నత్యపథంలో అడ్డు వచ్చిన ప్రతిబంధకా లన్నీ ఒంటరిగనే పోట్లాడి ఒదిలించుకున్నవే.

అధికారపురస్సరంగా సేవచేసిన దేశాభిమాని

గాంధీగారు రాజకీయంలో ప్రవేశించిన తర్వాత గొప్పదనానికి విలువగట్టే ఒరిపిడిరాయే మారిపోయిందని చెప్పవచ్చు. త్యాగానికీ, సేవకూ, సాహసానికీ, భావస్వాతంత్ర్యానికీ, విజ్ఞానానికీ, విద్వత్తుకూ వ్యాఖ్యలుకూడ మారిపోయినవనడంలో సందేహంలేదు. సౌఖ్యజీవనాన్ని సరకుచేయకుండా దేశస్వాతంత్ర్యం కోసం దిమ్మరియై తిరిగే వ్యక్తి త్యాగి అనీ, ఇల్లిల్లూ తిరిగి తన కున్న తాహతుతో ఇతరులకు సహాయం చేసేవాడు సేవకుడనీ, స్వాతంత్ర్యంపిలుపు వచ్చినపుడు విపత్తును ఎదుర్కొనడానికి జంకనివాడు వీరుడనీ, అతిసామాన్యమైన సౌకర్యాలనుకూడ నిరాకరించి సేవాకార్యంలో కఠినజీవితాన్ని గడిపేవ్యక్తిఆదర్శప్రాయుడనీ, తమతమ పరివారాల్ని పోషించే సాధకబాధకాల్ని గురించి ఆలోచించకుండా నిర్మోహత్వంతో కాని, నిర్లక్ష్యంగాగాని దేశంకొరకు పాటుపడేమనిషి దేశాభిమాని అనీ, ప్రస్తుతసమస్యలమీద బుద్ధిని చకితపరచేసేటట్టు భావపారిశుద్ధ్యంకలిగివిషయవైదుష్యం కనపడేటట్టు ప్రకటనచేసినవ్యాసాలను వ్రాయగలవారిని రాజకీయవిశారదు లనే భావం దేశంలో ప్రబలిపోయింది. పరాధీనమైన దేశంలో ఇటువంటి గుణాలకు ఈవిలువ గలగడం దేశానికి చాలాశ్రేయోదాయ


కమే. అయినప్పటికీ మనకు మరొకవిధమైన దేశాభిమానంకూడ అవసరం. ప్రభుత్వంలో ప్రవేశించిన తర్వాత సంపూర్ణమైన పరిపాలనాదక్షతతో ప్రభుత్వాన్నంతా దేశోపయోగంకోసరం మార్చి నడిపించగలిగే పరిపాలనాదక్షులు మనకు కావాలి. రాజకీయాల్ని, శాసనసూత్రాల్ని, శాసననిబంధనల్ని సాంగోపాంగంగా తెలిసినవారు, వ్రాయ సమర్థత కల మునద్దీలుకూడా మనకు కావాలి. స్వతంత్రంగాను, సామర్థ్యంతోను పరిపాలనాశకటాన్ని నడిపించగల సారథులు మన కుండాలి. ప్రలోభ మనేది ఎరగని నిష్కామ బుద్ధితో పరీక్షలలో నెగ్గగలిగిన సమర్థులు మన కవసరం. విరోధులకు లొంగక, స్వార్థులకు భయపడక న్యాయము, ప్రజాలాభమును పురస్కరించుకొని నిర్భయముగా శాసించగల వీరశాసకులుకూడ మనకు కావాలి. ఇతడు బీద, అతడు ధనికుడు అనే భేదభావం లేకుండా, నిష్పక్షపాతంగా నడిపించగల మంత్రిపుంగవులుకూడా మన కవసరం. వర్గభేదాల్ని తగ్గించి, జమీందారీ—రైతుల సమస్యలను సమన్వయపరిచి, ఉత్పత్తిదారులు పెట్టుబడిదారుల సంఘర్షణలో దేశాన్ని విపత్తిపాలు కానీయకుండా చాకచక్యంతో రాజ్యాన్ని నడిపించగల నిపుణులు మన కెందరున్నా చాలరు. ఉద్యోగమదంవల్ల పౌరులను అవమానించడమే కాకుండా వారి రక్తాన్ని పీల్చిపిప్పి చేసే అధికారులకు బుద్ధిగరిపే చండశాసనులుకూడా మన మెక్కువగా కోరవలసినవారు. తన చేతిలోనున్న అధికారమును, తలలోని బుద్ధిని, కలిగిన అనుభవాన్ని, సంపాయించిన వివేకాన్ని ప్రజలకోసం వినియోగించే వ్యక్తినికూడ దేశాభిమాని అని ఉగ్గడించవద్దా? ఇట్టివారు వచ్చినంతవరకు అధికారాన్ని కోరి సంపాయించి నిర్వహించే దేశాభిమానులు. మిగతవారు ఎక్కువఅధికారములకోసమై ఉద్యమాలను నడుపుతూ తక్కువఅధికారాలను త్యజించే దేశాభిమానులు. డాక్టరు రావుగారు అధికారమును పురస్కరించుకొని సేవచేసిన దేశాభిమాని.

స్వరాజ్యపార్టీ-సీ.పీ.లో నాయకత్వం

౧౯౨౨-వ సంవత్సరములో గయా కాంగ్రెసు పిదతరువాత మోతీలాల్ నెహ్రూ చిత్తరంజనదాసులు గాంధీఉద్యమపు రాజకీయవివేకాన్ని సవాలుచేశారు. కోర్టులు, స్కూళ్లు, శాసనసభలు బహిష్కరించడం తప్పని నిర్ధారణ చేశారు. ౧౯౨౩ లో జరిగిన ఎన్నికలకై స్వరాజ్యపార్టీని స్థాపించి కాంగ్రెసువారిని శాసనసభలకు నిలిపారు. శాసనసభల్లోకి వెళ్లి ప్రభుత్వాన్ని ప్రతిష్టంభింపచేయవలెనని వేసిన ఎత్తది. మంత్రివర్గాలు ఏర్పడకుండా చేయాలని అన్నిరాష్ట్రాలలోనూ ప్రయత్నాలు జరిగినవి. తత్ఫలితంగా కాంగ్రెసు వేసిన ఈయెత్తు ఒక్క సీ. పీ. లో తప్ప ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా సాగలేదు. సీ. పీ. కాంగ్రెసు పార్టీకి రాఘవేంద్రరావుగారు నాయకుడు అప్పుడు. ప్రభుత్వాన్ని ప్రతిష్టంభింప చేయడంకోసం రావుగారు పార్టీని ఏవిధంగా నడిపించిందీ, ప్రభుత్వపు ఎత్తులన్నిటిని ఏవిధంగా చిత్తుకొట్టించిందీ కాంగ్రెసుచరిత్రలో సగర్వంగా వ్రాయబడివుంది. ఆరోజులలో భారతమాతకంఠమాలలో సీ. పీ. మణిపూసలాగా మెరిసింది. భారతదేశంలోని కాంగ్రెసువాదు లంతా "సెబాస్ సీ. పీ." అన్నారు. రావుగారి సామర్థ్యాన్ని మోతీలాల్ నెహ్రూ, సీ. ఆర్. దాసులు ఎంతో పొగడించారు. సీ. పీ. అంటే రాఘవేంద్రరావు, రావు అంటే సీ. పీ. గా ఏర్పడిపోయింది. సీ. పీ. కాంగ్రెసువాదులు రావుకు బ్రహ్మరథం పట్టారు. భారతమాతదాస్యశృంఖలాన్ని తెంచడానికి దెబ్బవేసేవారిలో రావు అగ్రగణ్యుడుగా వుంటాడని అనుకున్నారు. రావే కాంగ్రెసులో వుంటే ఒకనాడు కాంగ్రెసుప్రెసిడెంటై వుండేవాడని సీ. పీ. ప్రధాననాయకులలో ఒకరైన ద్వారకాప్రసాదుమిశ్రగారు ఎన్నోసార్లన్నారు.

రాజకీయ దృక్పథంలో మార్పు

కాని ౧౯౨౬-వ సంవత్సరంలో రావుగారి రాజకీయ దృక్పథంలో విపరీతమైన మార్పు గలిగింది. బయటవుండి ఎంతప్రయత్నంచేసినా, ఎంత వుద్యమము నడిపినా ప్రజలకు మేలుచేయడానికి అలస్యం కాకుండా వుండదని ఆయనకు దృఢపడింది. ప్రజలకు మేలుచేయడానికి ప్రభుత్వపరికరాల్ని ఎందుకు వుపయోగించుకో గూడదని ఆయనకు ఆలోచన పుట్టింది. తనలో రగులొకొని మండుతూవున్న దేశప్రేమ, దేశీయులకు



గాంధీటోపీ గవర్నరు రాఘవేంద్రరావుగారు
[సిబ్బందితో తన స్వంతపట్టణమగు బిలాస్పూరుకు పోయిన సందర్భమున తీసిన చిత్రము]

ఏవిధంగానైనా మేలుచేయాలనే అకుంఠితదీక్ష, క్రిందటి పది సంవత్సరాల్లో జాతీయోద్యమాన్ని నడిపించడంలో తన కలవడిన సాహసం, భావస్వాతంత్ర్యమూ ప్రభుత్వప్రాకారాలమధ్య వున్నప్పటికీ తనను పవిత్రమైన దేశభక్తుడుగానే ఉంచగలవని ఆయనకు సంపూర్ణ విశ్వాసం కలిగింది. అప్పటి పరిస్థితుల్ని బట్టి తన రాజకీయవైఖరిలో కలుగుతున్న మార్పుకు తాను లోబడక ఆయనకు తప్పిందికాదు.

మధ్యపరగణాల సంయుక్తంజనాభాలో మహాకోసలవాసులు అధిక సంఖ్యాకులైన మహారాష్ట్రీయులకు లొంగిపోయే వుండేవారు. దీనికి కారణం మహారాష్ట్రీయుల విజ్ఞానం, వారి రాజకీయపరిజ్ఞానమూను. తమిళులకు, ఆంధ్రులకు మధ్య వున్నట్టు, మహారాష్ట్రులకు, గుజరాతీవారికి మధ్య వున్నట్టు హిందీలకు, మహారాష్ట్రీయులకూడా భాషాభేదంవల్ల కలహాలు ఏర్పడి వున్నాయి. మాంటుఫర్డు రాజకీయ సంస్కారణలు వచ్చిన తర్వాత తమ తమ సంఖ్యల బలంమీద రాజకీయనాయకత్వానికి నిరంతరం పోటీపడుతూనే వుంటారు. రావు తన చాకచక్యంవల్ల కౌన్సిల్లోనూ, బయటాకూడ హిందీలను, మహారాష్ట్రీయులను కూడ గట్టుకుంటూ వచ్చాడు.

ప్రభుత్వ ప్రాకార ప్రవేశం

సంవత్సరాలకొలది ప్రతిష్టంభన జయప్రదంగా నడిపించినప్పటికీ బ్రిటిషువారిని లొంగదీయడం కష్టమనీ, కాంగ్రెసు మరొక క్రొత్త అడుగు వేసితీరవలెననీ దేశంలో కలవరం పుట్టింది. ఈ పర్యాయం పూనానుండి మహారాష్ట్రీయులు ముందుకు దారితీశారు. బ్రిటిషు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధపడినంత అధికారమంతా మనంకూడా అందుకోవచ్చు ననే ఉద్యమం బయలు దేరింది. 'రెస్పాన్సివ్ కోవాపరేషను' అనే పేరుతో దేశంలో ప్రచారంచేస్తూ ౧౯౩౭-వ సంవత్సరం ప్రథమంలో సీ. పీ. కౌన్సిలు ప్రెసిడెంటు, కాంగ్రెసువాది అయిన తాంబేగారు సీ. పీ. ప్రభుత్వపు హోమ్‌మెంబరు పదవిని ఒప్పుకున్నాడు. కాంగ్రెసుక్షేత్రంలో పడిన ఈ పల్లం రావుగారు సహించలేక పోయినాడు. దీనివల్ల కాంగ్రెసు పార్టీకికూడ పెద్దదెబ్బ తగులుతుందనీ, మహాకోసలానికి పెద్దనష్టం వస్తుందనీ ఆయనకు నమ్మకం ఏర్పడింది. మహారాష్ట్రులు త్రొక్కిన ఈ పంథాలో తనవారితో తానుకూడ ముందుకుపోవాలని ఆయనకు తట్టింది. వెంటనే తాను మంత్రివర్గ మేర్పరిచి ప్రధాన మంత్రి అయినాడు. ప్రభుత్వాన్ని ప్రతిఘటించిన తన అనుచరుల నందరినీ తాను ఏర్పరచిన ప్రభుత్వానికి అండగా నిలిచేటట్టుగా తయారుచేశాడు. రావుగారి జీవితంలో క్రొత్తశకం ప్రారంభమైంది. అప్పటికి రావుగారి వయస్సు ౩౬ సంవత్సరాలు. తర్వాతి ఆయన శేషజీవితం పదిహేనుసంవత్సరాలలో ఒక్కొక్క సంవత్సరం సినిమాదృశ్యాలలాగ ఒకదానికంటె ఒకటి విశేషంతో సాగుతూ పోయినయి. ఆయనకాంక్షలు ఆయన వేసుకున్న ప్రణాళికప్రకారం నెరవేరుతూ వచ్చాయి. ఈ పదిహేను సంవత్సరాలూ రావుగారు ప్రభుత్వపు ప్రాకారంలో వున్నా ఆయనలో నెల్లవలుగా పెరిగిపారే దేశాభిమానంలోనూ మార్పురాలేదు; ఆయన అంతఃస్వరూపంలోనూ భేదం రాలేదు; బహిఃస్వరూపంలోనూ హెచ్చుతగ్గులు రాలేదు. ఒకప్పుడు ప్రభుత్వాన్ని ఎర్రజెండావలె భయపెట్టిన ఖద్దరుటోపీతోను, ఖద్దరుదుస్తులతోనూ గవర్నరుగద్దెమీద కూర్చొని రాష్ట్రాన్ని శాసించాడు. ఐ. సి. యస్. ల మీద రాజ్యంచేశాడు. ప్రజాసేవకుల్ని ప్రోత్సాహపరిచాడు.

పారమెరుగని పాండిత్యం

డాక్టరు రావు ఒక గొప్ప పండితుడు. ఆయనది శ్రుతపాండిత్యం కాదు; పఠితపాండిత్యం. కఠినమైన కాన్‌స్టిట్యూషనుప్రశ్నయే కానివ్వండి, అంతర్రాష్ట్రీయరాజకీయం కానివ్వండి, చరిత్రను సంబంధించినది కానియ్యండి, లేక సారస్వతానికి సంబంధించినది కానియ్యండి, కళకు సంబంధించిన విషయం కానివ్వండి, విజ్ఞానం అవనీయండి—ఏవిధమైన ప్రశ్నకు సమాధానము చెప్పాలన్నా ఆయనకు కొట్టినపిండి. ఇంగ్లీషుభాషలో ఏ విషయంమీద వెలువడినప్పటికీ గొప్ప గొప్ప గ్రంథకర్తల పుస్తకాలు తను అడగకుండానే వి. పీ.

గా పంపవచ్చునని ఆయన ఆర్డరు ఇచ్చేవాడు. తత్ఫలితంగా గొప్పగొప్ప యూనివర్సిటీలు కూడ మాచి ఈర్ష్యపడే గ్రంథసంచయం ఆయనదగ్గర ఏర్పడివుంది. ఈ పుస్తకాలన్నీ తాను స్వంతంగా కష్టపడి చదివేవాడు. ఒకసారి ఒక ఐ. సి. యస్. ఆఫీసరు ఒక చట్టంవిషయమై రావుగారితో చర్చచేస్తూవుంటే దాని మీద రావుగారి కున్న జ్ఞానానికి అచ్చెరువు, తన అజ్ఞానానికి వ్యాకులత ఆయనకు కలిగింది. ఒకసారి అమరావతిలో పశుప్రదర్శనం జరిగింది. అది రావుగారు తెరిచాడు. తన వుపన్యాసంలోనూ, తర్వాత జరిగిన చర్చలలోనూ పశువుల జాతులు, వాటి పాలన, వాటిపట్ల ప్రభుత్వమూ, ప్రజలూ చూపవలసిన కర్తవ్యం, ప్రపంచంలోని భూభాగాల్లో దేనికొరకై ఏదేశం ఎక్కడ ఏమికృషి చేస్తూవుందీ, మన పశుసంపదను అభివృద్ధిపరచడం కోసరం ఏమి చేయవలసినది. అనే విషయాలను గురించి రావుగారు ఇచ్చిన జ్ఞానసామగ్రి పశుశాస్త్రప్రవీణులకు ఆశ్చర్యం కలుగచేసింది. ఇంగ్లండునుంచి కొత్తగా వచ్చిన ఒక విజ్ఞానవతితో తన సంభాషణలో రాయలు ఎకాడమీలో వున్న కొత్త కొత్త చిత్రాలనుగురించి రావుగారు చేసిన విమర్శ విని ఆవిడ అచ్చెరువుపడ్డది. జాయింటు కమిటీ రిపోర్టు ఆయనకు కంఠపాఠం. భారత రాజకీయ సంస్కారాల చరిత్ర ఆయనకు పదేపదే నడిచిన బాట. దేశంలోని వివిధ రాష్ట్రాలలో ప్రజోపయోగంకొరకు ఏర్పడి అమలులో వున్న చట్టాలు ఆయనకు కరతలామలకం. రసాయనశాస్త్రం మొదలుకొని ఖగోళశాస్త్రంవరకూ, ఇంగ్లీషు నాగరికతలో భోజనపుబల్లవద్ద వుండే మర్యాదలు మొదలుకొని పార్లమెంటుమర్యాదలవరకు సంబంధించిన సర్వవిషయాలూ ఆయనకు కొట్టినపిండి. ఇంగ్లీషులో మొన్నమొన్నటివరకు వచ్చిన ఏవుత్కృష్ట గ్రంథాన్ని గురించి అయినా ఏవిధంగా విమర్శింపగలడో అట్లనే హిందీలో వుండే గద్యపద్య గ్రంథాలనుకూడా విమర్శించేవాడు. ఆయనపాండిత్యం ఎంత విశాలమైనదో అంత గంభీర మైనది కూడాను. ఆయనబుద్ధి తేనెటీగవంటిది. ఆయనవిజ్ఞానం ఒక గొప్ప తేనెతెట్టె.

వాద నైపుణ్యము, వచోవిలాసములు

బారిష్టరు రావు కోర్టులో ప్రాక్టీసే చేస్తే హిందూదేశంలో గణుతికెక్కిన ఏ మొదటి నలుగురైదుగురు లాయర్లలోనో తన పేరు వ్రాయించుకొనేవాడే. ఆయనప్రాక్టీసు లాకోర్టులలో చట్టాలకు అర్థాలు చెప్పి న్యాయాన్యాయాలను మథనంచేయడానికిబదులు చట్టాలను నిర్మాణంచేసే కౌన్సిలుహాలులో జరిగింది. ఆయనవాదనైపుణ్యం లాకోర్టులో ప్రతిధ్వనించి లక్షలకొలదిగ సొత్తునార్జించడానికి వుపయోగపడడానికి బదులు చట్టనిర్మాణసభల్లోనూ, ప్రభుత్వకార్యాలయాల్లోనూ ప్రజోపయోగంకోసం వినియోగపడింది. ఆయనవచోనైపుణ్యం క్లయింట్లను, సాటివకీళ్లను, జడ్జీలను మురిపించడానికిబదులు ప్రజానాయకులను, పత్రికారచయితలను, తన పార్టీఅనుచరులను సంతోషపెట్టడానికీ, ప్రేమపాత్రులుగా చేసుకొనడానికీ ఉపయోగపడింది. రావుగారి వాదంలో ఎంత గాంభీర్యం, వైశాల్యం వుండేవో అంత విలాసంకూడ వుండేది. ఆయన భాషను నాట్యమాడించేవాడు. తన మాటనుగెల్పించడానికి గారడీచేసేవాడు. శరపరంపరగా వచ్చే వాక్యాలు, శ్రవణమధురంగా వినపడే భాషాలబ్జులు, వడివడిగా అందకుండా పరుగెత్తే భాషాప్రవాహం, విచ్చుకత్తులలాగ విరోధియొక్క వాదపటుత్వాన్ని చీల్చివేసే కొత్తకొత్త పాయింట్లు, మెరుపులాగ బుద్ధిని భ్రమింపజేసే వచోవిలాసం ఆయనవిరోధుల్ని ఊగించేస్తూవుండేవి. ఆయన వాదాన్ని వింటూవుంటే విరోధులు తమ స్వంత పాయింట్లనే మరచిపోయి రావుగారి వాదమే నిజమని తలచి మర్యాదకుమాత్రం రావు నెదిరిస్తూ తమకు ఓటుబలం తెచ్చుకోలేక చతికిలబడిపోయేవారు.

నాగపూరు యూనివర్సిటీ వైసుఛాన్సలరు కేదారుగ్గారు. రావును ప్రశంసిస్తూ ఇలాఅన్నాడు: "నేను రావుతో కౌన్సిలులో హోరాహోరిగా పోట్లాడాను. కాని అటువంటి సాహసిని, తెలివిగలవాణ్ణి నా జీవితంలో మరొకణ్ణి చూచి ఎరుగను. సీ. పీ. కి హైకోర్టు అక్కర్లేదని న్యాయవాదులూ, ప్రజానాయకులూ అన్నారు. రావు వుండితీరాలన్నాడు. ఆయన నెది

రించడానికి మేము సరంజామా, హంగామా చేశాము. కాని అతని శక్తిముందు మే మాగలేకపోయినాము. అతనివలె రాజకీయతంత్రాన్ని నడపగలిగిన దిట్ట, రాజకీయసమస్యలకు సరియైన అర్థం చెప్పగల పండితుడు అతనిని మించినవాడు మారాష్ట్రంలో లేడు. అపారమైన ఆయనపాండిత్యం, విరివియైన వివిధమైన అతని వైదుష్య ముందు ప్రతివాదీ చేతులు ముడుచ్చ వలసిందే. స్వాధ్యాయంవల్లనే తా నీశక్తిని సంపాయించాడు. అన్నిటికంటే గొప్పవిషయం నేను ఆయనలో చూచిన దేమిటంటే అతనికి ఎందులోనూ వ్యామోహంకాని, ఆసక్తి కాని వుండేదికాదు. ఎంత వుత్తమపదవిలో ఉన్నప్పుడుకూడా అతనికి ఆత్మ విస్మరణ వుండేదికాదు. అతడు ఒక నిష్కామ కర్మి. అతని మృత్యువువల్ల మనము ఒక గొప్ప పురుషుణ్ణి, దేశభక్తుణ్ణి గోల్పోయినాము."

రైతుబాంధవుడు

రావు రైతుబిడ్డ. కృష్ణాజిల్లాలోని పెదముద్దాలిలో తన తాతతండ్రులు సంపాయించిన ఆస్తి–పాస్తులు ఇప్పటికీ వున్నాయి. రాజకీయాల్లో ఉత్తుంగశిఖరాలను అధిరోహించికూడ రావు రైతుసమస్యల్ని మరచిపోలేదు. పెట్టుబడిదారులద్వారా జరిగే రైతురక్తశోషణం ఆయనహృదయంలో ఎప్పుడూ కలకవేస్తూవుండేది. ౧౯౩౨ లోనే దేశంలో ఎవరూ కలగూడ గనని ఋణవిమోచన చట్టాన్ని సి.పి.లో ప్రవేశపెట్టాడు. రాజకీయంలో ధనవంతుల కున్న ప్రాపకం, పలుకుబడి పరిమితి లేనిది గదా! సీ.పి. నిరుపేద అయినందువల్ల, మార్వాడీ పెట్టుబడిదార్ల చేతిలోని కందుకంగా వున్నందువల్ల ఆయన ఈ ఋణవిమోచనచట్టానికి ఎట్టి ప్రతిఘటన కలిగి వుంటుందో బహు తేలికగా వూహించవచ్చు. ఈ బిల్లును ప్రవేశపెట్టి ప్యాసుచేయించడంలోకూడ రావుగారు ఇంద్రజాలికుడులాగానే పనిచేశాడు. ఆయన ప్రతివాదుల కిచ్చిన జవాబులు, ప్రతివాదుల ఎదిరింపును చెల్లాచెదరుచేసి తన వాదంయొక్క న్యాయస్వరూపాన్ని స్థాపించడానికి చూపిన పటిమ వింతవింత కథలుగా సీ. పీ. నాయకులు ఇప్పటికిని చెపుతారు. ఈ ఋణవిమోచనచట్టంవల్ల రైతుల వెన్నుమీదనుంచి ఎనిమిదికోట్ల రూపాయల బరువు తొలిగిపోయింది. సామాన్యపౌరులు పడే బాధల్లో పోలీసుజులుం ఒకటి. రావుగారిచేతుల్లోకి అధికారసూత్రం రావడంతోనే ఆయన పోలీసుకానిస్టేబుల కందరికీ వారి కర్తవ్యాన్ని గురించి విద్యగరపడంకోసం పోలీసుపాఠశాల లేర్పరిచాడు. ఇదికూడ దేశంలో నవీనమే. దీనికి ఫలితంగా నేడు సీ.పి. పోలీసుల్లో మిగతపోలీసులకంటె మంచి ఓర్పిక, అడకువ, మర్యాద, సేవాతత్పరత కనపడతాయి.

ఆడంబరము లేని వ్యక్తి

తాను గవర్నరుగా వున్నప్పుడుకూడ మధ్యమ తరగతికి చెందిన పౌరుల దుస్తులతోనే ప్రజానీకంలో కలసిమెలసి తిరుగుతూవుండేవాడు. ఒకసారి తాను పర్యటనం చేస్తూవుంటే చిన్న వుద్యోగస్థుడైన బాల్యమిత్రు డొకాయన ఒక స్టేషనులో కలసి "హలో మిస్టర్ రావు!" అని సంబోధించి కరస్పర్శ చేశాడట. రావు పదినిమిషాలు కులాసాగా కబుర్లుచెప్పి ఆయన్ని పంపించేశాడట. ఇది ఇంగ్లీషుపద్ధతుల ప్రకారం అమర్యాద. రావుగారు వెళ్లినతరువాత ఆజిల్లాపోలీసువారతనిని అరెస్టుచేశారు. రావుకు తర్వాత ఈసంగతి తెలిసి ఆయన్ని విడిపించాడనీ, పోలీసుల్ని మందలించాడనీ తెలుస్తుంది.

అతిథిపూజ

డాక్టరు రావు పాశ్చాత్యరాజకీయపద్ధతులను, రాజ్యవ్యవస్థను ఎరిగిన వ్యవహర్తమాత్రమే కాదు; వారి సంఘమర్యాదల్ని ఎరిగినవాడుకూడాను. ఆయన చూపులకు భారతీయుడు. సంప్రదాయాల్లోనూ భారతీయుడే. విదేశీయుల కెప్పుడూ ఆయన లొంగి ఎరుగడు. ముఖస్తుతి చేసియెరుగడు. కాని వారి మర్యాదల్లో చాలా బాగా ఆరితేరినవాడు. ఇంగ్లీషుపద్ధతుల ప్రకారం ఆతిథ్యం ఇవ్వడానికి ఆయనకు మించిన చేయి లేదు. నాగపూరులో ఆయనఆతిథ్యాన్ని పొంది ప్రశంసించని మిత్రుడు లేడు. తనకు వచ్చిన ఆదాయంలో అధికభాగం ఆయన అతిథిపూజకై ఖర్చు పెట్టేవాడు. ఒకసారి మద్రాసుహైకోర్టుజడ్జి ఒకాయన

ఆయనకు అతిథిగా వుండి రావుగారి ఆతిథ్యాన్ని ఇలా ప్రశంసించాడు : "రావుగారి ఆతిథ్యంలో నాకు రాజమర్యాదలు కనపడ్డాయి. ఇంగ్లండులోని గొప్పగొప్ప హోటళ్లలోకూడ ఆయనభోజనశాలలోనివైభవం నాకు కనపడలేదు. వైభవమూ, ఆడంబరమూ డబ్బుఖర్చు పెట్టితే రావచ్చు. కాని అతిథుల సౌకర్యాల్ని ప్రతిదాన్నీ సూక్ష్మంగా గమనించే గృహస్థులు దొరకడం చాలా అరుదు. అత్యాకర్షకమై, హృదయాన్ని పల్లవింపచేసే మర్యాదలతో, ఆడకువతో ఆయన స్వయంగా నా సౌకర్యాలనుగురించి శ్రద్ధపుచ్చుకుంటున్నపుడు బహుకార్యస్థుడైన ఆయన సేవాతత్పరత నాకుఅచ్చెరువుకలుగజేసింది. ఆయన వివిధవిషయ వైదుష్యం, విశాలమైన దృక్పథం, జయప్రదంగా మంత్రాంగం జరపడానికి కావలసిన చురుకైన బుద్ధి, సాహసం, చాకచక్యం చూచి నేను చాలా గర్వపడ్డాను. రావుగొప్పదనం ఆంధ్రులందరూ గర్వింపదగిన విషయం" ఆయన ఆతిథ్యం భారతీయులకూ, విదేశీయులకూ సమానంగా లభించేది.

జాతీయగౌరవమును నిలువబెట్టిన దిట్ట

రాఘవేంద్రరావు అవసరం వస్తే పర్వతాలవంటి ప్రతిఘటనలకుకూడ జంకేవాడు కాడు. ఇంగ్లీషువాడి దగ్గర వుద్యోగం చేస్తూ ఆయన ఇండియనుధైర్యసాహసాలకు గౌరవం తెచ్చాడు. తనచేతిక్రింద నున్న, తన దారి కడ్డంవచ్చిన ఇంగ్లీషుఆఫీసర్లకు రావుగారు భయభక్తులు నేర్పించిన ఘట్టా లెన్నో వున్నాయి. ఒకసారి 'బేండా' అనే గ్రామానికి మిలిటరీ సోల్జర్లు నిప్పంటించారు. ఎంతో నష్టం కలిగింది. అప్పుడు రావు హోముమెంబరు. తప్పుచేసిన దుండగీండ్లను కోర్టులో కీడ్చి శిక్షింపజేశాడు. సోల్జర్లను సివిల్‌కోర్టులో విచారించి శిక్షించడం అసాధారణమైన విషయం గదా! దీనికి ఇంగ్లీషు ఆఫీసర్లలోనూ, ఇండియాగవర్నమెంటులోనూ రావుమీద వెగటు పుట్టింది. సర్వసేనాధిపతికూడా రావుమీద కత్తిగాశాడు. వైస్రాయికూడ జోక్యం కలుగజేసుకున్నాడు. ఇందులో మనం పెంకితనం చూపించకూడ దని సీ. పీ. గవర్నరుకూడా పట్టుపట్టాడు. రావు ఎవరికీ లొంగలేదు. రావుపంతం గెలిచింది. న్యాయం నెగ్గింది. పరాజితుడైన మిలిటరీ ఆఫీసరు తన ఓటమి నొప్పుకుంటూ, రావు నభినందిస్తూ, అతని ధైర్యసాహసాల్ని ప్రశంసిస్తూ వ్రాసిన వుత్తరం తెల్లనల్లజాతుల మధ్య జరుగుతున్న పోరాటంలో సువర్ణాక్షరాలతో నమోదుచేయవలసి వుంటుంది. ప్రభుత్వపు టుద్యోగిగా నుండికూడ కాంగ్రెసుతోపాటు సైమను కమిషనును తన రాష్ట్రములో బహిష్కరింప చేసిన గాథ రావు అపారమైన ధైర్యసాహసాలకు దాఖలా.

ఉన్నత విద్యాసంస్కారాన్ని పురస్కరించుకుని హార్టాగు అధ్యక్షతక్రింద విచారణ చేయడం కోసం హార్టాగుకమిటీ పర్యటనం చేస్తున్న రోజులవి. సీ. పీ. విద్యాశాఖాధికారి ఆ కమిటీముందు సాక్ష్య మివ్వడానికై కోరబడి సిమ్లాకు ప్రయాణమై వెళ్లాడు. అప్పుడు రావు సీ. పీ. కి ప్రధానమంత్రి. విద్యాశాఖ ఆయనచేతిలోది. తన అనుమతి లేకుండా బయలుదేరిపోయిన ఆ తెల్లదొరకు రావు వెంటనే శాస్తిచెప్పాడు. సిమ్లా చేరకమునుపే తంతిమీద ఆయన్ని తిరగగొట్టాడు. రావుగారి ఈ చర్యవల్ల విదేశీయులకు ఆయనమీద ఎంత వెగటు పుట్టివుంటుందో వూహించవచ్చు.

క్రిప్సుతో పేచీ

ఇటీవల మొన్నమొన్న జరిగిన ఒక ఘట్టాన్ని మన దేశీయనాయకులగు డాక్టరు పట్టాభిసీతారామయ్యగారుకూడ మనకు తెలియజేశారు. సర్ స్టాఫర్డు క్రిప్సు హిందూదేశంలో గారడీ చేయడంకోసం బ్రిటిషు ప్రపోజల్సనే గారడీ పెట్టె తెచ్చిన సంగతి ఇప్పుడు లోకప్రసిద్ధమైనదిగదా! క్రిప్సు చాలా నమ్మకస్థుడనీ, న్యాయపరుడనీ, మన మిత్రసత్తముడనీ కాంగ్రెసు కొంతవరకు భ్రమించి పోయిందిగదా! ఆ సందర్భంలో అప్పుడు వైస్రాయి కౌన్సిలులో డిఫెన్సుమెంబరుగా వున్న రావుగారు కూడ క్రిప్సును చూడడానికి వెళ్లారు. అప్పుడు వారిద్దరికి ఈ రకంగా సంభాషణ జరిగింది:

రావు— రక్షణశాఖనుకూడ ప్రజాయత్తం చేస్తేనేగాని దేశం మీరుతెచ్చిన ప్రణాళికను ఒప్పుకోదు.

క్రిప్సు — ప్రపంచ మంతా యుద్ధంలో తగులుకొన్న ఈ సమయంలో రక్షణశాఖను భారతీయుల కెట్లా యిస్తాము ?

రావు — ఇదే రక్షణశాఖను ఈ దేశస్థుల కివ్వ వలసిన సమయం.

క్రిప్స్—ఇది అసంభవం.

రావు—అయితే కొంతకాలం ప్రత్యక్షంగా యుద్ధానికి సంబంధించినటువంటి విషయాలు, సేనల్ని నడిపించే ఏర్పాట్లు మీదగ్గర వుంచుకోవచ్చు.

క్రిప్స్—వైస్రాయికౌన్సిలుకు మెంబరుగా వుండికూడ ప్రజానాయకుడిలాగా మీ రీవిధంగా మాట్లాడడం చూస్తే నా కాశ్చర్యంగా వుంది.

రావు—నేను ముదట భారతీయుణ్ణి. భారతీయస్వాతంత్ర్యాన్ని కోరేవాణ్ణి. మీరు రక్షణశాఖ దేశీయుల కిస్తేనే మీకూ, మాకూ రాజీ. లేకపోతే మీరు వచ్చిన ప్రయోజనం లేదు.

క్రిప్స్—మీరు చెప్పినది నేను వినను, ఇక మీరు దయచేయవచ్చు.

రావు—మిమ్మ చూడడానికి నాయంతటా నేను రాలేదు. మీ ఆహ్వానంమీద వచ్చాను. రాజీ కుదరటానికి సలహో చెప్పాను. తరువాత మీయిష్టం.

అని చెప్పి రావుగారు లేచివచ్చారట. క్రిప్స్ కూ, రావుకూ జరిగిన ఈసంభాషణ విని రావుగారి సహచరులకూ, మిగతేవారికీ చాలా ఆశ్చర్యం వేసిందట.

ఎన్నికలలో అఖండ విజయం

౧౯౩౭ ఎన్నికలసంవత్సరం. ఎన్నికలలో కాంగ్రెసు తన అభ్యర్థుల్ని నిలుపుతుం దనగానే కాంగ్రెసేతరులకు కాళ్లూ,చేతులూ చల్లబడ్డాయి. కాంగ్రెసు నెదిరించినవా రంతా బహుభాగం గాలిదుమారంలాగ ఎగిరిపోయినారు. రావుమాత్రం తాను చేసిన సేవకు ప్రజలు కృతజ్ఞులుగా వుంటారనే నమ్మకం తగ్గలేదు. తానుకూడ తన జిల్లాలో అభ్యర్థిగా నిలుచున్నాడు. ఏవిధంగానైనాసరే రావును ఓడించితీరాలని కాంగ్రెసువాదులకు తీవ్రమైన కోరిక కలిగింది. మహాత్మగాంధీ నివసించే ప్రాంతంలో రావువంటి రియాక్షనరీ (ప్రతిగామి) గెలవడమా ? కాంగ్రెసులోని ప్రథమ తరగతికి చెందిన నాయకు లంతా రావును ఓడించే ప్రయత్నానికి సహాయం చేశారు. జవాహరులాలు నెహ్రూ రావుగారి ఫిర్కాలో ప్రచారంచేశారు. ఈ క్రొత్త రుతువుమార్పులో పాతమంత్రు లందరూ పండిన పండ్లలాను, పనికిరాని పండ్లలాను ఒక్కొక్కరుగా కాంగ్రెసుపెనుగాలికి ఆగలేక రాలి పడిపోయినారు. జమీందార్లు, జాగీరుదార్లు, మిరాసీదార్లు, తాలూకాదార్లు—ప్రజల ఫిర్కాలలో నిల్చినవారెవరూ గెలవలేదు. రావుకు తన అభ్యర్థిత్వానికి అంటుకునివున్న లోటుపాట్లూ,కాంగ్రెసుయొక్క అజేయమైన శక్తీ—రెండూ తెలుసు. అందుకనే తాను తన ఫిర్కాఅంతా కాలినడకను నడచి ఇల్లిల్లూ తిరిగాడు. ఆయన కున్న ఆత్మవిశ్వాసం ఒక్క గాంధిగారి పేరు చెపితేనే క్రుంగిపోయేది. మిగతావారిలో ఎవరికైనా తాను సమాన మనే ఆయనకు ధీమా, ఈ రహస్యం కాంగ్రెసువాదులకు కూడా తెలుసు. అందుకోసమే ఎలక్షనులో కాంగ్రెసు తరఫున గాంధీవుత్సవాలు జరిగినాయి. గాంధీప్రభలు వూరేగింపబడ్డాయి. గాంధిగారితో ముఖాముఖీని కాకపోయినా గాంధిగారి ప్రతిమతో పోట్లాడవలసిన అవసరం రావుకు వచ్చింది. అయినా రావుధైర్యం కొంచెం చెదరలేదు. అతనిది తప్పిపోని లెఖ్ఖ. గురితప్పనివేటు. గుర్తెరిగిన మార్గం. ఎలక్షను అయిన తర్వాత రావు ఓడిపోయా డనే దేశంలో పుకారు. కాని రావుమాత్రం తా నిన్ని ఓట్లతో గెలుస్తానని ఢంకా వాయించాడు. ఓట్లు ఎంచితే ఒకటిరెండు హెచ్చుతగ్గుగా తాను చెప్పినన్ని ఓట్లే అతనికి వచ్చినాయి. అతని ఘటనాఘటన సామర్థ్యానికి దేశ మంతా ఒక్కసారి మళ్లీ నివ్వెరపోయింది.

ఆదర్శశుద్ధి - కర్తవ్య నిర్వహణ దీక్ష

జీవితంలో కీర్తి అనేకమందికి అనేక తీరులుగా వస్తుంది. కీర్తియొక్క స్వరూపం ప్రచారాన్నిబట్టి నిశ్చయించడం కష్టం. ప్రచారంలోకి వచ్చే ప్రతి పేరుకూ కీర్తిని ఆపాదిస్తే మనం ప్రమాదాలకు లోనవుతాం. గట్టి పునాదులమీద నిష్కామంగా, నిస్స్వార్థంగా, పరిశుద్ధమైన వర్తనతో, పవిత్రమైన బుద్ధితో సత్యాన్ని ఆరాధిస్తూ ప్రజాసేవను పురస్కరించుకుని తన శారీరక, మానసిక, బౌద్ధిక శక్తులను సద్ధ



ప్రధానమంత్రి, రాఘవేంద్రరావుగారు
[తోడిమంత్రులతోను, కార్యనిర్వాహక సంఘసభ్యులతోను కలిసి తీయించుకొన్న చిత్రము]

మైన ఆదర్శంకోసం బలియిచ్చే వ్యక్తియొక్క కీర్తే సుస్థిరమైందీ, పరీక్షకు నిల్చేదీను. ఆధునికసౌకర్యాలను పురస్కరించుకుని కీర్తి ప్రతిష్ఠలు సంపాదించడానికి ఎన్నో సాధనాలు వున్నాయి. ఈ సాధనాల మూలంగా ఎన్నో గాజుపూసలు రత్నాలవలె మెరుస్తూ కనపడతాయి. అసలు రత్నాలు ప్రచారంలోకి తెచ్చే ప్రచారకులు దొరకకపోతే పోగలిగినంత దూరమే అవి కాంతిని చిమ్ముతూ వుంటాయి. మహోకాంక్షతో ప్రేరేపింపబడి, కుంటువోవని దీక్ష, అలసిపోవని శరీరం, మందంకాని మానసికోత్సాహం కల మానవుడు పరిస్థితులకు లొంగక తీగలాగ పోగలిగినంతదూరం పైకి ఎగబాకిపోతూనే వుంటాడు. అతనికి లోక ప్రశంసతోను, లోకనిందతోను పనిలేదు. అతనికి కావలసింది పని. అతనికి జరూరు కర్తవ్య నిర్వహణం. అతనికి ఆశ్రయం సంఘం. అతని ప్రేరణ సేవ. అతనికి సహాయం స్వశక్తియే. తాను కాంక్షించింది అతనికి అయితీరాలి. అతను తన గమ్యస్థానం చేరితీరాలి. తన పనిని సాధించడానికి చేసే తపస్సులో అతనికి ఆలుబిడ్డలతో పని లేదు. బంధువర్గంతో సంబంధం లేదు. మిత్రులతో నిమిత్తం లేదు. ఎదిరించేవారితో విరోధం లేదు. ప్రశంసించేవారితో మైత్రీ లేదు. తన యావచ్ఛక్తీ ఉద్దేశ్యసిద్ధికై ఉపయోగపడవలసిందే. నైయక్తికబంధనా లేవీ ఆయన్ని బాధించడానికి వీల్లేదు. కర్తవ్యనిర్వహణం అతనికి ఆరాధ్యం. ఇవే శ్రీ రావుగారి జీవితానికి రూపురేఖలు గీచిన, పోషించిన, విస్తరించిన కొన్ని ఉద్దేశ్యాలు. ఇట్టి ఉద్దేశ్యాలను పురస్కరించుకుని జీవితసౌధాన్ని నిర్మించుకునే యువకులు ఎంతమంది వున్న అంత దేశభాగ్యమేకదా!

ధనపేటికలను తెచ్చే దివానుపదవీ తిరస్కారం

౧౯-౩౭లో ఇండూరుదివానుపదవి ఖాళీఅయింది. రావుగారిని దివానుగా చేసుకోవాలని మహారాజాగారు ఎంతెంతో ప్రయత్నించేశారు. "నేనా! ఒక స్వదేశసంస్థానంలో దివానుగా వుండి సమాధికట్టుకుంటానా" అని మహారాజాగారి కోర్కెను నిరాకరించాడు. ౪౦-వ సంవత్సరంలో జయపూరుదివానుపదవి ఖాళీ అయింది. గాంధీగారి అనుమతిపైన జయపూరు దివానుపదవి ఒప్పుకోవలసిందిగా జమ్నాలాలు బజాజుగారు ఉత్తరాలు వ్రాసి ప్రార్థించుపడ్డారు. "నేను అంగీకరించలేను" అని ఇంగ్లండునుంచి బదులువచ్చింది. ఇలా ఎన్నో తా వాశించని, కోరని పదవులు ఆయన కాళ్లను తాకి తిరస్కరింపబడి తిరిగిపోయినవి. ఈ పదవుల్లోకే రావు వెళ్లి వుంటే లక్షలకొలది విత్తమార్జించి వుండేవాడు. ధనపేటికలను తెచ్చే దివానుపదవులు విడిచి స్వల్పవేతనంమీద అధికారవిహీనమైన ఇండియామంత్రిసలహాదారుగా ఇంగ్లండుకు పోవడం రావుగారి మిత్రులు కొందరికి నిరర్థకంగా కనపడింది. కాని, ఉత్తుంగశిఖరాలకు ఎగబ్రాకిపోవాలనీ, బ్రిటిషు సామ్రాజ్యకేంద్రంలోనే ప్రవేశించి దాని గుట్టెరిగి సామ్రాజ్యపు పునాదులు పెకలించాలనీ ఆయన్ని కలవరపెడుతూవుండే అతని హృదయావేదన వారి మిత్రు లేమెరుగుదురు? వైస్రాయికౌన్సిల్లో చేరిన పిమ్మట నెహ్రూ మొదలైన కాంగ్రెసు నాయకుల్ని విడిచిపెట్టి జాతీయనాయకులతో రాజీపడవలసినదిగా వైస్రాయితో పోరాడినట్లు తెలుస్తుంది. సంపూర్ణస్వాతంత్ర్యం భారతభూమికి సంప్రాప్తించడానికి, బ్రిటిషు-భారతీయులమధ్య తారతమ్యం చూపబడినప్పుడు భారతీయులకు అన్యాయం కలగకుండా చేయడానికి తనవ్యక్తిత్వపు బరువునంతా ఒగ్గి తన పంతాన్ని గెలిపించుకునేవాడట. రావుగారిలో ఇంతటి గాఢమైన భారతీయాభిమానం, పక్షపాతం వుండేవి. అయినా ఒకసారి ఒక మిత్రుడు "భారతీయులచేతిక్రింద నీవు ఇష్టంతో పనిచేస్తావా" అని ఒక యూరోపియను ఆఫీసరును అడిగితే, "రాఘవేంద్రరావువంటి సమర్థులక్రింద పనిచేయడానికి నాకభ్యంతరంలేదు. అతని చేతిక్రింద పనిచేయడం అంటే నాకు పెద్ద ఖుషీ. అనితరంగా అసాధారణమైన సామర్థ్యంగల వ్యక్తులక్రింద పనిచేయటానికి ఎవరికీ అభ్యంతరం వుండకూడదు." అని జవాబిచ్చాడట అతడు.

అసాధారణమైన శక్తిసామర్థ్యాలు

ఆంధ్రదేశంలో రావుగారి జీవితవిశేషాలను గురించి బహుకొద్దిమందికి తెలుసు. మన ఆంధ్రు

డొక్కడు పరాయిదేశంలోనికివెళ్లి గొప్ప గవర్నరయినాడనీ, గొప్పపదవుల్లోకి వచ్చాడనీ విని సంతోషించడం తప్పితే ఆయనశక్తిసామర్థ్యాలను గురించిన వివరాలు తెలుసుకోనడానికి తెలుగుదేశపు హద్దుల్లోకి రాలేదు. ఎంతోమంది అదృష్టవంతుల్లో రావు ఒక అదృష్టవంతుడనీ, అతని పూర్వజన్మసుకృతంవల్ల బ్రిటిషుగవర్నమెంటులో బ్రిటిషువారిదయను పొంది ఇంత గొప్పగొప్పపదవులు సంపాయించగలిగాడనీ మాత్రమే అనుకున్నాం. పదవులు సంపాయించడానికి పరీక్షలు ప్యాసయ్యేదానివలె సమర్థతకంటె అదృష్ట మెక్కువ వుండాలనీ అనుకుంటాము. దీనికి కారణం అనేకులైన అసమర్థులు పదవుల్ని పొంది అందలా లెక్కి తిరగడమే. కాని రావుగారివంటి ఒక సాధారణమైన బారిష్టరు యాభై సంవత్సరాలు నిండకమునుపే ఇరవైఅయిదుసంవత్సరాల ప్రజాహితజీవనంలో తన జీవితంలోని ఉత్కృష్టమైన ఆకాంక్షలను అవిచ్ఛిన్నంగా నిర్వహించుకోగలిగాడంటేనూ, గత ఇరవైఅయిదు సంవత్సరాలలోని సంఘర్షమయమైన సార్వజనికజీవితంలో సునాయాసంగా పైకి ఎక్కివచ్చాడంటేనూ, ప్రజాసన్మానం ప్రభుత్వసమాదరణా సరిసమానంగా పొందాడంటేనూ ఆయన జీవితంలోని విశేషాలూ, ఆయనలో వున్న సుగుణాలూ, బుద్ధి-హృదయాల సమన్వయశక్తి—వీటిని గురించి కొంత విపులంగానే తెలుసుకోవలసివుంటుంది. కొంత విపులంగానే వ్రాయవలసివస్తుంది. ఉత్కృష్టమైన ఆకాంక్షలను హృదయాల్లో అమర్చుకుని జీవితంలో ఉన్నతమైన స్థానములకై పాకులాడప్రయత్నించే వేలమంది యువకులకు రావుజీవితం ఒక గుణపాఠంగా వుపయోగపడుతుంది. సంఘర్షణ, పోటీ, ఈర్ష్యాద్వేషాలు, ఆదర్శభేదాలు, అనుదారత, పారతంత్ర్యం, కులభేదం, భాషాభేదం, వర్గభేదం, స్వార్థం ఎక్కడ చూచినా పెనవేసుకునిపోతున్న దేశం మనది. ఈదుర్గుణాల్ని నిర్మూలం చేయడంలోనే ధర్మచింతన గల మహాత్మా గాంధి మొదలగు దేశీయనాయకుల కాలం ఎంతో వ్యయమవుతోంది. రాజకీయంగా వున్నతిలోకి రావాలంటే పారతంత్ర్యంలో వున్న దేశంలో ప్రభువుల ప్రేమపాత్రత వుంటేనే ప్రయోజనపడుతుంది. స్వతంత్రాభిప్రాయాలు, సత్యప్రియత, స్వజన, స్వదేశీయాభిమానం, స్వార్థులను ప్రతిఘటించే స్వభావం ఔన్నత్యానికి అడ్డుతగులుతూవుంటాయి. తన పరిపూర్ణమైన, ప్రయోజనకారియైన ప్రజాసేవాతత్పరమైన జీవితపటాన్ని చిత్రించుకోగోరే వ్యక్తి సుషుప్తి జాగ్రదవస్థలలోకూడ స్వప్నాలు చూచేవాడుగా వుండాలి. చీకటికొట్టులో వున్నప్పుడుకూడ వెల్తురుబాట అతనికి వెతుక్కకుండా కనపడాలి. కఠినసమస్యాపూర్ణమైన ప్రపంచమనే కారడవిలో కాకిలాగ, చిట్టడివిలో చీమలాగ దూరిపోగలిగివుండాలి. తాత్కాలికమైన లోభ, లాలసత్వాల్లో చిక్కక, పక్కసందులను చూచి బాటలని భ్రమించక తన రాచబాటను తాను గుర్తెరిగి వుండాలి. గురుతరమైన అడ్డంకులు ఘోరమైన శత్రువులతో ముఖాముఖి ఏర్పడినప్పుడు నవ్వి చాతుర్యంతో తప్పించుకు పోగలగాలి. ఐహిక ఆముష్మిక కర్తవ్యాలు నిర్వహించి అమలులోకి తేవాలి. మనుష్యుల్లో వున్న దేవతల్ని, దేవతలుగా కనపడే మనుష్యుల్ని కనిపెట్టగలగాలి. అలసటలేని శరీరంతో, వెనుకకు తిరగని బుద్ధితో, విశాలమైన దృక్పథంతో, ఉదారమైన హృదయంతో, ఏకాగ్రచిత్తంతో, తనమీదా, తన ఆదర్శాలమీదా నమ్మకంతో వాయువేగంగా నడచిపోగలిగివుండాలి. ఇట్టి శక్తులు అన్నీ లక్షలలో ఏ ఒకరిలోనో గాని కనపడవు. అట్టివారిలో డాక్టరు యీడ్పుగంటి రాఘవేంద్రరావుగారు ఒకరు.

ఆంధ్రాభిమానం - ఆంధ్రరాష్ట్రసిద్ధికి కొత్త సూచన

మహారాష్ట్రులతో పోటీపడ్డా, హిందీవాళ్లమధ్య పుట్టి పెరిగినా మాతాపితృస్థాన మగు ఆంధ్రదేశంపట్ల రాఘవేంద్రరావుగారికి ఎప్పుడూ ప్రేమ తగ్గలేదు. తాను తెలుగు చదువుకోనిదానికి ప్రాయశ్చిత్తంగా కాబోలు తన బిడ్డల్ని తెలుగుదేశంలో చదివించాడు. ఇటీవల ఆంధ్రరాష్ట్రసిద్ధి తన జీవితోద్దేశ్యాల్లో ఒకటిగా ఏర్పరచుకున్నాడు. ఇండియా మంత్రికి సలహాదారుడుగా వెళ్లకపూర్వం మద్రాసు రాజధానికి వచ్చి సత్వర ఆంధ్రరాష్ట్రసిద్ధికై ఆయన ఇచ్చిన సలహాలు, చేసిన ప్రయత్నం ఆంధ్రదేశం మరచిపోలేదు.

బొంబాయిలో ఓడ ఎక్కడానికి పూర్వం ఏప్రియలు ౧౯౩౯ లో ఆయన బొంబాయిలోని జ్యోత్స్న అనే ఒక మరాఠీ పత్రికకు ఇచ్చిన ప్రకటనను బట్టి భాషా ప్రయుక్త రాష్ట్రముల విషయమై రావుగారికి చాలా ఉత్సాహం, శ్రద్ధ వున్నట్టు బోధపడుతుంది. ఆయన అందులో నవీన మైన ఒక సూచన చేశాడు. "ఇండియాను భాషాప్రయుక్తరాష్ట్రాలుగా విభజించాలంటే బొంబాయి, మద్రాసు రాజధానుల్ని మాత్రం విడగొట్టి భాషలవారీగా పంచితే చాలు. మహారాష్ట్రులు, తెలుగువారు ఆందోళన చేసి తమ కార్యాన్ని సాధించుకుంటే తమిళులకు, కన్నడులకు, గుజరాతీయులకుకూడ రాష్ట్రాలు సిద్ధిస్తాయి. మహారాష్ట్రం, ఆంధ్రదేశం క్రీస్తుశకానికి పూర్వంనుంచీ సంబంధబాంధవ్యాలు కలిగివున్నాయి. వీరిద్దరికీ శకం ఒక్కటే. అది శాలివాహనశకం. గోదావరీతీరమున ప్రతిష్ఠానపురంలో స్థాపించబడ్డ శాతవాహనుల సామ్రాజ్యం ఆంధ్రుల, మహారాష్ట్రుల సమ్మిళిత సామ్రాజ్యం. ఇద్దరి విజ్ఞానాలకూ మాతృక ఒక్కటే. సంఘశాస్త్రప్రకారంకూడ రెండు జాతులకూ రక్తసంబంధాలున్నాయి. హిందూదేశంలో నివసించే ఉచ్చవర్ణాలవారిలో సవర్ణవివాహం మహారాష్ట్రులకూ, ఆంధ్రులకూ తప్ప మరెక్కడా లేదు. (ఈ ఇద్దరితో కర్నాటకులకుకూడ వు.వి.) వేలకొలది మహారాష్ట్రీయులు ఆంధ్రదేశంలోనూ, ఆంధ్రులు మహారాష్ట్రదేశంలోనూ భాషాభేదం లేక ఆయాజేశాల్లో అతుక్కుపోయినారు. రెంటికి మధ్య హైద్రాబాదే లేకపోతే మహారాష్ట్రీయులకూ, ఆంధ్రులకూ అవిభక్తబాంధవ్య మేర్పడే ఉండేది. హైద్రాబాదుకు ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచే బాధ్యతకూడ ఆంధ్రులమీదా, మహారాష్ట్రులమీదా వుంది. హైద్రాబాదులో నివసించే జనుల్లో నూటికి ౬౦ కి పైగా తెలుగువారూ, మహారాష్ట్రులే. మహారాష్ట్రంకూడ జనాభాలో రెండుకోట్ల నలభైలక్షలే అయినా ఎన్నో తునకలుతునకలుగా విడిపోయివుంది. మహారాష్ట్రులు విజ్ఞానసంపన్నులు, కార్యదక్షులు. ఆంధ్రులు వుత్సాహసాహసాలు కలవారు. ఈ ఇద్దరూ చేరి వేరువేరుగా తమ ప్రాంతాలకై ఆందోళన కొనసాగించినా సరే, లేక జాయింటురాష్ట్రం నిర్మించుకొనడంకోసం ప్రయత్నం చేసినా సరే ఎంతో లాభ ముంటుంది. హిందూదేశంలో వారు ఒక బలవత్తరమైన వర్గంగా ఏర్పడి సార్వదేశిక రాజకీయాల్లో మహారథులౌతారు. బెల్గాం మొదలుకొని భండారావరకున్న మహారాష్ట్రప్రాంతం, ఒరిస్సాను ఎల్లలుగా ఏర్పరచుకుని బెల్గాంవరకు కర్నాటకాన్ని కలుపుకున్న ఆంధ్రప్రాంతం, ఏడుకోట్ల జనాభా కలిగి బృహత్తరమైన సముద్రతీరం, అరణ్యాలు, నదీనదములు కలిగిన సస్యశ్యామలములైన త్రిరాష్ట్ర సమూహ మౌతుంది. ప్రసిద్ధవదులైన కృష్ణాగోదావరీ స్రవంతులు ఈ మూడురాష్ట్రాలకూ చెందినవేకదా! రెండువేల సంవత్సరాలనుంచి ఎడతెగకుండా వస్తూవున్న సంబంధబాంధవ్యాల్ని తెగకుండా ముడివేసుకొనడం ఎంత ఉత్కృష్టమైన విషయం! గుజరాతీ, మహారాష్ట్రుల విజ్ఞానంలో పరస్పరం ఎంతో వ్యత్యాస మున్నది. తెలుగులకూ తమిళులకూ, కర్నాటకులకూ తమిళులకూ పాతా కొత్తచుట్టరికాలు రెండూ లేవు. ఆంధ్రమహారాష్ట్ర కర్నాటకాలు ఏకమైతే హిందూదేశంలోని స్వదేశసంస్థానాల సమస్యకూడ నూటికి డెబ్భయివంతులు తేలిపోతుంది. విజ్ఞానాన్నీ, చరిత్రనూ ఆధారంగా చేసుకుని ఏర్పరచుకున్న ఈరాష్ట్రసమాఖ్య ఎంతో జయప్రదంగా కొనసాగవచ్చు. క్రీస్తుప్రథమ శతాబ్దాలలోని ఆంధ్రసామ్రాజ్యం, ౫, ౬ శతాబ్దాల నాటి శాతవాహనుల సామ్రాజ్యం, పదిపదమూడు శతాబ్దాలనాటి ఓరుగల్లురాజ్యం, పదమూడు పదహారుశతాబ్దాలనాటి విజయనగరసామ్రాజ్యం, పదిహేడు పద్దెనిమిదిశతాబ్దులనాటి మహారాష్ట్రసామ్రాజ్యం ఈమూడు జాతులకూ చెందిన సంయుక్తసంపత్తి. రెండువేల సంవత్సరాలనుండి దట్టముగా పెనవేసుకునిపోయిన ప్రేమపాశాలు గత వందసంవత్సరాలనుండి బ్రిటిషురాజ్యంవల్ల తెగిపోవడానికి సిద్ధంగా వున్నాయి. వీటిని తెగకుండా, కాపాడే కర్తవ్యం ఈముగ్గురిది." రావుగారు చేసిన ఈకొత్తసూచన మహారాష్ట్రీయుల్లో కలవరం కలిగించింది. మహావిదర్భనాయకులగు మాడ్‌ఖోల్కరు, పట్వర్ధన్ రావుగారు చేసిన ఈ నవీనసూచనను గురించి మహారాష్ట్రపత్రికల్లో సంచలనం లేవదీశారు. బహుశా ఈవిషయమై ఆంధ్రనాయకులతో పర్యా

లోచనలు సల్పడంకోసం మహారాష్ట్రనాయకులు ఆంధ్రదేశానికి త్వరలోనే రావచ్చు. రావుగారి సూచన చాలా సారగర్భితమైందీ, కూలంకషంగా చర్చించ తగినదీను. భాషాప్రయుక్తరాష్ట్రాలవిషయమై ఆయన గొప్ప ప్రణాళిక నొకదానిని తయారుచేసి లండనులో పెట్టివున్నాడని తెలుస్తుంది. ఆయన ఈవిషయమై చేసిన కృషి యుద్ధానంతరంగాని బయటపడదు.

౧౫ జూన్ ౧౯౪౨ తేదీ ఇండియా గవర్నమెంటుయొక్క అసాధారణగజెట్టులో ఇలా అచ్చయింది; "డాక్టరు రావు చిన్నవయస్సులోనే తన రాష్ట్రంలో గొప్ప ప్రాముఖ్యం సంపాయించాడు. మినిష్టరుగాను, హోమ్ మెంబరుగాను, కొద్దికాలం గవర్నరుగానుకూడ పనిచేశాడు. ఛీఫ్ మినిష్టరుగాకూడ కొన్నాళ్లుండి పద్దానుగుసంవత్సరాలు గొప్పపదవుల నధిరోహించి తన రాష్ట్రంలోని పరిపాలన వ్యవహారాల్లో శాశ్వతమైన కీర్తిని సంపాయించాడు. ౧౯౩౬-వ సంవత్సరంలో ఇండియామంత్రి సలహాదారుడుగానూ, ౪౧ లో వైస్రాయికౌన్సిలుమీద ప్రజారక్షణశాఖ సభ్యుడుగానూ పనిచేశాడు. రోగిగా వుండికూడ ప్రజారక్షణశాఖ వ్యవస్థలో ఆయన చూపిన దక్షత, స్ఫూర్తి స్తుత్యం. ప్రజాకార్యములలో ఎంతో అనుభవం కలిగి, పరిపాలనా కౌశలం కలిగి తాను చేసిన వుద్యోగాల్లో అసామాన్యమైన ప్రాముఖ్యాన్ని సంపాయించిన, అరుదుగా దొరికే నమ్మకస్థుడైన సహచరుణ్ణి కోల్పోయినందుకు రాజప్రతినిధి కెంతో కష్టంగా వుంది. విషాదకరమైన ఆయనమృత్యువు ఆయన తన రాష్ట్రంలోనూ, అఖిల భారతభూమిలోనూ ముందుముందు చేయదలచుకొన్న అత్యద్భుతమైన సేవలను త్రుంచివేసింది. వైస్రాయి ఆయనకుటుంబానికి సహానుభూతి చూపిస్తున్నాడు."

ఆశ్వాసాంతం

శక్తికి మించిన పని తీసుకుంటే మెషీనే అరిగిపోతుంది. మనిషిశరీరం ఆగుతుందా? సరియైన ఆహారాభావంవల్ల రావుకు ఇంగ్లండులోనే వ్యాధిసంభవించింది. వేలకొలది మైళ్లు విమానంలో ప్రయాణంచేసినందువల్ల ఆవ్యాధి హెచ్చి అతన్ని అర్ధమృతుణ్ణి చేసివేసింది. అనారోగ్యం కారణంగా కొత్త వుద్యోగం స్వీకరించక పోవడం పిరికితనం అని రావు బహుశా భ్రమపడ్డాడు. దీని ఫలితాన్ని బట్టి చూస్తే "ప్రమాదో ధీమతామపి" అనే సామెత ఆయనపట్ల వర్తించిందనే అనుకోవాలి. కాని విధిని ఎవరు తప్పించగలుగుతారు?

మన విధి

రావు బ్రతికివుంటే ఇంకా ఏయేశిఖరాలుఅంటుకునేవాడో అవి కల్పనకే విడిచిపెడదాం. కాని అతను అందుకున్న శిఖరాలను గురించి, దానికి పడ్డ ప్రయాస, చేసినప్రయత్నాన్ని గురించి విపులంగా వ్రాసే ప్రయత్నం ఆయన్ని సన్నిహితంగా ఎరిగినవారూ, తెలుసుకున్నవారూ చేయవలసిన పని. రావు ఆంధ్రుడని గర్విస్తే చాలదు. ఆయనగొప్పదనాన్ని ఆంధ్రయువకులకు స్ఫూర్తివంతంగా చేయడంకోసం సుస్థిరమైన స్మారకం కూడ ఏర్పడడం అవసరం. రావు ఏ స్వతంత్రదేశంలోనో పుట్టివుంటే అతడు కర్మణ్యులకు ఆరాధ్యదేవత అయ్యేవాడని రాజకీయాల్లో ఆయనకు చిరశత్రువుగా వున్న మాజీమంత్రి ద్వారకాప్రసాదు మిశ్రయే అన్నాడు. బ్రతికివుండగా అతని సుగుణాలూ దుర్గుణాల్నీ కూడా చూచాం. ఇప్పుడు అతని సుగుణాల్నీ, గుణవిశేషాల్నీ మన మేలుకోసమైనా మనం చూచి అనుకరించవచ్చునుగదా!

*

ప్రియా!

= శ్రీ పురిపండా అప్పలస్వామి =

ఆషాఢ మంబుదశ్యామలంబో ప్రియా!
విడదు శంపాదేవి విభుని కౌగిలి ప్రియా!
నా ప్రవాసనిశాంత మేకాంత మో ప్రియా!
ఆశాప్రదీపశూన్యము, విశీర్ణము ప్రియా!
ఏ నవ్య జీవనాహ్వానమంగళగాన
మే శుభాగమనవార్తా సమీరసుగంధ
మీ యభాగ్యపు దీనహృది సోకునని ప్రియా!
కదలిపోయెను కల్పకల్పాంతములె ప్రియా!
ఆషాఢ మంబుదశ్యామలం బో ప్రియా!
నా ప్రవాసనిశాంత మేకాంత మో ప్రియా!

'రెండులేఖల'కు జవాబు

●

= శ్రీ బొడ్డపాటి కుటుంబరాయశర్మ =

నా సహకవియైన స్వర్గీయ వెంకటరత్నము పేరట ఫిబ్రవరి ౪౨ భారతిలో 'కన్యక' అను శీర్షిక క్రింద నేడు గీతపద్యములు 'కన్యాచరిత్ర నుండి' యని ప్రకటింపఁబడుట జూచితిని. అందు గల మూడు గీతపద్యములగూర్చి మిక్కిలి అక్కజపడితిని. ౧౯౩౩–౩౪ సం. లలో నే నాంధ్ర క్రైస్తవ కళాశాలయందు విద్యార్థిగా నున్నపు డావాతావరణ ప్రభావమువలననేమి, యితర పరిస్థితులవలననేమి పొడచూపిన భావములను పొందుపరచుచు, తత్పూర్వభావస్థితులను భావనచేసికొని యభినందన పూర్వకముగ బాలవితంతువు నితివృత్తముగ గల పంద్రెండు గీతపద్యముల రచించి, వానికి నితివృత్తగౌరవము లేదని యెంచి ప్రకటించుటకు మనసుపోక, యాచిత్తుప్రతిని కొన్నినాళ్లలో యుంచి, సగౌరవమైన జీవిక యేర్పడి, ఆత్మగౌరవశీలములు గల వ్యక్తినని నల్వురిలో తిరుగ నేర్చినపిమ్మట కర్తృహంకారము ముందంజవేయగా, నాపంద్రెండు గీతపద్యములను 'వ్యాసు' డను శీర్షిక క్రింద-బహుళః ౧౯౩౯ లో కాబోలు- హిందూకళాశాల పత్రికయందు ప్రకటించితిని. వ్యాసమహర్షి పొందిన యంతస్తాప మిందు పొందుపడిన దని పఠితలు ముస్ముందు వాని నుదాహరించినపుడు గ్రహింపగలరు. ఆ నావ్యాసమున నున్న యొక నాల్గుగీతపద్యములలోను గల ౧౬ పాదములందును నొక పంద్రెండు పాదములు ౩ గీతపద్యములుగ, వర్ణాగమ లోప వ్యత్యాసములతో గుదింపబడి, అవి నాపద్యము లని కళాశాలపత్రికలో ప్రకటింపఁబడుట తెలిసియు, నామీద కళాశాలకు జెందిన విషయములలో కార్పణ్యముగల, మా కళాశాలకు జెందిన శ్రీ సింగరాజు సుబ్బారావుగారను నొకానొక విద్యార్థి పంపగా, భారతిలో పై జెప్పిన నాసహకవి పేరట 'కన్యక' అను శీర్షిక క్రింద ప్రకటింపబడుటయే నా కాశ్చర్యము గొల్పినది. ఇది '౪౨ ఫిబ్రవరి భారతిలో జరిగినది. వెంటనే నేను భారతి సంపాదకుల కీ విషయమునుగూర్చి వ్రాయ నుద్దేశించితినిగాని, మా కళాశాల పత్రికలో తనరచనల కగ్రస్థానము లభింపకపోవుట నాకారణమున నని యపోహ పడుచున్నట్లును, అందుచే నావిద్యార్థి యీ చర్యకు కడగొనినట్లును, నేను చూచాయగ దెలిసికొనుటచేత, భారతివారితో నుత్తర ప్రత్యుత్తరములు జరుపవలెనో, లేక ప్రకటనచేయించిన యావిద్యార్థితో వ్యవహారమునకు దిగవలెనో న్యాయవాదుల సలహాపైన గాని జరుగ వీలులేదని తెలిసికొని తత్ప్రయత్నములో నున్నాను. విద్యార్థుల పరీక్షాదినము లగుటచే నుపాధ్యాయవృత్తిలో నున్న నావంటివానికి మూర్చి నెల విశ్రాంతి కల్పింపదు. పైపెచ్చు చాల యైహికదైహికబాధలు గల నేను త్వరపడతా దనియు, విశ్రాంతిగ నెలవులలో నీవిషయమును గూర్చి సాకల్యముగ వ్రాయవచ్చుననియు తలచి తరుణమునకై నిరీక్షించుచుంటిని.

ఇంతలో ఏప్రియలు ౭-వ తేదీ భారతిలో రెండు లేఖలు ప్రకటింపబడినవి. అందు ప్రథమ లేఖ మా గుడివాడలో శ్రీ దేవులపల్లి శాస్త్రిగా రను వారు వ్రాసినది. రెండవది జ. రుక్మిణీనాథశాస్త్రి గారు వ్రాసినది. అందు ప్రథమ లేఖలో వ్రాయబడిన యంశములు కేవలము నా కపకీర్తిని, నష్టమును గల్గించు దురుద్దేశము గల యసత్యకల్పనలు. రెండవ లేఖలోని యపహాస్యసహమైన రచనావిధానము స్పర్ధాసమన్వితము.

ప్రత్యుత్తర కాంక్షులగు పాఠకుల కాపద్యములు మూడును నావే యని ఋజువుచేయుచు, సత్యాసత్యముల విపులముగ వ్రాయవలసియున్నను, కాలము వ్యాసవిస్తృతి నొల్లని హేతువుచే బహుసంక్షేపముగ ముఖ్యాంశములమాత్రమే యుదాహరించి, నా నిర్దో

షిత్వము నీపత్రికాముఖముననే ప్రస్తుతము ఋజువుచేసి కొనఋానుచున్నాను. పఠనాసౌలభ్యమునకై మున్ముందుగ నావ్యాసముల రెంటిని యథాతథముగా తిరిగి యుదాహరింతును:

వ్యాసుడు

బొడ్డపాటి కుటుంబరాయశర్మ, ఎం. ఏ.

౧. ఆవెలుఁగు పాటలేందుశోభావిలుప్త
పార్శ్వకదినాంతరేఖ ఆవనితమేని ;
మెట్ట లెగఁబ్రాకి తరఁగలై మెలఁగు గాంగ
వేణివంటిది కమ్ములు లేని చీర.

౨. ఆముక్తైందవసితిమ యొక్కపుడు మునుపు
నునుపుసంజల జాజువారినది లేదు
ఇప్పుడైనను వెల్లబోయినదిలేదు
పుట్టినది పుట్టినట్లు సొంపులు వెలార్చు.

౩. రమణిరంగులనూరిచేరమ్మకాక
పరమనైర్వర్ణ్యశుద్ధసత్త్వపు రోచి
మొగలిరేకును తనగోటిమొనల నొత్తి
నూత్నవిధివ్రాయు చిత్రప్రయత్నఫలము.

౪. తెలివ పాదాలపసిమి యద్దినదికాదు
అద్దకము మెచ్చుకవిని నే నసలుకొను
కృతకహరిద్రకలన నిర్మితనిసర్గ
కనకపాంచాలికకు పాపకర్మగాదె?

౫. కనుల కొలుకు సొగల కసటు లేదు
కొక్కులును రాని వీభ్రమరికలు వాని
రానికొక్కులె నలువచే లూనితములు
ఊహలో నేన యాకొక్కు లునిచినాను.

౬. పొలఁతిచెక్కిలి తాటంకపుష్యరాగ
దీప్తిమంజరి విరిసినది యనరాదు.
తరళతాంబూలికాపత్రతతులమీద
రత్నములు పింజరించు కర్జమును లేదు.

౭. చిక్కణంబయి, నొక్కులు నొక్కులై, వి
నీలమగు దీని ధమ్మిల్లమూలమందు
చుట్టుకొని పెంపులు గ్రసించినట్టు లేదు
మల్లెపూదండ పేరిఁట తెల్లత్రాచు.

౮. ఏలలన కేశబంధస్థ వాలసమితి
నైన మల్లెలు విరిసినవా ? మసలేల
తాంగిచెక్కిలేక మణులీనెనా ? యుద్దైన
కృత్రిమంబేగదా యలంకృతి భరంబు.

౯. పర్వతపు సానువులమీద ప్రభలురేఁచు
మణులు సతిచెక్కిలికి మారుమనువుగాదె ?
తీవకొనలందు బూచిన పూవులకును
పడఁతుకశిరోజముల కేమిబాంధవమ్ము ?

*౧౦. కుంకుమము లేకయే రక్తిఁగులుకు దీని
కడ, కడమవారు కాశ్మీరగర్భభవములు,

* * *

౧౧. ఈ ముహూర్తము మిగుల బలీయమైన
దీమె బొమముడి వీడిపోయినది. యీమె
కనుబొమలలోని వలపువంకరలు తీరి
తిన్ననైనది. చేతి కందినది ధనము.

౧౨. నా ధనము నాకు చెందువానంద మేమి ?
ఇప్పుడా హస్తమెండిపోయినది యేమొ ?
ఇతరహస్తైకనిక్షిప్త మీ నిధాన
మరసి ననుఁ జేరుట యదృష్టమన్నమాట.

'కన్యక'

శ్రీ. శే. తుమ్మలపల్లి వెంకటరత్నం

౧. కాకిబంగార మని నెమిలీక లనుచు
పుస్తకముపుటలందు దోపుటయ కాని,

* ఇట్లు రెండు తపద్యపాదములతో సర్వగీత పద్యవ్యాసమునకు పరిసమాప్తి చెప్పుట నాయాచారమని నా పూర్వపద్య వ్యాసముల (సుమారు ౧౦ యేండ్ల క్రితము) చూచినవారు గ్రహింపకపోరు. నూటికి తొంబది పూర్వవ్యాసములు నా విట్టివే. ౧౧, ౧౨ పద్యములు పిమ్మట వ్రాసిన వని పాఠకులు గ్రహింపగలరు. నా యారవగీతిమున భావములు రెండైనను వానికి సంబంధ మున్నది. అవి రెండును స్త్రీధనమును గూర్చినవి. 'కన్యక' లో నట్లు సంబంధ మున్నదేని పరిశీలింపుడు.

పుస్తక మ్మెక్కడ నాడు విప్పనది లేదు;
పొలతి పాఠాల నొప్పజెప్పను మదెట్లొ ?

౨. పువ్వులకు పరిమళం బెవ్వ డిచ్చె ?
పికముల కెవండు పాట నేర్పించినాడు ?
మించుతీగెల నటు మెఱపించు నెవడు ?
పడతి తనవిద్య లొకడు నేర్పకయె నేర్చె !

౩. నిమ్మనీరెత్తినట్లు, పువ్వుమ్మొకడుపు
లోపలను తేనె లూరినట్లును, మహౌష
ధులను తీరైన గాంతు లందుకొనునట్లు,
పాజ్ఞనవిద్యలే వచ్చిపడియె సతికి.

(రాబోవు ౫, ౬, ౭ పద్యములలో భావమే గాక భావరయు నాదియే యనుటకు మఱొక యాధారము తోచగలదు. పై ౨, ౩ పద్యములందైనను కవి స్వతంత్రభావముల వెలార్చినది లేదు. అవి కాళిదాసు కుమారసంభవము చదివినవారికి పరిచితములే ! కావున అసలు కవి యీపద్యములందు స్వతంత్రభావముల వెదజల్ల నుద్దేశింపనేలేదేమో యనిపించుచున్నది.)

౪. నెటిబసపుబచ్చనైన గన్నేరుమొగ్గ
కుంకుమపుబంకమైనట్టి నుంకెనవిరి
తేపుమాపును నగరేశ్వరీపదాల
వ్రాలి సాష్టాంగమిడు కన్యకాలలామ.

౫. తేఱవపాదాల పసిమి యద్దినదె కాదు;
అద్దకము మెచ్చు కవిని నే నసలుకాను;
కృత్రకహరిద్రకలన నిర్మితనిసర్గ
కనకపాంచాలికకు పాపకర్మకాదె ?

౬. పొలతిచెక్కిలి తాటంకపువ్యరాగ
దీప్తిమంజరి విరిసినది యనరాదు;
చిక్కణంబయి నొక్కలు నొక్కలైన
కచభరంబున పువ్వు లక్కరయె లేదు.

౭. పర్వతపుసానువులమీద బ్రభలునీచు
మణులు సతిచెక్కిలికి మాఱుమనువుగాదె ?
తీవెకొనలందు బూసిన పూవులకును
పడతుకశిరోజముల కేమి బాంధవంబు ?

*　　　*　　　*

'కన్యక' యందలి ౬-వ పద్యములోని మొదటి రెండుపాదములును, 'వ్యాసుడు' నందలి యారవపద్యములోని మొదటిరెండుపాదములును సమానములు. కాని మఱల 'కన్యక'లోని ౬-వపద్య తృతీయచరణము నా 'వ్యాసుడు' నందలి ౭-వ పద్యప్రథమపాదము (అంత్యవర్ణలోపము)తో సరిపోవుచున్నది. 'కన్యక' లోని ౬-వ పద్యచతుర్థపాదముమాత్రము స్వతంత్రము గావలెను. ఇన్ని అతుకులతో ౬-వపద్యము పూర్తియైనది. మొత్తముమీద ఏపద్యము లెందమరునో, యేపాదముల నెవ రెట్లు గ్రహించిరో విమర్శించి పోల్చుకొనుటకు పాఠకులే అర్హులు కాన తద్విషయవిమర్శన మిచ్చట చేయుటలేదు.

పదేండ్లనాటిమాట

(అనగా సత్యనారాయణగారితోడి వెంకటరత్నము వివాదము.)

మాకు కళాశాలలో నుపాధ్యాయుడైన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారితో, నాయెదుట, స్వర్గీయ వెంకటరత్నము వివాదపడుట యాంధ్రపత్రికాముఖమున ౧౯౩౨-౩౩ సం.లలో నతడే యంగీకరించెను. అది యంతయు (ఆ పత్రిక) పఠితలకు విశదమే. ఆ వివాదములో నేను కొంత త్రొక్కిళ్లుపడి, సహకవియైనను వెంకటరత్నము చేసిన విమర్శ నామోదింపలేదు. ఆవిషయమున నతనికి కొంత నొవ్వు కల్గినది. దానిని విపులీకరించి వ్రాయు నగత్య మిచ్చటలేదు కాని మే మిర్వురము నాటినుండి జంటకవనము చెప్పకో దగిన దేదియు వ్రాసియుండలే దని కొంతగ జ్ఞాపకమున్నది. కొలదిప్రకటనలు చేసినను నవి తత్పూర్వవిరచితములే ! మొదటినుండియు శ్రీ సత్యనారాయణగారి నాదర్శకముగ నుంచుకొని, కొంతగ నప్పుడప్పుడు వారి ననుకరించు పోకడ లనదగినవి నేనుపోవుట కీ. శే. వెంకటరత్నము సహించినను, పైన జెప్పిన వివాదానంతరముమాత్రము సహించెడివాడు కాడు. 'ననుప్రసంజల జాజువారుట' మొదలగు ప్రయోగములు జాతీయము లని వానిపై నాకు వ్యామోహము మెండుగ నుండెడిది. "మద్గురు వధానమృదూక్తి

మరందధారలలో కడుగనివారు" మొదలైన శ్రీ సత్య నారాయణగారి ప్రయోగములను వారి కన్నైదుటనే యాక్షేపించిన కీ. శే. వేంకటరత్నము నన్ను, 'ననుపు సంజల జాజువారుట' మొదలగు ప్రయోగములు శ్రీ సత్యనారాయణగారి వనుకొని, వానిని గూర్చి యప్పు డప్పు డాక్షేపించెడివాడు. కాని వారిర్వురకు వివాదము జరుగకపూర్వము -

(౧) " ... ... సాంధ్యకాలికా
నశ్వర దేహ బంధనము
నాగభినీత మహోద్యదర్ధనా
రీశ్వర తాండవభ్రమణ
రేఖలు లేని కొఱంత తోఁ జెడిక్ "

(౨) " ... ...
నీ విరజాజి వల్లరుల్
చేతులు నా గళాన కయి
సేయనిలో టాకటే నతోదరీ !"

(3) "ననుపుసంజలజాజువారిన తటాన—"

మొదలైన ప్రయోగములను మా జంటకవనాన నిర్భయముగ ప్రయోగించుచునేయుండెడివాడను. ('నదీ విహృతి'— 'చంద్రిక'లో ప్రకటితము.) ఇవి నా ప్రయోగము లనుట నిస్సందేహము. కీ. శే. వేంకట రత్నమే యైనచో 'నతోదరీ' అనియే యనడు. ఏ 'కృశోదరీ' అనియో వ్రాసెడివాడు.

పిమ్మట కీ. శే. వేంకటరత్నము సత్యనారా యణగారిపై వ్రాసిన విమర్శ ఆంధ్రపత్రికలో కొన్నా ళ్లకు ప్రకటింపబడినది. దాని కొక ప్రత్యుత్తరము కూడ ప్రచురింపబడినట్లు నాకు జ్ఞాపకమున్నది. ఏ దెట్లున్నను నాడు మొదలుకొని యెట్టి యక్కరగల్గి నను మా వెంకటరత్నము నెదుట శ్రీ సత్యనారాయణ గారి పద్యమే చదివెడివాడను గాను. దానికి కారణ ములు పెక్కు గలవు.

ఇంతలో 'గౌరీత్రిశతినుండి' యని శ్రీ సత్య నారాయణగారు భారతిలో ప్రకటించిన పద్యములలో "అల ప్రౌఢనుకవియిల్లా లిది యంచు" అను పాదమున కర్త్రహంకారము అప్రయత్నముగ చక్కగ కుదురుకొన్న దని వారిని మెచ్చు మాలో కొందఱ మనుకొనుటయు, కొందఱు దానిని గర్హించు టయు గల్గినది. మొత్తముమీద కవియొక్క వ్యక్తిత్వ మట్లు కుదురుకొనుట శ్లాఘాలంఘన మనుకొని తల పోసిన నేను, కీ. శే. వెంకటరత్నము శ్రీ సత్యనారా యణగారి 'ప్రతిస్పర్ధి' అని కొంద ఱనుకొనుదినా లలో, స్వయముగా రచించిన పైన పేర్కొన్న 'వ్యాధుడు' అను వ్యాసమున —

"తెలవపాదాల పసిమి యద్దినది కాదు
అద్దకము మెచ్చుకవిని నే నసలె కాను"

అని సందర్భము దొరికినవెంటనే పొందుపరచి, శ్రీ సత్యనారాయణగారియంతవాడ వైతివని కీ. శే. వేంకటరత్నముచే పిమ్మట కొన్నాళ్లకు మాటకూడ పడితిని. కావున "ననుపుసంజల జాజువారినది లేదు", "అద్దకము మెచ్చుకవిని నే నసలె కాను" ఇత్యాది ప్రయోగములు నావి. "నీ కర్పూరపుఖండముల్ భుజము" లనుదానిని బోలునట్లు "నీ విరజాజివల్లరుల్ చేతులు" అని వ్రాసినందులకే మున్ను నన్నాక్షేపించిన మా వేంకటరత్నము 'ననుపు సంజల', 'అద్దకము మెచ్చుకవిని' అను ప్రయోగములు, శ్రీ సత్యనారాయణ గారి పోకడల బోలు ననుకొనుటచే, చేయనేచేయడు. ఇంతటితో నీ యంశము నిక ముగించి ముఖ్యమైన యింకొక సంగతిని ముచ్చటింతును.

ఔచిత్యము

'కన్యాచరిత్ర' వెంకటరత్నము తన మర ణమునకు కొన్ని దినాలముందు ఒంటరిగ వ్రాసికొన్న రచనము కావచ్చును. అనగా దాని నతడు వ్రాసి సుమారు ౮ సంవత్సరా లైనదన్నమాట. అతని మర ణమునకు రెండుమూడేండ్లక్రితమే నేను చెన్నపట్నము విద్యావ్యాసంగమునకై పోయితిని. అస లంతకుమును పే యొకటిరెండేండ్లనుండి జంటకవనము చెప్పుట మాని వేసితిమి. అతని యనారోగ్యమే దానికి మొదలు. అతడు రెండేండ్లపైగా బాధపడెను. ఆ పరిస్థితులలో నాయుష్యమునకు నారోగ్యమునకును - అతడు కొన్ని

పురాణసంబంధములు, భక్తిబద్ధములు, వ్యాధికి జెందిన వియు నగు పద్యములు వ్రాసియుండునని కర్ణాకర్ణికగ తదుపరి వింటిని. 'కన్యాచరిత్ర' యు, 'అంబికాస్తవము' ను దానికి సాక్ష్యమిచ్చుచున్నవి. అస లతనికి పురాణేతివృత్తము లిష్టమనుటకు భీమేశ్వరసప్తతియు, నాతో కలిసి వ్రాసిన 'సౌందర్యలహరి' యు నిదర్శనములు. అత డీకన్యాచరిత్ర వ్రాసినదే నే నెఱుగను; అస లెఱుగుట కవకాశమును లేదు. కావున నే నతనినుండి యీ వివాదాస్పదములగు మూడుగీతముల దొంగిలించుట యసంబద్ధము, అసత్యము నని చెప్పగలను.

అస లతని మార్గమే వేరు. అతనికి సిద్ధసమాసములు కడు ప్రీతికరము. "అది మునుపొక్కపిట్టయిన నంకుపయిఙ్ దనకాలు మోపమిఙ్, హృదయరసాలమియ్యది మదీయమెటో పదిలంపురీతి నున్నది" మొదలైన క్లిష్టాన్వయముగాని, "నిర్మిత నిసర్గ కనక పాంచాలిక"వంటి పైకి విరుద్ధములుగ నుండియు, మధ్యమపదలోపి సమాస మనియో, మరేమో చెప్పుకొని సమర్థింపవచ్చుననదగు చిత్రపదప్రయోగములుగాని, 'ఏకత్రత' వంటి శబ్దసృష్టిగాని గిట్టదు.

మఱియు 'వ్యాసుడు' అను వ్యాసమున బాలవితంతువు వస్తువని పఠితలు ప్రతిపాదమునను గ్రహింపగలరు. "చిక్కణంబయి నొక్కులునొక్కులై వినీలమైన దీనిధమ్మిల్లమూలమందు" అను పద్యమున జడను నల్లత్రాచుగ బోల్చుట శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి 'ప్రతిస్పర్ధి'చేయదు. చేసెనుపో, జడ యను నల్లత్రాచుపైన మల్లెదండ యను తెల్లత్రాచు లేకుండె ననుటచేతను, "పుట్టినది పుట్టినట్లె సొంపులు వెలార్చు" ననుటచేతను ఆ బాలవితంతువు సంసారసుఖమే యెఱుగ దని నా యుద్దేశము. "ఆంగ్ల సంస్కృతాంధ్రములలో 'రసవత్కవిత' జెప్పగల"డని మొగమెరుగని శ్రీ సింగరాజు సుబ్బారావుగారుప్రభృతులచేతనే నుతులు వితతముగ గొనిన కీ. శే. వెంకటరత్న మిట్టి ధ్వనిమయము, రసనిధానము నైన పద్యమును 'కన్యక' నుద్దేశించి వ్రాసిన రచనలో నౌచిత్యభంగకరముగను, రసాపకర్షకముగను వెలయింపజేయుట దోషముగాన మొదటి పాదమును మాత్రమే గ్రహించుటచే నది తొలఁగిపోయినను (౧) పాలఁతి చెక్కిలి, (౨) పర్వతపు సానువులమీద అను పద్యములం దంతటి దోషమును వాటిల్లినది. "పాలఁతి చెక్కిలి తాటంక పుష్యరాగ దీప్తిమంజరి విరిసినది యనరాదు" అనుట వితంతువునకు ధ్వనియుతముగ చెల్లును. 'విరిసినది యనరాదు' అనగా 'లేదు' అనుట వాచ్యార్థము. 'ఉండుట దోషము' అని నా భావము. ఆకన్యకు దిద్దులు లేవు అనుట వాచ్యార్థము. ఆమెకు దిద్దులుకల వనరాదు అని నా భావము. ఏలన ఆమె వితంతువు. వితంతువునకు తాటంకపుష్యరాగములు గలవనుట కవితాసమయము కాదని నాయూహ. "కచభరంబున పువ్వు లక్కర యేలేదు" అనుట కన్యకకెట్లు సరసముగ చెల్లునో ఊహింపలేను. కన్యలు పూలుదాల్చుట లోకవిరుద్ధ మనుకొనువా రింకను కలుగలేదు. బాలవితంతువునకు 'కచభర'ముండ వచ్చునన్నను పూలు ధరించు నవసరము మాత్రము లేదని నా తాత్పర్యము.

ఇట్లే 'పర్వతపుసానువులమీద' అను పద్యమున 'మాఱుమనువు' అనుట పునర్వివాహవాంఛగల వితంతువర్ణనమున కుదురుకొన్నట్లును, "పూవులకును పడతుక శిరోజముల కేమి బాంధవంబు' అనుటలో నితివృత్తవస్తువుయొక్క పూర్వసువాసినితనము వెల్లడియగుచున్నట్లును పఠితలు పోల్చుకొనకపోరు. కాని యవి కన్యకయం దెట్లు పొందుపడగలవు? ఇమిడినను కేవల వాచ్యార్థప్రతిపాదకమగు నధమకావ్యమును కీ. శే. నాసహకవికి అంటగట్టరాదని నామనవి. పైవి నాకృతిలో కుదిరిన ట్లా 'రసవత్కవి' రచనలో సరిపడకపోవుటచే నవి యతని వనుట ఎవ్వరు నొల్లరానిది.


కావున సుమారు పదేండ్లక్రితము 'వ్యాసు' డని వ్రాసిన నాకంటె కడపట 'కన్యాచరిత్ర' వ్రాసిన కీ. శే. వెంకటరత్న మీ పద్యపాదములను నాయందలి ప్రేమాదరాభిమానసూచకముగ ననుసరించి, మఱియు పొందుపడనట్లు తోచిన తావులలో కొంత మార్చి, తర్వాత నెమ్మదిగ సమన్వయపడునట్లు మార్పుచేతమని చిత్తుప్రతియందు కేవలము పాదపూరణార్థము

తాత్కాలికముగ వ్రాసియుంచి, పిమ్మట నేయనారోగ్యకారణములచేతనో అట్లే మరచిపోయియుండవలెను. అసలతడు 'కన్యాచరిత్ర'లో నీమూడుపద్యములు వ్రాసెననున దంగీకరింపఁదగినచో నాయూహ సరికావచ్చును. ఆగ్రంథమాతృకను నే నసలు చూచినగాని యేమియు నిర్ధారణచేయలేను. ఈపద్యములు ప్రక్షిప్తములే యైనచో నిక ప్రచురింపించినవారి చమత్కారమునకు మేరయే లేదు.

ఈపరిస్థితులలో, మీదుమిక్కిలి తెలిసీతెలియముల జేసి శ్రీదేవులపల్లిశాస్త్రిగారు కొందఱి ప్రోత్సాహమున నాపద్యచౌర్యము నాపై మోపుచు లేఖ వ్రాయుటయు, సత్యాసత్యము లెఱుఁగని భారతివారది ప్రకటించుటయు జరిగినది.

కావున నాపద్యములలో వేంకటరత్నమునకు గిట్టని శ్రీసత్యనారాయణగారి ప్రభావ ముండుటచేనేమి, పదప్రయోగమునందలి వైచిత్రిచే నేమి, బాలవితంతువునకే యన్వయించు నౌచిత్యముచే నేమి, అవి నావను, నావస్తువునకు నే ఱదురుకొనుచున్నవనియు, 'కన్యక'యందు "తెఱవ, పొలఁతి, కచభరంబు, మారుమనువు, పూవులకును పడఁతుకశిరోజముల కేటి బాంధవమ్ము" మొదలగునవి యతుకవనియు, ఆపద్యములను నేను స్వయముగ వ్రాసినవే యనియు పాఠకులకు విన్నవించుచున్నాను.

[ఈ వాదవివాదములనుగూర్చిన చర్చ కింతటితో స్వస్తి. —సంపాదకుడు, భారతి]



కళింగరంగంపై

బలరాముడు - కళింగరాజ్యము

కురుపాండవులకు యుద్ధ మాసన్నమగుతరి శ్రీ కృష్ణుడు పాండవపక్ష మవలంబించుటచే, దుర్యోధనుడు శిష్యుడైన కతమున వాని పక్ష ముండిన నన్నదమ్ముల పోరగునని గుర్తించి, బలరాముడు తీర్థయాత్ర నెపమున దేశసంచారమునకై వెడలెను. నైమిశ వనమున నాతడు పోవుచు మునినివాస మొకటి పొడగాంచి యచట వేదశాస్త్ర పురాణాది వాక్యములను సూతుడు శౌనకాదిమునీశ్వరుల కుపన్యసించుచుండుట గని యచ్చో గొంతదనుక నాగెను. సూతుడు బోధనమున నిమగ్నుడగుటచే బలరాముని రాక గానడయ్యెను. అర్ఘ్యపాద్యాది సత్కారముల నీకారణమున సూతుడు బలరాముని బూజింపకుండుటకు గినిసి, కోరి తన్నవమానించుట కిట్లు చేసెనని తలచి నాగలి చేబూని వాని గొట్టగా సూతుడు తలదెగి నేల కొఱగెను. అంత సభలోన సంక్షోభ మంకురింప రాముడును బశ్చాత్తాప మంది సూతుని బునర్జీవితునిగ జేసెను. కాని శౌనకాదులు బలరాముని చర్యను గర్హించి పాపహరణార్థ మొక నదీతీరమున పంచలింగప్రతిష్ఠ గావింప శాసించిరి.

ఇంతవర కీకథ పురాణాంతర్గతము. తరువాతి కథ చరిత్రలేశ గర్భితమైన బలరామ క్షేత్రమాహాత్మ్యమను స్థానికపురాణాంతర్గతము. అయ్యది క్లుప్తముగ నిట వివరించుచున్నాను.

పాపపరిహారార్థము పంచలింగప్రతిష్ఠాపనము

బలరాముడు తన ప్రధానాయుధమగు నాగలిని భుజమున ధరించి నైమిశమును (బంగాళము) వీడి కళింగరాజ్యమున బ్రవేశించెను. మార్గమధ్యమున వేటకై వచ్చిన కళింగాధిపతివలన నారాజ్యహీనస్థితిని రాముడు దెలిసికొనగలిగెను. దేశజనులు నాగరకత నెఱుగరు. వర్షములు సకాలమున గురియకపోవుటచే కఱవు లెప్పుడు నారాజ్యమున కాపురముండును. నీతి మతవిద్య లచ్చట కానరావు. ప్రజల కారోగ్యమార్గము పట్టుపడదు. లేమి తేలేని దైన్యము, లేమి గలవని విత రిక్కించి నీటివసతి లేకుండుటచే నీదుర్భరస్థితి వచ్చెనని రయించి కళింగరాజ్యము నుద్ధరింప నెంచి వ్యవసాయము జనులకు నేర్పి సస్యసంపద నభివృద్ధిచేసినగాని జగతిలో నీరాజ్యము తలయెత్త లేదని నిశ్చయించి శంకరునిగూర్చి ధ్యానించెను. గంగాధరుడు వానియెదుట సాక్షాత్కరించినతోడనే బలరాము డాదిదేవుని జటాజూటమునుండి యొక్క జలకణ మిమ్మని ప్రార్థించెను. శివు డాతని ప్రార్థన మంగీకరించి జటాజూటము సడలించి పర్వతాగ్రమున నొక సలిలబిందువును జారవిడిచెను. బలరాముడు నాగలి పర్వతంబున నాటి ముందు నడువ నాతని వెంట పెద్ద రొద లిడుచు నురుసుగ్రమ్ముచు నొక మహాప్రవాహము రాజొచ్చెను. శివుని ప్రసాదంబున బలరాముని నాగలి వెంట వచ్చు నాయేరు లాంగుల్య యన బరగజొచ్చెను. లాంగలివెంబడి వచ్చిన కుల్య గావున లాంగుల్య యను నామ మద్దానికి సార్థకమయ్యెను. నది పుట్టిన పర్వతాగ్రమునుండి తూర్పు సముద్రమున కలియునందాక - తీరంబున బలరాముడు శివలింగములైదింటిని బ్రతిష్ఠచేసెను. పంచలింగప్రతిష్ఠతో నాతని పాపము తొలగెను.

చారిత్రక నిదర్శనములు

ఉత్కళరాష్ట్ర నిర్మాణమునకు పూర్వము లాంగుల్యానది (నాగావళియనికూడ దీనిని బిలుతురు) గంజాం విశాఖపట్నంజిల్లాలకు జాలభాగము సరిహద్దుగ నుండెను. ఈనదిపై పాలకొండ, శ్రీకాకుళము అను ముఖ్యనగరములును, అనేకగ్రామములును గలవు. దీని నిడివి ౨౦౦ మైళ్లు. బలరామునిచే ప్రతిష్ఠింపబడిన వని నమ్మబడుచుండిన శివాలయము లైదును — సోమేశ్వరాలయము, భీమేశ్వరాలయము, సంగమేశ్వరాలయము, కోటీశ్వరాలయము, మణినాగేశ్వరాలయము — నేటికిని కొలదిరాబడులతో రాగభోగాదు లందుచున్నవి. నదికిరుపార్శ్వముల కొంతమార్గమువరకుండు ప్రదేశమందలి జనులు సంకల్పమును జెప్పకొనునపు డీ ప్రదేశమును బలరామక్షేత్ర మని చెప్పుదురు. కళింగరాజ్యమున నేటికిని ప్రచారమందుండు నీ విషయములు గమనించవలసి యున్నది: (౧) బలరామక్షేత్రము — ఇది శ్రీకాకుళము చీపురుపల్లి తాలూకాలకు వైదికులు వ్యవహరించు నామము. (౨) లాంగుల్య— దీనినే నాగావళి నది యని కూడ బిలుతురు. (౩) పూరీపట్టణమందలి జగన్నాథస్వామివారి ఆలయమున బలరామునివిగ్రహము. (౪) నాగావళీనదీతీరమున నైదు శివాలయములు. (౫) తూర్పుకనుమలందలి యొక పర్వతాగ్రమునకు బలరామగిరి యను వ్యవహారము. పై విషయములను విమర్శింపగా నీప్రదేశమున బలరాము డను నొక మహానుభావుడు మత రాజకీయములందే కాక సాంఘిక జనోపయోగ నైతిక విషయములందు గూడ ప్రమేయము గలిగించుకొని విపులసంస్కరణముల నీ కళింగరాజ్యమున నెలకొల్పె ననుట నిర్వివాదాంశము. అట్టి మహానుభావుని నవతారపురుషునిగా ప్రజ లెన్నుటలో నాశ్చర్య మేమియు లేదు.

నదులపుట్టుక - పురాణగాథల అంతరార్థము

హిందూదేశమున నదు లన్నియు నే మునీశ్వరుడో, యే మేధావంతుడో, యేరాజపుంగవుడో గంగాదేవిని ప్రార్థించి జనోపయోగార్థమై తెచ్చెనని పురాణములు చెప్పుచున్నవి. గోదావరిని గౌతముడు, గంగను భగీరథుడు, నాగావళిని బలరాముడు తపస్సు చేసి శంకరుని మెప్పించి భూలోకమునకు దెచ్చిరనుటలో నంతరార్థము కలదు. తపస్సు చేయుట యనగా నరణ్యమున నొంటరిగా గూర్చుండి ముక్కు మూసుకొని భగవద్ధ్యానము చేయుటయే కాదు. పర్వతోపరిభాగమునుండి ప్రవహించుచుండు సెలయేళ్లనెల్ల నేకముఖముచేసి,నిమ్నోన్నతములగని పెట్టి సముద్రమువరకు మార్గము చూపుట సామాన్యమైన పని కాదు. గొప్ప మేధాశక్తి, నిర్మాణచాతుర్యము నుండినగాని యట్టి పని నెరవేరదు. బలరాముడుగూడ నట్టివా డనియే భావింప వలయును. వీనిచే నిర్మింపబడిన దేవాలయములన్నియు నే డెనిమిదిశతాబ్దములనాటి వగుటచే భగవదవతారమని భావింపబడుచుండిన బలరాముడుగూడ నా కాలమువాడే యగును.

హలాయుధనామము వచ్చుటకు కారణము

ఇక బలరాముని ప్రధానాయుధములలో నాగలి యొకటి యని పురాణములు చెప్పుచున్నవి. జనులు ప్రాచీనకాలమున భూమిని దున్ని పంటలను పండించుట నెఱుగరు. జంతువుల వేటాడి జీవించెడివారు, లేదా వనములందలి భోజనార్హమగు కందమూలాది ఫలముల దినెడివారు. 'రేపటి గతి యేమి' యనెడి చింతయే వారికి లేకుండెను. జనసంఖ్య వృద్ధిచెంది వన్యఫలాదులు క్షీణించగా నాహారసంపాదనకృషి యవసరమయ్యెను. ఈకృషియే తపస్సు. గౌతమబలరామాదులు భూమిని దున్ని పంటలు పండించి ధాన్యాదుల సేకరించుకొనుటయే తపఃఫలము. హలమును చేబూని యాకలి యను శత్రువు నాయాయుధముతో పోరాడి జయించుటచేత నాతడు హలాయుధు డని పురాణముల ప్రసిద్ధినందెను. ఈస్థితి మానవశైశవదశను సూచించుచున్నది: అందుచే హలాయుధు డగు నీబలరాముడు మిక్కిలి ప్రాచీనుడు కావలెను. లేదా కళింగదేశమున నే డెనిమిదిశతాబ్దముల నూతనవ్యవసాయకార్యక్రమమును నెలకొల్పినవాడైన కావలయును. వ్యవసాయము నీటిసౌకర్యమున్నగాని ఫలించదు. బలరాముడే కళింగ

మున నాగావళీనదిని తెచ్చి కాల్వల గల్పించి ధాన్యాదుల పండించుటను నేర్పియుండును.

సురాపాన మేల చేయవలసి వచ్చెను ?

పురాణములలో నీతడు సురాపానాసక్తుడనికూడ వర్ణింపబడినది. నేటికిగూడ సురాపానలోలత్వము కాయకష్టముల ననుభవించు పాటకజనులలోనధికముగా గనబడుచున్నది. శరీరమందలి బడలికను దీర్చి, లేని యుత్సాహమును నురగలిగించు నను నమ్మకము నేటికిని జనులయందుగలదు. బహుశా బలరాము డీయలవాటును నెలకొల్పుటలో మార్గదర్శకుడేమో!

గదాయుద్ధము — కఱ్ఱసాము

గదాయుద్ధమున నీమహానుభావుడు ప్రవీణుడని భారతము చెప్పుచున్నది. ఈవిద్యయం దీయన ప్రియ శిష్యుడు దుర్యోధనుడు. పల్లెలందలి కాపులు నేడు గూడ విరతికాలమున వినోదార్థము బారెడు వెదురు కఱ్ఱను బట్టి పలువిధముల సాము చేయుటను నేర్చుచుందురు. ఇట్టి సాములో హస్తలాఘవమున మిక్కిలి ప్రావీణ్యము నందినవారు పలువురు గలరు. ఇరువది మంది విరామములేక రాళ్లు రువ్వుచున్నను నొక్కరాయిచేతనైన దెబ్బతినక తన బారెడుకఱ్ఱను నన్నివైపుల గిరగిర ద్రిప్పుటవలన కాపాడుకొనగలిగిన ప్రవీణులు లేకపోలేదు.

పురాణగాథలను సూక్ష్మదృష్టితో బరిశీలించిన యెడల నిట్టి రాజకీయ సాంఘికవిషయ లేశము లనేకములు బయల్పడుచుండును.

మండ నరసింహం

విమానదాడి నవయుగసృష్టి కాదు

పందొమ్మిదో శతాబ్దిలోనే ఒక ఫ్రాంజ సీయుడు ఈ వుద్యమానికి అంకురార్పణ చేసివున్నాడని యీక్రింది చారిత్రక నిదర్శనము ఋజువుచేయుచున్నది:

వైమానిక నిర్మాణాన్ని గురించిన అనేక దృష్టాంతాలు మన పురాణాల్లోనూ, ప్రబంధాల్లోనూ అనంతములుగా కనిపిస్తూనే వుంటున్నవి. అయినా, మన ఉన్నతిని అభివర్ణించే ఉదంతాలపయిన మనకు ఉండవలసినంత విశ్వాసం లేకపోవటం సత్యదూర మన లేము.

పోనీ—మనకు ఎక్కువ మక్కువను కలిగించే ఆంగ్ల దేశచరిత్రలో దే—'ఫెరాగో' అనేమహాశయుడు వివరించిన — విమానదాడుల్ని గూర్చిన ఒక విచిత్ర ఘట్టం ఈయుద్ధసమయమందు తెలుసుకోవటం సముచితం కాగలదు:

"అద్భుతమైన, అనుపమమయిన, అజేయమైన సమరసాధనగా అపారవినియోగము నందుతున్న ఈనాటి 'విమానదాడి' ఉద్యమం ఆధునికుల బుద్ధిబల ఫలితం కాదుసుమండీ. అటువంటి వూహా శుద్ధపారపాటు.

విజ్ఞానసంపత్తులో మానవుడు ముఖ్యమైన ఈ మెట్టును చేరుకున్నది ౧౮౪౯ లో.

౧౮౪౯ న ఇటలీ ఆస్ట్రియాలకు మధ్య జరిగిన సంకులసమరములో, ఆస్ట్రియనుసేనలోని యువకుడయిన ఒక వుద్యోగి—యుషేటియస్—వెనిస్ పట్టణాన్ని గగనమార్గాన్నుండి బాంబింగు చేయటానికి ఉద్యుక్తుడైనాడు.

ఈమాట వినేసరికి ఆస్ట్రియన్ మిలిటరీవర్గంలో ఉత్సాహం రేకెత్తింది. యుషేటియసూ, అతనిసోదరుడూ ఈకార్యసాధనకు ఘట్టిగా పూనుకోవలసిందని వారు ప్రోత్సహించారు.

ఆ వూత తీసుకొని సోదరులిరువురూ 'మాంట్గో ల్ఫియర్' బెలూన్నులో వేడిగాలి పూరించి చూశారు. వారాలతరబడి గాలికెరటాలను గురించి పరిశోధనలు సల్పి కొత్తరకపు బెలూన్లు సృష్టించారు. తుదకు, వారి యత్నాల ఫలితముగా — ౨౦ పౌన్ల బాంబును ౩౦ నిమిషాలసేపు నిలవరించగల బెలూను తయారైంది.

యుషేటియస్ సోదరుల పరిశోధనలు క్రమశః విజయవంత మవుతున్నవి. మహత్తర సాధనకు తొలు

తగా ఉపక్రమించిన ఈ సోదరులు, వైమానిక దాడిని గురించిన మదింపును (బహుశా ఇదే చరిత్రకు తెలిసిన మొట్టమొదటి అంచనా అయివుండాలె) ప్రభుత్వానికి అందజేశారు.

ఆ మదింపు వివరాలు యివి:

౧౦౦ 'మాంట్గాల్ఫియరు' బెలూన్లు

౫౦ గాలిని వేడిచేసే స్టవ్‌లు

౧౦౦ బాంబులు

ఈ ఎస్టిమేటు సరాసరి చక్రవర్తికే నివేదిత మయింది. సంతోషపూర్వకంగా ఆయన తక్షణమే ఈ పవిత్రోద్యమానికి అంగీకృతి తెలిపారు.

వసంతఋతువు ప్రారంభం కాగానే యుషేటియసు వుద్యమం కార్యరూపం తాల్చింది. సాధనలు చేసి చూచుకునే నిమిత్తం ఆతని కొక యుద్ధనౌక నిచ్చారు.

'ముందుగా వక బెలూను వదిలాడు యుషేటియస్. తను అనుకున్న మార్గాన్ని అది రైటుగా వెళ్లడం గమనించి, దాన్ని దెబ్బ తీయటానికిగాను—సరిగ్గా టైమ్ చూచి — బాంబులతో అమర్చిన మరి రెండు విమానాలను పైకి వదిలాడు.

అయితే — పడవేసిన బాంబుల్లో చాలమటుకు గురి తప్పిపోయినందువల్ల వెనిసుపట్టణం అనుకున్నంతగా శిథిలం కాలేదు. కాని, జనసామాన్యంలో మాత్రం ఈ దాడివల్ల కలిగిన అలజడిని నోటిమాటలతో వర్ణింపలేము.

తొలియత్నం గనక పోతే పోయింది — మళ్లీ ప్రయత్నించి ఈ సారి ద్విగుణితోత్సాహంతో దాడి జరపమని యుషేటియస్‌ను బలవంత పెట్టింది ప్రభుత్వం.

సరి — అట్లానే రెండోసారి విమానదాడి జరిపాడు అతడు. అనుకున్న ఫలిత మివ్వలేదు. ౧౮ గురు మాత్రము ఈదాడివల్ల మరణించారు. ౪౦ మంది గాయపడ్డారు. ఈ పరిస్థితి మిలిటరీ వుద్యోగులకు ఎంత మాత్రమూ సంతృప్తి నివ్వకపోగా, ఇంత శ్రమపడిన వీరాధివీరుడు యుషేటియసును వారు లేవిడికొట్టి అవతలకు సాగనంపారు.

తన బుద్ధిబలంవల్ల సృష్టింపబడిన ఈ 'విమాన దాడి' అనే వుద్యమం ౨౦-వ శతాబ్దినాటికి ఇంతటి విజృంభణముగా పండబారుతుందని తలంపలేకపోయింది ఆ అమాయిక ప్రాణి!"

ముద్దా విశ్వనాధం.





విమర్శనము

మాతృభాషాబోధిని

గ్రంథకర్త: రూపనగుడి నారాయణరావుగారు. ప్రకాశకులు : ఆంధ్రవిద్యార్థిప్రచురణాలయము, పూల బజారు, బళ్లారి. పుటలు ౨౩౮. వెల రూ. ౧-౮-౦.

బోధనాభ్యసన పాఠశాలలకొరకై మద్రాసు దొరతనమువారు క్రొత్తగా నియమించిన ౧౯౪౦ సంవత్సర ప్రణాళిక ననుసరించి, మాతృభాషను (తెలుగు) సులభముగా బోధించుట కనుకూలించు వివిధ పద్ధతులను పొందుపరచి వ్రాయబడిన పుస్తక మిది. ఆప్రణాళికలోని ప్రతియంశమును ఈగ్రంథమునందు సాకల్యముగాను, స్పష్టముగాను, వలసినచోట్ల సచిత్రముగాను కూడ వివరింపబడియున్నవి. అందుకు తగిన ఉదాహరణములును, నిదర్శనములును కావలసినన్ని ఇవ్వబడినవి. బోధనాభ్యసన పాఠశాలలందు ఉన్నత, మాధ్యమిక ప్రగ్రేడులలో శిక్షణబడయుచున్న విద్యార్థి-ఉపాధ్యాయులకును, ప్రాథమిక పాఠశాలలందలి ఉపాధ్యాయులకును ఈ గ్రంథము తెలుగుబోధనమునందు అనేక విధములుగా ఉపయోగపడగలదు. దీనిని వారు యథోచితముగా ఉపయోగించినయెడల వారివద్ద శిక్షణపొందు బాలవిద్యార్థులు చాల మేలు పొందగలుగుదు రనుట నిశ్చయము. ఇటువంటి పుస్తకము తెలుగులో ఇదివర కేదైన ఉన్నదో లేదో సంశయాస్పదమై యున్నది. కాని ఇట్టివి చాలప్రచారము గాంచుట మాత్రము విద్యావిధానములో నూతన వికాసమునకు దారితీయగలదని మేము దృఢముగా నమ్ముచున్నాము. ఈ పుస్తకమును రచించుటలో గ్రంథకర్తకృషి ప్రతిపుటయందును గోచరించుచున్నది. బోధనకళయందు వారు గడించిన చిరకాలానుభవము ఇందులో ద్యోతకమగుచున్నది. వారి ఈప్రయత్నము కడుశ్లాఘాపాత్రమైనదని మావిశ్వాసము. ఆంధ్రుల ఆదరప్రోత్సాహములతో వా రింకను ఇటువంటి ఉత్తమ-తరగతిపుస్తకములను బహుళముగా రచింపగలరని ఆశించుచున్నాము.

దేశద్రోహి

గ్రంథకర్త: పి. వి. సుబ్బారావుగారు. డిస్ట్రిబ్యూటర్లు: యువకార్యాలయము, తెనాలి. పుటలు ౭౨. వెల ౬ అణాలు.

ఇది ఒక కథలసంపుటి. భావకవిత్వమనే ప్రణయనతత్వముమీద తిరుగుబాటు మాపుమ, గ్రంథకర్త వ్యాయాశయాల కనుగుణముగా రచించిన కొన్నికథ లిందులో కూర్చబడియున్నవి. చివర నొక నాటికగూడ ఉన్నది. సాహిత్యములో క్రొత్తగా బయలుదేరుచున్న తిరుగుబాటు కొంతకుకొంత ఈకథలలో చిత్రించుటకు ప్రయత్నింపబడినది. ఈకథలలో రచనా, శిల్ప నైపుణ్యాలు తక్కువ. అసలు వాటికొరకై రచయిత ప్రయత్నించిన జాడకూడ కనిపించదు. ఆయనదృష్టి యంతయు తనలో జీర్ణించిపోయియున్న ఆశయముల ప్రచారముమాత్రమే. కుటుంబరావుగారు పీఠికలో చెప్పినట్లు ఈరచయితఉపజ్ఞ అసలుకథలలోకంటె నడుమ నడుమ ఇరికించిన బుల్లికథలలో బాగుగా కనిపించుచున్నది. గ్రంథకర్త విప్లవాశయములకు అనుగుణమైన ఇతివృత్తవస్తువులే ఈకథలలో చిత్రింపబడియున్నవి.

గర్వభంగం

గ్రంథకర్త: ధనికొండ హనుమంతరావుగారు. డిస్ట్రిబ్యూటర్లు: వినోదగ్రంథమాల, తెనాలి. పుటలు ౨౭. వెల ౬ అణాలు.

ఇది ఇంకొక్క కథాసంపుటి. మొత్తమిందులో ఏడుకథ లున్నవి. ఇప్పుడిప్పుడు పైకి వచ్చుచున్న యువకథకులలో హనుమంతరావుగా రొకరు. కథా రచనలో పరినిష్ఠితప్రజ్ఞ నింకను అందుకొకపోయి నప్పటికిని ఈ కథకునిలో అభివృద్ధిలక్షణములు కనిపించుచునేయున్నవి. ప్రస్తుత సంపుటిలోని కథలు ఆ మాధ్యమికావస్థలో రచించినవగుట వీనిలో అంతగా ఎన్నదగిన నాణెము కనుపించదు. కాని సంసార పక్షముగా ఉండి, అభివృద్ధిమార్గమును చూచాయగా తెలుపుచునేయున్నవి. పాఠకుల ఆదరణ ప్రోత్సాహములతో ముమ్ముందీకథకుడు సానదీరినకథలను సృష్టించగలడని ఆశించుచున్నాము.

గీతాసారము

రచయిత: ఓరుగంటి రామారావుగారు, 'ద్వారక', తుని, తూర్పుగోదావరిజిల్లా. వెల కాగితపు అట్ట: రూ. ౦-౭-౦. ఖద్దరు బైండు: రూ. ౦-౧౨-౦.

అసలు భగవద్గీతలో పునరుక్తులు మున్నగునవి కొన్ని సందర్భములలో నున్నవని కొందరి అభిప్రాయము. విషయమును మరింత దృఢపరచుటకే అట్లు చెప్పినవానినే మరల చెప్పుట సంభవించినదని మరి కొందరు సమాధానము నొసగుచుందురు. ప్రస్తుత గీతాసారములో అట్టివిధానము గాక ఒకేపర్యాయము విషయమంతయు స్పష్టీకరింపబడినది. ఇందలి భావ వ్యావహారికము. చదువుకొన్నవారికే కాక అక్షర జ్ఞానము లేనివారికిని బహుసులభముగ గీతాతాత్పర్య మవగతమగును. సుమతిశతకమూ, వేమనపద్యములలోని సులభమైన భాషాశైలిలో వ్రాయబడిన ఇట్టి భగవద్గీత ఇంతవరకు వెల్వడలేదు. పండితులకూ, పామరులకూ అందరికీ చదువతగినది.

నేషనల్ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్, కలకత్తా-వారి వార్షిక నివేదిక


౧౯౪౧ డిశంబరు ౩౧-వ తేదీతో అంతమగు సంవత్సరమున నేషనల్ ఇన్సూరెన్సుకంపెనీకి రూ. ౧,౯౭,౪౯,౨౫౩ లకు ౭,౯౭౬ కొత్తప్రపోజలులు వచ్చినవి. రూ. ౧,౬౨,౬౦,౧౨౭ లకు పట్టాలు జారీ చేయబడినవి. ఈసంవత్సరము మరణమువలన రూ. ౧౦,౫౨,౨౨౪ లకును, మెచూరిటీవలన రూ. ౧౨,౦౭,౮౯౩ లకును క్లెయిములు సంభవించినవి. లైఫ్ ఫండు ఈ సంవత్సరాంతమున రూ. ౩,౬౯,౭౧,౦౩౯ లు ఉన్నది. ప్రస్తావనసాలున ఈఫండు రూ. ౮౩,౪౫,౫౭౮ లు పెరిగినది. ఇది ప్రశంసనీయమగు అంశము. వడ్డీరాబడి మొత్తము ఇన్‌కంటాక్సు పోను రూ. ౧౫,౭౭,౫౧౧ లు. ఆయవ్యయదామాయిషా ౮౬.౪%. ప్రస్తావనసాలున డైరెక్టరులు ౬% డివిడెండు (రాబడిపన్ను లేకుండ) డిక్లేరుచేసినారు. ౧౯౪౦-వ సంవత్సరముతో అంతమగు ౫ సం.లకు చేసిన వాల్యుయేషను రిపోర్టు ౧౯౪౧ లో ప్రచురించబడినది. వాల్యుయేషనున రూ. ౧,౩౦,౬౨౨ ల లాభము (surplus) తేలినది. తిరిగి వాల్యుయేషను జరుగులోపల కలుగు క్లెయిములపై పట్టా సాలు ౧కి, రూ. ౧౦౦౦కి, యావజ్జీవిత పట్టాలపై రూ. ౧౫ లును ఎండోమెంటు పట్టాలపై రూ. ౧౦లును ఇంటెరింబోనసు నివ్వ నేర్పాటుచేయబడినది.

౧౯౪౧-వ సంవత్సరమున శత్రు ఆక్రమణచే కంపెనీ కోలాలంపూరు, రంగూన్ బ్రాంచీలు నిలిచిపోయినవి. కాని ఇందువలన కంపెనీకి కలిగిన నష్టము మిక్కిలి స్వల్పమని తెలియును. ఈకంపెనీవ్యాపారస్థితి సర్వవిధముల సంతృప్తికరముగా నున్నదని ౧౯౪౧-వ సంవత్సరపు ఆయవ్యయ పట్టికవలన తెలియనగును.

పాలుజడ [నాటిక]

గ్రంథకర్త: శ్రీ రామచంద్ర అప్పారావుగారు. ప్రకాశకులు: నవ్యసాహిత్యపరిషత్తు, గుంటూరు. పుటలు ౫౫. వెల తెలియదు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St, Madras. Editor:— S. Sambhu Prasad.



'కాళికా తాండవము'

[చిత్రకారుడు: శ్రీ 'రాజు']